




# బోల్షివిక్

సంపుటి: 7 సంచిక: 1 సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.ఒ.బి. సమాచార పత్రిక జనవరి-జూన్ 2019

## లోపలి పేజీల్లో...



| | | |
|---|---|---|
| 1. కామ్రేడ్ గణేష్ ఇంటర్వ్యూ | - | 3 |
| 2. బూటకపు పార్లమెంటరీ ఎన్నికల బహిష్కరణ - సి.సి | - | 8 |
| 3. రాజ్యాంగ యంత్రం - కామ్రేడ్ లెనిన్ | - | 17 |
| 4. 'ఆజాదీ' కశ్మీర్ పోరాటం | - | 26 |
| 5. బూటకపు అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల బహిష్కరణ -ఎస్.జడ్.సి | - | 30 |
| 6. కితుబా ఎన్‌కౌంటర్ బందు ప్రకటన | - | 35 |
| 7. అమరుల జీవిత చరిత్రలు | - | 36 |
| 8. ఒడిశా రాష్ట్ర అమరుల జీవిత చరిత్రలు | - | 44 |
| 9. పోరాట స్రవంతి | - | 53 |

## అమరులకు నివాళి

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది!

# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2019 జనవరి నుంచి జూన్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు, సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఓ.బిలో కామ్రేడ్ కామేశ్వరి (రింకి), (డివిజన్ కమిటీ సభ్యురాలు)తో పాటు, ఏరియా కమిటీ సభ్యులైన కామ్రేడ్ సత్తిబాబు (దాసు), కామ్రేడ్ లక్ష్మీ (క్రాంతి), కామ్రేడ్ లాలు (కృష్ణ) మరియు దళ సభ్యురాలైన కామ్రేడ్ ఉయిక తిమ్మో (గీత)లు అమరులయ్యారు. ఈ కామ్రేడ్స్‌తో పాటు, వేటకి వెళ్ళివస్తున్న ఇద్దరు (బురదమామిడి) రైతులు శతృతూటలకు బలయ్యారు. దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దుఃఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

## పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దిన పత్రికలకు, ఎలక్ట్రానిక్ మీడియాకు ఎ.ఒ.బి పార్టీ సెక్రటరీ

# కామ్రేడ్ గణేష్ ఇచ్చిన ఇంటర్వ్యూ

*(ఏప్రిల్ 2019)*

**1. ప్రశ్న :- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకుంటున్న రాజకీయాలపై మావోయిస్టు పార్టీ వైఖరి ఏంటి?**

**జవాబు :-** ఆంధ్రప్రదేశ్‌లో గానీ, దేశంలోగానీ చోటు చేసుకుంటున్న రాజకీయాలు అన్నప్పుడు వాటిని పార్లమెంటరీ రాజకీయాలు అనడం సముచితంగా వుంటుంది. ప్రస్తుతం అవి పరమ అధ్వాన్నంగా, దిగజారుడు స్వభావంతో ప్రజల ముందు బహిర్గతమైనాయి. ముఖ్యంగా వాటి ప్రజా వ్యతిరేక, దోపిడీ పాలకవర్గ అనుకూల స్వభావాన్ని ప్రజలు మునుపెన్నటికన్నా లోతుగా గ్రహిస్తున్నారు. రాష్ట్రంలోని పార్లమెంటరీ పార్టీల (టి.డి.పి, వై.ఎస్.ఆర్.సి.పి, జనసేన, కాంగ్రెస్, బి.జె.పి, వామపక్షాలు వగైరా) యొక్క స్వభావం ఒక్కటే. అవి ఒకే తానులోని ముక్కలు. అవి ఈ దేశ ప్రజలకు శత్రువులైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వాములకు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అందుకే ఇవి ప్రజల ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేకపోతున్నాయి. మోసపూరిత మాటలతో కాలం వెళ్లబుచ్చుతున్నాయి.

చంద్రబాబు తన 5 ఏళ్ళ పాలనలో ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనాడు. రైతుల ఋణమాఫీ మొదలుకొని, బెల్టుషాపుల మూసివేత వరకు చేసిన వాగ్దానాలు అమలు పరచకుండా, కేవలం కొన్ని జిమ్మిక్కులు మాత్రమే ప్రదర్శించాడు. పోలవరం, అమరావతి వంటి భారీ నిర్మాణాలను ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా చేపట్టి, అవి పూర్తిచేయకపోగా, లక్షలాది మంది రైతాంగాన్ని నిర్వాసితులను చేశాడు. ఇంకా 'అభివృద్ధి' పేరుతో పోర్టులు, విమానాశ్రయాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, కోస్టల్ కారిడార్ వంటి నిర్మాణాలను చేపట్టి, లక్షలాది మంది రైతాంగాన్ని నిర్దాక్షిణ్యంగా సొంత భూములనుండి తరిమేశాడు. ఈ నిర్మాణాలను చేపట్టిన సందర్భాలలో, చంద్రబాబు ఆశ్రితులైన కాంట్రాక్టర్లు, రియలెస్టేట్ వ్యాపారులు, దళారీలు మాత్రం విపరీతంగా దోచుకుని తెగ బలిసిపోయారు. 'బాబువస్తే జాబు వస్తుంద'ని ఎన్నికల సందర్భంగా చేసిన ప్రచారం ఉత్త మోసపూరితమైనదని తేలిపోయింది. గడిచిన ఈ 5 సంవత్సరాలలో నిరుద్యోగ సమస్య మరింతగా పెరిగింది. ఎన్నికలు దగ్గరపడినకొద్ది తిరిగి మళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు వృద్ధాప్యపు పెన్షన్లు, నిరుద్యోగ భృతి వంటి కొన్ని సంక్షేమ పథకాలలో మెరుగుదల తీసుకువచ్చి 'ఎరగ' వేసినప్పటికీ, అందులో సింహభాగం అవినీతి పరులైన అధికారుల, దళారీల బొక్కసాల్లలోకి చేరగా, ప్రజలకు చేరింది స్వల్పమనే చెప్పాలి. ఈ సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులు తిరిగి ప్రభుత్వ అప్పు రూపంలో తడిసి మోపెడై ప్రజల మూపులపైనే పడబోతున్నది. చంద్రబాబు హయంలో రాష్ట్రం మొత్తం అప్పు 4.15 లక్షల, కోట్లకు చేరి, ప్రజల తలసరి అప్పు 83 వేల రూపాయలకు చేరింది. చంద్రబాబు సంక్షేమం పేరుతో ఇచ్చిన దానికన్నా, దొడ్డిదారిన ప్రభుత్వ అప్పు పేరుతో ప్రజలపై వేసిన భారమే ఎక్కువ.

గడిచిన ఈ 5 సంవత్సరాల కాలంలో చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలోని దళితులపైనా, ఆదివాసీలపైనా, మైనారిటీలపైనా, మహిళలపైనా కేవలం బ్రాహ్మణవాద ఫ్యూడల్ వైఖరిని మాత్రమే చేపట్టింది. 'నీరు-చెట్టు' పథకం పేరుతో దళితుల ఎసైన్‌మెంట్ భూములను గ్రామాలలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ఆధిపత్య శక్తులు ధౌర్జన్యంగా గుంజుకున్నాయి. దళితులపై దాడులు సర్వసాధారణంగా మారాయి. మన్యంలో బాక్సైట్ తవ్వకాల పేరుతో టి.డి.పి ప్రభుత్వం ఆదివాసీలపై తీవ్రమైన దమనకాండ అమలు చేసింది. ఎట్టకేలకు ఆదివాసీల ప్రతిఘటనతో బాక్సైట్ తవ్వకాలను తాత్కాలికంగా ఆపుకున్నప్పటికీ, జి.ఒ నెంబర్ 97 ను పూర్తిగా రద్దు చేయకుండా, తిరిగి అవకాశం దొరకగానే, బాక్సైట్ తవ్వకాలకు పథకాలు రచిస్తున్నది. మహిళలపైన, ముఖ్యంగా మైనర్ బాలికలపైన అత్యాచారాల విషయంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో వుంది. బాబ్రీ మసీద్ రామజన్మభూమి వివాదంలో మైనారిటీల పక్షాన నిలబడకుండా హిందూఫాసిస్టులకు వంత పాడుతున్నది.

ఇక ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్రమైన ద్రోహం చేశాయి. ఈ నాటకంలో చంద్రబాబు పక్కా అవకాశవాద పాత్ర పోషించి, నేడు ప్రత్యేక హోదా కోసం జరిగే పోరాటంలో తానే ఛాంపియన్‌ను అంటూ ముందుకు వస్తున్నాడు. చంద్రబాబు మొదటి నుండి అవకాశవాదాన్ని ఒక కళగా అభ్యసించాడు. ఆయనకు అది వెన్నతో పెట్టిన విద్య.

చంద్రబాబు మొదలుకొని మోడీ వరకు ఈ దేశ బూర్జువా పార్టీల నాయకులందరూ విదేశీ పెట్టుబడులను ఈ దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ 'సర్వరోగ నివారిణి'లా చూపెడుతున్నారు. అలా చూపెట్టడమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్ శక్తుల (బహుళజాతి సంస్థలకు)కు ఎర్ర తివాచీలు పరుస్తున్నారు. సామ్రాజ్యవాదుల దోపిడీకి దళారీలుగా పని చేస్తూ, తమ బొక్కసాలు నింపుకుంటున్నారు. వీళ్ళు ఇంతగా సాగిల పడినా, వాళ్ళు అనుకున్నంతగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశంలోకి ప్రవహించడం లేదు. ఇందుకు ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న సంక్షోభమే కారణం. ఈ ద్రవ్య, ఆర్థిక సంక్షోభం మన దేశంలో కూడా సుడులు తిరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే పాలకవర్గాలు తగ్గుతున్న తమ లాభాల రేటును పెంచుకునేందుకు

ప్రజలపై దోపిడీని తీవ్రతరం చేస్తున్నాయి. ఈ దోపిడీ పీడనలను వ్యతిరేకిస్తున్న ప్రజలపై ఫాసిస్టు నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయి. అంతేకాదు మరోవైపు దోపిడీ సంపదలో అధికభాగం కొల్లగొట్టేందుకూ, అధికారంలో వాటా పొందేందుకు వీళ్ళమధ్య కుక్కల కొట్లాట పెరిగింది. ఈ కుక్కల కొట్లాట నేడు జరుగుతున్న పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 'కనువిందు' చేస్తున్నది. ఈ సందర్భంగా వాళ్ళు గొప్పగా చెప్పుకుంటున్న 'పార్లమెంటరీ ప్రజాస్వామ్య'పు విలువలను సైతం చాపలా చుట్టచుట్టి అటకపై పడేస్తున్నారు. రాష్ట్రం వాళ్ళ సొంతదుకాణం అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిణామాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు బూటకత్వాన్ని బహిర్గతపరుస్తున్నాయి. ఈ బూటకపు స్వభావాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ప్రస్తుతం అమలులో వున్న ఈ బూటకపు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపైనా, దోపిడీ పాలకవర్గ పార్టీలపైనా, వాటి రాజకీయాలపైన అసహ్యాన్ని పెంచుకుంటున్నారు.

**2. ప్రశ్న :- దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వైఫల్యం చెందిందంటారా?**

**జవాబు :-** ఈ మాట మేము ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. గడిచిన 72 సంవత్సరాల 'స్వతంత్ర భారతదేశ చరిత్ర' ఈ విషయాన్ని తెటతెల్లం చేస్తున్నది. ఈ మధ్య కేంద్ర ఎన్నికల కమీషన్ చేసిన ప్రకటన 'పార్లమెంటరీ ప్రజాస్వామ్య'పు దీన స్థితిని కళ్ళకు కడుతున్నది. ఎన్నికలలో ధనబలం, దౌర్జన్యం పెరిగిందని వీటిని నివారించడం తమకొక సవాల్‌గా మారిందని ఎన్నికల కమీషన్ తన ఆవేదనను వ్యక్తం చేసింది. అయితే కేవలం ధనబలం, దౌర్జన్యాలు మాత్రమే ఎన్నికల ప్రక్రియపై నకారాత్మక ప్రభావాన్ని చూపడం లేదు. కులం, మతం, ధనం, దౌర్జన్యం, కుహనా దేశభక్తి, అసత్య ప్రచారం... ఒక్కటేమిటి, సకల రుగ్మతలతో 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం' కుళ్ళిపోయి పరమ దుర్గంధాన్ని వెదజల్లుతున్నది. ఇంకా ఒక్కమాటలో చెప్పాలంటే ఎన్నికల ప్రక్రియ ఒక రాజకీయ ప్రక్రియలా కాకుండా వ్యాపారంలా మారింది. వ్యాపారంలో పెట్టుబడి పెట్టేది లాభం (అదనపు విలువ) కోసమే అన్నట్లు ప్రజాప్రతినిధులు ఎన్నికలలో చేసిన ఖర్చుకు రెట్టింపు సంపాధించడం తమ హక్కుగా భావిస్తున్నారు. అందుకనుగుణంగా అవినీతికి పాల్పడటమే కాకుండా ఎడేచ్ఛగా పార్టీలు మారుతున్నారు. ఈ కప్పదాట్లు సర్వసాధారణమైపోయాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కేవలం కాగితాలకే పరిమితమై పోయింది. ఎన్నికల కమీషన్ నామమాత్రంగా మారి, మాటల గారడీతో ప్రజలను మాత్రం మోసం చేస్తున్నది. ఈ పరిణామాలన్నీ 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం' వైఫల్యాన్ని చూపెట్టడం లేదా?

**3. ప్రశ్న :- తెలంగాణలో టి.ఆర్.ఎస్ పాలన తీరుతెన్నులు, మళ్ళీ అధికారంలోకి రావడంపై మీ కామెంట్?**

**జవాబు :-** ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భాగస్వామి అయిన టి.ఆర్.ఎస్‌కు, మొదటి విడత అధికారంలో వుండేందుకు ప్రజలు అవకాశం ఇచ్చారు. అయితే కె.సి.ఆర్ ప్రజల ఆకాంక్షలకు తగట్టుగా వ్యవహరించలేదు. తన వర్గ స్వభావానికి తగట్టుగానే దోపిడీ వర్గాలకు ప్రయోజనాలు చేకూర్చే విధానాలనే అమలు చేశాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో కోస్తా పెట్టుబడిదారులపై యుద్ధం ప్రకటించి, అధికారంలోకి రాగానే 'ఒకే గూటి పక్షులు' అన్న చందంగా వాళ్ళతో చేతులు కలిపి ప్రజలపై దోపిడీ, అణచివేతలను తీవ్రతరం చేశాడు. ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలంటే ఉద్యమకాలంలో వందలాది నాగళ్ళతో రామోజీ ఫిలింసిటీని దున్నిస్తానని ప్రగల్భాలు పలికిన కె.సి.ఆర్ అధికారంలోకి రాగానే రామోజీరావు అంత మహానుభావుడు మరొకరు లేరంటూ పత్రికాముఖంగా ప్రకటించి, తన అవకాశవాదాన్ని బహిర్గతపరచ్చుకున్నాడు. సారాంశంలో వేము చెప్పదలచుకున్నదేమిటంటే కె.సి.ఆర్ మాటల గారడీతో ప్రజల ఆకాంక్షలను దెబ్బతీస్తూ, పరమనియంతగా మారాడనేదే. ఈ పరిస్థితిని ఉపయోగించుకొని ప్రజలను పోరాటమార్గం పట్టించే బూర్జువా పార్టీలేవి లేకపోవడంతో కె.సి.ఆర్‌కు రెండవ విడత ఎన్నికలలో గెలుపు సులభమైంది. తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా వున్న కాంగ్రెస్, ముఠా తగాదాలలో కునారిల్లుతూ ప్రజల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోలేదు. దీనికి తోడు తెలుగుదేశం పార్టీతో ఎన్నికల పొత్తు కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బయింది. తెలంగాణ ఎన్నికలలో తెలుగుదేశం ప్రవేశాన్ని కె.సి.ఆర్ తెలివిగా ఉపయోగించుకొని, కోస్తా పెట్టుబడిదారుల పెత్తనం తిరిగి రాబోతున్నదని ప్రచారం చేపట్టి ఎన్నికలలో లబ్ది పొందాడు.

కె.సి.ఆర్ గత పాలన గానీ, ప్రస్తుత పాలన గాని ప్రజావ్యతిరేకమైనదే. దోపిడీ పాలకవర్గాలకు సేవ చేసేదే. ప్రజలకు కొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా అవి ప్రభుత్వ అప్పు రూపంలో ప్రజలు తీర్చవలసినవే. కె.సి.ఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రభుత్వ అప్పు 2 1/2 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. మరోవైపు తన సంపద, తన పరివారపు సంపద పెద్దమొత్తంలో పెరిగింది. ఆయన తనది రైతు ప్రభుత్వం అని చెబుతున్నాడు. వాస్తవం ఏమిటో, కె.సి.ఆర్ స్వభావమేమిటో నిజామాబాద్ పసుపు, ఎర్రజొన్న రైతులూ, ఖమ్మం సుబాబుల్ రైతులు బహిర్గతపరుస్తున్నారు. కె.సి.ఆర్ ప్రభుత్వం తమని నిలువునా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ వైఖరికి నిరసనగా వందలాది మంది రైతాంగం ఎన్నికలలో నామినేషన్లు వేశారు. ఆయన ప్రస్తుతం బి.జె.పి, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా ఫెడరల్ ఫ్రంట్ అంటూనే, బి.జె.పికి అనుకూలంగా పావులు కదుపుతున్నాడు. కె.సి.ఆర్ లక్ష్యమంతా కేంద్రంలో బేరసారాలాడే శక్తిని పెంచుకొని దోపిడీలో తన వాటాను పెంచుకోవడమే.

**4. ప్రశ్న :- సంతలో సరుకుల మాదిరిగా అధికార పార్టీలకు అమ్ముడుపోతున్న ఎమ్.ఎల్.ఎలు, మారుతున్న రాజకీయాలపై మీ పార్టీ అభిప్రాయం?**

**జవాబు :-** ఈ విషయంపై మా అభిప్రాయం పైనే చెప్పాము. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ, వాళ్ళు రూపొందించుకున్న విలువలను సైతం కోల్పోయి శిథిలావస్థకు చేరింది. దీనిని సంస్కరించడం సాధ్యం కాదు. కనుకనే ప్రజలు దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా రంగంలోకి దిగి, ఈ రాజకీయ వ్యవస్థను ధ్వంసం చేసి, తమకు అనుకూలమైన, నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను రూపొందించుకోవలసిందే. అందుకు మా పార్టీ ప్రజలకు నాయకత్వం వహిస్తున్నది. అదే మేం చెబుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవం.

**5. ప్రశ్న :- దొంగే ఇతరులను దొంగ దొంగ అన్నట్లు ప్రజలను దోచుకుంటున్న పార్టీలు ఇతర పార్టీలపై ఆరోపణలు చేయడం,**

**పరస్పర దూషణలకు దిగడం ... దేనికి సాంకేతం? దీన్ని ఎలా చూస్తారు?**

**జవాబు :–** మేము ఈ ఆరోపణ, ప్రత్యారోపణలను కుక్కల కొట్లాట అంటున్నాం. ఈ నాయకులకు అక్రమంగా సంపాదనను పెంచుకోవడమూ, అందుకు వక్రమార్గంలో అధికారాన్ని చేపట్టడం పరమధ్యేయాలుగా వుంటాయి. మన రాష్ట్రంలో ఇప్పటికే రాశులు, రాశులుగా సంపదను పోగేసుకున్న చంద్రబాబు, జగన్‌లు ఈ రేసులో ముందువీరిన వున్నారు. వీళ్ళ చేతుల్లో మీడియా వుంది. అమ్ముడుపోయిన మేధావులు, కళాకారులు వున్నారు. వీళ్ళందరినీ ఉపయోగించుకొని ఎన్నికలలో ప్రజలను తమకనుకూలంగా ప్రభావితం చేస్తున్నారు. ఈ మధ్య ఎ.బి.కె ప్రసాద్, రామచంద్రమూర్తి, అమర్ వంటి 'ప్రజాస్వామికవాదులు' సైతం తమ స్వప్రయోజనాలకోసం 'స్వయం ప్రకటిత నియంత' అయిన జగన్ (టి.వి9 రజినికాంత్‌తో జరిగిన ఇంటర్వ్యూ సందర్భంగా, జగన్ ప్రాంతీయ పార్టీలలో వ్యక్తులే నిర్ణయాలు తీసుకుంటారనీ, తమ పార్టీలో కూడా తానే నిర్ణయాధిపతినని స్వయంగా ప్రకటించాడు)ను అధికారంలోకి తెచ్చేందుకు పోటీ పడి, తమ సేవలను అందిస్తున్నారు. అయితే ఈ పాలకపార్టీలు అనుసరిస్తున్న దోపిడీ, మోసపూరిత, నిరంకుశ పద్ధతులు వికటిస్తుండటం వలన, ప్రజలు వాళ్ళ అసలు నైజాన్ని తెలుసుకుంటున్న క్రమం పెరుగుతున్నది. కనుకనే ప్రజలను ప్రత్యామ్నాయ విప్లవ రాజకీయాల వైపు మరింత చురుకుగా సమీకరించేందుకు ఇది సరైన సమయం అనుకుంటున్నాము.

**6. ప్రశ్న : కొత్తగా వచ్చిన జనసేన పార్టీని మావోయిస్టు పార్టీ ఏ విధంగా చూస్తుంది? దాన్ని ప్రస్తుత అధికార పార్టీ టి.డి.పి, ప్రధాన ప్రతిపక్షం వై.సి.పిల గాటనే కడుతుందా?**

**జవాబు :–** పవన్‌కు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలాలేమిటో, వాటికి పరిష్కారాలేమిటో తెలియదు. తెలిసినా ఆయన వాటి జోలికి పోడు. అందుకే గత ఎన్నికలలో బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు పార్టీ బి.జె.పికి, టి.డి.పికి మద్దతు ఇచ్చాడు. ప్రస్తుతం అవి సరిగా లేవనీ, ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని చెబుతూ స్వంత పార్టీ పెట్టుకుని ఎన్నికల రంగంలోకి దిగాడు. వాస్తవంగా బి.జె.పి, టి.డి.పిలు అప్పుడూ, ఇప్పుడూ ఒకేలా ఉన్నాయి. వాటి స్వభావంలో మార్పేమి లేదు. మారిందల్లా పవనే. పవన్ చరిష్మాను ఉపయోగించుకొని ఒక పాలకముఠా అధికారంలోకి వచ్చేందుకు తయారైంది. ఈ ముఠాకు పవన్ అవసరం. పవన్‌కు ఈ ముఠా అవసరం. ఇది పాత కథే. కొత్త సీసాలో పాత సారానే. అందుకే పవన్ పార్టీలో చేరుతున్న నాయకులలో ఎక్కువ భాగం పాత కామందులే. అంటే గతంలో ఇతర పార్లమెంటరీ పార్టీలలో పని చేసి, ప్రజా వ్యతిరేకులుగా ముద్ర వడినవారే. ప్రస్తుతం రాజకీయ ఉపాధి కోసం వెంపర్లాడుతున్నవారే. కొంతమంది టాప్‌ర్యాంక్ బ్యూరాక్రట్స్ కూడా చేరుతున్నారు. వీరు కూడా ఈ దోపిడీ వ్యవస్థ ఎడలా, దోపిడీ విధానాల పట్ల అత్యంత వినయ విధేయతలు కలిగినవారే. పవన్ కూడా ప్రజల సమస్యల మూలాలోకి వెళ్ళకుండా అందరు నాయకుల లాగానే ఎన్నికల వరాలజల్లు కురిపిస్తున్నాడు. ఈ పార్లమెంటరీ పార్టీల నాయకులంతా ప్రజల సొమ్ము ప్రజలకు ఇవ్వడానికి కూడా ఫ్యూడల్ చక్రవర్తుల్లా వ్యవహరిస్తున్నారు. ప్రజలు అగ్గిపెట్టె మొదలు అన్ని వస్తువులపై పన్నులు కడుతున్నారు. జి.ఎస్.టి వచ్చిన తర్వాత ఈ పన్నులు రెట్టింపైనాయి. ఈ పన్నుల రూపంలో వసులైన ధనాన్ని ప్రజల సంక్షేమం కోసం ఖర్చు పెట్టేందుకు సైతం, ఆ పథకాలకు తమ పేర్లు పెట్టుకొని దానకర్ణుడిలాగా, శిబిచక్రవర్తిలాగా ఫోజులు కొడుతున్నారు. వీళ్ళకు కనీసం తాము రూంపొందించుకున్న బూర్జువా ప్రజాస్వామ్య విలువలు సైతం గుర్తుకు రావడం లేదు. పవన్ కూడా ఇదే బాటలో ఉన్నాడు. చివరికి కె.సి.ఆర్ వాగుడును వినియోగించుకొని ఆంధ్ర, తెలంగాణల మధ్య వైషమ్యాన్ని రెచ్చగొట్టి ఎన్నికల పబ్బం గడుపుకునే స్థాయికి దిగజారాడు. ఈ లక్షణాల రీత్యా ఆయనను గానీ, ఆయన పార్టీని గాని మేము ప్రత్యేకంగా చూడటం లేదు. ఈ పార్టీ కూడా ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఈ దోపిడీ వ్యవస్థకూ, దోపిడీ పాలకవర్గాలకు సేవ చేసేదే. ప్రస్తుత ఎన్నికలలో జనసేన పార్టీ బి.ఎస్.పి, వామపక్షాలతో పొత్తు పెట్టుకున్నంత మాత్రాన ప్రజలకు కొత్తగా ఒరిగేదేమి లేదు. బి.ఎస్.పి, వామపక్ష పార్టీల దోపిడీ పాలకవర్గ అనుకూల, అవకాశవాద వైఖరి గతంలోనే ఋజువైంది.

**7. ప్రశ్న :– మొత్తంగా నేడు జరుగుతున్న ఈ పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలపై మీ వైఖరి ఏమిటి?**

**జవాబు :–** నేడు దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఏ మాత్రం పనికిరాదని ఈ 72 ఏళ్ళ చరిత్ర రుజువు చేసింది. కనుక దీనికి కాలం చెల్లిపోయింది. ఈ స్థితిలో ప్రజలు ఎన్నికలను బహిష్కరించడం ద్వారా మరింత చురుకుగా రాజకీయ ప్రక్రియలోకి రావాలి. అలాగే దేశంలో ప్రజల నిజమైన భాగస్వామ్యంతో కూడిన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పేలా, అంటే నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం ప్రజాయుద్ధంలోకి సమీకృతులు కావాలి. ప్రజలు రాజ్యాధికారాన్ని సాధించేలా సాయుధులవడంతో పాటు, విప్లవ ప్రజాకమిటీ (ఆర్.పి.సి)లను నిర్మించుకోవాలి. ఈ ఎన్నికల సందర్భంగా ప్రజలకు మేము ఈ దిశగా ముందడుగేయమని పిలుపునిస్తున్నాం.

**8. ప్రశ్న :– మావోయిస్టు ఉద్యమం దారి తప్పి హింసకే పరిమితం అవుతోంది అన్న వాదన పెరుగుతున్న తరుణంలో పార్టీ వైఖరిలో మార్పు వచ్చిందా? పాత విధానాలతోనే సాగుతోందా?**

**జవాబు :–** మా పార్టీ ఎప్పుడూ దారి తప్పలేదు. మేము అప్పుడూ, ఇప్పుడూ సరైన పంథాలోనే నడుస్తున్నాము. అది ప్రజాపంథా. ప్రజల మౌలిక సమస్యలైన భూమి, విస్థాపన వంటి సమస్యలతో పాటు, ఇతర సమస్యలపై కూడా మా పార్టీ మాత్రమే నిజాయితీగా పని చేస్తున్నది. అణగారిన సెక్షన్‌ల(దళిత, ఆదివాసీ, మైనారిటీ, మహిళా, పీడిత జాతులు)కు మా పార్టీ మత్రమే అండగా నిలబడుతున్నది. మరోవైపు ప్రజలను చైతన్య పరుస్తూ, వివిధ నిర్మాణాలలోకి సంఘటిత పరుస్తున్నది. ఇలా సంఘటిత పడిన ప్రజాపునాది మా పార్టీకి వున్నంతగా మరేనంస్థకు లేదు. ఈ క్రమంలోనే ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అణచివేతకు పాల్పడుతున్న ఈ దోపిడీ ప్రభుత్వాలనూ, వారి కిరాయి సాయుధ బలగాలను ప్రజలు మా పార్టీ, పి.ఎల్.జి.ఎ నేతృత్వంలో సాయుధంగా ప్రతిఘటిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ దోపిడీ ప్రభుత్వాలు ప్రజలపై అమలు జరుపుతున్న ఫాసిస్టు హింసను ప్రజలు మా పార్టీ పి.ఎల్.జి.ఎల నేతృత్వంలో ప్రతిహింస ద్వారా జవాబు చెబుతున్నారు. ఈ

క్రమాన్నంతా ఉద్దేశపూర్వకంగా చూడ నిరాకరించినవారు మాత్రమే మాది దారి తప్పిన హింసగా ప్రచారం చేస్తూ, మాపై దుష్ప్రచార దాడిని కొనసాగిస్తున్నారు.

**9. ప్రశ్న :- బసవరాజు నేతృత్వంలో పార్టీ పంథాలో ఏమైనా మార్పు రానుందా? లేదా పోరాట విధానం మారనుందా?**

**జవాబు :-** మా పార్టీ నూతన ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ బసవరాజును ఎన్నుకున్న మాట వాస్తవమే. అయితే మా పార్టీలో కొత్తవారు బాధ్యతల్లోకి వచ్చినప్పుడల్లా పంథాలో మార్పు చోటు చేసుకోదు. పరిస్థితులలో వచ్చే ఘననీయమైన మార్పులు మాత్రమే పంథాలో మార్పులకు కారణమవుతాయి. కనుక ప్రస్తుతం మీరనుకున్నటువంటి గుణాత్మకమైన మార్పులేవి మా పంథాలో చోటు చేసుకోవడం లేదు. ప్రస్తుతం మేము అమలు చేస్తున్న దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథానే దేశ నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించుకుంటూ పురోగమిస్తాము.

**10. ప్రశ్న :- మావోయిస్టు పార్టీ ఉద్యమ ప్రాంతాల పరిధి తగ్గి ఉనికే ప్రశ్నార్థకం అయిందనే వాదనలకు తగ్గట్టుగా భద్రతా బలగాల దాడులు, ఎన్‌కౌంటర్లు, తగ్గుతున్న క్యాడర్ సంఖ్యపై మీ అభిప్రాయం?**

**జవాబు :-** 'ఉనికే ప్రశ్నార్థకం' అయిందనే వాదన ఇప్పటిది కాదు. ఈ దోపిడీ ప్రభుత్వాలు గత 40 ఏళ్ళుగా చేస్తున్న వాదనే ఇది. ఇది విప్లవోద్యమానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సైకలాజికల్ వార్‌లో భాగమే. అయితే మీరన్నట్లు మా ఉద్యమం తాత్రొడ్డుమీద ప్రయాణం లాగా ఉండని మాట వాస్తవమే. అది ఎగుడు దిగుడులతో, ఆటు పోట్లతో క్రమంగా పురోగమిస్తున్నది. 2006లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేస్తానని ప్రకటించింది. కానీ ఒక పుష్కరకాలం గడిచినప్పటికీ, అది మా పార్టీని ఎ.పిలో పూర్తిగా నిర్మూలించలేకపోయింది. గత 12 సంవత్సరాలుగా మా పార్టీ నేతృత్వంలో ఎ.పి ప్రజలు అనేక సమస్యలపై వీరోచితంగా పోరాడుతూ, క్రమంగా ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ విస్తరిస్తున్నారు. అంటే దీనర్థం ప్రజలు విప్లవాన్ని కోరుకుంటున్నారనే. ఈ క్రమంలో మాకు నష్టాలు జరిగిన మాట వాస్తవమే. తిరిగి ఆ నష్టాలను పూరించుకుంటూ పురోగమిస్తున్నాము. కేవలం ఒక విద్యుత్ బల్బును కనుగొనడానికి థామస్‌ఆల్వాఎడిసన్ 10 వేలసార్లు వైఫల్యం చెందాడు. అటువంటిది చాలా క్లిష్టతరమైన సామాజిక మార్పును సాధించడం అంత తేలిక కాదు. ఆ అనివార్యమైన విప్లవమార్పు కోసం ఎన్నో ఎత్తుగడలను మార్చుకోవలసి వుంటుంది. ఈ అవగాహనకనుగుణంగానే మా పార్టీ విజయం దిశగా క్రమంగా అడుగులు వేస్తున్నది.

**11. ప్రశ్న :- క్వాలిటీ రిక్రూట్‌మెంట్ తగ్గిన నేపథ్యంలో పార్టీలో విషయ పరిజ్ఞానం గల నాయకుల్ని తయారు చేసుకోవడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, తప్పటడుగుల వల్ల ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకతను ఎలా అధిగమిస్తున్నారు?**

**జవాబు :-** క్వాలిటీ రిక్రూట్‌మెంట్ అంటే చదువుకున్నవాళ్ళు, మేధావులు అనే అర్థం మీ ప్రశ్నలో వ్యక్తమవుతున్నది. ఇది సరైన అవగాహన కాదు. క్వాలిటీ రిక్రూట్‌మెంట్‌లో రాజకీయంగా సంఘటితపడిన వ్యవసాయ కూలీ, పేదరైతాంగం కూడా వస్తారు. వారికి మా పార్టీ విషయ పరిజ్ఞానాన్ని అందించి, అనేక రంగాలలో నాయకత్వ శ్రేణులుగా ఎదిగిస్తున్నది. ఆ పీడిత రైతాంగ నాయకత్వమే నేడు విప్లవోద్యమంలో అద్భుతాలు సృష్టిస్తున్నది. వాళ్ళే పొలిటికల్ కమిస్సార్‌లుగా, మిలిటరీ కమాండర్లుగా, కమ్యూనికేషన్ పర్సన్‌లుగా, ఆయుధాల తయారీలో టెక్నిషియన్స్‌గా, టీచర్లుగా, డాక్టర్లుగా సమర్థవంతమైన పాత్రను పోషిస్తున్నారు. అయితే మీరన్నట్లు పార్టీ కంపోజిషన్‌లో మధ్యతరగతి విద్యావంతులను చేర్చుకోవలసిన అవసరం వున్నది. మా పార్టీ ఈ దిశగా కృషిని కొనసాగిస్తున్నది. కొంత మేరకు ఫలితాలను కూడా సాధిస్తున్నాము. అయితే పార్టీలో అన్యవర్గ ధోరణులు అనేవి కార్మికవర్గేతర ధోరణులకు చెందినవి. ఇవి పార్టీని ప్రజల నుండి దూరం చేస్తాయి. ప్రస్తుతం మా పార్టీ ప్రధానంగా వ్యవసాయ కూలీ, పేద రైతాంగం, పట్టణ మధ్యతరగతి వర్గాలతో కూడుకొని వుండటం వలన వారిని ప్రొలిటేరియనైజ్ చేస్తూ, ప్రజలకు అత్యంత సన్నిహితంగా ఉండేలా బోల్షివీకరణ క్యాంపెయిన్ నిరంతరం చేపడుతుంటాం. కనుక ప్రజలనుండి వ్యతిరేకత తెచ్చుకునే సమస్య వుండదు.

**12. ప్రశ్న :- పార్టీ అనుబంధ సంఘాలు నిస్తేజమైన ప్రస్తుత స్థితిలో మైదాన ప్రాంతాల్లో పోరాటం కష్టంగా మారడమే కాకుండా ఉద్యమ ప్రాంతాల్లో ప్రత్యేకించి ఆదివాసీ ప్రాంతాల్లో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి అనే విషయం అంగీకరించక తప్పని వాస్తవం. దీన్ని అధిగమించడానికి పార్టీ ఏం చేయబోతోంది?**

**జవాబు :-** దేశవ్యాపితంగా వున్న విప్లవ శక్తిని మీరు తక్కువగా అంచనా వేస్తున్నారు. మీరన్నట్లు మాకు కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ, పురోగమించేందుకు అవకాశాలు మెండుగా వున్నాయి. వాటిని మేము ఉపయోగించుకొంటాం. అంతర్జాతీయంగా, దేశీయంగా పాలకవర్గాలు ఎదుర్కొంటున్న ద్రవ్య, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో విప్లవ సిద్ధాంతానికి ఆదరణ పెరుగుతున్నది. అలాగే మా పార్టీకి కూడా విశాల మైదాన, పట్టణ ప్రాంతాలలో ఆదరణ పెరుగుతున్నది. ఈ అనుకూలతను విప్లవ పురోగమనానికి వినియోగించుకొనేందుకు పార్టీని అనేక నూతన వ్యూహాత్మక ప్రాంతాలకూ, పట్టణ మైదానాలకు విస్తరిస్తున్నాము. ఈ మాత్రం పట్టణాలకు విస్తరిస్తున్న విప్లవోద్యమ ప్రభావానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరింతలేక పోతున్నాయి. అందుకే అర్బన్ మావోయిస్టుల పేరుతో నిజాయితీ కలిగిన ప్రజాస్వామిక వాదులను సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరెస్టులు చేసి, వేధిస్తున్నాయి. ఈ నిర్బంధాలు ప్రతిఘటనకే దారి తీస్తాయి. ప్రస్తుతం మా పార్టీ విశాల ప్రాంతాలలోని, విశాల ప్రజానీకంలోకి వెళ్ళి పోరాటాలు చేపట్టడం ద్వారా శత్రువును ఒంటరి చేసి, విప్లవోద్యమాన్ని పురోగమింపజేయగల్గుతుంది.

**13. ప్రశ్న :- పార్టీ ద్వితీయ శ్రేణిలో సమర్థ నాయకత్వాన్ని నిర్మించడంలో విఫలమవుతుందని వాదనలు వున్నాయి. కేవలం సాయుధ పోరాటంపైనే దృష్టి ఉంచి పార్టీకి గుండెకాయలాంటి పొలిటికల్ వింగ్‌ని ఎందుకు నిర్వీర్యం చేసుకుంటోంది?**

**జవాబు :-** ఈ వాదనలు కూడా మా పార్టీ అవగాహనకు, ఆచరణకు పొంతన లేకుండా వున్నాయి. మా అవగాహనలో, ఆచరణలో

కార్మికవర్గ రాజకీయాలనే ప్రతి విషయానికి ముందుపీఠిన ఉంచుతాం. మిలటరీ రంగంతో సహా, ప్రతి రంగాన్ని రాజకీయాలకు లోబరిచే ఉంచుతాం. మేము నిర్వహించే సాయుధ పోరాటం కూడా ప్రజలకు అధికారం దక్కాలనే రాజకీయ అవగాహన కేంద్రంగా జరుగుతున్నది. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే కార్మికవర్గంలోని పురోగామి శక్తులకు, రాజకీయంగా ప్రాతినిధ్యం వహించే నిర్మాణంగా పార్టీ ఉంటూ, ఉద్యమంలోని సకల కార్యకలాపాలను పార్టీనే నియంత్రిస్తుంది. ఈ విషయాలను అర్థం చేసుకోలేనివాళ్ళే మా మిలటరీ కార్యాచరణను రాజకీయాలతో సంబంధం లేని సుద్ధ మిలటరీ కార్యాచరణగా అర్థం చేసుకుంటుంటారు. ఈ అంచనా సరైనది కాదు. అలాగే పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకొనేందుకూ, నాయకత్వ కొనసాగింపునకు మేం ఎప్పటికప్పుడు లీడర్‌షిప్ ట్రైనింగ్ క్యాంపుల నిర్వహణ ద్వారా ఆ సమస్యను పరిష్కరించుకొంటుంటాం. ఇందులో మేం సకారాత్మక ఫలితాలనే సాధిస్తున్నాం.

**14. ప్రశ్న :- ఎన్నిసార్లు ఎదురు దెబ్బలు తింటున్నా, గుణపాఠాలు నేర్చుకోకపోగా మళ్ళీ అవే తప్పిదాలు చేస్తూ ఉదాహరణకి మితిమీరిన మొబైల్స్ వినియోగం, అనుమానాస్పద వైఖరి కలిగి పోలీసులతో సఖ్యత కలిగిన వ్యక్తులనే నమ్మటం, వారి నుండి సాయం ఆశించి పార్టీ క్యాడర్లను కోల్పోవడం.... మీ అభిప్రాయం?**

**జవాబు :-** నిజమే. మీరన్నట్లు పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులనూ, క్యాడర్లను కొంత ఎక్కువ సంఖ్యలో కోల్పోయిన మాట వాస్తవమే. నేడు భారతదేశంలో విప్లవోద్యమం ఎదుర్కొంటున్న శత్రువు చాలా బలమైనవాడు. ఇటువంటి బలమైన శత్రువును ఎదుర్కొని విజయాలు సాధించేందుకు త్యాగాలు అవసరమవుతాయి. అయితే అనవసరమైన త్యాగాలను పార్టీ కోరుకోవడం లేదు. వీటిని నివారించేందుకే పార్టీ ఎప్పటికప్పుడు తమ తప్పుల నుండి గుణపాఠాలు తీసుకొని తిరిగి ఆ తప్పులను జరగకుండా చూసుకుంటున్నది. అయితే శత్రువు ఎప్పటికప్పుడు తన వ్యూహాన్ని, ఎత్తుగడలను మార్చుకుంటూ సాయుధ దాడిని తీవ్రతరం చేస్తున్నాడు. ఇటువంటి మారుతున్న పరిస్థితులలో కూడా సరైన పనిపద్ధతులు, ఎత్తుగడలతో నష్టాలను తగ్గించుకొని శత్రువును ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందులో సఫలీకృతం అవుతున్నాం. అంతేగానీ నష్టాల విషయంలో నిర్లక్ష్యంగా వుండటం లేదు. విప్లవానికీ, ప్రజల భవిష్యత్‌కు బాధ్యత పడుతున్న పార్టీగా ఇది మాకు ప్రధాన కర్తవ్యంగా వుంటుంది.

**15. ప్రశ్న :- మీ పార్టీ కొండలకు, గుట్టలకు అంటే ఆదివాసీ ప్రాంతాలకే పరిమితమా? మారుతున్న కాలం, పరిస్థితులు, ప్రజల ఆలోచనా విధానాలను బట్టి పార్టీ వైఖరిలో మార్పు చూసే అవకాశం వుందా?**

**జవాబు :-** పార్టీ వ్యూహాత్మక ప్రాంతాలను (దట్టమైన అటవీ ప్రాంతాలు) కేంద్రంగా చేసుకుంటున్నప్పటికీ, విశాలమైన మైదాన ప్రాంతాలకూ, పట్టణాలకు విప్లవోద్యమాన్ని పురోగమింపచేస్తుంది. ఇది మా రాజకీయ మిలటరీ వ్యూహంలో భాగమే. అలాగే కేవలం ఆదివాసీలనే కాకుండా కార్మికవర్గం, రైతాంగం, పెటీ బూర్జువా వర్గం, జాతీయ బూర్జువా వర్గాలను కూడా ఆర్గనైజ్ చేసి, విప్లవంలోకి కలుపుకొచ్చుకుంటుంది. ఇది మా అవగాహన ఆచరణ కూడా. అలాగే సమాజంలోని ఉత్పత్తి సంబంధాలలో చోటు చేసుకుంటున్న మార్పులకనుగుణంగా ప్రజలను పోరాటాలలోకి సమీకరించేందుకూ, సంఘటితపరిచేందుకు మా ఎత్తుగడలను కూడా మార్చుకుంటుంటాం.

**16. ప్రశ్న :- గతంతో పోలిస్తే సరెండర్‌లు పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. క్యాడర్‌ని సరైన స్థాయిలో మోటివేట్ చేయడంలో విఫలం అవుతున్నారు అని అర్థమా?**

**జవాబు :-** శత్రువు విప్లవోద్యమాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు గ్రీన్‌హంట్, సమాధాన్ వంటి పేర్లతో ఫాసిస్టు దాడిని తీవ్రతరం చేస్తున్నాడు. ఈ ప్రతీఘాతుక దాడిని ఓడించి, విప్లవోద్యమాన్ని పురోగమింపజేసే ప్రయాణంలో కొన్ని కఠినమైన మలుపులు వుంటాయి. అటువంటి సందర్భాలలో పార్టీ మొత్తం తన సిద్ధాంత స్థాయిని, చైతన్యస్థాయిని పెంపొందించుకోవాల్సి వుంటుంది. అప్పుడు మాత్రమే పార్టీ శత్రువు అమలు జరుపుతున్న ఫాసిస్టు దాడిని ధీటుగా ఎదుర్కొగలుగుతుంది. ఈ అవగాహనకనుగుణంగానే పార్టీ ఎప్పటికప్పుడు పరిస్థితులను తట్టుకొని పురోగమించేలా క్యాడర్ల సిద్ధాంత, రాజకీయ స్థాయిని పెంచుతున్నది. అయితే ఈ క్రమంలో తమ సిద్ధాంత, రాజకీయ స్థాయిని పెంపొందించుకోలేనివారు, ప్రజల విముక్తి కోసం త్యాగాలకు సిద్ధపడనివారు లొంగిపోవడం సహజం. ఈ లొంగుబాట్లు శత్రువు పైచేయి సాధించినప్పుడే కొంత ఎక్కువగా జరుగుతున్నాయి. పార్టీ ఎప్పటికప్పుడు ఈ దిగజారుళ్ళను తగ్గించేందుకు సిద్ధాంత, రాజకీయ కృషి చేపడుతున్నది. మొత్తంగా చూసినప్పుడు పార్టీలోకి భర్తీ అయినవారిలో లొంగిపోయినవారికంటే నిలదొక్కుకున్నవారు, అమరుల సంఖ్య ఎక్కువ. ఈ అంశం మా పార్టీ రాజకీయ పటిష్టతకు తార్కాణం.

**"మార్క్సిజం - లెనినిజం ప్రకారం ఎన్నికలలో పాల్గొనడం లేదా బహిష్కరించడమనేవి పోరాట రూపాలు, ఎత్తుగడలకు సంబంధించినవి. కానీ కృశ్చెవ్ రివిజనిజం ఆవిర్భావం తర్వాత పార్లమెంటరీ బాట, ఎన్నికల్లో పాల్గొనడం అన్నవి ఆధునిక రివిజనిస్టుల వ్యూహంగా మారాక, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకున్నప్పుడు మనం దాన్ని కేవలం ఎత్తుగడలకు సంబంధించిన సమస్యగా మాత్రమే చూడలేం. అందుకని అన్ని ఇతర ఎత్తుగడల వలనే ఈ ఎత్తుగడ కూడా దేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు సాధారణంగా తగినదిగా ఉండి విప్లవ వ్యూహానికి అంటే దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి దోహదపడేదిగా వుండినప్పుడు మాత్రమే ఉపయోగించుకోవచ్చునని అనడం తప్పు అవుతుంది."**

– ***భారత విప్లవ వ్యూహం ఎత్తుగడలు,*** (ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ ఆమోదించిన డాక్యుమెంట్) 44వ పేజి.

బూటకపు పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరించండి!

# నిజమైన భారత జనతా ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్ స్థాపనకై పోరాడండి!

*మా ప్రతిపాదిత నిజమైన ప్రత్యామ్నాయ నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమ సంక్షిప్త చిత్రణ!*

**ప్రియమైన ప్రజలారా, మిత్రులారా!**

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత సామ్రాజ్యవాద దేశాలు వలసలలో స్వతంత్ర/విముక్తి ఉద్యమాల వల్ల ప్రత్యక్ష వలస పాలన సాగించగలిగే స్థితి ప్రపంచంలో లేకుండా పోయింది. దీంతో ప్రపంచంలో వలస దోపిడీ పీడన స్థానంలో నయా వలస దోపిడీ పీడన ప్రారంభమైంది. 1947లో మన భారతదేశంలో బ్రిటీషువారి ప్రత్యక్ష పాలన అంతమైంది. ఎంతో మూల్యం చెల్లించిన తర్వాత కూడా దేశానికి లాంఛనప్రాయ (నకిలీ) స్వాతంత్ర్యమే లభించింది. బ్రిటీషువారి కుట్రల ఫలితంగా, వారితో దేశ దళారీ పాలకుల కుమ్మక్కు వలనా మతం పేరిట మునుపెన్నడూ లేని విధంగా రక్తపాతం జరిగిన తర్వాతే దేశ విభజన జరిగింది. భారత బడా బూర్జువాలు, బడా భూస్వాములు దేశం వలసగా ఉన్న కాలమంతా బ్రిటీషువారి దళారీలుగా, వారికి విశ్వసనీయమైన సేవకులుగా ఉన్నారు. బ్రిటీషువారితో కలిసి భారత ప్రజలను దోపిడీ చేస్తూనే బ్రిటీష్ వలస పాలకులకు వ్యతిరేకంగా సాగిన స్వతంత్ర ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ ప్రజలను మోసగిస్తూ వచ్చారు. ఇటువంటి దళారీ పెట్టుబడిదారుల, భూస్వాముల చేతిల్లోకే అధికార మార్పిడి జరిగింది. బ్రిటీష్‌వారి నిష్క్రమణతో దేశంలో సామ్రాజ్యవాదుల దోపిడీ, తెర వెనక నుండి రాజకీయ అదుపు నిరాటకంగా కొనసాగే విధానం ఆరంభమైంది. ఈ విధంగా వలస, అర్ధభూస్వామ్య భారతదేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశంగా మారింది. అందువల్లనే ఈ దోపిడీ వ్యవస్థను, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కాపాడుతూ ప్రజలను నిరంతరాయంగా దోపిడీ పీడనలకు గురి చేయడానికి మొదట ఈ దోపిడీ వర్గాలకు చెందిన అతిపెద్ద పార్టీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

ఈ బడా పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి చేసే పేరుతో సామ్రాజ్యవాద (విదేశీ) పెట్టుబడి, టెక్నాలజీపై ఆధారపడే ఆర్థిక విధానాన్ని అనుసరించింది. ఫలితంగా వాటిపై ఆధారపడడం పెరిగింది. పరిపాలన, రాజకీయాలు, న్యాయవ్యవస్థ, సైన్యం, ఆర్థిక విధానాలు, విద్య, సంస్కృతి మొదలైనవి చాలా వరకూ వలసకాలపు చట్రంలోనే కొనసాగాయి. ఇవి నిజమైన/స్వతంత్ర పునాదిపై నిర్మించబడినవి కాకపోవడం వల్ల ప్రజాస్వామీకరించ బడలేదు. భారత ప్రజల ప్రతినిధుల సభ అని పిలువబడే పార్లమెంటు, నిజానికి 1947 తర్వాత ప్రపంచంలో అత్యంత బూటకమైన వాటిలో ఒకటిగా నిలిచింది. పార్లమెంటులో తీసుకునే నిర్ణయాలు బడా పారిశ్రామికవేత్తలు, బడా భూస్వాములు, వారి పక్షం వహించే కొంత మంది కేబినెట్ మంత్రులు తీసుకునే నిర్ణయాలుగా ఉంటాయి. పార్లమెంటులో ఏ బిల్లు అయినా ఆమోదించడం, ఆమోదించకపోవడం అనేది సామ్రాజ్యవాదుల, దోపిడీ వర్గాల ప్రయోజనాలకు తోడ్పడే విధంగానే పార్లమెంటు వెలుపల డబ్బు లేదా మంద బలం ద్వారా నిర్ణయించబడుతుంది.

నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం పెట్టుబడిదారులు రూపొందించిన 'బాంబే ప్లాన్'ను ఆమోదిస్తూ మొదటి పంచవర్ష ప్రణాళికను ప్రారంభించింది. ఆనాడు ప్రపంచయుద్ధం వలన విధ్వంసానికి గురైన తమ ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మించుకోవలసిన అత్యంత ఆవశ్యకమైన పరిస్థితిలో, సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ ప్రభావమూ, అభివృద్ధిని చూసి ఆందోళన పడిన సామ్రాజ్యవాదులు కీన్స్ సూచించిన విధంగా ప్రభుత్వ పెట్టుబడితో కూడిన భాగస్వామ్య ఆర్థిక విధానాలను ప్రారంభించారు. వీరు 'సంక్షేమ' పెట్టుబడిదారీ రాజ్యాల నాటకాన్ని ముందుకు తెచ్చారు. ఆనాడు భారత ఆర్థిక వ్యవస్థ స్థితి కూడా దయనీయంగా ఉండింది. మార్కెట్ల స్తంభించిపోవడం, పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, వాటికోసం దేశీయ దళారీ పెట్టుబడిదారుల వద్ద తగినంత పెట్టుబడి లేకపోవడం వల్ల పెద్దెత్తున ప్రభుత్వమే పెట్టుబడిని పెట్టాల్సిన అవసరం పాలకుల ముందుకు వచ్చింది. ఈ విధంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పేరుతో ప్రైవేటు, ప్రభుత్వ రంగాలు ఉనికిలోకి వచ్చాయి. అవి సామ్రాజ్యవాద మార్కెట్, సామ్రాజ్యవాదుల పెట్టుబడి (అప్పు), టెక్నాలజీలపై ఆధారపడినవిగా ఉండినాయి. ప్రభుత్వ పర్యవేక్షణలో, ప్రభుత్వ పెట్టుబడితో పంచవర్ష ప్రణాళికలు దేశంలో దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని బలోపేతం చేసాయి.

'సంక్షేమ రాజ్యం' అని చెప్పుకున్నప్పటికీ, విద్య, వైద్యం, తాగునీరు, గృహవసతి వంటి ప్రజల మౌలిక అవసరాలపై ఖర్చు తగ్గిపోతూ వచ్చింది. గత 71 ఏళ్లుగా ఈ సామ్రాజ్యవాద అనుకూల, దేశ పాలకవర్గాల అనుకూల, ప్రజావ్యతిరేక, దేశ వ్యతిరేక విధానాల కొనసాగింపుగానే తాజా పరిస్థితి నిర్దిష్టంగా ఇలా ఉంది - మోదీ ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపు విద్య, వైద్య రంగాలకు జీడీపీలో 4.4 శాతం మాత్రమే ఉంది.

ఇది సబ్-సహారన్ ఆఫ్రికా, తూర్పు ఆసియా, లాటిన్ అమెరికా దేశాలతో పోల్చితే చాలా తక్కువ. ఈ ప్రభుత్వం పిల్లలకు పోషకాహారం, గర్భవతి తల్లుల, బాలింత తల్లుల, యువతుల పోషణ, ఆరోగ్య సంక్షేమం కోసం 75 శాతం నిధులను తగ్గించింది. దీంతో పాటు, 6 శాతం పెరుగుదల రేటుతో ఆకాశాన్ని అంటే ధరలు, ప్రభుత్వ లెక్కల ప్రకారమే 9.5 శాతానికి చేరుకున్న తీవ్రమైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరగడం, విదేశీ అప్పులు 37,96,200 లక్షల కోట్ల రూపాయలు, రెవెన్యూ లోటు 3.5 శాతం, కరెంటు అకౌంటు లోటు 2.5 శాతం పెరిగిపోవడం, జీడీపీ వృద్ధి రేటు 2 శాతం పడిపోవడం, రూపాయి విలువ పడిపోయి డాలరుకు 74 రూపాయలు కావడం, నోట్ల రద్దు, 58,000 కోట్ల రూపాయల రాఫేల్ కుంభకోణం, పంజాబ్ నేషనల్ బ్యాంకు, రొటోమాక్ కంపెనీ వంటి మంత్రుల - నాయకుల - అధికారుల అవినీతి కుంభకోణాలతో పాటు బ్యాంకుల ఎన్‌పీఏ (నాన్ పర్‌ఫార్మింగ్ అసెట్స్-మొండి బకాయిలు), ఎల్‌ఓయు (లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్), ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్), విదేశీ ఒప్పందాల వంటి వాటి ద్వారా తారాస్థాయికి చేరిన వ్యవస్థీకృత అవినీతి, విదేశీ బ్యాంకుల్లోకి గతం కంటే ఎక్కువగా నల్లధనం చేరడం, మహిళలపై తీవ్రమైన అణచివేత, విస్థాపన కారణంగా లక్షలాది ప్రజల నిస్సహాయ స్థితి, దుర్భరస్థితి, ఆకలిచావులు మొదలైనవి ప్రజల జీవనస్థాయిని భయంకరంగా దిగజార్చివేసాయి.

గత 71 సంవత్సరాల అనుభవంలో ఈ దేశంలో 73 శాతం సంపద కేవలం 1 శాతంగా ఉన్న కుబేరుల చేతిలో కేంద్రీకృత్వం కావడం ద్వారా పిడికెడు మంది ధనికులు మరింత ధనికులయ్యారనీ, పెద్దసంఖ్యలో పేదలు మరింత పేదలయ్యారనీ స్పష్టమవుతుంది. నిజానికి, దేశంలో ఉపాధి, విద్య, వైద్యం, ఆహారం, నివాసం మొదలైన మౌలిక హక్కులు/ సదుపాయాలు 65 కోట్ల మంది ప్రజలకు లభించడం లేదు. ప్రపంచంలో అత్యంత పోషకాహార లోపం బారినపడిన పిల్లలలో ఎక్కువ మంది మన దేశంలో ఉన్నారు. దేశంలో 30 కోట్ల మంది ప్రజలు ఆకలితో బతుకులెల్లదీస్తున్నారు, 49 కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువును జీవిస్తున్నారు. మునుపటి యుపీఏ ప్రభుత్వం లాగానే మోదీ ప్రభుత్వం ఎల్‌పీజీ విధానాలను అమలు చేసిన కారణంగా, కార్మికుల, ఉద్యోగుల నిజవేతనాలు తీవ్రంగా పడిపోతున్నాయి. ఆర్థికాభివృద్ధి రేటు 7 శాతం ఉన్నదని ప్రభుత్వం ఢంకా భజాయిస్తున్నప్పటికీ, తప్పుడు లెక్కలు చూపడంలో ఆరితేరిన మోదీ ప్రభుత్వం నిజ వృద్ధిని 2 శాతం పెంచి చెప్పడం 2015 నుంచే ప్రారంభించింది. అందువల్లనే మోదీ పాలనలో ఉపాధి కేవలం 1.1 శాతమే లభించింది. ప్రతి సంవత్సరం 2 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తానన్న మోదీ 2016-17లో కేవలం 4.16 లక్షల ఉద్యోగాలు మాత్రమే కల్పించాడు. నోట్ల రద్దు వల్ల 3 లక్షల చిన్న, మధ్యరకం పరిశ్రమలు మూతబడి 2 కోట్ల ఉద్యోగాలు ఊడిపోగా, జీఎస్టీ వల్ల వ్యాపారంలో మాంద్యం మరింత పెరిగి 15 కోట్ల మంది పనిచేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య రకపు పరిశ్రమలు దెబ్బతిన్నాయి. 'ఈ వే' బిల్లు ద్వారా వ్యాపార, చిన్న పరిశ్రమలపై పెద్ద దాడి చేసాడు. ముఖ్యమైన రంగాలన్నింటిలోకి విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం పలికి, స్థానికమైన వాటి నాశనానికి మార్గం సుగమం చేసాడు. నిరుద్యోగం ఎంతగా పెరిగిందంటే ఉత్తర్‌ప్రదేశ్‌లో 62 చప్రాసీ ఉద్యోగాల కోసం 93,000 మంది అర్జీలు పెట్టుకున్నారు. ఇందులో 3,740 మంది పీహెచ్‌డీ చేసినవారు. 2019 నాటికి దేశంలో 77 శాతం యువకులు ఉద్యోగాల కోసం బికారుల్లా తిరిగే పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యార్థి-యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకొని పోవడంతో దేశంలో 4,68,48,100 మంది రైతులు మొత్తం 12.60 లక్షల కోట్ల రూపాయల రుణభారంతో అల్లాడుతున్నారు. మోదీ పాలనలో రైతుల ఆత్మహత్యలు మూడు రెట్లు పెరిగాయి. ప్రతి సంవత్సరం 12 వేలకు పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని 2017 మే నెలలో స్వయంగా మోదీ ప్రభుత్వమే సుప్రీం కోర్టులో చెప్పింది. ప్రతి 40 నిముషాలకు ఎక్కడో ఒక చోట రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడు. దేశంలో విస్థాపన సమస్య తీవ్రంగా ఉంది. గనులు, అడవుల్లో బఫర్ జోన్లు, హైవే, వివిధ ప్రాజెక్టుల కోసం భూమిని కబ్జా చేస్తూ కోట్లాది మంది ప్రజలను విస్థాపితం చేస్తున్నారు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు. గాలి, నీరు, నేల, ఆహారం అన్నీ కలుషితమైపోతున్నాయి.

మా పార్టీ అవగాహన ప్రకారం సమస్యలకు మూలం - ప్రజాస్వామ్యంగా పిలువబడుతున్న ఈ వ్యవస్థ పునాదుల్లో ఉంది. భారత ప్రజలు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ద్వారా కేంద్రంలో, రాష్ట్రాల్లో అనేక ప్రభుత్వాలను మార్చారు. కానీ ఫలితమేమయ్యింది? ప్రస్తుత దుర్భర స్థితి, ఆకలి చావులు ఏదో ఒక ప్రభుత్వ కారణంగా కాకుండా, గత 71 సంవత్సరాలుగా పాలకవర్గాలు వివిధ ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల ఫలితమే. అందువల్లనే మా పార్టీ కాలంచెల్లిన ప్రస్తుత వ్యవస్థను సమూలంగా మార్చేందుకు నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహిస్తున్నది.

పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో జరిగే ఎన్నికల ద్వారా నేటి దేశంలోని అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను మార్చడం సాధ్యం కాదు; ఈ ఎన్నికల ద్వారా కేవలం ఈ వ్యవస్థను కాపాడడానికీ, కొనసాగించడానికీ అధికారానికి వచ్చే పాలకవర్గ ముఠాలు/రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు మాత్రమే మారుతాయి. ఇది కేవలం ముఖానికి వేసుకున్న తొడుగును మార్చడంతో సమానం. అంటే ఎన్నికల ద్వారా కేవలం పాలకుల/ప్రభుత్వాల రంగులు మారుతాయి, దోపిడీ పాలన అంతం కాదు. మేము దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా భారత పాలకుల - దళారీ నిరంకుశ బూర్జువాల, భూస్వాముల, వారి సామ్రాజ్యవాద ప్రభువుల అధికారాన్ని రూపుమాపి పీడిత ప్రజల, అంటే, కార్మికుల, రైతుల, పెటీబూర్జువాల (చిన్న దుకాణదారులు, చిన్న వ్యాపారులు, సాధారణ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు మొదలైనవారు), దేశీయ బూర్జువాల (చిన్న, మధ్యతరగతి పెట్టుబడిదారులు, వ్యాపారులు), పీడిత

సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల ఐక్యసంఘటనతో కూడిన నిజమైన స్వతంత్ర, ప్రజాస్వామిక, ప్రగతిశీల ప్రభుత్వాన్ని ఏర్పరచాలని భావిస్తున్నాం.

ఈ సందర్భంగా మేము స్పష్టంగా చెప్పదలచేదేమంటే, మేము ఫాసిజానికీ, దురాక్రమణ/ జోక్యందారీ యుద్ధాలకు, రాజ్య టెర్రరిజానికీ, మతోన్మాద టెర్రరిజానికీ, వ్యక్తిగత హింసావాదానికీ పూర్తిగా వ్యతిరేకం. మేం అన్ని రకాల న్యాయమైన యుద్ధాలను, విప్లవ యుద్ధాలను/ తిరుగుబాట్లను/ పోరాటాలను సమర్థిస్తాం. మేం దేశ విముక్తికై/ నూతన ప్రజాస్వామిక భారత నిర్మాణానికై దీర్ఘకాలిక ప్రజాయుద్ధం కొనసాగిస్తున్నాం. ఈ విప్లవ యుద్ధంలో మేము ప్రజాపంథాను, వర్గపంథాను ఖచ్చితంగా అమలు చేస్తాం, దోపిడీ, పీడనలకు గురయ్యే ప్రజలను దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో రాజకీయంగా సమీకరించడం ద్వారానే విప్లవకర మార్పు తీసుకురావాలని భావిస్తాం. అయితే, దేశవ్యాప్తంగా అటువంటి ప్రభుత్వం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసిన తర్వాత మాత్రమే ఏర్పడుతుంది. ఈ నూతన ప్రజాస్వామిక రాజ్యాధికారం కుళ్లి కంపుకొట్టే పాలకవర్గాల నేటి ఆర్థిక వ్యవస్థకు, రాజకీయాలకు, సంస్కృతికి గల పునాదినే సమూలంగా మార్చివేస్తుంది. అందువల్లనే, గత అర్ధశతాబ్దం నుండి మా పార్టీ నాయకత్వాన దేశవ్యాప్తంగా లక్షలాది-కోట్లాది మంది పీడిత ప్రజానీకం లక్షలాది మంది కేంద్ర-రాష్ట్ర పోలీసు, పారామిలిటరీ బలగాలు కొనసాగిస్తున్న అణచివేత క్యాంపెయిన్లను సాహసోపేతంగా తిప్పికొడుతూ పోరాడుతున్నారు. ఈ పోరాటంలో వేలాది మంది విప్లవ కేడర్లు-ప్రజలు ప్రాణాలనర్పించారు. ఫలితంగా, దేశంలోని పలు బలమైన విప్లవోద్యమ ప్రాంతాలలో విప్లవ ప్రజా కమిటీలు (స్థానికంగా నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాలు) ఏర్పడి ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రాథమికంగా అమలు చేస్తున్నాయి. ఈ విధమైన కృషిని కొనసాగించడం ద్వారానే దేశంలో నిజమైన స్వతంత్ర, ప్రగతిశీల, సర్వతోముఖ, స్వావలంబ, లౌకిక, ప్రజాస్వామిక వ్యవస్థ స్థాపించబడుతుంది, ప్రణాళికాబద్ధంగా బలోపేతం చేయబడుతుంది. అటువంటి భారతదేశం నిజమైన లౌకిక దేశంగా వివిధ జాతుల స్వచ్ఛంద సమాఖ్యగా ఉంటుంది. ఈ విధంగా భారతదేశాన్ని సమూలంగా మార్చడం కోసం కార్మికవర్గ అగ్రగామిగా మా పార్టీ నాయకత్వంలో నాలుగు ప్రజాస్వామిక వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల మైత్రిపై ఆధారపడిన విప్లవకర ఐక్యసంఘటనా ప్రభుత్వం - నూతన ప్రజాస్వామిక రాజ్యం వివిధ రంగాలలో చేపట్టే మౌలిక కార్యక్రమం గురించిన సంక్షిప్త చిత్రణను ఇక్కడ మేము అందిస్తున్నాం.

### నూతన రాజ్యయంత్రం-రాజ్యాంగం ఆవశ్యకత

మొట్టమొదట నూతన సామాజిక వ్యవస్థ కోసం, దాని పురోభివృద్ధి కోసం నూతన రాజ్యయంత్రాన్నీ, నూతన రాజ్యాంగాన్ని ఏర్పరచుకోవడం అవసరం. నిజానికి ప్రస్తుత రాజ్యయంత్రం - రాజ్యాంగమే దేశంలోని అశేష ప్రజానీకాన్ని అంతులేని నయావలస దోపిడీ పీడనలకు గురిచేయడంలో, పిడికెడు మంది ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారే క్రమం కొనసాగించడంలో ప్రధాన సాధనంగా ఉంది. దీంతో పాటు, ఇదే భారత సమాజంలో నిరంతరాయంగా వర్గాల మధ్య, సామాజిక సెక్షన్ల మధ్య వైరుధ్యాలు కొనసాగడానికి ప్రధాన సాధనంగా ఉంది. ఉదాహరణకు, వ్యవసాయంలో కులాధారిత అర్ధభూస్వామ్య సంబంధాలు, పరిశ్రమలలో దళారీ బడా నిరంకుశ పెట్టుబడి ఆధిపత్యం, కేంద్ర, రాష్ట్రాల మధ్య వైరుధ్యాలు, కపటమైన రిపబ్లిక్కు సమాఖ్య, జాతుల అణచివేత, కులపరమైన అణచివేత-వివక్ష, మతపరమైన అణచివేత-వివక్ష, మహిళల పట్ల పితృస్వామిక ఆచరణతో పాటు వివిధ రకాల అణచివేత-వివక్ష, బాలలపై దోపిడీ, అణచివేత మొదలైనవి. ఈ వైరుధ్యాలను, సమస్యలన్నింటినీ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మార్గదర్శకత్వంలో సవ్యంగా పరిష్కరిస్తూ సోషలిస్టు సమాజంగా పరివర్తన విజయవంతంగా జరిగేందుకు నూతన ప్రజాస్వామిక అధికారం నెలకొల్పడం తప్పనిసరి అవసరం. ఇందుకు ఒక నూతన రాజ్యయంత్రాన్నీ నిర్మించుకోవలసిన, ఒక నూతన రాజ్యాంగాన్ని-చట్టాలను రూపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉంటుంది. ఇందులో భాగంగా నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఎన్నుకునే ఎన్నికల వ్యవస్థ ఉంటుంది. నూతన రాజ్యయంత్రం నూతన ఎన్నికల వ్యవస్థ, నూతన రాజ్యాంగంపై ఆధారపడి ఉంటుంది.

నూతన ప్రజాస్వామిక రాజ్యయంత్రం - రాజ్యాంగం కార్మికవర్గ నాయకత్వాన కార్మిక-కర్షక పునాదిపై ఆధారపడి కార్మిక, కర్షక, పట్టణ మధ్యతరగతి, దేశీయ పెట్టుబడిదారుల, పీడిత సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల ప్రజాస్వామిక రాజ్యయంత్రంగా -రాజ్యాంగంగా ఉంటుంది. ఇది ఈ నాలుగు వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వాటి పురోభివృద్ధికీ, ఉన్నత పరివర్తనకు ప్రధాన సాధనంగా ఉంటుంది. ఇందుకు మొట్టమొదట నేటి దోపిడీ పీడనలకు మూలమైన ఉత్పత్తి సంబంధాలను రద్దు చేసి, నూతన ప్రజాస్వామిక రాజ్యానికి పునాదిగా ఉండే ఉత్పత్తి సంబంధాలను నెలకొల్పడంతో పాటు గత ఉత్పత్తి సంబంధాల పునాదిపై ఏర్పడిన, దోపిడీ వర్గాలకు సేవ చేస్తూ వాటికి ప్రాతినిధ్యం వహించిన రాజకీయాలను, సంస్థలను రద్దు చేస్తుంది. సామాజిక అణచివేత- వివక్షలను రద్దు చేస్తుంది. సాంస్కృతిక రంగంలో నిరంతరం విప్లవాన్ని కొనసాగిస్తుంది. ఇది దోపిడీ వర్గాల అవశేషాలను, కూలదోయబడిన దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే శక్తులను అదుపు చేస్తూ, విద్యావంతం చేస్తూ పరివర్తన చెందించడానికి వారిపై, సామ్రాజ్యవాద ఏజెంట్లపై, విప్లవ ప్రతిఘాతకులపై, దేశద్రోహులపై నూతన ప్రజాస్వామిక నియంతృత్వాన్ని అమలు చేస్తుంది. అశేష ప్రజల, దేశ సర్వతోముఖాభివృద్ధికీ దేశ స్వాతంత్ర్యాన్ని - సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికీ ఆర్థిక, రాజకీయ,

సామాజిక, సైనిక, సాంస్కృతిక, పర్యావరణ తదితర కార్యక్రమాలన్నింటిలోనూ రాజ్య వ్యవహారాలన్నింటిలోనూ ప్రజల చైతన్యపూర్వక, క్రియాశీల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి కృషి చేస్తుంది. దేశంలోని వివిధ పీడిత వర్గాల, సామాజిక సెక్షన్ల, జాతుల మధ్య వివిధ రంగాలలో గల అంతరాలను తొలగిస్తూ మార్క్సిజం - లెనినిజం - మావోయిజం మార్గదర్శకత్వంలో సమాజాన్ని నూతన ఉన్నత దిశగా-సోషలిజం దిశగా నడిపించడానికి అన్ని రంగాల్లో ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వపరంగానూ, ప్రజలపరంగానూ కృషి చేస్తుంది. పార్టీ, ప్రభుత్వం, సైన్యం తదితర రంగాల్లోని అధికార యంత్రాంగంలో తలెత్తే నిరంకుశత్వం, అవినీతి, బంధుప్రీతి, వివక్ష తదితర ప్రజావ్యతిరేక, అభివృద్ధినిరోధక పోకడలను సకాలంలో అరికట్టడానికి చట్టపరంగా కృషి చేయడమే కాకుండా ప్రజలను-ప్రజా సంస్థలను (ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక రాజకీయ పార్టీలు, సాంస్కృతిక సంస్థలు తదితరమైనవి) ప్రోత్సహిస్తుంది, వాటికి ప్రజాస్వామిక హక్కులు కల్పిస్తుంది.

## వ్యవసాయ రంగం

నూతన ప్రజాస్వామిక రాజ్యం వ్యవసాయంలో దోపిడీ ఉత్పత్తి సంబంధాలను రూపుమాపుతుంది, వ్యవసాయం సామ్రాజ్యవాదంపై, బహుళజాతి కంపెనీలపై ఆధారపడేతత్వాన్ని అంతం చేసి, వ్యవసాయాన్ని వాస్తవికంగా అభివృద్ధి చేస్తుంది. ప్రస్తుతం దేశంలో మొత్తం వ్యవసాయ యోగ్యమైన భూమి 30 శాతం పైగా జనాభాలో 5 శాతంగా ఉన్న భూస్వాముల చేతుల్లో ఉంది. మొత్తం రైతుల్లో 65 శాతంగా ఉన్న భూమిలేని పేద రైతులచేతుల్లో ఉన్న భూమి ఒక హెక్టారు కంటే కూడా చిన్నది. నూతన ప్రజాస్వామిక రాజ్యం భూస్వాముల, మత సంస్థల భూమినంతటినీ జప్తు చేసుకుంటుంది, 'దున్నేవారికే భూమి'పై ఆధారపడి భూమిలేని, పేద రైతులకు, రైతుకూలీలకు అదనపు భూమిని పంపిణీ చేస్తుంది, ఇది భూమిలేని, పేద రైతుల ప్రభుత్వ, సహకార, ప్రైవేటు రుణాలను, రద్దు చేస్తుంది. రైతాంగాన్ని దోపిడీ చేసే రుణ వ్యాపార సంస్థలను తన నియంత్రణలోకి తీసుకుంటుంది. ఇది సహకార వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రజల శ్రమ, పెట్టుబడే ఈ సహకారానికి ముఖ్య ఆధారంగా ఉంటాయి, ఇందులో కీలకమైన అంశం శ్రమ. ఇది వినియోగదారుల-రుణదాతల సహకార సమితులను ప్రోత్సహిస్తుంది. ఇది పెట్టుబడిదారీ రైతుల పెద్ద వ్యవసాయ క్షేత్రాలను, కార్పొరేట్ రంగాలకు చెందిన వ్యవసాయ క్షేత్రాలను, ఫారం హౌసులను, ప్లాంటేషన్లు, తోటలు మొదలైన వాటి భూమినంతటినీ జప్తు చేసుకొని వాటిలో సమిష్టిగా వ్యవసాయం చేయించేందుకు ప్రాముఖ్యత ఇస్తుంది.

ఇది నీటిపారుదల, విద్యుదుత్పాదన కోసం భారీ నదీ లోయల్లో ప్రాజెక్టులను నిర్మించడం కాకుండా భూమి ఆకృతికి అనుగుణంగా, చిన్న-చిన్న ప్రాజెక్టులను, అంటే, చెక్‌డ్యాములు, చిన్న నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తుంది. తద్వారా పర్యావరణం దెబ్బతినకుండా చేస్తుంది, ప్రజలను విస్థాపన నుండి కాపాడుతుంది. ఏదేనీ భారీ ప్రాజెక్టును అనివార్యంగా నిర్మించాల్సిన పరిస్థితి ముందుకు వస్తే స్థానిక ప్రజల ఆమోదంతో, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని మాత్రమే నిర్మిస్తుంది.

ఇది మార్కెట్ ఎగుడు-దిగుళ్లు, అప్పుల భారం నుండి రైతులను విముక్తి చేస్తుంది. ఇది ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి బయటకు వస్తుంది. రైతుకు వ్యతిరేకమైన ప్రతీ విధానాన్ని తిరస్కరిస్తుంది. వ్యవసాయంలో బహుళజాతి కంపెనీల దోపిడీ చొరబాటును అడ్డుకుంటుంది. వ్యవసాయంలో నపుంసక, సంకర విత్తనాలను, భూమిని బంజరుగా మార్చే వ్యవసాయ ఉత్పాదితాలను (ఇన్‌పుట్లు) నిషేధిస్తుంది. మట్టిని, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని దేశవాళీ విత్తనాలను, ఎరువులను వినియోగిస్తుంది, వాటిపై పరిశోధనలను ప్రోత్సహిస్తుంది. ఇది వ్యవసాయంలో సహకార సమితులకు, చిన్న రైతులకు అవసరమైన వస్తువులపై సబ్సిడీ ఇస్తుంది. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తుంది. ఇది మొట్టమొదటగా ఆహారం విషయంలో, పోషకాహారం విషయంలో దేశాన్ని స్వయంసంపూర్ణం చేస్తుంది, సబ్సిడీలు ఇచ్చి చౌక ధరలకు ఆహార పంపిణీని గ్యారంటీ చేస్తుంది. ఇది ప్రభుత్వ పథకాలలో వ్యవసాయంపై ఖర్చుని పెంచుతుంది, దీనికి ప్రాధాన్యతనిస్తుంది. ఈ విధంగా ఇది "వ్యవసాయాన్ని పునాదిగా తీసుకొని పరిశ్రమను నాయకత్వంలో ఉంచే" సూత్రాన్ని, "రెండు కాళ్ల మీద నడిచే" వరుస విధానాలనూ అనుసరిస్తుంది.

## పారిశ్రామిక రంగం

నూతన ప్రజాస్వామిక రాజ్యం పరిశ్రమలను, వ్యాపారాలను సామ్రాజ్యవాద నియంత్రణ నుంచి దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల నియంత్రణ నుంచి పూర్తిగా విముక్తి చేస్తుంది. దానిని స్వావలంబనపై ఆధారపడినదిగా పునర్నిర్మాణం చేస్తుంది. ఇది సామ్రాజ్యవాదులకు, దళారీ బడా పెట్టుబడిదారులకు చెందిన యావత్తు పారిశ్రామిక, బ్యాంకు పెట్టుబడిని, సట్టా వ్యాపారుల పెట్టుబడిని, వారి భూమిని, భవనాలను, తోటలు మొదలైన వాటిని, ఉన్నతాధికారుల అపరిమితమైన సంపదను, బ్యాంకులలో ఉన్న వారి డబ్బును జప్తు చేసుకుంటుంది. ఇది బడా పెట్టుబడిదారులకు, విదేశీ పెట్టుబడిదారులకు చెందిన యావత్తు ఫ్యాక్టరీలను, బ్యాంకులను, ఇన్సూరెన్స్ కంపెనీలను, ఇతర ద్రవ్య సంస్థలను, పరిశోధన-అభివృద్ధి విభాగాలు మొదలైన వాటిని జాతీయం/దేశీయం చేస్తుంది. ఇది బడా పరిశ్రమల్లో దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, విదేశీ పెట్టుబడిదారుల పెట్టుబడి ఉనికిని పూర్తిగా రూపుమాపుతుంది. ఇది పాలకవర్గాల ద్వారా సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల నుంచి, దేశాల నుంచి తీసుకున్న రుణాలను రద్దు చేస్తుంది. ఇది మన పరిశ్రమలను ఆధారపడేలా చేసే/పరాధీనం చేసే ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ మొదలైన సామ్రాజ్యవాద సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను కూడా రద్దు చేస్తుంది. ఇది సామ్రాజ్యవాద ప్రాయోజిత ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను తిరస్కరిస్తుంది. ఇది

సాధారణంగా ప్రభుత్వ పెట్టుబడిని బలోపేతం చేస్తూ పట్టణ, గ్రామీణ రంగాలలో పెట్టుబడి సంచయనంపై సీలింగును విధిస్తుంది.

ఇది వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకోవడం ద్వారా పరిశ్రమల స్థాపన-అభివృద్ధి జరుగుతాయి. ఇది శ్రమ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ప్రస్తుత అసమతుల్యతను దూరం చేస్తుంది. గ్రామీణ ప్రాంతాలను తగిన విధంగా అభివృద్ధి చేయడం, అక్కడ పరిశ్రమలను, వ్యాపారాలను అభివృద్ధి చేయడం ద్వారా పట్టణాలలో పెరుగుతున్న జనాభా వత్తిడిని తగ్గిస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుండి పని-వ్యాపారం కోసం పట్టణ ప్రాంతాలకు వలసపోయే స్థితిని క్రమంగా అంతం చేస్తుంది.

నేడు సంఘటిత రంగంలో కేవలం 7 శాతం మంది పనిచేస్తున్నారు. నూతన ప్రజాస్వామిక రాజ్యం పరిశ్రమలలో ఉపాధి కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తుంది తప్ప లాభాలకు కాదు. ఇది కాంట్రాక్టు కార్మిక పద్ధతిని అంతం చేస్తుంది. ఇది ఆరు గంటల పని విధానాన్ని అమలు చేస్తుంది. ఇది మహిళలు, పురుషుల కోసం సమాన పనికి సమాన వేతనాన్ని గ్యారంటీ చేస్తుంది. ఇది బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా రూపుమాపుతుంది. కార్మికులకు సామాజిక భద్రతనూ, భద్రమైన పని పరిస్థితులనూ కల్పిస్తుంది. ఇది పని చేసే హక్కును మౌలిక హక్కుగా గుర్తిస్తుంది. నిరుద్యోగ నిర్మూలన వైపుగా పురోగమిస్తుంది. నూతన ప్రజాస్వామిక రాజ్యం సెజ్ (ప్రత్యేక ఆర్థిక జోన్లను)లను రద్దు చేస్తుంది.

నూతన ప్రభుత్వం చిన్న, మధ్యతరహా పరిశ్రమలను కాపాడుతుంది. దేశీయ పెట్టుబడిదారీ పరిశ్రమలను, వ్యాపారాలను పరిమితం చేసి నియంత్రిస్తుంది. పరిశ్రమల, వ్యాపార వాణిజ్యాల, గృహ పరిశ్రమల, చేతివృత్తుల బహుముఖ అభివృద్ధి కోసం సహకార ఉద్యమాన్ని పూర్తిగా ప్రోత్సహిస్తుంది.

## జాతులకు స్వయంనిర్ణయాధికార హక్కు-స్వచ్ఛంద సమాఖ్య నిర్మాణం

నూతన ప్రజాస్వామిక రాజ్యం ప్రస్తుతం జరుగుతున్నట్లుగా సాయుధ బలంపై ఆధారపడి ఏ జాతినీ కూడా భారత సమాఖ్యలో భాగం చేసేందుకు పూనుకోదు. నేటి భారత విస్తరణవాద ప్రభుత్వం కశ్మీర్‌ను 5 లక్షల భారత సైన్యం ఉక్కుపాదాలతో అణగదొక్కుతున్నది. మణిపూర్, నగాల్యాండ్, అసోంతో సహా యావత్తు ఈశాన్య ప్రాంతం నిజానికి సైనిక రాజ్యంగా మార్చివేసింది. నూతన రాజ్యం యావత్తు జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార హక్కును గుర్తిస్తుంది, వాటన్నింటికీ సమాన స్థాయిని కల్పించి, సమానతపై ఆధారపడి దేశాన్ని ఐక్యం చేస్తుంది. భారత సమాఖ్యలో ఉండే జాతి, రక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ మొదలైన విషయాలు మినహా యావత్తు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవహారాలలో స్వావలంబనను కలిగి ఉంటుంది. ఈ విధంగా ప్రజాస్వామికంగా, పరస్పర ఆమోదంపై, సహకారంపై ఆధారపడి ఫెడరల్ రిపబ్లిక్కుల స్వచ్ఛంద సమాఖ్యను ఈ రాజ్యం స్థాపిస్తుంది. ఈ రాజ్యం యావత్తు జాతుల భాషలకు సమాన స్థాయిని కల్పిస్తుంది. ఇది లిపి లేని భాషల అభివృద్ధికి తోడ్పడుతుంది. దేశీయ భాష లేదా అనుసంధాన భాష అనే పేరుతో ఏ రూపంలోనూ ఈ రాజ్యం ఇతర జాతులపై ఏ భాషను కూడా రుద్దబోదు. ఇది వివిధ జాతుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తుంది. జాతుల నడుమ ఉన్న వివిధ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తుంది.

## కుల అణచివేత-వివక్షల నిర్మూలన

నూతన ప్రజాస్వామిక రాజ్యం భూస్వాముల రాజకీయ అధికారాన్ని ధ్వంసం చేయడం ద్వారానూ, దున్నేవారికే భూమి ప్రాతిపదికన వారి భూమిని పంపిణీ చేయడం ద్వారానూ, భూమిలేని, పేద రైతుల నాయకత్వం కింద ఉండే కొత్త అధికారం ద్వారానూ (వీరిలో పెద్ద సెక్షన్లు దళితులు, ఆదివాసులు, ఇతర పీడిత కులాల నుండి వచ్చినవారే అయి ఉంటారు), సమాజంలో కుల ఆధారిత భూస్వామ్య పునాదిలో పాతుకుపోయి ఉన్న కులవ్యవస్థను రూపుమాపే క్రమాన్ని ఆరంభిస్తుంది. ఇందుకు ప్రత్యేక నిర్మాణ, పోరాట రూపాలను ఎంచుకోవడం ద్వారా శాస్త్రీయ సోషలిస్టు దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా బ్రాహ్మణవాద భావజాలాన్నీ, కులవివక్షనూ, అసమానతలనూ నిర్మూలించి, అంటరానితనాన్ని, మొత్తంగా కులవ్యవస్థనూ సంపూర్ణంగా నిర్మూలించే వైపు కృషి చేస్తుంది. ఇది కులవివక్ష పాటించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తుంది. అప్పటి వరకూ దళితులకూ, ఇతర సామాజిక పీడిత కులాలకు ఊతమివ్వడానికి రిజర్వేషన్లతో సహా ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తుంది.

## మహిళలకు సమాన హక్కు

ఇది మహిళలకు వ్యతిరేకంగా అన్ని రకాల వివక్షను రూపుమాపే దిశగా పురోగమిస్తుంది. ఇది పురుషాధిపత్యాన్నీ, పితృస్వామ్యాన్నీ రూపుమాపేందుకు పోరాడుతుంది. ఇది భూమితో పాటు ఆస్తిపై వారి సమాన హక్కును కూడా గ్యారంటీ చేస్తుంది. ఇది సతీసహగమనం, బాల్య వివాహాలు, వరకట్నం, లింగ వివక్ష మొదలైన మహిళా వ్యతిరేక తప్పుడు రుగ్మతలపై నిషేధం విధిస్తుంది. ఇందుకు ఒడిగట్టిన దోషులకు శిక్ష విధిస్తుంది. ఇది వినియోగవాదాన్నీ (కన్‌జ్యూమరిజం), మహిళలను అంగడి సరుకుగా వాడుకునే - అశ్లీల సాహిత్యం, నగ్న విజ్ఞాపనలు, అందాల పోటీలు మొదలైన ప్రతీ ఒక్క సామ్రాజ్యవాద-పెట్టుబడిదారీ రుగ్మతలను నిషేధిస్తుంది. ఈ రాజ్యం వేశ్యావృత్తిలో కూరుకుపోయిన మహిళలకు పునరావాసం కల్పిస్తుంది. వారికి సామాజిక గుర్తింపును కల్పిస్తుంది. ఇది మహిళలను ఇంటిపని అనే జైలు నుంచి విముక్తి చేస్తుంది, సామాజిక ఉత్పత్తి, ఇతర కార్యకలాపాలలో వారి భాగస్వామ్యాన్ని గ్యారంటీ చేస్తుంది. స్త్రీలు ఎదుర్కొనే అణచివేత, వివక్షలను వేగంగా నిర్మూలించడానికి ప్రత్యేక విధానాలను ప్రోత్సహిస్తుంది. వారికి రిజర్వేషన్లతో సహా ప్రత్యేక సదుపాయాలను ఖాయం చేస్తుంది.

## ఆదివాసులకు స్వయం ప్రతిపత్తి

ఇది జల్-జంగల్-జమీన్‌పై ఆదివాసుల-మూలవాసుల సమిష్టి యాజమాన్యాన్ని గుర్తిస్తుంది. వాటిని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం కోసం, ఆ సముదాయాలను ప్రోత్సహిస్తుంది. ఇది యావత్తు ఆదివాసీ సముదాయాల సంపూర్ణ అభివృద్ధి కోసం, వాటికి వివిధ స్వావలంబన అధికారాలను గ్యారంటీ చేస్తుంది. దానికి అనుగుణంగా ప్రత్యేక విధానాలను అమలు చేస్తుంది.

## లౌకిక రాజ్య నిర్మాణం

రాజ్యాంగం లౌకికమైనదని ప్రకటించినప్పటికీ, భారత రాజ్యం 'హిందీ, హిందు, హిందుస్తాన్' అనే బ్రాహ్మణవాద, జాతీయోన్మాద భావజాలంతో కూడుకొని ఉంది. నూతన ప్రజాస్వామిక రాజ్యం రాజ్యానికి మతం రంగు పులమడానికీ, అన్ని రకాల మత ఛాందసత్వాలకూ వ్యతిరేకమైనది. ఇది మత మైనారిటీలపై అత్యాచారాలను, మత ప్రాతిపదికతో కూడిన సామాజిక అసమానతలను రూపుమాపుతుంది. ఇది మత మైనారిటీల సామాజిక-ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక విధానాలను అమలు చేస్తుంది. ఇది మత వ్యవహారాలలో రాజ్యం జోక్యాన్ని రూపుమాపుతుంది. దీంతో పాటు, ఇది రాజకీయ లక్ష్యాల కోసం మతాన్ని వినియోగించడాన్ని అడ్డుకుంటుంది. ఇది మతాన్ని పాటించడంలో, పాటించకపోవడంలో వ్యక్తిగత స్వేచ్ఛకు గ్యారంటీ కల్పిస్తుంది.

## నూతన ప్రజాస్వామిక సంస్కృతి నిర్మాణం

భారత సమాజం వేలాది యేళ్లుగా కులపరంగా విభజించబడిన బ్రాహ్మణవాద కుల, సామాజిక అంతరాలు, వివక్ష, ఆచారాలు, అంధవిశ్వాసాలపై ఆధారపడిన సమాజంగా ఉంది. బ్రాహ్మణవాదం ఇక్కడి భూస్వామ్య విధానానికి సాంస్కృతిక వెన్నెముక లాంటిది. నూతన రాజ్యం ఉన్మాదపూరిత కులతత్వాన్నీ, పుట్టుకపై ఆధారపడి సామాజికంగా ఉన్నత, నీచ భేదాలు, అంటరానితనం, వివక్షలను పూర్తిగా రూపుమాపే వైపు పురోగమిస్తుంది.

ఇది ఆదివాసుల పట్ల వివక్షను రూపుమాపుతుంది.

ఇది దేశంలో బ్రాహ్మణవాద హిందూ మతోన్మాద భావజాల ప్రభావంతో మతమైనారిటీల పట్ల వ్యాప్తి చెందిన అణచివేత-వివక్షను నిర్మూలిస్తుంది.

సమాజంలో శాస్త్రీయ, హేతువాద దృక్పథాన్ని ప్రోత్సహిస్తుంది.

ఇది శిథిలమవుతున్న భూస్వామ్య, వలసవాద, సామ్రాజ్యవాద సంస్కృతి స్థానంలో నూతన ప్రజాస్వామిక, ప్రగతిశీల సంస్కృతిని స్థాపిస్తుంది. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మార్గదర్శకత్వంలో సోషలిస్టు-కమ్యూనిస్టు సంస్కృతి సాధన దిశలో పురోగమిస్తుంది.

## కేంద్ర-రాష్ట్ర సంబంధాలు

ఈ నూతన రాజ్యం అన్ని స్థాయిల్లో ప్రజల ప్రజాస్వామిక రాజ్యాంగానికి అనుగుణంగా, దానిపై ఆధారపడి విప్లవ ప్రజా సమితుల ద్వారా, ప్రజా ప్రభుత్వ పరిషత్తుల ద్వారా ప్రజల రాజకీయాధికారాన్ని స్థాపిస్తుంది. ఇది ప్రతినిధి సభలను బాతాఖానీ క్లబ్బులుగా, పళ్లు ఇకిలించేవిగా కాకుండా, సరైన కార్యనిర్వహణాధికార కేంద్రాలుగా అభివృద్ధి చేస్తుంది. ఇది భారత రాజకీయాలు, పాలన, సంస్కృతిలో కొనసాగుతున్న యావత్తు వలసవాద చట్రాలను, చట్టాలను, ప్రభావాలను రూపుమాపుతుంది.

యావత్తు ప్రజల కోసం అభివ్యక్తి స్వాతంత్ర్యం (మాట్లాడే స్వాతంత్ర్యం, రాసే స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం)తో పాటు సమావేశ హక్కు, సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె హక్కు, ప్రదర్శన జరుపుకునే హక్కు వంటి ప్రజాస్వామిక హక్కులను ఈ రాజ్యం గ్యారంటీ చేస్తుంది. ఇది రాజ్యాధికారం ద్వారా ప్రతి రోజూ పాలనా పనులను నడపడంలో ప్రజల భాగస్వామ్యాన్నీ, రాజ్యాధికారంపై ప్రజల నియంత్రణాధికారాన్ని గ్యారంటీ చేస్తుంది, ఈ అధికారాన్ని తగ్గించే ప్రతీ ప్రయత్నాన్నీ అడ్డుకుంటుంది.

ఇది కేంద్ర, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం నెలకొని ఉన్న యావత్తు అసమాన సంబంధాలను రూపుమాపి ఆరోగ్యవంతమైన సంబంధాలుగా పునర్నిర్మిస్తుంది. ఇది కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆచరణ క్రమంలో తలెత్తే ఏ సమస్యనైనా సమాఖ్య మౌలిక కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజాస్వామికంగా, పరస్పర సహకారంతో సంప్రదింపుల ద్వారా పరిష్కరిస్తుంది. రాష్ట్రాలకు రక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ మొదలైన విషయాలు మినహా ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవహారాలలో స్వావలంబనను కల్పిస్తుంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఆధిపత్య సంబంధాలను రూపుమాపుతుంది.

ఇది వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి ద్వారా ప్రాంతీయ అసమానతలను రూపుమాపే వైపు పురోగమిస్తుంది. ఇది ప్రాంతాల మధ్య నదీజలాల పంపిణీ, సరిహద్దు వివాదాలు వంటి సమస్యలను ఉమ్మడి ఆమోదంతో పరిష్కరిస్తుంది.

## సంక్షేమ రాజ్యం

ఇది ఉపాధి, విద్య, వైద్యం హక్కులను మౌలిక హక్కులుగా గ్యారంటీ చేస్తుంది. నిరుద్యోగాన్ని నిర్మూలించే వైపుగా పురోగమిస్తుంది. ఇది నిరంకుశ కేంద్ర, దేశ-విదేశీ బడా పెట్టుబడికి సేవ చేసే లక్ష్యంతో రూపొందించబడిన విద్యా విధానాన్ని రూపుమాపుతుంది. కార్మిక, కర్షక తదితర శ్రమజీవి ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా, దేశ ప్రయోజనాలు, ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకునే, ఉత్పత్తితో సంబంధాన్ని కలిగి ఉండే ప్రజాస్వామిక, శాస్త్రీయ విద్యా విధానాన్ని అభివృద్ధి చేస్తుంది. ఈ రాజ్యం నిరుద్యోగ భృతిని, సామాజిక బీమాను అమలు చేస్తుంది. ప్రజల జీవనస్థాయిని మెరుగుపరిచేలా గ్యారంటీ ఇస్తుంది.

ఇది శారీరక వికలాంగులకు, మానసిక అసమర్థులు-వికలాంగులకు, వృద్ధులకు, అనాథలకు, అంగలోపంతో బాధపడే ఇతర ప్రజలకు తగిన ఆర్థిక, సామాజిక భద్రతను, ఆరోగ్యకరమైన సామాజిక-సాంస్కృతిక వాతావరణాన్ని కల్పిస్తుంది.

ఇది యావత్తు ప్రజల కోసం, ప్రత్యేకించి, కార్మికులు, రైతులు, ఇతర శ్రమజీవి ప్రజల కోసం ఉన్నత ఆరోగ్య, ఉచిత వైద్య సేవలకు గ్యారంటీ కల్పించే ఒక ప్రజా వైద్య విధానాన్ని అమలు చేస్తుంది. యావత్తు దేశ ఆరోగ్య రంగం ప్రజా ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది. వైద్యులు ఆసుపత్రికి వెళ్లడం అనివార్యం చేస్తుంది.

ఇది తాగునీరు, కరెంటు, రవాణా, కమ్యూనికేషన్, ఇతర ప్రజోపయోగ రంగాలలో లాభం కోసం పనిచేసే ప్రైవేటు వ్యవస్థలను రూపుమాపుతుంది. యావత్తు రంగాలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకొస్తుంది. ఇది మానసిక, శారీరక శ్రమకు మధ్య అంతరాన్ని క్రమంగా తగ్గించేందుకు ప్రయత్నిస్తుంది. ఇది యావత్తు భారీ పన్నులను రూపుమాపుతుంది. ప్రస్తుత పన్నుల విధానాన్ని రద్దు చేస్తుంది, సరళమైన, ప్రగతిశీల పన్నుల విధానాన్ని అమలు చేస్తుంది.

### ప్రజా న్యాయ విధానం

ఇది ప్రజా అనుకూల ప్రగతిశీల, ప్రజాస్వామిక దృక్పథాన్ని అవలంబిస్తూ అందరినీ సంస్కరించడం కోసం హేతబద్ధ న్యాయాన్ని గ్యారంటీ చేసే న్యాయ విధానాన్నీ, న్యాయ వ్యవస్థను అమలు చేస్తుంది. ఈ దిశలో ఇది అధిక ఖర్చుతో కూడిన నేటి న్యాయ విధానాన్ని తొలగించి ప్రజలకు అందుబాటులో ఉండే న్యాయ విధానాన్ని తయారు చేస్తుంది.

### పర్యావరణం-విస్థాపన

లాభాల వేటలో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ప్రత్యేకించి అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడిదారులు పర్యావరణానికి ఎంతగా ధ్వంసం చేసారంటే భూమి అస్తిత్వమే సంక్షోభంలో పడిపోయింది. నూతన ప్రజాస్వామిక రాజ్యం ప్రపంచంలో భావజాలపరంగా సమానమైన ఇతర దేశాలతో కలిసి కాలుష్యాన్ని తగ్గించే విధంగా, దానికి అయ్యే ఖర్చు భరించే విధంగా సామ్రాజ్యవాద దేశాలపై ఒత్తిడి తీసుకువస్తుంది. ఇది పెద్ద నదీలోయ ప్రాజెక్టులను, అడవుల నరికివేతను, ఇతర పర్యావరణ వ్యతిరేక ప్రాజెక్టులను నిరుత్సాహపరుస్తుంది, అవసరమైతే వాటిని నిషేధిస్తుంది.

భారతదేశంలో వివిధ ప్రాజెక్టులలో 1947 నుంచి ఇప్పటి వరకు 6 కోట్ల మందికి పైగా ప్రజలు విస్థాపితులయ్యారు. ఇందులో ఎక్కువగా ఆదివాసులు ఉన్నారు. ఈ రాజ్యం ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండా, పర్యావరణానికి నష్టం కలిగిస్తూ, ఏ ప్రదేశంలోనూ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టదు. ప్రజా ప్రయోజనం కోసం చేపట్టే ఏ ప్రాజెక్టు వలన అయినా విస్థాపన జరిగే స్థితిలో సంపూర్ణ పునరావాసానికీ, ఉపాధికీ గ్యారంటీ ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టును ప్రారంభించడం జరుగుతుంది.

### అంతర్జాతీయంగా సౌహార్ద సంబంధాలు కలిగిన సార్వభౌమాధికార దేశం

ఇది సామ్రాజ్యవాదదేశాలతో ప్రస్తుత అభివృద్ధి నిరోధక, ప్రజావ్యతిరేక ప్రభుత్వంతో చేసుకున్న యావత్తు అసమాన, దేశవ్యతిరేక, దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే ఒప్పందాలను రద్దు చేస్తుంది. ఈ రాజ్యం దేశ భద్రత కోసం ప్రజలను సాయుధం చేస్తుంది, దేశ రక్షణలో ప్రజల పాత్రను పెంపొందిస్తుంది.

ప్రస్తుత పాలకుల విస్తరణవాద కోర్కెలకు వ్యతిరేకంగా ఈ రాజ్యం తన పొరుగు దేశాలతో సౌహార్ద సంబంధాలను నెలకొల్పుకుంటుంది. ఇది పొరుగు దేశాలతో గల సరిహద్దు సమస్యలను, నీరు, ఇతర సమస్యలను శాంతియుతంగా, న్యాయమైన విధంగా పరిష్కరించుకునేందుకు పూర్తిగా ప్రయత్నం చేస్తుంది. ఈ రాజ్యం పొరుగు దేశాలతో ఎన్నటికీ విస్తరణవాద పద్ధతుల్లో వ్యవహరించదు.

నేటి ప్రపంచంలో వివిధ సామాజిక వ్యవస్థలు గల దేశాలతో సంబంధాలలో ఈ రాజ్యం కింద పేర్కొన్న ఐదు సూత్రాలను అమలు చేస్తుంది - ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారం పట్ల పరస్పరం గౌరవం, పరస్పరం దురాక్రమణలకు పూనుకోకపోవడం, ఒకరు మరొకరి అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం, సమానత్వం-పరస్పర ప్రయోజనం- శాంతియుత సహజీవనం.

సంక్షిప్తంగా ఇవీ నూతన ప్రజాస్వామిక రాజ్యాధికారం అమలు చేసే ప్రధాన మౌలిక ప్రత్యామ్నాయ కార్యక్రమ రూపురేఖలు.

### ప్రియమైన ప్రజలారా, మిత్రులారా!

ప్రజాపక్షం వహించే ప్రజల-దేశ విముక్తి సాధించే ప్రత్యామ్నాయ కార్యక్రమాలతో ప్రజల ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని స్థాపించే లక్ష్యంతో మా పార్టీ నాయకత్వంలో నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం నుండి ఆరంభించి దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి నేడు దండకారణ్యం, బిహార్-ఝార్ఖండ్, తూర్పు బిహార్-ఈశాన్య ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం, ఆంధ్రప్రదేశ్, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏఓబీ), తెలంగాణ, మధ్యప్రదేశ్-మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ), పశ్చిమ కనుమల (కర్నాటక-తమిళనాడు-కేరళం సరిహద్దు) ట్రైజంక్షన్ తదితర ప్రాంతాలలో సామ్రాజ్యవాద-వ్యతిరేక, భూస్వామ్య-వ్యతిరేక సాయుధ పోరాటం కొనసాగుతున్నది. ఈ పోరాట లక్ష్యం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని స్థాపించడం, తద్వారా మన దేశాన్ని విముక్తి చేసి, దానిని స్వయంసంపూర్ణ, సమృద్ధ దేశంగా తయారు చేయడం. ఈ పోరాటంలో కోట్లాది భూమిలేని, పేద రైతులు, వ్యవసాయ కూలీలు, మధ్యతరగతి రైతులు, కొన్ని చోట్ల ధనిక రైతాంగం భాగమవుతున్నారు, విప్లవ ప్రజా సంఘాలలో, విప్లవ ప్రజా కమిటీలలో సంఘటితమవుతున్నారు. తాము కలలు గన్న భారతదేశాన్ని నిర్మించుకునేందుకు పోరాడుతూ అమరులవుతున్నారు.

పాలకవర్గాల ప్రభుత్వం దీన్ని ఎంత మూల్యం చెల్లించి అయినా అణచివేయాలని చూస్తున్నది. మునుపటి యుపీఏ

1, 2 ప్రభుత్వాల మాదిరిగానే స్వయంగా అమెరికాకు విశ్వసనీయ ఏజెంటు అయిన దేశ ప్రధాని మోదీ, అమెరికాకు, ఇతర సామ్రాజ్యవాద శక్తులకు విశ్వసనీయ దళారులు, సేవకులు అయిన తన తోటి మంత్రులు కూడా మా పార్టీ, భాకపా (మావోయిస్టు)ను దేశ అంతర్గత భద్రతకు అతిపెద్ద ముప్పుగా ప్రకటించారు. మా పార్టీనీ, విప్లవోద్యమాన్ని సమూలంగా తుడిచిపెట్టే లక్ష్యంతో యుపీఏ ప్రభుత్వం కొనసాగించిన ప్రజలపై యుద్ధంగా ప్రసిద్ధి చెందిన బహుముఖ దాడి-"ఆపరేషన్ గ్రీన్‌హంట్"ను బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మరింత తీవ్రతరం చేసింది. అది 2017 మే నెల నుండి దాని స్థానంలో మరింత క్రూరమైన ఫాసిస్టు "సమాధాన్" వ్యూహాన్ని ముందుకు తెచ్చింది. కశ్మీరు, ఈశాన్య ప్రాంతాలలోనూ, విప్లవోద్యమ ప్రాంతాలలో విప్లవ ప్రతీఘాతుక సల్వాజుడుం (ప్రజల మధ్య అంతర్యుద్ధాన్ని సృష్టించే సల్వాజుడుం వంటి అభియాన్లకు రాజ్యం మద్దతు నివ్వడం సరైంది కాదనీ దాన్ని ఆపాలనీ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది), సేంద్ర వంటి అభియాన్లలోనూ వచ్చిన అనుభవాలను బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు మోదీ-షా-భాగవత్ ముఠా దేశవ్యాప్తంగా విస్తరింపజేసింది. రాజ్యం ప్రత్యక్షంగా తన సాయుధ బలగాలను మోహరించి చేపట్టే ఆపరేషన్లు, కేంపెయిన్లతో పాటు రాజ్యేతర శక్తులను (నాన్-స్టేట్ ఏక్టర్స్) ప్రోత్సహించి విప్లవోద్యమంపై దాడి చేయడం నానాటికీ పెచ్చుమీరిపోయింది. నిజానికి, ఈ పోరాటం జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికార్ కోసం, యావత్తు ఆర్థిక-రాజకీయ హక్కులను సాధించడం కోసం కొనసాగుతున్న ప్రజా పోరాటం. దీన్ని అణచివేయడం కోసం అత్యాధునిక ఆయుధాలతో 5, 6 లక్షల పారామిలటరీ బలగాలను మోహరించి, శిక్షణ పేరుతో సైన్యాన్ని మోహరించేందుకు సన్నాహాలు చేస్తూ, 12 రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలను పోలీసు-సైనిక శిబిరంగా మార్చివేసారు. ఈ విధంగా ప్రజలకు వ్యతిరేకంగా అన్యాయమైన యుద్ధాన్ని సాగిస్తున్నారు. అరెస్టులు, మానసిక-శారీరక హింసలు, హత్యలు, రహస్య హత్యలు, మాయం చేయడం, మహిళల్ని బలాత్కరించడం-హత్య చేయడం - మొదలైన అమానవీయమైన అత్యాచారాలు నిరంతరం కొనసాగుతున్నాయి. రాజ్యాంగాన్ని, చట్టాలను, కోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘిస్తూ బూటకపు ఎన్‌కౌంటర్లు, డజన్ల కొలదీ హత్యాకాండల ద్వారా తెల్లబీభత్సాన్ని సృష్టిస్తూ కనీస ప్రజాస్వామిక హక్కులను సైతం నేడు పోలీసు బూట్ల కింద కాలరాచివేస్తున్నారు. మోదీ పాలనలో విప్లవోద్యమ ప్రాంతాలలో సుమారు 420 మంది విప్లవకారులను, 360 మంది ప్రజలను హత్య చేసారు. వంద మందికి పైగా ఆదివాసీ యువతులపై అత్యాచారాలు చేసి, వారిలో అనేక మందిని హత్య చేసారు. గృహ-గ్రామ దహనాలు చేయడం, 'ఉపా' వంటి నిర్బంధ చట్టాలను మోపి వేలాది మందిని జైలు పాలు చేయడం, విలేకరులను, రచయితలను, వకీళ్లను, సామాజిక కార్యకర్తలను, మహిళా, ఆదివాసీ సంఘాల కార్యకర్తలను బెదిరించడం పోలీసులకు నిత్యకృత్యం అయింది. ఉద్యమ ప్రాంతాలలోనూ, ఉద్యమ ప్రాంతాలకు వెలుపల మైదాన, పట్టణ ప్రాంతాలలోనూ బహిరంగ-చట్టబద్ధ ప్రజా ఆందోళనలపై సైతం తీవ్ర నిర్బంధం సాధారణ విషయంగా మారింది. మరోవైపు వివిధ పీడిత వర్గాలు, సామాజిక సెక్షన్లు సాగిస్తున్న ప్రజా ఉద్యమాలు, ప్రజాస్వామిక ఉద్యమాలపై సైతం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయి. కశ్మీర్, ఈశాన్య జాతుల వంటి పీడిత జాతులు దశాబ్దాలుగా విడిపోయే హక్కుతో సహా జాతులకు స్వయంనిర్ణయాధికార హక్కు కోసం సాగిస్తున్న జాతివిముక్తి పోరాటాలను కేంద్ర ప్రభుత్వం భారత సైన్యాన్నీ, పారామిలటరీ బలగాలను మోహరించి ఉక్కుపాదంతో అణచివేస్తున్నది. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని అమలు చేస్తూ దేశాన్ని జాతుల బందిఖానాగా మార్చివేసింది. కశ్మీరులో 370, 35ఏ ఆర్టికిల్స్‌ను కాలరాచివేసింది. ఈ విధంగా దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేరుతో మొత్తంగా దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వాముల నిరంకుశత్వం అమలవుతున్నది. అప్రకటిత ఎమర్జెన్సీ స్థితి కొనసాగుతున్నది. ఇటువంటి స్థితిలో, భారత ప్రజలు ఈ దేశ సాయుధ బలగాలతో యుద్ధం చేయాల్సి వస్తున్నది.

ఈ మోసపు, దగాకోరు ఎన్నికల ప్రధాన ఉద్దేశ్యం - ఏ పాలక ముఠా అధికారంలోకి రావాలో; ఏ పాలక ముఠా మరో ఐదేళ్ల కాలం సామ్రాజ్యవాదుల, దేశంలోని దోపిడీ వర్గాల ప్రయోజనాలు ఈడేరిస్తూ అశేష ప్రజానీకంపై దుర్మార్గ పాలన కొనసాగించాలో తేల్చడమే తప్ప మరొకటి కాదు. ఈ బూటకపు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సామ్రాజ్యవాద గ్లోబల్ కార్పొరేషన్లకు మన దేశ ఆర్థిక వ్యవస్థలోకి తలుపులు బార్లా తెరవడంలో ప్రముఖ పాత్ర పోషించగలిగినవారూ; చట్ట సభలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ సాయుధ బలగాలు, కోర్టులు, ప్రసార సాధనాల ద్వారా ఎల్‌పీజీ విధానాలను అమలు చేయడంలో దక్షత కలిగినవారూ; ఈ దోపిడీ వ్యవస్థ పట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని, ప్రజాస్వామిక, విప్లవ, జాతివిముక్తి పోరాటాలను క్రూరంగా అణచివేయగలిగినవారూ; ఈ కుళ్లు వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా మా పార్టీ నాయకత్వాన మొగ్గతొడుగుతున్న నిజమైన ప్రజల విప్లవాధికారాన్ని రూపుమాపడం కోసం 'గ్రీన్‌హంట్', 'సమాధాన్' వంటి విప్లవ ప్రతీఘాతుక దాడులను నడిపించడంలో ఆరితేరినవారు మాత్రమే ఎన్నికలలో గెలుస్తారు. ధనబలం-కండబలం ఉన్న దేశీ-విదేశీ కార్పొరేట్ల దన్ను కలిగిన కోటీశ్వరులు, ఫాసిజాన్ని - అంటే మతోన్మాదాన్నీ, కులోన్మాదాన్ని, ప్రాంతీయతత్వాన్నీ రెచ్చగొట్టి ప్రజలను విభజించి-పాలించగలిగేవాళ్లు, వేలాది మంది ప్రజలను ఊచకోత కోయగలిగిన మోదీ, అమిత్ షా వంటి వాళ్లు, డబ్బు-సారాయితో ఓటర్లను కొనగలిగినవాళ్లు, రిగ్గింగు చేయగలగినవాళ్లు మాత్రమే ఎన్నికలలో పోటీ చేయగలుగుతారు తప్ప సామాన్య ప్రజలెవరికీ ఆ అవకాశం లభించదు. ఇందులో గెలిచిన ఎంపిలకూ, ఎంఎల్ఏలకూ ప్రజలకు జవాబుదారుగా ఉండాల్సిన పనిలేదు. ఐదేళ్ల పాటు

నిరంకుశ పాలన కొనసాగించే అధికారం వారికి ఉంటుంది.

కానీ మేము ప్రతిపాదిస్తున్న నిజమైన స్వతంత్ర, ప్రగతిశీల, సర్వతోముఖ, స్వావలంబనపై ఆధారపడిన, దోపిడీలేని, భారత జనతా ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్‌కు నేడు పిండరూపంలో ఉన్న విప్లవ ప్రజాకమిటీలు ఇందుకు పూర్తిగా భిన్నమైనవి. ఇవి కరుడుగట్టిన అభివృద్ధి నిరోధకులకు మినహా, 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అన్ని స్థాయిల్లోనూ ఎన్నుకునే హక్కును, ఎన్నికయ్యే హక్కును, ఎన్నికయిన ప్రజా ప్రతినిధులను వెనక్కి పిలిచే (రీకాల్) హక్కును కల్పిస్తూ ప్రజలందరికీ ప్రజాస్వామిక హక్కులను గ్యారంటీ చేస్తాయి. దేశంలోని పోరాడుతున్న రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు, విద్యార్థి యువజనులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, మహిళలు, దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, తదితర ప్రజలు సామ్రాజ్యవాదుల దన్నుతో భారత పాలకవర్గాలు/కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న అన్యాయమైన యుద్ధాన్ని, న్యాయమైన యుద్ధం ద్వారా ఎదుర్కోవడమే కాకుండా, వారు స్పష్టమైన ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థను, నూతన ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని పిండరూపంలో విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పీసీ)లను నిర్మించడం ప్రారంభించారు. కొన్ని చోట్ల జిల్లా స్థాయి వరకు విప్లవ ప్రజా కమిటీలను స్థాపించారు. భవిష్యత్తులో అభివృద్ధి క్రమంలో ఈ నూతన ప్రజా ప్రభుత్వమే భారత విప్లవ ప్రజాస్వామిక సమాఖ్య ప్రభుత్వ రూపంలో అభివృద్ధి అవుతుంది. ఇది నాలుగు వర్గాల - కార్మికుల, రైతుల, మధ్యతరగతి, దేశీయ బూర్జువాల, పీడిత సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల ఐక్యసంఘటనా ప్రభుత్వం. అయితే పాలకవర్గాల ప్రభుత్వం దీనిని నాశనం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అయినప్పటికీ ప్రజా ప్రభుత్వం తన నూతన ప్రజాస్వామిక విధానాలను అమలు చేయడం ఆరంభించింది.

యావత్తు కార్మికులు, కర్షకులు, మధ్యతరగతి, దేశీయ పెట్టుబడిదారులు, మహిళలు, దళితులు, ఆదివాసులు, మత మైనారిటీలు, పీడిత జాతులు, దేశభక్త, ప్రగతిశీల, ప్రజాస్వామిక వ్యక్తులు, బృందాలు ఈ నూతన ప్రజాస్వామిక రాజ్య నిర్మాణంలో తమ వంతు పాత్రను పోషించాల్సిందిగా, ఈ న్యాయమైన యుద్ధంలో భాగం కావాల్సిందిగా, ప్రస్తుత దోపిడీ సామ్రాజ్యవాద ప్రాయోజిత రాజ్యాధికారాన్ని తిరస్కరించి, దాని ప్రతినిధి సభలకు (పార్లమెంటు, విధానసభలు, పంచాయితీలు) జరిగే ఎన్నికలను బహిష్కరించాల్సిందిగా, రానున్న లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాల్సిందిగా వారికి మేము పిలుపునిస్తున్నాం.

విప్లవాభినందనలతో

**కేంద్రకమిటీ,**

జనవరి 5, 2019

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

**"బూర్జువా ప్రజాస్వామిక విప్లవం సైతం పరిపూర్తి కాని, అసమాన సామాజిక, రాజకీయ పరిస్థితులు అస్థిత్వంలో ఉన్న అర్ధవలస, అర్ధభూస్వామ్య భారతదేశ నిర్దిష్ట పరిస్థితులలో విశాలమైన గ్రామీణ ప్రాంతంలో సాయుధ పోరాటాన్ని ప్రారంభించి కొనసాగించడానికి కార్మికవర్గ పార్టీకి వస్తుగత పరిస్థితులు అనుమతిస్తాయి. సాయుధ పోరాటానికి సన్నాహం పేరిట ఎన్నికలలో పాల్గొనడం విప్లవోద్యమానికి ద్రోహం మాత్రమే చేస్తుంది. బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు పరిపూర్తి చెంది సార్వత్రిక సాయుధ తిరుగుబాటు విప్లవ మార్గంగా ఉండే పెట్టుబడిదారీ దేశాలకు భిన్నంగా భారతదేశంలో విప్లవానికి శాంతియుతమైన సన్నాహక కాలం ఉండదు.**

**అందువలన సాధారణంగా చెప్పాలంటే, మన దేశంలో నెలకొని వున్న పరిస్థితులలో ఎన్నికలలో పాల్గొనడమనేది విప్లవకర వర్గపోరాటాన్ని అభివృద్ధి చెందించడానికిగానీ లేదా ప్రజలలోని ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంపొందింప చేయడానికిగానీ తోడ్పడదు. పైగా అది పార్టీ శ్రేణులలో, మొత్తంగా ప్రజారాశులలో రాజ్యాంగపరమైన భ్రమలను, లీగలిస్టు ధోరణులను పెంచి పోషించడం మాత్రమే చేస్తుంది."**

- ***భాతర విప్లవ వ్యూహం ఎత్తుగడలు,*** (ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ ఆమోదించిన డాక్యుమెంట్) 45వ పేజీ.

# రాజ్యాంగ యంత్రం

*(స్వెర్ద్‌లోవ్ విశ్వవిద్యాలయంలో 1919, జులై 11 తేదీన కామ్రేడ్ లెనిన్ చేసిన ప్రసంగం)*

కామ్రేడ్స్, మీరు నిర్ణయించుకుని నాకు తెలియజేసిన కార్యక్రమం ప్రకారం నేటి ప్రసంగం రాజ్యాంగయంత్రం గురించి. ఈ విషయం గురించి మీకిదివరకే యేమాత్రం పరిచయం వుందో నాకు తెలియదు. మీ తరగతులు యిప్పుడే ప్రారంభమైయాయని తెలుసుకున్నాను. యీ విషయాన్ని ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చెయ్యడం మీకు యిదే మొదటి ప్రయత్నం అనుకుంటాను. ఇది నిజమే అయితే, యీ మొదటి ఉపన్యాసంలోనే చాలామంది శ్రోతలకు స్పష్టంగా తెలిసేటట్లు ఈ జటిలమైన విషయాన్ని చెప్పలేకపోవచ్చు. అంత మాత్రాన మీరు కలవరపడనక్కరలేదు. ఎందుచేతంటే రాజ్యాంగయంత్రం అనే విషయం చాలా చిక్కులతో కూడిన కఠినమైన విషయమే కాకుండా బూర్జువా పండితులూ, రచయితలూ, తత్వవేత్తలూ యీ విషయాన్ని తక్కిడిబిక్కిడి తారుమారు చేసినట్టు బహుశా మరే విషయాన్ని కూడా చేయలేదు. అందుచేత సంక్షిప్తమైన యీ ఉపన్యాసం వినీవినడంతోనే మొదటి పాఠంతోనే యీ విషయం పూర్తిగా అర్థం అయిపోతుందని అనుకోకూడదు. ఈ మొదటి ఉపన్యాసాన్ని మీరు విన్న తర్వాత దీనిలో మీకు అర్థంకాని విషయాలనూ, స్పష్టంగా తెలియని విషయాలను గుర్తు పెట్టుకొని వాటిని తదుపరి అధ్యయనం, ఉపన్యాసాలు, చర్చలవల్ల ఆ సమస్యలు బోధపడి విశదం అయేటందుకు రెండవసారి, మూడవసారి, యింకా అవసరం అయితే నాల్గవసారి కూడా వాటిని గురించి మీరు పర్యాలోచన చెయ్యాలి. మనం మళ్ళీ మరొకసారి కలుసుకుంటా మనుకుంటాను, అప్పుడు ఈ సమస్యకు సంబంధించిన మరి కొన్ని విషయాలను చర్చించగలము, యింకా తేటతెల్లం కాకుండా మిగిలిపోయిన సందర్భాలను తేల్చుకోగలము. ఉపన్యాసాలను వినడం, చర్చల్లో పాల్గొనడమే కాకుండా మార్క్స్, ఎంగెల్స్‌లు రాసిన పుస్తకాల్లో అత్యంత ముఖ్యమైన వాటిలో కొన్నింటినైనా చదువుతారని కూడా నేను ఆశిస్తున్నాను. ఈ ముఖ్యమైన గ్రంథాలు సోవియట్, పార్టీ పాఠశాలా లైబ్రరీల్లో విద్యార్థులకు అందుబాటుగా వున్న వాటి పేర్లు పుస్తక సూచనల్లోనూ, కేటలాగుల్లోనూ, పాఠ్యగ్రంథాల్లోనూ వుంటాయనడంలో నాకేమీ సందేహం లేదు. ఈ గ్రంథాలలోని వివరణాశైలి క్లిష్టతను చూచి మీలో కొందరికి మొట్టమొదట బెరకు కలిగినప్పటికీ, మీరు నిరుత్సాహ పడకూడదని మీకు నేను మరొకసారి గుర్తు చేస్తున్నాను. మొదటి చదివినప్పుడు మీకు స్పష్టంగా తెలియనిది రెండవసారి చదివినప్పుడు గాని మరొక దృక్కోణం నుండి పరీక్షించినప్పుడు గాని స్పష్టంగా తెలుస్తుంది. ఈ సమస్య అసలే అనేక చిక్కులతో కూడినదైవుండగా దానికితోడు బూర్జువా పండితులూ, రచయితలూ దీన్ని యింకా యెంత చిక్కుపెట్టి పారేశారంటే యీ సమస్యను నిజంగా అధ్యయనం చేసి, దీనిలో ప్రావీణ్యాన్ని స్వతంత్రంగా సాధింపతలచుకున్నవారు దీన్ని స్పష్టంగానూ, క్షుణ్ణంగానూ అవగాహన చేసుకోవడానికి యీ సమస్యను పదే పదే పరిశీలించి, దాన్ని వివిధ దృక్కోణాల నుండి పర్యాలోచన చేయడం అవసరం అని నేను మరొకసారి చెప్పవలసి ఉంది. ఇది రాజకీయాలన్నింటికీ యెంతో మూలాధారమైనట్టిన్నీ, మౌలికమైనట్టిన్నీ సమస్య అవడం చేతనూ, అల్లకల్లోలము విప్లవాత్మకములైనట్టి నేటి రోజుల్లోనే కాకుండా అత్యంత శాంతియుతమైన సమయాల్లో కూడా యే ఆర్థిక సమస్యగానీ, యే రాజకీయ సమస్య గాని చర్చించినప్పుడు ప్రతీ దినపత్రికలోనూ యీ సమస్య మీకు తటస్థపడుతూంటుంది కాబట్టినీ, యీ సమస్యకు పదే పదే రావడానికి చాలా సులభం అవుతుంది. రాజ్యాంగయంత్రం అంటే యేమిటి? దాని సారాంశం యేమిటి? దాని ప్రాముఖ్యత యెందులో వుంది? రాజ్యాంగయంత్రంపట్ల పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోయడానికి పోరాడుతున్న మన పార్టీ–కమ్యూనిస్టు పార్టీ–వైఖరి యేమిటి? –అనే యీ ప్రశ్నలు మీకు ప్రతి రోజూ యేదో ఒక సందర్భంలో తటస్థించుతూనే వుంటాయి. అన్నింటికంటె ముఖ్యమైనది ఏమిటంటే, గ్రంథాలు చదవడం ఫలితంగా, రాజ్యాంగ యంత్రాన్ని గురించి మీరు వినే ప్రసంగాలు, జరుగుకున్న చర్చల ఫలితంగా ఈ విషయాన్ని స్వతంత్రంగా ఎదుర్కొని పరిష్కరించవలసి వస్తుంది. ఎందుచేతంటే మీరు ఈ సమస్యను రకరకాల సందర్భాలలోనూ, అతి స్వల్ప విషయాలలోనూ, యెప్పుడూ అనుకోని సందర్భాలలోనూ, ప్రత్యర్థులతో చర్చలు జరపడంలోనూ ఎదుర్కోవలసి వుంటారు. మీరు ఈ సమస్యను స్వతంత్రంగా గ్రహించవలసినప్పుడల్లా, అప్పుడు మాత్రమే మీ అభిప్రాయాలు స్థిరరూపాన్ని ధరించి, యెవరితోనైనా వాదించి మీ అభిప్రాయాలను చాలా వరకు జయప్రదంగా సమర్థించుకోగలుగుతారు.

ఈ నాలుగు మాటలూ చెప్పిన తర్వాత అసలు విషయం గురించి, రాజ్యాంగయంత్రం అంటే యేమిటి? ఇది యే విధంగా ఉద్భవించింది, పెట్టుబడిదారీ విధానాన్ని సంపూర్ణంగా కూలదోయడానికి పోరాడుతున్న కార్మికవర్గ పార్టీ –కమ్యూనిస్టు పార్టీ– యీ రాజ్యాంగయంత్రం పట్ల ఎలాంటి వైఖరి వహించాలి –అనే విషయం గురించి ప్రస్తావిస్తాను.

బూర్జువా విజ్ఞానశాస్త్ర, తత్వశాస్త్ర, న్యాయశాస్త్ర, అర్థశాస్త్ర, పత్రికారచనల ప్రతినిధులు ప్రయత్నాపూర్వకంగానూ అప్రయత్నంగానూ రాజ్యంగ యంత్రం అనే సమస్య అంతగా తక్కిడిబిక్కిడి తారుమారు చేసినట్టిది మరే యితర సమస్య కూడా లేదని నేనిదివరకే చెప్పాను. ఈ నాటికి కూడా యీ సమస్యను మత విషయక సమస్యతో తరచు తారుమారు చేయడం జరుగుతూంది. మత సిద్ధాంతాల ప్రతినిధులే కాకుండా (వారు అలా చేస్తారని మనం అనుకోవడం సహజమే) మతం పట్ల తమకు పక్షపాతం లేదని చెప్పుకునేవారు సహితం రాజ్యాంగయంత్రం గురించిన విశిష్ట సమస్యలని మత సమస్యలతో కలగాపులగం చేస్తారు. రాజ్యాంగయంత్రం అనేది యేదో ఒక దైవాంశసంభూతమైన విషయమనీ, ప్రకృతికి అతీతమైన విషయమనీ, యేశక్తి వలన మానవాళి మనగలుగుతుందో పురుషప్రసక్తి లేకుండా మానవాళికి

కేవలం బాహ్యంనుండే యే శక్తి మనుగడను కలుగజేస్తుందో, లేక కలుగజేయ గలుగుతుందో, లేక ప్రసాదించుతుందో, అట్టి భగవత్కారణమైన ఒక శక్తే రాజ్యాంగయంత్రం అని ప్రతిపాదింపబూనే ఒక సిద్ధాంతాన్ని– తరుచుగా సైద్ధాంతికంగానూ తత్వశాస్త్రరీత్యానూ ఒక దృక్పథాన్ని ఒక తర్కాన్ని కలిగిన క్లిష్ట సిద్ధాంతాన్ని – నిర్మించడానికి వారు ప్రయత్నిస్తుంటారు. ఈ సిద్ధాంతం దోపిడీవర్గాల – పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గాల – స్వప్రయోజనాలతో యెంతగా ముడిపడిపోయిందంటే, వారి స్వప్రయోజనాలకి యెంతగా ఉపకరిస్తాందంటే, బూర్జువా ప్రతినిధివర్యుల అన్ని ఆచారవ్యవహారాల్లోనూ, అభిప్రాయాల్లోనూ, శాస్త్రంలోనూ యెంత లోతుగా చొచ్చుకొని పోయిందంటే, మీరు యెటువైపు తిరిగినాసరే, చివరికి మతదురభిమానాలకి మీరెన్నడైనా లోనయారా అన్న సూచననే అతి ఏహ్యపడి తిరస్కరించుతూ రాజ్యాంగయంత్రాన్ని స్థిరచిత్తంతో పరిశీలించగలమనే నమ్మకంతో వున్న మెన్షెవిక్కుల, సోషలిస్టు రివల్యూషనరీల అభిప్రాయాల్లో కూడా యీ సిద్ధాంతపు అవశేషాలు మీకు యెదురవుతూనే వుంటాయి. మరి యే యితర సమస్య కంటే (అర్థశాస్త్రపు మూల సూత్రాలు మినహా) యీ సమస్య పాలకవర్గాల ప్రయోజనాలపైన ప్రభావాన్ని కలిగివుంది కాబట్టి, యీ సమస్య మరింత గందరగోళపరచబడింది. ఇప్పుడు సమాజంలో కొందరు అనుభవిస్తున్న ప్రత్యేక ఆధిక్యతలనూ, దోపిడీ విధానపు ఉనికినీ, పెట్టుబడిదారీ విధానపు ఉనికినీ సమర్థించడానికి యీ రాజ్యాంగయంత్రం సిద్ధాంతం పని కొస్తుంది. యీ కారణంవల్లనే నిష్పాక్షికంగా యీ సమస్యను గురించి చెప్తూతారని అనుకోవడమూ, తాము శాస్త్రజ్ఞులమని చెప్పుకొనేవారు మనకి యీ విషయంపైన కేవలం శాస్త్రోక్తమైన అభిప్రాయాన్ని చెప్పగలుగుతారని మనం ఆశించడమూ ఒక గొప్ప పొరపాటే అవుతుంది. మీరు యీ సమస్యను బాగా తెలుసుకొని దానిని తగినంత లోతుగా పరిశీలించిన తర్వాత, రాజ్యాంగయంత్రం గురించిన సమస్యలోనూ వివిధ వర్గాల మధ్య వున్న పరస్పర పోరాటం మీకు తప్పకుండా కనబడుతుంది. ఆ పోరాటం రాజ్యాంగ యంత్రం గురించి వుండే అభిప్రాయ వైరుధ్యాల్లోనూ, రాజ్యాంగయంత్ర ప్రాముఖ్యాన్నీ, పాత్రనూ అంచనా వేడయంలోనూ ప్రతిబింబిస్తున్నది లేక వ్యక్తమౌతున్నది.

ఈ సమస్యను మనం వీలైనంత శాస్త్రోక్తంగా యెదుర్కోవడానికీ, రాజ్యాంగయంత్ర ఉద్భవ పరిణామ చరిత్రను అధమం అతి స్థూలాంగానైనా గమనించవలసి ఉంటుంది. సాంఘీకశాస్త్రానికి సంబంధించిన సమస్యలో అత్యంత విశ్వసనీయమైనదీ, ఈ విషయాన్ని ఎదుర్కొనడంలో తండోపతండాలుగా ఉన్న వివరాలలో పడిపోయో, లేక పరస్పర విరుద్ధంగా ఉన్నటి అభిప్రాయ వైవిధ్య పరంపరలో పడిపోయో దారితప్పిపోకుండా, సరిగ్గా ఎదుర్కొనే అలవాటు చేసుకొని, ఈ సమస్యను శాస్త్రోక్తంగా ఎదుర్కోవడానికీ, దీనికి ఆధారమైన చారిత్రాత్మక సంబంధాన్ని మర్చిపోకుండా, చరిత్రలో ఫలానా సంఘటన యెలా ఉత్పన్నం అయినదీ, చారిత్ర పరిణామంలో యీ సంఘటన యే యే మౌలికమైన దశలలో గుండా దాటినదీ, దాని పరిణామం దృష్ట్యా ఆ ఫలానా సంఘటన నేడు యే విధంగా పరిణమించిందీ, పరిశీలించడం అత్యంత ముఖ్యమైన విషయం.

రాజ్యాంగయంత్రం గురించిన సమస్య సందర్భంలో ఎంగెల్స్ రచించిన "కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం" అనే గ్రంథాన్ని మీరు చదువుతారని నేను ఆశిస్తున్నాను. ఆధునిక సోషలిజం మనకు ప్రసాదించిన మౌలికమైన గ్రంథాల్లో యీ గ్రంథం ఒకటి. ఈ గ్రంథంలో వున్న ప్రతి వాక్యమూ అదేదో ఆషామాషీగా చెప్పడం కాకుండా అఖండమైన చారిత్రక రాజకీయ విషయాన్ని ఆధారంగా చేసుకొని రాయబడిందనే నమ్మికతో ప్రమాణవాక్యంగా మనం అంగీకరించవచ్చు. ఈ గ్రంథంలో అన్ని భాగాలు కూడా ఒకే విధంగా సుబోధకంగానూ, సులభగ్రాహ్యంగానూ విశదీకరింపబడలేదనడంలో యెట్టి సందేహమూ లేదు. చరిత్రలోనూ, అర్థశాస్త్రంలోనూ యిదివరకే కొంత ప్రవేశం వున్న పాఠకుడికోసం కొన్ని భాగాలు రాయబడ్డాయి. అయినా ఈ గ్రంథాన్ని మొట్టమొదట పర్యాయం చదివేటప్పుడే మీకు అర్థం కాని యెడల దాని గురించి మీరు కంగారు పడనవసరం లేదని కూడా మరొకసారి చెప్పాలి. ఈ గ్రంథం ఎవరికోగాని తొలిసారి చదివిన వెంటనే బోధపడదు. ఈ గ్రంథంమీద మీకు ఆసక్తి కుదిరి మళ్ళీ మరొకసారి చదివారంటే గ్రంథం అంతా కాకపోయినా చాలా భాగాన్ని మీరు అర్థం చేసుకోగలుగుతారు. రాజ్యాంగయంత్రం గురించి నేను ఉద్దేశించిన సరియైన దృక్పథాన్ని యీ గ్రంథం సూచిస్తుంది కనుక, నేను దానిని పేర్కొంటున్నాను. రాజ్యాంగయంత్ర ఆవిర్భావాన్ని గురించి చారిత్రాత్మకమైన సంక్షిప్త వృత్తాంతంతో యీ గ్రంథం ఆరంభం అవుతుంది.

పెట్టుబడిదారీ విధానం పుట్టుకా, మనిషిని మనిషి దోపిడీచేసే పద్ధతీ, సోషలిజమూ, సోషలిజం యే విధంగా ఉద్భవించిందీ, యే కారణాలవల్ల అది ఉద్భవించిందీ – అనేటటువంటి సమస్యలను, ఇతర సమస్యలన్నింటిలాగానే, సరిగ్గా యెదుర్కొనేందుకు ఈ సమస్యను చారిత్రక దృష్టితో చూడాలి. ఈ సమస్య సందర్భంలో రాజ్యాంగయంత్రం ఆది నుండీ లేదు అనే విషయాన్ని మొట్టమొదట మనం గ్రహించవలసి వుంది. రాజ్యాంగయంత్రం అంటూ లేని కాలం వుండేది. సమాజంలో వర్గ విభజన యెప్పుడైతే యెక్కడైతే జరుగుతుందో, దోపిడీచేసేవారూ దోపిడీ చేయబడేవారూ ఎప్పుడైతే ఉంటారో, అప్పుడల్లా రాజ్యాంగయంత్రం ఆవిర్భవిస్తోంది.

మనిషిని మనిషి దోపిడీచేసే విధానపు మొదటి రూపాంతరమైన వర్గ విభజన ప్రథమ రూపం – బానిస యజమానులు, బానిసలు – తలయెత్తక పూర్వం పితృస్వామిక కుటుంబం వుంటూండేది. దీనినే గణము అని కూడా అంటారు (గణం అంటే ఒక తెగ, రక్తబంధువులు తరతరాల వరకూ సమిష్టి జీవితం గడిపారు). నాగరికతలో అట్టడుగు జాతుల జీవనంలో యీ పురాతన కాలపు స్పష్టమైన అవశేషాలు యీ నాటికి కూడా నిల్చివున్నాయి. పురాతన సంస్కృతిని గురించి రాసిన యే గ్రంథాన్ని మీరు తీసి చూసినాసరే సమాజంలో బానిస యజమానులు, బానిసలు అనే విభజన యింకా యేర్పడని ఆదిమ కమ్యూనిజాన్ని యించుమించుగా పోలినట్టి కాలం వుండేది అనే వాస్తవంశపు దాదాపు స్పష్టమైన వర్ణనలు, సూచనలు, స్మరణలు మీకు తప్పకుండా తటస్థపడుతూనే వుంటాయి. కాగా ఆ కాలంలో రాజ్యాంగయంత్రం యింకా ఆవిర్భవించలేదు. ఒక క్రమపద్ధతి ప్రకారం బలాన్ని ప్రయోగించడానికీ బలప్రయోగంవల్ల ప్రజలని లోబర్చుకోవడానికీ ఒక ప్రత్యేక యంత్రం అప్పటికీ యింకా యేర్పడలేదు. ఇటువంటి యంత్రాన్ని రాజ్యాంగయంత్రం అని పిలుస్తాం.

ఆదిమ సమాజంలో మనుష్యులింకా చిన్న చిన్న గణాల్లో జీవిస్తూ యించుమించుగా ఆడవి మనుష్యుల స్థితిలోనే ఉంటూ, పరిణామంలో యింకా అట్టడుగు స్థాయిలోనే వుంటూండే కాలంలో – ఆ కాలానికీ ఆధునిక నాగరిక సమాజ కాలానికీ మధ్య యెన్నో వేల సంవత్సరాలున్నాయన్నమాట – రాజ్యాంగయంత్రం నెలకొల్పబడినట్టు యింకా అప్పటికీ సూచనలైన లేవు. ఆచార ప్రాబల్యమూ, గణ పెద్దలకుండే అధికార గౌరవశక్తులూ, యివే మనకి కనబడుతూంటాయి. స్త్రీలకి కూడా అప్పుడప్పుడు యీ అధికారం వుంటూండేది. అప్పటి రోజుల్లో స్త్రీల స్థితి యీనాడుండే హక్కులు లేక అణచిపెట్టబడి వుండే దురవస్థ కాదు. కాని యితరులను పాలించేందుకూ, కేవలం ఈ పరిపాలన కోసమే యితరులను బలప్రయోగం వల్ల లోబర్చుకొనేందుకూ, నేడు అమలులో వుంటూ మీకందరికీ బాగా తెలిసినట్టి సాయుధ సైనిక దళాలు, కారాగృహాలు మొదలైన సాధనాలను చిహ్నంగా గలిగిన బలప్రయోగపు యంత్రాంగాన్ని క్రమపద్ధతిలోనూ నిరంతరంగానూ ఉపయోగించేటట్టి, ఒక ప్రత్యేక వర్గానికి చెందిన వ్యక్తులున్నట్టు – ఏదైతే రాజ్యాంగయంత్రం సారాంశంగా వుంటుందో అట్టి వ్యవస్థ వున్నట్టు – ఆ రోజుల్లో మాత్రం మనకెక్కడా కనబడదు.

బూర్జువా పండితులచేత డాంబికంగా ''మతము'' అని నామకరణం చేయబడిన బోధనల నుండీ, కుయుక్తుల నుండీ, తత్వశాస్త్ర సిద్ధాంత రాద్ధాంతాలనుండీ, వారిచే ప్రతిపాదింపబడిన అభిప్రాయాల నుండీ, మనం తప్పించుకుని బైటపడి వాటిని ఒక వైపుకి నెట్టివేసి విషయపు అసలు సారాంశాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించే యెడల మానవ సమాజం నుండి కేవలమూ పరిపాలన చేయడానికి ప్రత్యేకించబడిన యంత్రాంగమే యీ రాజ్యాంగయంత్రం అనే విషయం మనం స్పష్టంగా తెలుసుకోగలుగుతాం. మరి యే యితర కార్యాన్ని నిర్వర్తించకుండా ఒకేఒక్క పరిపాలన కార్యంలోనే నిమగ్నులైన ప్రత్యేక మనుషుల బృందం ఒకటి యెప్పుడైతే ఆవిర్భవిస్తుందో, పరిపాలన చేయడానికిగాను కారాగృహాలు, ప్రత్యేక దళాలూ, సైన్యాలు మొదలైనవాటి ద్వారా బలప్రయోగంవల్ల యితరులను లోబర్చుకోవడానికి దానికి ప్రత్యేక యంత్రం అవసరమవుతుందో, అప్పుడే రాజ్యాంగయంత్రం ఉద్భవిస్తుంది.

రాజ్యాంగయంత్రం అంటూ లేకుండానే ఆచారసాంప్రదాయాల బలంవల్లనో లేక గణపెద్దలకూ, స్త్రీలకూ – ఆ రోజుల్లో స్త్రీలకు పురుషులతో సమాన హోదా, తరచుగా హెచ్చైన హోదా కూడా వుంటూండేది – వుండే అధికార గౌరవాలవల్లనో, సాధారణ సంబంధాలు, మానవ సంఘము, క్రమశిక్షణ, కార్యకలాపాల నిర్వహణ, పరిరక్షింపబడుతూండే కాలమూ, పరిపాలన నిర్వహణలో ప్రవీణులైనట్టి ప్రత్యేక వర్గము వారు యింకా ఏర్పడని కాలమూ ఉండేది. సమాజంలో ఎప్పుడైతే వర్గ విభజన – యితరుల శ్రమని నిరంతరం తామే సొంత పరచుకోగలిగేటట్టిన్నీ కొందరి ప్రజలను దోచుకొనగలిగేటట్టిన్నీ మనుషుల బృందాల కింద సమాజంలో విభజన – యేర్పడుతుందో, అప్పుడే ప్రజలని బలాత్కారంగా నిర్బంధం చేయడానికి ఒక ప్రత్యేకమైన యంత్రాంగం ఆవిర్భవించిందని చరిత్ర తెలుపుతూంది.

ఈ సమాజ వర్గవిభజన చరిత్రలో జరిగిన ఒక ప్రధానాంశం అని సదా స్పష్టంగా దృష్టిలో పెట్టుకోవలసి ఉంటుంది. ఎట్టి మినహాయింపూ లేకుండా అన్ని దేశాల్లోనూ వేలాది సంవత్సరాలనుండి జరుగుతూన్న యీ మానవ సమాజ పరిణామం – ప్రప్రథమంలో ప్రభువులంటూ లేనట్టి పితృస్వామిక వ్యవస్థగాను, ఆదిమ సమాజంగాను దాని తర్వాత బానిసత్వం మీద ఆధారపడినట్టి బానిస సమాజం వచ్చినట్టున్ను – యీ విధంగా సాధారణ నియమాలను అనుసరించి, క్రమవిధానాన్ని అనుసరించి, యీ పరిణామం జరుగుతూంటుదని చరిత్ర మనకు తెలియజేస్తుంది. ఆధునిక నాగరిక యూరప్ ఖండం అంతా యీ దశ గుండా దాటింది – రెండు వేల సంవత్సరాల క్రితం బానిస వ్యవస్థ ప్రబల పరిపాలన వ్యవస్థగా వుంది. ప్రపంచంలో యితర భాగాల్లో వున్న ప్రజల్లో బహుళ సంఖ్యాకులు కూడా యీ దశ గుండా దాటారు. కొన్ని వెనకబడిన జాతుల్లో బానిసత్వపు అవశేషాలు నేటికి కూడా నిల్చివున్నాయి. ఉదాహరణకు, యీనాడు కూడా ఆఫ్రికాలో బానిస వ్యవస్థా సంస్థలు కొనసాగుతూనే వున్నాయి. మొట్టమొదట జరిగిన వర్గ విభజనలో బానిస యజమానులూ, బానిసలూ అనేది ప్రధానమైన విభజన. మొదటి వర్గంవారు అన్ని ఉత్పత్తి సాధనాలనీ – భూమినీ, దానితోపాటు పరికరాలనూ, ఆ కాలంలో అవి యెంత ఆదిమ దశలో వున్నప్పటికీ కూడా, తమ సొంతానికి కలిగి వుండేవారు. వీరు బానిస యజమానులనీ, యితరులకోసం శ్రమపడుతూ యితరులకు తమ శ్రమని సప్లయ్ చేసేవారు బానిసలనీ పిలవబడుతూండేవారు.

చరిత్ర క్రమంలో యీ రూపం తరువాత, భూస్వామ్య విధానం (ఫ్యూడలిజం) అనే మరొక రూపం వచ్చింది. చాలా దేశాలలో బానిస విధానం, తన పరిణామ క్రమంలో భూదాస్య విధానం కింద మార్పు చెందింది. ఈ దశలో ఫ్యూడల్ భూస్వాములనీ, రైతు భూదాసులనీ సమాజంలో మౌలికమైన విభజన యేర్పడింది. ప్రజల మధ్య వుండే సంబంధాల స్వరూపం కూడా మార్పు చెందింది. బానిస యజమానులు బానిసలని తమ సొంత ఆస్తిగా పరిగణించేవారు. చట్టాలు కూడా యీ అభిప్రాయాన్నే స్థిరపరిచి, బాసిసపై సంపూర్ణ హక్కును కలిగియున్న బానిస యజమాని సొంత చరాస్తిగా బానిసను పరిగణించాయి. రైతు బానిసకు సంబంధించినంతవరకు మాత్రం, వర్గదాస్యమూ వర్గ పరాధీనతా యెప్పటిలాగే వుండిపోయినప్పటికీ, రైతులు ఫ్యూడల్ భూస్వామి సొంత చరాస్తుల కింద పరిగణింపబడక రైతుల శ్రమను భూస్వామి అనుభవించడానికీ, వారిచేత నిర్బంధంగా కొన్ని సేవలను చేయించుకోవడానికీ, భూస్వామికి అధికారం వున్నట్టు మాత్రమే అంగీకరింపబడింది. ఆచరణలో మాత్రం, మీకందరికీ తెలిసినట్టే, యీ వ్యవసాయ బానిస విధానం అన్ని దేశాలలో కంటే ముఖ్యంగా రష్యాలో చాలా కాలంవరకూ నిలిచి వుండి అత్యంత ఘోరమైన రూపాలను ధరించి బానిస విధానం కంటే యే విధంగానూ భిన్నంగా వుండేది కాదు.

దీని తదుపరి, వర్తకవాణిజ్యాల అభివృద్ధి పొంది, ప్రపంచ మార్కెట్టు రూపొంది, డబ్బు చలామణీ అభివృద్ధి పొందడంతో భూస్వామ్య సమాజంలోనే పెట్టుబడిదారీ వర్గం అనే కొత్త వర్గం ఒకటి ఆవిర్భవించింది. సరుకుల మూలంగానూ, సరుకుల మారకం మూలంగానూ, సరుకుల మారకం డబ్బు శక్తి అధికం అవడం మూలంగానూ, పెట్టుబడి శక్తి ఉత్పన్నం అయింది. పద్దెనిమిదవ శతాబ్దిలోనూ – సరిగ్గా చెప్పాలంటే పద్దెనిమిదవ శతాబ్ది చివరి నుండి పందొమ్మిదవ శతాబ్ది అంతట్లోనూ – ప్రపంచం అంతటా

విప్లవాలు సంభవించాయి. పశ్చిమ యూరప్ దేశాలన్నింటిలోనూ భూస్వామ్య విధానం రద్దు చేయడబడింది. అన్ని దేశాల్లో కంటే ఆలస్యంగా యిది రష్యాలో సంభవించింది. 1861లో రష్యాలో కూడా ఒక మౌలికమైన మార్పు జరిగింది. ఫలితంగా ఒక సమాజ రూపం పోయి దాని స్థానే మరొక సమాజ రూపం వచ్చింది – భూస్వామ్య విధానం పోయి దాని స్థానాన్ని పెట్టుబడిదారీ విధానం ఆక్రమించుకుంది. దానికింద వర్గవిభజన, దానితోపాటు భూదాస్యపు జాడలూ అవశేషాలూ మూనుపటిలాగే వుండిపోయినప్పటికీ, దానిలో వర్గ విభజన మౌలికంగా భిన్నమైన రూపం ధరించింది.

అన్ని పెట్టబడిదారీ దేశాల్లో పెట్టబడిని కలిగినవారూ, భూస్వాములూ, మిల్లుల, ప్యాక్టరీల సొంతదారులూ ఆయా దేశాల జనాభాలో అతి అల్ప సంఖ్యాకులుగానే వుంటున్నారు. వాళ్ళు మొత్తం ప్రజలందరి శ్రమమీదనూ అధికారాధిపత్యాన్ని వహిస్తూ, శ్రమ శక్తిని తమ స్వాధీనంలో వుంచుకొంటారు, అంటే శ్రమజీవులను తమ చెప్పుచేతుల్లో వుంచుకొని, వాళ్ళని దోపిడీ చేస్తూ, పీడిస్తూ వుంటారు. ఆ శ్రమజీవులలో అధిక సంఖ్యాకులు తమ రెక్కల కష్టాన్ని – తమ శ్రమ శక్తిని – అమ్ముకోవడం ద్వారానే ఉత్పత్తి క్రమంలో తమ జీవనోపాధిని సంపాదించుకొనే వేతన కార్మికులుగా శ్రామికులుగా వుంటున్నారు. పెట్టుబడిదారీ విధానంలోకి మారడంతో, వెనకటి భూస్వామ్య విధానపు కాలంలోనే చెదురుమదురుగా వున్న, అణగదొక్కబడిన రైతులలో కొంత భాగం (అధిక సంఖ్యాకులు) శ్రామికుల కింద మారిపోగా, కొంత భాగం (అల్ప సంఖ్యాకులు) తామే కార్మికులను కిరాయి యిచ్చి పెట్టుకొనేటట్టి ధనిక రైతులుగా – అనగా గ్రామీణ పెట్టుబడిదారీ వర్గంగా మారిపోయారు.

మౌలికమైన యీ వాస్తవాంశాన్ని – ఆదిమ బానిసత్వపు రూపాల నుండి భూస్వామ్య విధానంలోకీ, అందులోంచి చిట్టచివరకి పెట్టబడిదారీ విధానంలోకీ, సమాజపు మార్పుని – మీరెప్పుడూ జ్ఞాపకం వుంచుకుంటూనే వుండాలి. ఎందుచేతనంటే మౌలికమైన యీ అంశాన్ని జ్ఞాపకం పెట్టకోవడంవల్లనే అన్నిటికీ మూలమైన యీ ప్రాతిపదిక పరిధుల్లోనే అన్ని రాజకీయ సిద్ధాంతాలనీ ఇమడ్చగటిగినప్పుడే మీరు యీ సిద్ధాంతాలకు సరిగా విలువకట్టి, అవి వేటిని గురించి వివరించి చెబుతున్నాయో ఆ విషయాలను అర్థం చేసుకోగలుగుతారు. ఎందుకంటే మానవ చరిత్రలో మహత్తరములైన ఈ యుగాలు – బానిస యజమాన్య, భూస్వామ్య, పెట్టబడిదారీ యుగాలు – ఒక్కొక్కటి పదులూ, వందలూ శతాబ్దాల కాలం విస్తరిస్తూ వున్నాయి, ఒక్కొక్క యుగం వివిధ రాజకీయ స్వరూపాలనూ విభిన్న రాజకీయ సిద్ధాంతాలనూ అభిప్రాయాలనూ, విప్లవాలనూ ప్రదర్శిస్తూంది. సమాజంలో యీ వర్గ విభజన, వర్గ పరిపాలనలో కలిగిన యీ మార్పును, మార్గదర్శి అనదగిన యీ సూత్రాన్ని దృఢంగా పట్టుకుని, యీ దృక్కోణం నుండి ఆర్థిక, రాజకీయ, భౌద్ధిక, మత విషయాలు మున్నగు సాంఘిక సమస్యలన్నింటినీ పరిశీలించే పక్షంలోనే – ఈ అత్యంత వైవిధ్యాన్ని నానా విధ వ్యత్యాసాన్ని – ముఖ్యంగా బూర్జువా పండితులు రాజకీయ వేత్తలు ప్రతిపాదించిన రాజకీయ తాత్విక, తదితర సిద్ధాంతాలకు సంబంధించిన విషయాలను – మీరు అర్థం చేసుకోగలుగుతారు.

రాజ్యాంగయంత్రాన్ని మూలకందమైన యీ విభజన దృష్ట్యా పరీక్షించినట్లైతే, నేను వెనక చెప్పినట్టు మానవ సమాజం వర్గాల కింద విభజింపబడక పూర్వం రాజ్యాంగయంత్రం కూడా వుండేది కాదు. కాని వర్గాల కింద సమాజ విభజన పుట్టి వేళ్ళూని దృఢంగా పాతుకుపోయేకొద్దీ, వర్గ సమాజం ప్రాదుర్భవిస్తున్నకొద్దీ, రాజ్యాంగయంత్రం కూడా పుట్టి వేళ్ళూని దృఢంగా పాతుకుపోనారంభించింది. బానిస విధానం, భూస్వామ్య విధానం, పెట్టబడిదారీ విధానం అనే దశలను పూర్తి చేసినట్టిన్నీ, యింకా యీ దశల గుండా సాగుతున్నప్పటికీ మానవ చరిత్రలో వందలాది దేశాలు ఉన్నాయి. ఈ దేశాల్లో ప్రతి ఒక్క దేశంలోనూ బృహత్తర చారిత్రాత్మక మార్పులు జరిగినప్పటికిన్నీ, బానిస విధానం నుండి భూస్వామ్య విధానంలోకి, అందులో నుండి పెట్టుబడిదారీ విధానంలోకి, అందులో నుండి ప్రస్తుతం ప్రపంచం అంతటా సర్వవ్యాపితంగా పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సాగుతూన్న పోరాటానికి మారినపుడు, మానవాభివృద్ధికి సంబంధించిన యెన్ని రాజకీయ అవస్థాంతరాలు యెన్ని విప్లవాలు జరిగినప్పటికీ వీటన్నిటిలోను రాజ్యాంగయంత్ర ఆవిర్భావాన్ని మీరు స్పష్టంగా చూడగలరు. అదెప్పుడూ కూడా సమాజంలో నుండి వేరుపడినట్టి, పరిపాలనా కార్యంలో పూర్తిగానో, లేక యించుమించు పూర్తిగానో, లేక ప్రధానంగానో నిమగ్నులైనట్టి వ్యక్తుల బృందంతో కూడినట్టి ఒక ప్రత్యేక యంత్రంగానే వుంటూ వచ్చింది. ప్రజలందరూ ఒక వైపున పాలితుల కింద, రెండవవైపున సమాజంలో నుండి పైకి లేచి పాలించడంలో నిపుణులైన పాలకులు అని, రాజ్యాంగయంత్రానికి ప్రతినిధులు అని అనబడేవారి కిందను విభజింపబడుతున్నారు. ఈ యంత్రం – యితరులను పరిపాలించే వ్యక్తుల బృందం, నిర్బంధాన్ని ఉపయోగింపగలిగేటట్టి బలాన్ని ప్రయోగింపగలిగేటట్టి సాధనం ప్రజలమీద యీ బలాత్కారం యే రూపాన్ని ధరిస్తుందీ అని ప్రసక్తి లేకుండానే, కేవలం దుడ్డకర్రనే కానీయండి, లేదా బానిస యుగంలో మరింత బాగా పరిణతి చెందిన వివిధ రకాల ఆయుధాలనే కానీయండి లేదా మధ్యయుగాలలో ప్రత్యక్షమైన పేల్చే ఆయుధాలనే కానీయండి, లేదా చిట్టచివరకి ఇరవైయ్యో శతాబ్దిలో సాంకేతిక నైపుణ్యశక్తిలోని అత్యద్భుతాలున్నూ, ఆధునిక సాంకేతిక శాస్త్రపు వినూతన విజయాల ననుసరించి నిర్మింపబడినట్టి అధునాతన ఆయుధాలనే కానీయండి తన ఆధీనం చేసుకుంటుంది. బలప్రయోగ పద్ధతులు మారాయి, కాని రాజ్యాంగయంత్రం అంటూ ఒకటి వున్నప్పుడల్లా మాత్రం ప్రతి మానవ సమాజంలోనూ, యితరులని పరిపాలించేటటువంటి, యితరులమీద అధికారాన్ని చలాయించేటటువంటి, యితరుల మీద ప్రభావాన్ని కలిగినటువంటి తమ శక్తిని నిలబెట్టుకోవడానికిగాను బలాన్ని ప్రయోగించే సాధనాన్ని, దౌర్జన్యాన్ని ఉపయోగించగలిగే ఆయా యుగాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్య స్థాయి ననుసరించి తయారు చేయబడిన ఆయుధాలని హస్తగతం చేసుకున్న వ్యక్తుల బృందం ఒకటి యెప్పుడూ వుంటూ వచ్చింది. కాగా యిట్టి సాధారణ సంఘటనలను పరిశీలన చేయడంవల్లనే, వర్గాలు లేనప్పుడు, దోపిడీ చేసేవారు లేనప్పుడు, రాజ్యాంగయంత్రం యెందుకు లేకపోయింది, వర్గాలు పుట్టేటప్పటికల్లా రాజ్యాంగయంత్రం యెందుకు పుట్టాలి అనే ప్రశ్నలని మనంతట మనమే వేసుకోవడంవల్లనే – ఒక్క యీ మార్గంవల్లనే రాజ్యాంగ యంత్రపు సారాంశమూ, ప్రాముఖ్యమూ యేమిటి అనే ప్రశ్నలకు మనం సమాధానం తెలుసుకోగలుగుతాం.

ఒక వర్గంమీద మరొకవర్గం అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఉపయోగించే యంత్రమే రాజ్యాంగయంత్రం. మానవ సమాజంలో యింకా వర్గాలు యేర్పడని కాలంలోనూ, బానిస యుగం యింకా ఆరంభం కాక ముందు ఆదిమ సమాజ పరిస్థితుల్లో వుండి ఇంచుమించు సమాన హక్కులతోనే వున్న ప్రజల శ్రమ ఉత్పాదక శక్తి యింకా అతి హీన స్థాయిలోనే వున్న పరిస్థితులలోనూ, అతి మొరటైన అనాగరిక జీవనాన్ని గడపడానికైనా చాలీచాలనంత మేరకే ఆదిమ ఉత్పత్తిని చేయగలిగే స్థితిలో వుండి ప్రజలందరూ కాయకష్టం చేసినప్పుడూ – ఆ కాలంలో సమాజంలోనున్న మిగతా ప్రజలమీద తమ ప్రభావాన్ని చూపించి వారిమీద పాలనాధికారాన్ని చలాయించడానికి ప్రత్యేక వ్యక్తుల బృందం ఒకటి సమాజంలో నుండి వేరుపడి యింకా పైకి రాలేదు సరేకదా, రావడానికి తగిన అవకాశాలు కూడా యేర్పడలేదు. ఎప్పుడైతే మొట్టమొదటి రూపంలో సమాజంలో వర్గ విభజన యేర్పడిందో, యెప్పుడైతే బానిస విధానం తలయెత్తిందో, యెప్పుడైతే వ్యవసాయక శ్రమ యొక్క అతిమోటైన రూపాలను కేంద్రీకరించడంవల్ల ఒక ప్రత్యేక వర్గానికి చెందినవారు కొంత అదనపు ఉత్పత్తి చేయగలిగారో, యెప్పుడైతే బానిసయొక్క నికృష్ట జీవనానికి ఆ అదనపు ఉత్పత్తి తప్పనిసరిగా అవసరం లేకపోయిన కారణంగా బానిస యజమానికి హస్తగతం అయేదో, యీ ప్రకారంగా యెప్పుడైతే బానిస యజమానుల వర్గం యేర్పడి వేళ్ళూని దృఢంగా పాతుకుని పోయిందో – అప్పుడే, ఈ వర్గం వేళ్ళూని దృఢంగా పాతుకొని పోవడానికే, రాజ్యాంగయంత్రం ఆవిర్భవించి తీరవలసిన అవసరం కలిగింది.

ఆ ప్రకారమే అది ఆవిర్భవించి తీరింది కూడాను – బానిస యజమానులకు బానిసలపై పరిపాలన చేసే అధికారాన్ని యిచ్చినట్టి యంత్రం, అనగా బానిస యజమానుల రాజ్యాంగయంత్రం అవతరించింది. వెనకటి రోజుల్లో సమాజమూ, రాజ్యాంగయంత్రమూ, యీ రెండూ కూడా యిప్పటికంటే చాలా చిన్నవిగానే వుంటూండేవి. రవాణా ప్రయాణ సౌకర్యాలు బహు స్వల్పంగా వుండేవి – యిప్పటి అధునాతనమైన రవాణా సౌకర్యాలు అప్పుడుండేవి కావు. పర్వతాలు, నదులు, సముద్రాలు యిప్పటికంటె అప్పుడు మరింత దుర్ఘటమైన ఆటంకాలుగా వుండేవి. అందుచేతనే అప్పటి రాజ్యాలు భౌగోళికంగా చాలా తక్కువ పరిధుల్లోనే యేర్పడి చాలా చిన్నవిగా వుంటూండేవి. ఇరుకైన ఎల్లల మధ్యనే యేర్పడి సాపేక్షంగా చాలా తక్కువ వైశాల్యంగల కార్యరంగాన్నే కలిగిన రాజ్యానికి సాంకేతికంగా చాలా దుర్బలమైన రాజ్యాంగయంత్రమే వుంటూండేది. అయినప్పటికీ బానిసలను బానిసత్వంలో నిర్బంధించి వుంచుతూ, సమాజంలో వున్న ఒక భాగం రెండో భాగాన్ని అదుపులో పెట్టుకుని, దానిని పీడించుతూ వుండేటట్టి ఒక యంత్రం వుంటూనే వచ్చింది. సమాజంలోని అత్యధిక భాగాన్ని సమాజంలోని రెండో భాగపు స్వప్రయోజనాలకోసం యథావిధిగా నిర్బంధంగా పనిచేయించుకోవాలంటే, బలప్రయోగం చేయగలిగే శాశ్వత యంత్రం ఒకటి లేకుంటే ఆ పని చేయడం అసాధ్యం. వర్గాలు లేనప్పుడు యిలాంటి యంత్రము లేదు. ఎప్పుడైతే వర్గాలు తలెత్తాయో, యెప్పుడైతే యీ వర్గ విభజన మరింత లోతుకు చొచ్చుకునిపోయి వేళ్ళు తన్ని పాతుకుపోయిందో, అటువంటి చోట్ల సర్వత్రా యెల్లప్పుడూ రాజ్యాంగయంత్రం అంటూ ఒక ప్రత్యేక రాజ్య పాలనాయంత్రాంగం తలెత్తుతూ వచ్చింది. ఈ రాజ్యాంగయంత్రం రకరకాల రూపాలను ధరించింది. బానిసయుగంలో ఆ కాలపు ప్రమాణాల దృష్ట్యా అత్యంత అభివృద్ధి, నాగరికత, సంస్కృతి కలిగిన దేశాల్లో – ఉదాహరణకు, బానిస విధానంమీదే సంపూర్ణంగా ఆధారపడినట్టి పురాతన గ్రీసు, రోము దేశాల్లో – అప్పటికే రకరకాల రూపాల్లో రాజ్యాంగయంత్రం ప్రబలి వుంటూండేది. ఆ కాలంలోనే రాచరికానికీ రిపబ్లిక్కుకీ మధ్య వుండే తేడా, ప్రభువర్గ పాలనకూ, ప్రజాస్వామికానికీ మధ్య వుండే తేడా తలయెత్తడం ఆరంభించింది. రాచరికం అంటే ఒకేఒక్క వ్యక్తి అధికారమూ, రిపబ్లిక్ అంటే ఎన్నిక రహితమైన అధికారం యేదీ కూడా లేకపోవడమూ అన్నమాట. ప్రభువర్గపాలన అంటే మొత్తం మీద కొద్దిపాటి అల్ప సంఖ్యాకుల అధికారమూ, ప్రజాస్వామ్యం అంటే, ప్రజాధికారమూ అన్నమాట. ఈ భేదాలన్నీ కూడా బానిసయుగంలో పొడచూపాయి. ఈ బేదాలున్నప్పటికీ అప్పటి రాజ్యాంగయంత్రం రాచరికం కానీయండి, రిపబ్లిక్ కానీయండి, ప్రభువర్గ పాలితమే కానీయండి, ప్రజాస్వామ్యపాలితమే కానీయండి – యేదైనప్పటికీ బానిస విధాన యుగంలోని రాజ్యాంగయంత్రం బానిస యజమానుల రాజ్యాంగయంత్రంగానే వుండేది.

ప్రాచీన యుగ చరిత్ర అధ్యయనం చేసేటప్పుడు యీ విషయాన్ని గురించి మీరు వినే ప్రతి ఉపన్యాసంలోనూ, రాచరిక ప్రభుత్వాల మధ్యనూ రిపబ్లికన్ ప్రభుత్వాల మధ్యనూ జరిగిన పోరాటాలను గురించి మీరు వింటూంటారు. అయితే బానిసలు మనుష్య మాత్రులతో సమానంగా పరిగణింపబడేవారు కారని – పౌరసత్వ హక్కులున్న ప్రజల్లాగ పరిగణింపబడకపోవడం అటుండగా, అసలు మనుష్య మాత్రుల్లాగా కూడా పరిగణింపబడేవారు కారన్న మౌళికమైన వాస్తవాంశాన్ని మాత్రం యీ సందర్భంలో మీరు గమనింపవలసి వుంటుంది. రోమన్ న్యాయచట్టం వారిని వస్తువులుగానే పరిగణించింది. నరహత్య గురించిన చట్టం అసలు బానిసలకు వర్తించేదే కాదు. వ్యక్తి పరిరక్షణను గురించిన యితర చట్టాల మాట ఇక చెప్పనే అక్కర లేదు. బానిస యజమానులు మాత్రమే పూర్ణ హక్కులు కలిగినవారుగా భావింపబడడంచేత రోమన్ చట్టం వీరినే పరిరక్షించేది. అందుకని రాచరికం అమలులో వున్నాసరే, రిపబ్లిక్ ప్రవేశ పెట్టబడినాసరే, అది బానిస యజమానుల రాచరిక ప్రభుత్వంగానో లేక బానిస యజమానుల రిపబ్లిక్ ప్రభుత్వంగానో మాత్రమే వుండేది. బానిస యజమానులే అన్ని హక్కులనీ అనుభవించుతూ వుండగా, చట్టంచే బానిసలు కేవలం వస్తువులుగా పరిగణింపబడేవారు. కాగా బానిసమీద యెటువంటి దౌర్జన్యం జరిగినా కూడా, చివరకి బానిసని హత్య చేసినా కూడా, అది ఒక నేరం కింద లెక్కకొచ్చేదే కాదు. బానిస విధానాన్ని అవలంబించిన రిపబ్లిక్ రాజ్యాలు వాటి వాటి ఆంతరంగిక నిర్మాణంలో ఒక దానితో ఒకటి భేదిస్తూ వుండేవి. ప్రభువర్గపాలన కలిగిన రిపబ్లిక్కులూ వుండేవి, ప్రజాస్వామ్య రిపబ్లిక్కులూ వుండేవి. ప్రభువర్గపాలన రిపబ్లిక్‌లో విశేషాధికారాలను కలిగిన యేకొద్దిమంది వ్యక్తులు మాత్రమే ఎన్నికలలో పాల్గొనేవారు. ప్రజాస్వామ్య రిపబ్లిక్‌లో అందరూ ఎన్నికల్లో పాల్గొనేవారు – అందరూ అనగా బానిసలు మినహా బానిసయజమానులందరూ అన్నమాట. అన్ని యితర విషయాలకంటె మూలకందమైన యీ విషయం రాజ్యాంగయంత్రం సమస్యని బాగా విశదీకరించి, రాజ్యాంగయంత్రపు నిజమైన సారాంశాన్ని స్పష్టంగా వ్యక్తపరుస్తుంది. కాబట్టి యీ విషయాన్ని

గుర్తుంచుకోవాల్సిన అవసరం యెంతైనా వుంది.

ఒక వర్గాన్ని మరొక వర్గం పీడించడానికి సాధ్యపడే యంత్రమే – ఒక వర్గపు చెప్పుచేతుల్లో యితర అనిచిపెట్టిన వర్గాలను లొంగుబాటులో వుంచడానికి తోడ్పడే యంత్రమే రాజ్యాంగయంత్రం. ఈ యంత్రానికి అనేక రూపాలున్నాయి. బానిస యజమానుల రాజ్యంలో రాచరికమూ, ప్రభువర్గ పాలిత రిపబ్లిక్ కాకుండా, ప్రజాస్వామ్య రిపబ్లిక్ కూడా వుండేది. వాస్తవానికి ప్రభుత్వ రూపాల్లో అత్యంత వైవిధ్యం వుంటూండేదే కాని, వాటిసారం యెప్పుడూ ఒకటిగానే వుండేది. బానిసలు యే విధమైన హక్కులు లేకుండా పీడిత వర్గం కింద యేర్పడి మనుష్య మాత్రులగానైనా పరిగణింపబడనివారుగా వుండేవారు. భూస్వామ్య రాజ్యంలో కూడా యిదే విధంగా వుండడం మనం చూస్తాం.

దోపిడీ విధానపు స్వరూపంలో వచ్చిన మార్పు బానిస రాజ్యాంగయంత్రాన్ని భూస్వామ్య రాజ్యాంగయంత్రం కింద మార్చేసింది. దీనికి అపారమైన ప్రాముఖ్యత వుంది. బానిస సమాజంలో బానిసకి యెట్టి హక్కులూ లేకుండా వుంటూ మనుష్య మాత్రుడి కిందైనా పరిగణింపబడేవాడు కాదు. భూస్వామ్య విధాన సమాజంలో రైతును భూమికి కట్టిపడేశారు. భూమికి ముడిపడిపోయిన ఒక భాగంగా రైతులు (ఆ రోజుల్లో జనాభాలో అత్యధిక సంఖ్యాకులు రైతులే – పట్నవాస ప్రజల సంఖ్య చాలా తక్కువగా వుండేది) పరిగణింపబడడమే భూదాస్య విధానపు ప్రధాన లక్షణం. భూదాస్య విధానపు భావమే అది. భూస్వామిచేత రైతుకి కేటాయింపబడిన పొలంమీద భూస్వామిచేత యిన్ని అంటూ నిర్ణయింపబడిన రోజుల్లోనే రైతు పనిచేసుకోవడానికి వీలుండేది. కడమ రోజుల్లో భూదాసుడు తన భూస్వామికోసం పని చేయవలసి వచ్చేది. వర్గ సమాజపు అసలు సారం మార్పు చెందకుండా అలాగే వుండిపోయింది. వర్గ దోపిడీమీదనే సమాజం ఆధారపడి వుండేది. భూస్వాములకే సంపూర్ణమైన హక్కులుండేవి. రైతులకి హక్కులంటూ యే మాత్రమూ వుండేవి కావు. ఆచరణలో వారి స్థితికీ, బానిస రాజ్యాంగయంత్రంలో బానిసల స్థితికీ కించిత్తు కూడా వ్యత్యాసం వుండేది కాదు. ఐనప్పటికీ భూదాసుడు భూస్వామి సొంత ఆస్తి కింద పరిగణింపబడనందున రైతాంగాన్ని భూదాస్యం నుండి విముక్తి చేయడానికి సువిశాలమైన పథం ఒకటి యేర్పడింది. తన సొంత పొలంలో తన కాలంలో కొంత కాలాన్నైనా వినియోగించుకోవడానికి – అంటే మాటవరసకి తన మీద తనకి కొంత స్వాధికారం లభించే – వీలు కలిగింది అతనికి. కాగా దినుసుల మార్పిడికీ, వర్తక వ్యాపార సంబంధాల అభివృద్ధికీ అవకాశాలు హెచ్చుకావడంతో భూస్వామ్య విధానం క్రమేణా విచ్ఛిన్నమైపోయి రైతాంగపు విమోచనకి క్రమక్రమంగా సువిశాలమైన అవకాశం యేర్పడసాగింది. బానిస సమాజం కంటె భూస్వామ్య సమాజం ఎప్పుడూ మరింత క్లిష్టభూయిష్టంగా వుండేది. వాణిజ్యమూ, పరిశ్రమలూ మరింతగా అభివృద్ధి పొందడానికి అవకాశం వుంటూ, అప్పటికే ఆ రోజుల్లోనే యీ అవకాశం పెట్టుబడిదారీ విధానానికి దారితీసింది. మధ్యయుగాల్లో భూస్వామ్య విధానపు ప్రాబల్యం హెచ్చుగా ఉండేది. యీ కాలంలో కూడా రాజ్యాంగయంత్రపు రూపాల్లో వైవిధ్యం వుంటూ యిక్కడ కూడా రాచరికమూ రిపబ్లిక్కూ – రిపబ్లిక్ రూపం యెంతో అస్పష్టంగా వున్నప్పటికీ కూడా – రెండూ వుంటూండడం మనకి కనబడుతుంది. రెండు రూపాలూ వుంటూండినప్పటికీ భూస్వామే అసలైన పరిపాలకుడుగా పరిగణింపబడేవాడు. రైతు బానిసలకు యెలాంటి రాజకీయ హక్కులూ వుండేవి కావు.

బానిసవిధానం, భూస్వామ్య విధానం, యీ రెండు విధానాల్లోనూ కూడా నిర్బంధాన్ని ప్రయోగించనిదే ఒక అత్యల్ప సంఖ్యాక వర్గం అత్యధిక సంఖ్యాక వర్గాన్ని పాలించడానికి వీలుపడేది కాదు. పీడిత వర్గాలు తమ పీడనను వదలగొట్టుకోవడానికి యెడతెగకుండా చేసిన ప్రయత్నాల దృష్టాంతాలు చరిత్రనిండా అనేకం కనబడుతూనే వున్నాయి. బానిసత్వం నుండి విముక్తి చెందడానికి దశాబ్దాల తరబడి సాగిన యుద్ధాల గురించి బానిస విధానపు చరిత్ర తెలుపుతోంది. అన్నట్టు, యిప్పుడు జర్మన్ కమ్యూనిస్టులు – పెట్టుబడిదారీ విధానపు శృంఖలాలను వదిలించుకోవడానికి నిజంగా పోరాడుతున్న ఏకైక జర్మన్ పార్టీ – "స్పార్టకిస్టులు" అనే పేరు పెట్టుకున్నారు. ఎందుకంటే, సుమారు రెండు వేల సంవత్సరాల కిందట జరిగినట్టి ఒక బృహత్తరమైన బానిస తిరుగుబాటులో పాల్గొన్న గొప్ప వీరుల్లో స్పార్టకస్ ఒకడు. బానిసలందరూ బానిస విధానంపైనే పూర్తిగా నిర్మించబడి సర్వశక్తివంతంగా కనబడిన రోమన్ సామ్రాజ్యం కొన్ని సంవత్సరాలపాటు స్పార్టకస్ నాయకత్వాన ఐక్యమై సాయుధులై బ్రహ్మాండమైన సేనగా తయారై లేవనెత్తిన మహత్తరమైన తిరుగుబాటుచేత ఆఘాతాలకు, దాడులకు గురైంది. చిట్టచివరకి బానిసలు ఓడిపోయి ఖైదీలుగా పట్టుబడిపోయి బానిస యజమానుల చేతుల్లో నానా చిత్రహింసలకు గురిచేయబడ్డారు. వర్గసమాజం చరిత్ర అంతటిలోనూ యిలాంటి అంతర్యుద్ధాలు అనేకం జరుగుతూనే వచ్చాయి. బానిస యజమాన్య యుగంలో జరిగిన మిక్కిలి గొప్ప అంతర్యుద్ధాన్ని ఇప్పుడే ఉదాహరించాను. భూస్వామ్య యుగమంతా నిరంతరం జరుగుతూనే వుండినట్టి రైతు తిరుగుబాట్లతో నిండి వుంది. ఉదాహరణకు, మధ్యయుగాల్లో జర్మనీలో రెండు వర్గాల మధ్య – భూస్వాములకీ, భూదాసులకీ – జరిగిన పోరాటం పెద్ద ఎత్తున విస్తరించి భూస్వాములకి వ్యతిరేకంగా రైతులు లేవదీసిన ఒక అంతర్యుద్ధంగా పరిణమించింది. రష్యాలో భూస్వాములకు వ్యతిరేకంగా రైతులు పదేపదే లేవదీసిన యిలాంటి తిరుగుబాట్ల ఉదాహరణలు మీకందరికీ బాగా తెలిసినవే.

తమ అధికారాన్ని నిలబెట్టుకోడానికిగాను, తమ పరిపాలనను భద్రపరచుకోడానికిగాను, అపారమైన సంఖ్యలో వున్నట్టి ప్రజలను యేకంజేసి తమ కింద లొంగదీసుకుని, వారిపైని కొన్ని చట్టాలనూ, నిబంధనలనూ మోపడానికి వీలుగా వుండేందుకు భూస్వాములకు యంత్రాంగం ఒకటి అవసరమైంది. కాగా భూదాసులపైన భూస్వాముల అధికారాన్ని నిలబెట్టడమే యీ చట్టాలలో వున్నట్టి ప్రధానోద్దేశం. ఇదే భూస్వామ్య రాజ్యాంగయంత్రం, దాని రూపంలో భేదం వుంది, ఉదాహరణకు, రష్యాలో, లేక యెంతో వెనకబడి నేటికి కూడా భూస్వామ్య విధానమే కొనసాగుతున్న ఆసియా దేశాల్లో రిపబ్లికైనాసరే రాచరికమైనాసరే రాజ్య రూపం అయి ఉండవచ్చు. రాజ్యాంగయంత్రం రాచరికమైనప్పుడు ఏకైక వ్యక్తి అధికారం గుర్తింపబడేది. రాజ్యాంగయంత్రం రిపబ్లికైనప్పుడు అందులో భూస్వామ్య సమాజపు ఎన్నికైన ప్రతినిధులు యేదో ఒక స్థాయిలో పాల్గొనడం గుర్తింపబడేది – అది భూస్వామ్య సమాజంలో. భూమిని తమ సొంత ఆస్తిగా చేసుకొనగల్గిన అల్పాతి అల్ప సంఖ్యాకులైన భూస్వాములు – వారికి పూర్తిగా లోబడిపోయి వున్న అత్యధిక సంఖ్యాకులైన భూదాసులు – యీ విధంగా రెండు వర్గాల కింద

చీలిపోయిన సమాజమే భూస్వామ్య సమాజం.

వాణిజ్య వ్యాపారాల అభివృద్ధీ, సరుకుల మారకమూ, వీటి ఫలితంగా కొత్త వర్గ మొకటి పెట్టుబడిదారుల వర్గం – అవతరించింది. మధ్యయుగాల ఆఖరి సంవత్సరాల్లో, అమెరికా కనుగొనబడిన కారణంగా ప్రపంచ వాణిజ్యవ్యాపారం అపారంగా పెరిగినప్పుడు, వెండి బంగారాలు బాగా హెచ్చు అయిపోవడంతో వెండి బంగారాలే మారకపు సాధనంగా పరిణమించినప్పుడు, డబ్బు చలామణీ ఫలితంగా కొంతమంది వ్యక్తులకి బ్రహ్మాండమైన ఐశ్వర్యాలని పోగుచేసుకొని అవకాశం కలిగినప్పుడు పెట్టుబడి తలయెత్తింది. ప్రపంచం అంతటా వెండి బంగారాలే ధనంగా అంగీకరింపబడ్డాయి. భూస్వాముల వర్గపు ఆర్థిక శక్తి క్షీణించిపోయి కొత్తగా పైకొచ్చిన వర్గపు శక్తి – పెట్టుబడి ప్రతినిధుల శక్తి– అభివృద్ధి అయింది. సమాజపు పునర్నిర్మాణం యెలా జరిగిందంటే, పైకి మాత్రం పౌరులందరూ సమానంగానే వున్నట్టు కనబడ్డారు. బానిస యజమానులు బానిసలు అన్న పూర్వపు విభజన మాయమైపోయింది. ఎవడి దగ్గర యెంత పెట్టుబడి వున్నదీ విచక్షణ లేకుండా చట్టం యెదుట అందరూ సమానులే అన్నారు. భూమిని సొంత ఆస్తిగా కలిగిన ఖామందైనాసరే, తన శ్రమ శక్తి తప్ప 'నా' అన్న మరే యితర ఆస్తీ లేని బికారీవాడైనాసరే – చట్టం యెదుట అందరూ సమానులే. చట్టం అందరినీ సమానంగా రక్షిస్తుంది. కేవలం తమ శ్రమ శక్తి అనే ఆస్తి తప్ప మరే యితర ఆస్తి పాస్తులూ లేక క్రమక్రమంగా దరిద్రంతో కుంగికృశించిపోతూ నాశనం అయిపోయి శ్రామికవర్గం కింద దిగజారిపోయిన అలగాజనం ఆస్తిపరుల ఆస్తిమీద పడకుండా ఆస్తిని రక్షింస్తుంది చట్టం. ఇదీ పెట్టుబడిదారీ సమాజం.

ఈ విషయాన్ని గురించి యింకా విపులీకరించి చెప్పడానికి నాకు యిప్పుడు అవకాశం లేదు. పార్టీ కార్యక్రమాన్ని చర్చించేటప్పుడు యీ విషయం మళ్ళీ వస్తుంది. అప్పుడు పెట్టుబడిదారీ సమాజపు లక్షణాలను మీరు తెలుసుకోగలుగుతారు. ఈ సమాజం భూదాస్య విధానాన్ని – పాత భూస్వామ్య విధానాన్నీ – వ్యతిరేకిస్తూ, స్వేచ్ఛ అనే నినాదానిస్తూ ముందుకు వచ్చింది. కానీ ఆస్తి ఉన్నవారికోసమే ఆ స్వేచ్ఛ. కాగా భూస్వామ్య విధానం ధ్వంసం అయిపోయిన తరువాత – యిది పద్దెనిమిదవ శతాబ్ది చివరి భాగానికీ పందొమ్మిదవ శతాబ్ది మొదటి భాగానికీ మధ్య జరిగినా – రష్యాలో మాత్రం కడమ దేశాలలో కంటె ఆలస్యంగా 1861లో జరిగింది – దాని స్థానాన్ని పెట్టుబడిదారీ రాజ్యాంగయంత్రం ఆక్రమించింది. అది ప్రజలందరికీ స్వేచ్ఛ కావాలనే నినాదాన్ని ప్రకటించి, యావత్తు ప్రజాభీష్టాన్నీ తాను వ్యక్తంచేస్తుందని, తాను వర్గ భేదాలున్న రాజ్యం యెంత మాత్రం కాను అని చెప్పుకుంటుంది. ఇక్కడకు వచ్చేటప్పటికి ప్రజలందరికీ స్వేచ్ఛకోసం పోరాడుతూన్న సోషలిస్టులకీ, పెట్టుబడిదారీ రాజ్యాంగయంత్రానికీ పోరాటం – ఇప్పుడు సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ స్థాపనకు దారితీసి, యావత్తు ప్రపంచానికీ విస్తరించినట్టి పోరాటం – సంభవించింది.

ప్రపంచ పెట్టుబడికి వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటాన్ని అర్థం చేసుకోవాలంటే పెట్టుబడిదారీ రాజ్యాంగయంత్ర సారాంశం గ్రహించాలంటే, భూస్వామ్య రాజ్యాంగ యంత్రంమీదికి పెట్టుబడిదారీ రాజ్యాంగయంత్రం విజృంభించినప్పుడు అది స్వేచ్ఛా నినాదంతో సంఘర్షణలోకి దిగిందన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. భూస్వామ్య విధానం రద్దు పెట్టుబడిదారీ వర్గానికి స్వేచ్ఛను కలిగించి వారికి ఉపకరించింది. ఎందుచేతంటే రైతులు పరిహారాన్ని చెల్లించివేయడంతో గానీ లేక కొంత భాగాన్ని క్విట్‌రెంట్‌గా చెల్లించడంతో గానీ భూములను తమ సొంత ఆస్తి కింద సంపాదించుకొనడానికి అవకాశం దొరికింది. సొంత ఆస్తిమీదనే అసలు రాజ్యాంగయంత్రం ఆధారపడి వుండడంచేత ఆస్తి యే విధంగా సంక్రమించినాసరే ఆస్తిని రాజ్యాంగయంత్రం పరిరక్షించేది. ఆధునిక నాగరిక రాజ్యాలన్నింటిలోనూ రైతులు సొంత ఆస్తిదారులైయారు. భూస్వామి తన భూమిలో కొంత భాగాన్ని రైతుకి దాఖలు పరిచినప్పుడు కూడా రాజ్యాంగయంత్రం భూస్వామికి పరిహారాన్ని యిస్తూ అతని సొంత ఆస్తిని పరిరక్షిస్తూనే వచ్చింది. సొంత ఆస్తిని తాను సంపూర్ణంగా కాపాడి భద్రపరుస్తుంది అని రాజ్యాంగయంత్రం చెప్పినట్టు సొంత ఆస్తిని అన్ని విధాలా వత్తాసు ఇచ్చి, దాన్ని పరిరక్షించేది. ప్రతి వర్తకునికీ, పరిశ్రమ యజమానికీ, ఫాక్టరీ సొంతదారునికీ గల ఆస్తి హక్కులను రాజ్యాంగయంత్రం గుర్తించింది. సొంత ఆస్తి మీదనూ, పెట్టుబడి శక్తిబలాలమీదనూ, ఆస్తిపాస్తులంటూ లేని కార్మికులను కూలినాలి చేసుకుని బతికే రైతాంగాన్ని పూర్తిగా లొంగదీయడం మీదనూ ఆధారపడిన యీ రాజ్యాంగయంత్రం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలమీదనే తన పరిపాలన నెలకొల్పబడిందని చాటుకుంది. భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాడుతూ ఆస్తి హక్కులకు సంపూర్ణమైన స్వేచ్ఛాస్వాతంత్రాలు వుంటాయని ప్రకటించి వర్గ రాజ్యాంగయంత్రం ఉండటం ముగిసిపోయినట్లు సగర్వంగా చాటుకుంది.

అయితే పేద రైతాంగాన్నీ, కార్మికవర్గాన్ని తమ కింద అణచిపెట్టి వుంచడానికి పెట్టుబడిదారులకి సహాయం చేసే యంత్రంగానే వుంటూ వచ్చింది రాజ్యాంగయంత్రం. అయినప్పటికీ పైకి అది స్వేచ్ఛాయుతంగా కనబడింది. సార్వజనికమైన ఎన్నిక హక్కు ఇచ్చిందని ప్రకటించింది. తన సమర్థకులచేత, మతబోధకులచేత, పండితులచేత తత్వవేత్తలచేత తాను వర్గాలులేని రాజ్యాంగయంత్రం అని చెప్పించింది. పెట్టుబదారీ రాజ్యాంగయంత్రంతో సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కులు పోరాడనారంభించిన యీ సమయంలో తమది యావత్ప్రజా, ప్రజాస్వామిక రాజ్యాంగయంత్రమనీ, మనల్ని స్వేచ్ఛాస్వాతంత్ర్యాల విచ్ఛేదకులమనీ, బలాత్కారంమీదా, కొందరు మరి కొందరిని అణగదొక్కడంమీద ఆధారపడిన రాజ్యాంగయంత్రాన్ని నిర్మిస్తున్నామనీ నిందిస్తున్నారు. ప్రస్తుతం, ప్రపంచ సోషలిస్టు విప్లవం ఆరంభమై, అప్పుడే కొన్ని దేశాల్లో యీ విప్లవం జయప్రదంగా సాగి, ప్రపంచ పెట్టుబడికి వ్యతిరేకంగా యీ పోరాటం ప్రత్యేకించి తీవ్రమైపుడు రాజ్యాంగయంత్రం సమస్య అత్యంత ప్రాముఖ్యతను వహిస్తూన్నట్టిది, వెంటనే పరిష్కారం కావలసినట్టిది అనవచ్చు, నేటి రాజకీయ సమస్యలకూ రాజకీయ వివాదాలకూ కేంద్రం అయింది.

రష్యాలో గాని, బాగా నాగరికత చెందిన యితర దేశాల్లో గాని యే రాజకీయ పార్టీని పరిశీలించి చూసినాసరే, యించుమించు అన్ని రాజకీయ వివాదాలు, విభేదాలు, అభిప్రాయాలు నేడు యీ రాజ్యాంగయంత్రం యేమిటి అన్న భావంమీద కేంద్రీకరింపబడుతున్నాయి. పెట్టుబడిదారీ దేశాల్లో వున్న రాజ్యాంగయంత్రం ప్రజాస్వామికమైన రిపబ్లికుల్లోకల్లా ప్రత్యేకంగా అమెరికా, స్విట్జర్లండులలో లాంటిది, అత్యంత స్వేచ్ఛాయుత

ప్రజాస్వామిక రిపబ్లికుల్లో వున్న రాజ్యాంగయంత్రం ప్రజాభీష్టాన్ని, మొత్తం ప్రజానిర్ణయాన్ని, జాతీయాభీష్టాన్ని, ఇత్యాదులను వ్యక్తంచేస్తూందా, లేక ఆ దేశాలలో కూడా రాజ్యాంగయంత్రం కార్మికవర్గ రైతాంగాలమీద తమ అధికారం నిలబెట్టుకొనేందుకు పెట్టుబడిదారుల చేతుల్లో తన సాధన మాత్రంగా ఉపయోగిస్తుందా? ఇది ముఖ్యమైన ప్రశ్న. దీనిమీదనే రాజకీయ వివాదాలన్నీ కేంద్రీకరింపబడుతున్నాయి. బోల్షెవిజాన్ని గురించి యేమిటంటున్నారు? బూర్జువా పత్రికలు బోల్షెవిక్కులను తిట్టి దుమ్మెత్తిపోస్తున్నాయి. ప్రజాస్వామ్య పరిపాలన బోల్షెవిక్కులు మట్టిపాలు చేస్తున్నారనే సాధారణ నిందలు చర్వితచరణంగా ప్రచారం చేయ్యని వార్తాపత్రిక ఒకటైనా లేనేలేదు. మన మెన్షెవిక్కులూ సోషలిస్టు రివల్యూషనరీలూ బోల్షెవిక్కులు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలని మట్టిపాలు చేశారనే నిందలను తామే కనుగొని బైటపెట్టినట్టు అమాయకంగానే (ఇది అమాయకత్వం అయివుండవచ్చు, లేదా బందిపోటుతనం కంటె అమాయకత్వమే ఏ కొంపతీస్తుంది అని సామెత చెప్పిన అమాయకత్వమైనా అయివుండవచ్చు) నమ్ముతూంటే మాత్రం, వారు పొరపాటు చేయడమే కాకుండా నలుగురినోట అవహేళన పాలవుతున్నారనే చెప్పాల్సి వుంది. అతి ధనవంతములైన దేశాల్లో కోట్లాది ధనాన్ని సంపాదించిన వార్తాపత్రికల్లో – తమ ప్రచారంకోసం కోట్లమీద ఖర్చుపెడుతూ కోట్లాది ప్రతుల్లో బూర్జువా అబద్ధాలనూ సామ్రాజ్యవాద విధానాన్నీ ప్రచారం చేస్తూన్న వార్తాపత్రికల్లో – అమెరికా, ఇంగ్లండు, స్విట్జర్లండు దేశాలు ప్రజాస్వామ్యంమీద ఆధారపడి పురోగమించిన రాజ్యాలై వుండగా, బోల్షెవిక్ రిపబ్లిక్ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలంటే యేమిటో యెరుగని బందిపోటుదొంగల రాజ్యమని, బోల్షెవిక్కులు ప్రజా పరిపాలన సూత్రాన్ని మట్టిపాలు చేయడమే కాకుండా, రాజ్యాంగనిర్ణయ సభను తరిమేసేవరకూ పోయారనేటటువంటి మౌలికమైన వాదనలనీ, అభాండాలనీ శతాధా బోల్షెవిజం నెత్తిమీద వెయ్యని పత్రిక ఒక్కటి కూడా లేదు. బోల్షెవిక్కులమీద ఘోరాతిఘోరమైన యీ ఆరోపణలని ప్రపంచంలో సర్వత్రా పదేపదే ప్రచారం చేస్తున్నారు. ఈ ఆరోపణలు మనల్ని రాజ్యాంగయంత్రం అంటే యేమిటి అన్న ప్రశ్న వేసుకునేందుకు నేరుగా దారి తీస్తుంది. ఈ ఆరోపణలని అర్థం చేసుకోవాలంటే వాటిని పరిశీలించి – వూరికే వాటిని గురించి యితరులు చెప్పేమాటలని నమ్మి తెలుసుకోకుండా దృఢమైన మన స్వంత అభిప్రాయాలతో మనంతట మనం, వాటి లోగుట్టు తెలుసుకోడానికిని పరిశీలించాలంటే, రాజ్యాంగయంత్రం అంటే యేమిటో మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఈ సందర్భంలో, అన్ని రకాల పెట్టుబడిదారీ రాజ్యాంగయంత్రాలూ, వాటిని సమర్థించి వాటి ఉనికిని కాపాడడానికి యుద్ధానికి పూర్వం సృష్టించిన అన్ని తరహాల సిద్ధాంతాలు మన ముందున్నాయి. ఈ సమస్యను సరిగా ఎదుర్కొనాలంటే యీ సిద్ధాంతాలనన్నింటినీ, యీ అభిప్రాయాలనన్నింటినీ మనం సవిమర్శకంగా చూడవలసి వుంటుంది.

ఇందుకు ఎంగెల్స్ రచించిన "కుటుంబం, సొంతాఆస్తి, రాజ్యాల ఆవిర్భావం" అనే పుస్తకం చాలా సహాయపడుతుందని యీదివరకే చెప్పాను. ఏ రాజ్యాంగయంత్రంలో అయితే భూమి, ఉత్పత్తి సాధనాలు సొంత ఆస్తులుగానే వుండి, పెట్టుబడి పెత్తనం వుంటుందో, అట్టి రాజ్యాంగయంత్రం యెంత ప్రజాస్వామికంగా వున్నప్పటికీ కూడా, అది కార్మికవర్గాన్ని, పేద రైతాంగాన్ని అణచివేయడానికి పెట్టుబడిదారులు ఉపయోగించే యంత్రమే అవుతుందని యీ పుస్తకం చెబుతుంది. సార్వజనికమైన ఎన్నిక హక్కు, రాజ్యాంగనిర్ణయ సభ, పార్లమెంటు – యివన్నీ కూడా అసలు విషయపు ఆంతర్యాన్ని యే మాత్రమూ మార్చనట్టి కేవలం లాంఛనాలుగానే, అవి ఒక విధమైన హుండీ పత్రాలుగానే వున్నాయి.

రాజ్యాంగయంత్రం అనేక రూపాల్లో పరిపాలన సాగించవచ్చు. అది ఒక చోట ఒక రూపంలో వున్నప్పుడు పెట్టుబడి తన శక్తిని ఒక విధంగా వ్యక్తంజేస్తుంది. అది మరొక చోట మరో రూపంలో వున్నప్పుడు పెట్టుబడి తన శక్తిని మరొక విధంగా వ్యక్తంజేస్తుంది. ఇది యెలాగున్నప్పటికీ అసలు శక్తి మాత్రం పెట్టుబడి చేతుల్లోనే వుంటుంది. ఎన్నిక అర్హతలంటూ వుండనీయండి, రిపబ్లిక్ ప్రజాస్వామికమైనదే కానివ్వండి కాకపోనివ్వండి – ఆ మాటకి వస్తే, అది యెంత ప్రజాస్వామికంగా వుంటే, పెట్టుబడిదారీ విధానం పాలన అంత మొరటుగానూ, అంత దయాదాక్షిణ్యాలు లేకుండానూ వుంటుందన్నమాటే. ప్రపంచంలో అత్యంత ప్రజాస్వామికమైనట్టి రాజ్యాల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఒకటి. ఐనప్పటికీ అమెరికాలో వున్నట్టు పెట్టుబడి శక్తి సమాజం అంతటిమీద పట్టెడుమంది కోటీశ్వరుల శక్తి యింత మొరటుగాను, యింత బాహాటంగా లంచగొండితనంతో నిండిపోయినట్టూ మరెక్కడా లేదు. (యీ విషయం 1905 తరువాత అక్కడికి వెళ్ళినవారికి బాగా తెలిసి వుంటుంది.) పెట్టుబడి అంటూ వుంటే చాలు, సమాజం అంతటిమీద అది తన అధికారాన్ని చలాయించిందన్న మాటే. ఎట్టి ప్రజాస్వామికమైన రిపబ్లిక్ అవనీయండి, ఎన్నిక విధానం యే రూపంలోనైనాసరే వుండనీయండి, అసలు విషయం అంతర్యాన్ని అవి మార్చలేవు.

ప్రజాస్వామ్య రిపబ్లిక్, సార్వజనికమైన ఎన్నిక హక్కు భూస్వామ్య విధానం కంటే యెంతో అభ్యుదయకరములై, మానవ సమాజాన్ని ముందుకు తీసుకుపోయాయి; అవి శ్రామికవర్గం ఐక్యతనీ, సంఘటితత్వాన్నీ సాధించుకుని, పెట్టుబడితో క్రమబద్ధంగా పోరాడే మరోనిశ్చలతనీ, సుశిక్షణనీ కలిగిన దళాలని ఏర్పాటు చేసేందుకు అవకాశం కలిగించాయి. బానిసల మాట అటు వుంచి, భూదాసులకు ఇందులో శతాంశం కూడా లేవు. మనకి తెలిసినట్టు, బానిసలు తిరుగుబాట్లు లేవదీశారు, పితూరీలు చేశారు, అంతర్యుద్ధాలు సాగించారు. కాని వర్గచైతన్యాన్ని కలిగిన అధిక సంఖ్యా బలాన్నీ, పోరాటానికి నాయకత్వం వహించగలిగే రాజకీయ ఆర్టీలనీ సృష్టించడానికి వారికి యే మాత్రమూ సాధ్యమై వుండేది కాదు. తమ లక్ష్యాలేమిటో స్పష్టంగా గ్రహించగలిగేటట్టి శక్తిని కలిగివుండడానికే వారికి సాధ్యపడేది కాదు. చరిత్రలో అత్యంత విప్లవాత్మకమైన తరుణాల్లో సహితం వారు పరిపాలక వర్గాల చేతుల్లో పాచికలుగానే వుండేవారు. బూర్జువా రిపబ్లిక్, పార్లమెంటు సార్వజనికమైన ఎన్నిక హక్కు – యివన్నీ ప్రపంచ మానవ సమాజ పరిణామం దృష్ట్యా మహత్తరమైన అభివృద్ధి. మానవజాతి పెట్టుబడిదారీ విధానంవైపు పురోగమించింది. కాగా పట్నవాస సంస్కృతి ధర్మమా అంటూ – తనని తాను తెలుసుకోవడాకీ, ప్రపంచ వ్యాపిత కార్మిక వర్గోద్యమాన్నీ, ప్రపంచమంతటా పార్టీలలో సంఘటితమైన కోట్లాది కార్మికులనూ ప్రజా సమూహాల పోరాటానికి చైతన్యవంతమైన నాయకత్వం వహించి నడిపించుతూన్న సోషలిస్టు

పార్టీలను సృష్టించడానికి పెట్టుబడిదారీ విధానంవల్లనే పీడిత శ్రామికవర్గానికి సాధ్యం అయ్యింది. పార్లమెంటు విధానం లేకపోతే, ఎన్నికపద్ధతి లేకపోతే కార్మికవర్గానికి యీ అభివృద్ధిని సాధించడం సాధ్యం కాకపోయే వుండేది. అందుకనే వీటన్నిటికీ ప్రజాబాహుళ్యం దృష్టిలో యింత ప్రాముఖ్యత వచ్చింది. అందువల్లనే సమూలమైన మార్పు ఎంతో కష్టంగా కనిపిస్తుంది. రాజ్యాంగయంత్రం స్వేచ్ఛను కలిగివుండి ప్రజలందరి ప్రయోజనాలను కాపాడటమే దాని పరమావధి అనే బూర్జువా అబద్ధాలను వెనకేసుకొస్తూ వాటిని సమర్థించే సిగ్గుమాలిన కపటులూ, శాస్త్రవేత్తలూ, మతగురువులూ మాత్రమే కాకుండా, పెట్టుబడిదారీ సమాజం నుండి సోషలిజానికి మార్పు చెందడాన్ని అర్థం చేసుకోలేనట్టి అనేకులు కూడా పాత దురభిమానాలని పునశ్చరణ చేస్తూ వుంటారు. బూర్జువావర్గంమీదనే ప్రత్యక్షంగా ఆధారపడుతూండేటటు వంటివారే కాకుండా, పెట్టుబడికి దాసోహం అయిపోయిన వారే కాకుండా (పెట్టుబడి చెప్పుచేతల్లో అనేక రకాల శాస్త్రవేత్తలు, కళాకారులు, మత గురువులు వగైరాలు చాలామందే వున్నారు), బూర్జువావర్గపు స్వేచ్ఛాభావాల దుర్భ్రమలకి లొంగిపోయినవారు కూడా సోవియట్ రిపబ్లిక్ స్థాపన ప్రారంభంలో ఆ బూర్జువావర్గపు అబద్ధాలను తిరస్కరించి, "మీ రాజ్యాంగయంత్రం స్వేచ్ఛాయుతమైనదని మీరు చెపుతూన్నప్పటికీ, వాస్తవానికి మీ రాజ్యాంగయంత్రం ప్రజాస్వామిక రిపబ్లిక్ అయినప్పటికీ, సొంత ఆస్తి వున్నంత కాలమూ మీ రాజ్యాంగయంత్రం కార్మికులని అణగదొక్కడానికి పెట్టుబడిదారులకి ఉపయోగపడే యంత్రమే అవుతుంది, రాజ్యాంగయంత్రం యెంత స్వేచ్ఛగా వుంటే అంత స్పష్టంగా యీ విషయం ప్రస్ఫుటమవుతుంది" అన్ని సోవియట్ రిపబ్లిక్ బాహాటంగా ప్రకటించినందుకు వారందరూ బోల్షెవిజంమీద కత్తిగట్టారు. ఇందుకు యూరప్‌లో స్విట్జర్లండు, అమెరికాలో సంయుక్త రాష్ట్రాలు దృష్టాంతాలు. ఇవి ప్రజాస్వామ్యములైన రిపబ్లికులు అయినప్పటికీ, వాటిని గురించి యెంత ఆకర్షణీయంగా వర్ణించి చెప్పబడుతున్నప్పటికీ, కార్మిక ప్రజాస్వామ్యం గురించీ, పౌరులందరి సమానత్వం గురించీ యెంతగా కబుర్లు చెపుతున్నప్పటికీ, యీ దేశాల్లో దయాదాక్షిణ్య రహితంగానూ, కర్కోటకంగానూ పెట్టుబడి తన అధికారాన్ని చలాయిస్తున్నంతగా మరి యే యితర దేశాల్లోనూ కూడా చలాయించడం లేదు. ఈ దేశాల్లోనే దోపిడీ విధానం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. వాస్తవానికి, స్విట్జర్లండులోనూ, అమెరికాలోనూ పెట్టుబడి పెత్తనం వల్లనే తమ స్థితిని నిజంగా మెరుగు చేసుకునేందుకు కార్మికులు చేసే ప్రతి ప్రయత్నం వెనువెంటనే అంతర్యుద్ధానికి దారి తీస్తుంది. ఈ దేశాల్లో సైనికుల సంఖ్య చాలా తక్కువ, స్థాయి సైన్యం కూడా చాలా చిన్నది. స్విట్జర్లాండ్‌కు "మిలీషియా" వుంది, ప్రతి స్విట్జర్లాండు పౌరుడికీ తన యింట్లో తుపాకీ వుంటుంది. అమెరికాకి నిన్నమొన్నటి వరకూ స్థాయీ సైన్యమంటూ లేనేలేదు. అందుచేత యెప్పుడైనా సమ్మె జరుగుతే, బూర్జువావర్గం తాను ఆయుధాలని ధరించి, కిరాయి సైనికులకి డబ్బిచ్చి తెచ్చి, సమ్మెను అణచివేస్తుంది. స్విట్జర్లండు, అమెరికాలలో కంటె ప్రపంచంలో మరెక్కడ కూడా కార్మికోద్యమాన్ని అంత క్రూరంగా అణచివేయడం చూడము. పెట్టుబడిదార్లకు ఆ దేశాల పార్లమెంట్లలో వున్నంత పలుకుబడి మరే దేశంలోనూ వుండదు. పెట్టుబడే సర్వశక్తివంతమైనదీ, షేరుమార్కెట్టే సర్వశక్తివంతమైనదీ అయివుంటూండగా, పార్లమెంటూ, ఎన్నికలూ కేవలం తోలుబొమ్మలూ, కీలుబొమ్మలూ మాత్రమే. కాని క్రమేణా కార్మికుల కళ్ళ నుండి గంతలు రాలిపోతున్నాయి. సోవియట్ అధికారపు భావం నానాటికీ వ్యాపిస్తూంది. ప్రత్యేకంగా యిటీవల జరిగిన రక్తపాత హత్యాకాండ తరువాత అది మరింత ప్రబలంగా విస్తరిస్తూంది. పెట్టుబడిదారులమీద నిర్దాక్షిణ్యంగా పోరాడవలసి వుందనే విషయం కార్మికుడికి నానాటికీ మరింత స్పష్టమవుతూంది.

రిపబ్లిక్ యేయే రూపాల ముసుగు వేసుకున్నాసరే, యెంతటి ప్రజాస్వామ్యమైన రిపబ్లిక్ వేషాన్ని ధరించినాసరే, అది పెట్టుబడిదారీ రిపబ్లిక్ అయినట్లైతే, దానిలో భూమి మీదనూ, ఫాక్టరీమీదనూ, సొంతాస్తి నిలిచివున్నట్లుయితే, సొంత పెట్టుబడి యావత్ సమాజాన్ని వేతన బానిసత్వ స్థితిలో వుంచినట్లైతే – అనగా మన పార్టీ కార్యక్రమంలోనూ, సోవియట్ రాజ్యాంగంలోనూ ప్రకటించబడిన లక్ష్యాలను అమలులో పెట్టకపోతే – అట్టి రాజ్యాంగయంత్రం కొందరు వ్యక్తులు మరికొందరిని అణగదొక్కి వుంచడానికి ఉపయోగపడే యంత్రమే అయితీరుతుంది. ఇట్టి యంత్రాన్ని, పెట్టుబడి శక్తిని కూలదొయ్యవలసిన వర్గం చేతుల్లోనే పెడతాం. రాజ్యాంగయంత్రం అంటే సార్వజనిక సమానత్వం అనేటువంటి పాత దురభిప్రాయాలన్నిటినీ మనం తిరస్కరించి తీరుతాం – యెందుచేతనంటే అట్టి అభిప్రాయాలు కేవలం మోసం తప్ప మెరొకటి కాదు: దోపిడీ వున్నంతకాలమూ సమానత్వం వుండజాలదు. కార్మికునితో భూస్వామి యెన్నటికీ సమానం కాజాలడు. అలాగే ఆకలితో అలమటిస్తూన్న మనిషి కడుపునిండా భోజనంచేసిన మనిషితో యెన్నటికీ సమానం కాజాలడు. యే యంత్రం రాజ్యాంగయంత్రం అని పిలవబడుతూండేదో, దేనినైతే పాతపుక్కిటి పురాణాలని నమ్మి అది ప్రజా పరిపాలన అని భావించి, దేనినైతే ప్రజలు మూఢనమ్మకంతో గౌరవించేవారో అట్టి యంత్రాన్ని, శ్రామికవర్గం బద్దలుచేసి యిదొక బూర్జువా వర్గపు అబద్ధం అని యెలుగెత్తి చాటుతుంది. ఈ యంత్రాన్ని పెట్టుబడిదారుల చేతుల్లో నుండి గుంజుకొని మనం హస్తగతం చేసుకున్నాం. ఈ యంత్రంతో – ఈ దుడ్డుకర్రతో – మనం అన్ని రకాల దోపిడీనీ నాశనం చేసితీరుతాం. ఇక ప్రపంచంలో యెక్కడా కూడా దోపిడీ వుండడానికి అవకాశం లేకుండా చేసిన తరువాత, భూస్వాములూ ఫాక్టరీ యజమానులూ ప్రపంచంలో లేకుండా చేసిన తరువాత, కొంతమంది పీకలమొయ్యా మెక్కుతూండగా కడమవారు ఆకలితో పస్తుండవలసిన పరిస్థితులని అంతం చేసిన తరువాత – అట్టి పరిస్థితులుండడానికి యెన్నటికీ యెట్టి అవకాశమూ వుండకుండా చేసిన తరువాతే యీ యంత్రాన్ని మనం పెంటకుప్పమీద పారేస్తాం. అప్పుడు రాజ్యాంగయంత్రమూ వుండదు, దోపిడీ వుండదు. ఇదీ మన కమ్యూనిస్టు పార్టీ దృక్పథం. ఈ విషయాన్ని గురించి తదుపరి ఉపన్యాసాల్లో పదేపదే ప్రస్తావించడానికి మనకి అవకాశం వుంటుందని ఆశిస్తున్నాను.

***"ప్రావ్ద" 15వ సంచికలో 1929, జనవరి 18న తొలిసారి ప్రచురింపబడింది.***

# స్వేచ్ఛాప్రియులైన కశ్మీర్ ప్రజల 'ఆజాదీ కశ్మీర్' పోరాటం ఎన్ని ఆటంకాలు ఎదురైనా ముందుకే పోతుంది! న్యాయమైన కశ్మీర్ ప్రజల పోరాటానికి సమస్త పీడిత, దేశభక్త, ప్రజాస్వామిక, పురోగామి శక్తులు మద్దతునివ్వాలి!!

కశ్మీర్ నేడు బ్రద్దలవబోతున్న అగ్నిపర్వతంలా ఉన్నది. అక్కడ భిన్న వర్గాల మధ్య, విరుద్ధ ప్రయోజనాల మధ్య ఘర్షణ తీవ్రరూపం దాల్చింది. గత 7 దశాబ్దాలకు పైగా, దేశాన్ని పాలించిన పాలకవర్గ పార్టీలన్నీ కశ్మీర్ ప్రజల స్వయం ప్రతిపత్తి ఆకాంక్షను తొక్కిపట్టాయి. ముఖ్యంగా భారత్‌ను ఎక్కువకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ సమస్యను సాగదీస్తూ, కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను తొక్కిపట్టి, నీరుగారుస్తూ, వారిని వంచించింది. 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ నేతృత్వంలోని బి.జె.పి మాత్రం ఏకంగా కశ్మీర్ ప్రజల ఆత్మగౌరవాన్నీ, అస్థిత్వాన్నీ, స్వతంత్ర కాంక్షను ధ్వంసం చేసి, తాము నిర్మించబోయే 'ఏకశిలాసదృశ్యమైన హిందూ రాజ్యం'లో బలప్రయోగం ద్వారా విలీనం చేయాలని సంకల్పించింది. కానీ కశ్మీర్ ప్రజల స్వాతంత్ర్య ఆకాంక్ష మరింత బలపడుతూ పదునెక్కుతున్నది. రాజ్యం చేస్తున్న బలప్రయోగాన్ని వారు బలప్రయోగం ద్వారానే తిప్పికొడుతూ, ఆజాదీ కశ్మీర్ లక్ష్యం దిశగా పురోగమిస్తున్నారు.

పై నేపథ్యంలోనే కశ్మీర్ పరిణామాలను పరిశీలించాలి. 2014లో కశ్మీర్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో అధికారం చేపట్టేందుకు అవసరమైనన్ని సీట్లు ఏ పార్టీకి రాకపోవడంతో, మోడీ అవకాశవాద పద్ధతులలో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పి.డి.పి)తో జత కట్టి, మోహబూబాముఫ్తీ ముఖ్యమంత్రిగా సంకీర్ణ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టేలా చేశాడు. మరోవైపు లక్షలాది కేంద్ర సాయుధ బలగాలనూ, సైన్యాన్ని కశ్మీర్‌కు తరలించి, ప్రజల రాజకీయ, పౌరహక్కులను ధ్వంసం చేసేందుకు పూనుకున్నాడు. ముఖ్యంగా కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని ప్రతిబింబిస్తూ, రాజ్యాంగంలో పొందుపరిచిన 370 అధికరణాన్నీ, 35(ఎ) అధికరణాన్ని రద్దు చేసేందుకు కుట్రపూరిత పథకాల అమలుకు తెర లేపాడు. బి.జె.పితో జత కట్టి, ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన మెహబూబాముఫ్తీ కేంద్ర ప్రభుత్వానికి రబ్బరు స్టాంపులా మారింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహం తారస్థాయికి చేరి, ఆజాదీ కశ్మీర్ నినాదం కశ్మీర్ అంతా మారుమ్రోగింది. ఈ పరిస్థితులలోనే 2018 జూన్‌లో, ప్రభుత్వం రంజాన్ పండగను పురస్కరించుకొని, కాల్పుల విరమణ ప్రకటించింది. ఈ సమయంలోనే సీనియర్ జర్నలిస్ట్ 'రైజింగ్ కశ్మీర్' దినపత్రిక సంపాదకుడు సుజాత్‌బుఖారీని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఈ సంఘటనను సాకుగా తీసుకున్న బి.జె.పి 2018 జూన్ 19న మెహబూబాముఫ్తీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడంతో, ప్రభుత్వం కుప్పకూలిపోయింది.

బుఖారీ హత్య, కాల్పుల విరమణకు ముగింపు పలకటం, మెహబూబా ప్రభుత్వం నుండి బి.జె.పి వైదొలగడం, కశ్మీర్ యువతకు వ్యతిరేకంగా మరో హంతక క్యాంపెయిన్‌ను ప్రారంభించడం –ఈ క్రమమంతా అజిత్‌దోవల్ సలహాతో మోడీ అండ్ కో రూపొందించిన వ్యూహంలో భాగమే. ఈ వ్యూహం సార్వత్రిక ఎన్నికల ముందు వాళ్ళకు అవసరమైంది. ఎందుకుంటే 2019 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపునకు మోడీ చేసిన అభివృద్ధి ఏమి లేదు కనుక, ఈ కుటిల వ్యూహం అవసరమైంది. ఈ వ్యూహం ప్రకారం మోడీ కాషాయసేన ప్రజలను వారు ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్యల నుండి పక్కదారి పట్టించేలా దేశ భద్రత గురించి గగ్గోలు పెడతారు. ప్రధానంగా పాకిస్థాన్ నుండీ, టెర్రరిస్టుల నుండి కశ్మీర్ రక్షణకూ, దేశ భద్రతకు ప్రమాదం పొంచిఉందనే అబద్ధాన్ని ప్రజలలో ప్రచారం చేసి, ప్రజలలో అభద్రతను సృష్టించి, ఈ అభద్రత నుండి దేశ ప్రజలను బయటపడవేసే 'చౌకీదార్', గొప్ప సమర్థవంతమైన నాయకుడు మోడీనే అంటూ ప్రజలను మోసం చేస్తారు. ఈ వ్యూహానికనుగుణంగా పుల్వామ దాడి తర్వాత మరింత ఉన్మాదాన్ని పెంచి, ఒక ఉద్వేగ స్థితికి ప్రజలను తీసుకొనిపోయి ఓట్లు వేయించుకోవాలనేది బి.జె.పి పన్నిన కుట్ర. సుజాత్‌బుఖారీ హత్యకూడా బి.జె.పి ముష్కరులు చేసిన హత్యగానే భావించవచ్చు. సరిగ్గా ఎన్నికలకు ముందు బి.జె.పి ఇటువంటి చర్యల ద్వారా లబ్ది పొందాలని చూస్తుంది. దాని గత చరిత్ర కూడా యిదే చెబుతుంది. 2019 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కశ్మీర్‌పై ఆకస్మికంగా మరింత కఠిన వైఖరిని చేపట్టి, దేశవ్యాపితంగా హిందూ–ముస్లీం ధృవీకరణను తీవ్రతరం చేసి, గవర్నర్ పాలనను కూడా రద్దు చేసి, ప్రభుత్వ ఏర్పాటుకు పి.డి.పి, నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌లు సిద్ధపడినా కూడా రాజ్యాంగ వ్యతిరేకంగా ఆఘమోఘాల మీద అసెంబ్లీని రద్దు చేయించి, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా తన మితవాద సామాజిక పునాదిని సంఘటితం చేసుకునేందుకు ప్రయత్నించింది. పుల్వామ దాడి తర్వాత మరింత

బరితెగించి బూటకపు జాతీయవాదాన్ని, బూటకపు దేశభక్తిని, మాతోన్మాదాన్ని రెచ్చగొట్టింది. అఖండ్‌భారత్, హిందూరాజ్యంలకు సంబంధించిన సంఘ పరివార్ దీర్ఘకాల ఎజెండా కూడా ఈ కాషాయ మూకలకు ఉంది. ఇటువంటి సమయాలలో ఈ ఎజెండాను బయటకు తీసి అమలు జరిపేందుకు ప్రయత్నిస్తారు. ప్రస్తుతం కశ్మీర్ సమస్య చర్చనీయాంశమైనది కాబట్టి కశ్మీర్‌కు సంబంధించిన పుర్వాపరాలను అధ్యయనం చేయాలి. వాస్తవాలను తెసులుకోవాలి. సత్యంవైపు నిలబడాలి. అందువలన 1947 ప్రాంతం నుండి కశ్మీర్‌కు సంబంధించిన ముఖ్యమైన విషయాలను ఒకసారి చూద్దాం.

1947 నాటికి జమ్ము-కశ్మీర్ బ్రిటిషు సామ్రాజ్యంలో అంతర్భాగంగా వున్న ఒక రాచరిక రాజ్యం. 1947 ఆగస్టు 15న బ్రిటిషు పాలకులు ఇండియాను వదిలి వెళ్ళిపోయిన సందర్భంలో భారత్, పాకిస్థాన్‌లు విడిపోయి స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడ్డాయి. ఆ సందర్భంలో జమ్ము-కశ్మీర్ ఒక విడి స్వతంత్ర రాజ్యంగా మిగిలింది. ఇదే సమయంలో పాకిస్థాన్ ప్రోద్బలంతో ఫష్తూన్ తెగలు కశ్మీర్‌లో కొంత భాగాన్ని ఆక్రమించడంతో, కశ్మీర్ రాజు హరిసింగ్ భారత్ సహాయాన్ని కోరాడు. దీంతో భాతరసైన్యం కశ్మీర్‌లో ప్రవేశించి, కొంత భూభాగం అక్రమించుకున్నది. 1947 అక్టోబర్ 27న భారత్ యూనియన్‌లో కశ్మీర్‌ను స్వయం ప్రతిపత్తి కలిగిన రాష్ట్రంగా కలిపేందుకు హరిసింగ్ అంగీకరించాడు. ఈ పరిణామాలతో జమ్ము-కశ్మీర్‌లో కొంత భాగం పాకిస్థాన్ ఆధీనంలోకి వెలితే, కొంతభాగం భారత్ ఆధీనంలోకి వచ్చింది. జమ్ము-కశ్మీర్ భారత్‌లో కలిసేముందు రూపొందిన షరతుల ప్రకారం విదేశీ వ్యవహారాలు, రక్షణ, సమాచార సంబంధిత విషయాల మీద మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి కశ్మీర్ మీద చట్టాలు చేసేహక్కు ఉంటుంది. మిగిలిన విషయాలలో కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి ఉన్నది. ఈ స్వయంప్రతిపత్తికి సంబంధించిన అంశాలను ఆర్టికల్ 370, 35(ఎ)ల రూపంలో రాజ్యాంగంలో పొందుపరిచారు. 1952లో కేంద్ర, రాష్ట్ర ప్రతినిధులు ఢిల్లీలో ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ సమస్య ఐక్యరాజ్యసమితి (యూ.ఎన్.ఓ) ముందుకు వచ్చినప్పుడు నెహ్రూ, 'కశ్మీర్ ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలుపుకొనేలా రిఫరెండం జరిపి, కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తామని' వాగ్దానం చేశాడు. మొదట కశ్మీర్‌కు కూడా ప్రధాన మంత్రి హెూదా ఉండేది.

షేక్ అబ్దుల్లా ప్రధాన మంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం 1947లోనే భూ సంస్కరణలు ప్రవేశపెట్టింది. జాగీర్దారీ విధానానికి స్వస్తి చెప్పడానికి దున్నేవారికే భూమి ప్రాతిపదికన పంపిణీని చేపట్టింది. హిందూ-ముస్లీం తేడా లేకుండా అందరికీ భూమి దక్కింది. ఇది గిట్టని హిందూ మతసంస్థలు, పెద్ద భూస్వాములు షేక్‌అబ్దుల్లా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టడంతోపాటు, కేంద్రంలో నెహ్రూ ప్రభుత్వాన్ని ప్రభావితం చేశారు. నెహ్రూ ప్రభుత్వానికి షేక్‌అబ్దుల్లా నిర్వహించిన భూసంస్కరణలు కంటగింపుగా తయారైనాయి. దీంతో కేంద్రప్రభుత్వానికి జమ్ము-కశ్మీర్ ప్రభుత్వానికి మధ్య ఘర్షణ ప్రారంభమైంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 35(ఎ)కు వ్యతిరేకంగా తన యంత్రాంగం కోసం పెద్ద ఎత్తున భూ సేకరణను చేపట్టింది. భారతసైన్యం కోసం కూడా భూ సేకరణను చేపట్టింది. దీనిని అక్కడి నాయకులు, ప్రజలు వ్యతిరేకించారు. కొద్ది కాలంలోనే కేంద్ర ప్రభుత్వానికి, కశ్మీర్‌కు ఘర్షణ తీవ్రతరమైంది. నెహ్రూ ప్రభుత్వం కశ్మీర్‌కు గల ప్రత్యేక హక్కులను హరించి వేయాలని కుట్రలు చేసింది. దీనికి వ్యతిరేకంగా షేక్ అబ్దుల్లా నాయకత్వంలో పోరాటం మొదలైంది. దీంతో 1953 ఆగస్టు 9న నెహ్రూ ప్రభుత్వం షేక్‌అబ్దుల్లాను అరెస్టు చేసి, తమ ఏజంటుగా ఉండే భక్షిగులామ్ మహమ్మద్ ప్రధానిగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసింది. షేక్‌అబ్దుల్లాను పాకిస్థాన్ ఏజెంటుగా ప్రచారం చేసి, 20 సంవత్సరాలు జైలులో పెట్టింది. ఈ పరిణామాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇంకొకవైపు పాకిస్థాన్‌తో వచ్చిన ఘర్షణలు, యుద్ధాల వలన రిఫరెండం జరుపలేకపోయామని భారత పాలకవర్గాలు కుంటిసాకులు చెప్పారు. కానీ వాస్తవానికి కశ్మీర్‌కు భారత్, పాకిస్థాన్, అమెరికా, రష్యాలు అందరూ శత్రువులే. అమెరికా పాకిస్థాన్‌వైపు, రష్యా భారత్ తరపున వకాల్తా పుచ్చుకొని ఐక్యరాజ్యసమితిలో కశ్మీర్ విషయంలో పరిష్కారం జరగకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారు.

ఇదే క్రమంలో 20 సంవత్సరాలు జైలు జీవితం పూర్తి చేసుకొని విడుదలైన షేక్‌అబ్దుల్లా కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయాడు. ఈ కాలంలో కేంద్రప్రభుత్వం ఎన్నికలలో రిగ్గింగ్‌లు జరుపుతూ, తమకు తొత్తులుగా ఉండేవారిని అధికార పీఠంపై కూర్చొబెడుతూ వచ్చింది. ఈ పరిణామాలన్ని కశ్మీర్ ప్రజలను అవమానపర్చటంతోపాటు, తీవ్రంగా గాయపరిచాయి. ఇటువంటి పరిస్థితులలోనే ప్రజలు ప్రత్యామ్నాయ మార్గంగా సాయుధ పోరాట మార్గం ఎంచుకున్నారు. జె.కె.ఎల్.ఎఫ్ (జమ్ముకాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్)ను స్థాపించారు. భారత్, పాకిస్థాన్‌లు ఆక్రమించుకున్న కశ్మీర్‌కు స్వాతంత్ర్యం కావాలనే డిమాండుతో జె.కె.ఎల్.ఎఫ్ పుట్టింది. 1985 నుండి ఇది ప్రారంభం అయింది. ఈ సంస్థ మీద, కశ్మీర్ యువతమీద భరించలేని అణచివేత కొనసాగింది. దీని నాయకుడు మక్బూల్‌భట్‌ను కేంద్ర ప్రభుత్వం ఉరి తీసింది. జగ్‌మోహన్ అనే నియంతను గవర్నర్‌గా నియమించి, వేల మందిని హత్యలు చేయించింది. ఇదే సమయంలో భారత్ అనుకూల సాయుధ గ్రూపులను కేంద్రం 'రా' (రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్) ద్వారా తయారు చేయించి నడిపింది. పాకిస్థాన్ కూడా తన అనుకూల గ్రూపులను తయారు చేయించి నాటకాలు ఆడించింది. ఈ సమస్యను హిందూ-ముస్లీం ఘర్షణగా మార్చేందుకు ప్రయత్నించింది. వాస్తవంగా కశ్మీర్ సమాజంలో సుఫీ ప్రభావం ఎక్కువ. ముస్లీం మతమధ్యం తక్కువ. భారత్, పాకిస్థాన్‌లు విభజన సమయాలలో జరిగిన మత ఘర్షణలు కశ్మీర్‌లో జరగలేదు. ఇలా

రకరకాల ప్రతీఘాతుక శక్తులు కశ్మీర్ జాతి పోరాటాన్ని పక్కదారి పట్టించేందుకు, దాని లక్ష్యాలను దెబ్బతీసేందుకు ప్రయత్నించాయి. ఇటువంటి రక్త క్రీడలలో అనుభవం గడించినవాడే అజిత్‌దోవల్. ఈ విధమైన చర్యల ద్వారా కశ్మీర్ పోరాటానికి భారత ప్రజలలో మద్దతు లేకుండా చేసి, ఒక గందరగోళాన్ని వ్యాపింపజేయడం వీటి లక్ష్యం. మొత్తం కశ్మీర్‌ను జైలు లేదా యుద్ధ క్యాంపుగా మార్చివేశారు. నిరంతర కర్ఫ్యూలు, వేధింపులు, మిస్సింగ్‌లు, అత్యాచారాలు, హత్యలు, లాకప్‌హత్యలు మొదలగు చర్యలు నిత్యకృత్యాలయ్యాయి. కశ్మీర్ జనాభా – 1.3 కోట్లు. ఇక్కడ సాయుధ బలగాలు 7 లక్షలు. ఢిల్లీ జనాభా – 1.6 కోట్లు. ఇక్కడ సాయుధ బలగాలు 8,500 మంది. ఈ లెక్కన ఢిల్లీలో కొన్ని వేల మందికి ఒక పోలీసు వుంటే, కశ్మీర్‌లో 18 మందికి ఒక సైనికుడు ఉన్నాడు. 30 సంవత్సరాల నుండి కశ్మీర్‌లో సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం అమలు కొనసాగుతోంది. నేడు ప్రపంచంలోనే కశ్మీర్ ఎక్కువ సాయుధ బలగాలు కలిగిన ప్రాంతంగా కుఖ్యాతి గాంచింది. సుమారు 80,000 మంది కశ్మీర్ ప్రజలను సాయుధ బలగాలు హత్య చేశాయి. కొన్ని వేల మంది మాయం చేయబడినారు. కొన్ని వేల మంది మహిళల మీద అత్యాచారాలు జరిగాయి. ప్రస్తుతం ఇక్కడ ఒక మిలిటెంట్‌ను చంపితే ఆర్మీ అధికారికి ప్రభుత్వం 15 లక్షలు ఇస్తున్నది. ఈ అమానుష కాండ ప్రజలను భయపెట్టకపోగా, మరింతగా ఉద్యమంపైపు నడిపించేలా చేస్తున్నది. ముఖ్యంగా చదువుకున్న యువత సమరశీల పోరాటాలకు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం వారు 'కశ్మీర్ సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పరీక్షలు వద్దు, చదువులు వద్దు, రక్తం, ఇంకు రెండు కలిసి పారలేవు. మొదట శాంతి, ఆ పిదపే పరీక్షలు' అంటూ చేతుల్లో నినాదాల అట్టలు పట్టుకొని రోడ్లపై ర్యాలీలు తీస్తున్నారు. సాయుధ బలగాలతో ముఖాముఖి ఘర్షణలకు దిగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరించి పాఠశాలలు, కళాశాలలు సజావుగా నడుస్తున్నాయని బొంకుతున్నది. కానీ కశ్మీర్‌లో నేడు విద్యా వ్యవస్థ ప్రతిష్టంబనకు గురైౖ ఉంది.

కశ్మీర్‌లో గత 7 దశాబ్దాలుగా పేరుకు ఎన్నికలు జరుగుతున్నప్పటికీ, ఆచరణలో సైనికపాలనే కొనసాగుతున్నది. అక్కడి ప్రజలకు ఎన్నికలపైన గానీ, ఎన్నికల పార్టీలపైన గానీ ఏ మాత్రం విశ్వాసం లేదు. ఈ 7 దశాబ్దాల కాలంలో ఇక్కడి ప్రజలు అనేక సందర్భాలలో ఎన్నికలను పెద్ద ఎత్తున బహిష్కరించారు. 2017లో శ్రీనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికలను గానీ, 2019లో జరుగుతున్న పార్లమెంటరీ ఎన్నికలను గానీ, స్థానిక ఎన్నికలను గాని కశ్మీర్ ప్రజలు క్రియాశీలకంగా బహిష్కరించారు. ఈ ఎన్నికలలో కేవలం 7% అంతకన్నా తక్కువ శాతం ఓట్లు పోలైనాయి. ఈ పోలింగ్ శాతం చూస్తే కశ్మీర్ ప్రజలకు 'అతిపెద్ద భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం'పై ఏ మేరకు విశ్వాసం ఉందో అర్థమవుతుంది. స్థానిక పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్, పి.డి.పిలపైన కూడా వారికి విశ్వాసం లేదు. ప్రజల దృష్టిలో అవి స్వప్రయోజనాలు నెరవేర్చుకునే అవకాశవాద పార్టీలుగానే వాటికి గుర్తింపు ఉంది. ఇక కాంగ్రెస్, బి.జె.పి వంటి జాతీయ పార్టీలనే కాకుండా, మొత్తం భారతరాజ్యాన్నే వాళ్ళు శత్రువులుగా పరిగణిస్తున్నారు. భారతరాజ్యం తమ ప్రజాస్వామిక హక్కులను కాలరాచివేస్తూ, తమని బానిసలుగా చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వారిలో పరాయీకరణ భావన గాఢంగా నెలకొని ఉంది.

మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కశ్మీర్ ఉద్యమంపై మున్నెన్నడూ లేనంత స్థాయిలో రాజ్య నిర్బంధం పరాకాష్టకు చేరింది. 2016లో బుర్హాన్‌వానీ హత్యకు నిరసనగా జరిగిన ఆందోళనలలో వందల మంది ప్రజలు చనిపోయారు. ముఖ్యంగా మోడీ హయంలో పెల్లెట్స్ ద్వారా యువకుల కంటి భాగంలో దాడులు చేశారు. చాలా మంది కంటి చూపు కోల్పోయారు. ప్రపంచంలో ఇంతవరకు ఎక్కడా చేయని దుర్మార్గం, మోడీ ప్రభుత్వం కశ్మీర్‌లో చేసింది. ఈ సందర్భంగా 9000 మందిని అరెస్టు చేశారు. 5,500 మందిని వాంటెడ్‌గా ప్రకటించారు. దాడులు, గృహదహనాలు, పంటల నాశనం, ఆపిల్ తోటలు ధ్వంసం నిత్యం జరుగుతున్న చర్యలు. భారతసైన్యం, సి.ఆర్.పి.ఎఫ్, ఎస్.ఎస్.బి, బి.ఎస్.ఎఫ్, కశ్మీర్ పోలీసులు కలిసి ఆపరేషన్ కామ్‌డౌన్ పేరుతో సాగిస్తున్న ఉమ్మడి విధ్వంసక క్రీడ ఇది.

కశ్మీర్‌లో స్థానికేతరుల సంఖ్యను పెంచే ప్రయత్నాలు చేశారు. సైనిక కాలనీల కోసం భారీగా భూసేకరణ జరిపారు. కశ్మీర్‌కు వలస వచ్చిన వారి కోసం ప్రత్యేక కాలనీలు నిర్మించడంతో పాటు, కశ్మీర్ భాషకు బదులు సంస్కృత అక్షరాలను చేరుస్తున్నారు. 2016 జులై 18న పార్లమెంటులో 370 ఆర్టికల్‌కు కాలం చెల్లిపోయిందని రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించడం కశ్మీరీల మనోభావాలను మరింతగా దెబ్బ తీసింది. 29,000 మంది హిందూత్వ శక్తులు జమ్ము ప్రాంతంలో సాయుధ శిక్షణను పొందాయి. వీరంతా ముస్లింలను తీవ్రవాదులుగా, వేర్పాటువాదులుగా ప్రచారం చేసి, ఎప్పుడంటే అప్పుడు దాడులు చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

2019 ఫిబ్రవరి నుండీ, ప్రధానంగా పుల్వామ ప్రతిఘటన తర్వాత మోడీ ప్రభుత్వం బాలకోట్ సర్జికల్ స్ట్రైక్ పేరుతో, 12 మిరాజ్ 2000 యుద్ధ విమానాలను సరిహద్దు దాటించి పాకిస్థాన్‌లో బాంబులు వేశామని చెప్పుకుంటున్నది. ఈ ఘర్షణ సందర్భంగా పాకిస్థాన్ ఆర్మీ నేలకూల్చిన భారత్‌యుద్ధ విమానం నుండి పాకిస్థాన్ భూభాగంలో పడిపోయిన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ పాక్ సైనికులకు దొరికితే, వారు అతనిని విడుదల చేశారు. మోడీ ప్రభుత్వం ఇది కూడా తమ దౌత్య విజయమేనని డబ్బా కొట్టుకున్నది. ఈ సంఘటనలను పెద్ద ఎత్తున మీడియా ద్వారా ఊదరగొడుతూ, ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులలో దేశ భద్రతకూ, రక్షణకు మోడీ లాంటి సమర్థవంతమైన నాయకుడు అవసరమని ప్రజలలో భ్రమలు కల్పించి ఓట్లు దండుకునేందుకు పథకం వేశారు. మరోవైపు మోడీ ఉన్మాదపూరితమైన ఉపన్యాసాలు ఇవ్వడంతో, దేశభక్తి పేరుతో కొన్ని ఉగ్రమూకలు, ఇతర రాష్ట్రాలలో వ్యాపారాలు

చేసుకుంటున్న కశ్మీరీలమీద, చదువుతున్న యువత మీద దాడులు చేశారు. నిత్యం బెదిరిస్తూ, భయానక వాతావరణంలో ఉంచారు. ఇటువంటివి 40 సంఘటనల వరకు జరిగాయి. మేఘాలయ గవర్నర్ తథాగతరాయ్, బెంగాల్ బి.జె.పి అధ్యక్షుడు కశ్మీర్ ప్రజల మీద దాడులు చేయమని బహిరంగ ప్రకటనలు యిచ్చారు. ఇదే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం హిందూత్వ టెంపోను మరింత పెంచడం కోసం ఉద్యమ నాయకులపై ఫాసిస్టు చర్యలు చేపట్టింది. హుర్రియత్ నాయకులను గృహ నిర్బంధంలో ఉంచడం, వారికి, వారి బంధువులకు విదేశాల నుండి డబ్బులు అందుతున్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంస్థల ద్వారా దాడులు చేయించడం, వారి బ్యాంకు ఖాతాలను స్థంభింపజేయడం, కొంత మందికి ఇస్తున్న పోలీసు రక్షణను రద్దు చేయడం, వీరందరూ ఉగ్రవాదులని ప్రచారం చేయడం, ఇండియాలో ఉంటూ పాకిస్తాన్‌కు మద్దతుదారులుగా ఉంటున్నారని ప్రచారం చేయడం... వగైరా పద్ధతులలో మోడీ ప్రభుత్వం పోరాటకారులపై ఫాసిస్టు దాడిని తీవ్రతరం చేసింది. వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీ, మోహన్ భాగవత్, రాంమాధవ్, రాజనాథ్‌సింగ్ మొదలగువారు కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని ఎన్నికలకు ముందు ప్రచారం చేయడం మొదలు పెట్టారు. కశ్మీర్ ఉద్యమం పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదమని పెద్ద ఎత్తున దుష్ప్రచారం మొదలు పెట్టారు. కశ్మీర్ ఉద్యమానికి మద్దతు ఇచ్చే వారిని దేశ ద్రోహులని ముద్ర వేస్తున్నారు.

70 సంవత్సరాలుగా కశ్మీర్ రాజ్యహింసతో నెత్తురోడుతోంది. మంచుపొగల మధ్య మౌనసౌందర్యాన్ని ప్రదర్శిస్తున్నది. కశ్మీర్ ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో ప్రజాస్వామికంగా ఆలోచించే వారికి అర్థం అవుతుంది. తమ అస్థిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం, స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం క్రూరమైన దమనకాండను తట్టుకొని నిలబడ్డది. అంతేకాదు 1980ల చివరలో ప్రారంభమైన సాయుధ ప్రతిఘటన అలలు అలలుగా సమరశీలతను మరింత పెంచుకుంటూ పురోగమిస్తున్నది.

కశ్మీర్ సమస్య జాతుల స్వయం నిర్ణయాధికార సమస్య. ఈశాన్య జాతులు, కశ్మీర్ జాతి తమను తాము ఎన్నడూ దేశంలో భాగంగా భావించలేదు. ఈశాన్య జాతులు కూడా తమ అస్థిత్వం, సంస్కృతిని రక్షించుకునేందుకు బ్రిటిషు సామ్రాజ్యవాదంతో పోరాడారు. ఆ పోరాటాన్ని నేడు భారత పాలక వర్గాలకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్నారు. నేడున్న భారతదేశం జాతుల బందీఖానాగా ఉన్నది. మన దేశంలో దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి సామ్రాజ్యవాదులకు విశాలమైన మార్కెట్, విశాల ప్రాంతంలో వనరుల మీద అధికారం కావాలి. విశాల ప్రాంతంలో వనరులనూ, సంపదనూ, శ్రమశక్తిని దోచుకునేందుకు వీలుగా జాతి సమైక్యత, సమగ్రత నినాదాల ద్వారా మధ్య తరగతిని మభ్యపెట్టి, శ్రామికవర్గాన్నీ, ఎదిరించిన జాతులను క్రూర నిర్బంధ కాండతో అణచివేస్తారు. వాస్తవానికి భారత జాతి, భాతరమాత, భారతీయ సంస్కృతి అనేవి ఉనికిలో లేవు. ఒకే భాష, భూ భాగం, ఆర్థిక జీవితం, సంస్కృతి కలిగినదే జాతి. దేశంలో వివిధ భాషలు, సంస్కృతులు కలిగిన విభిన్న జాతులున్నాయి. కానీ భారత జాతి మాత్రం లేదు. ఇక్కడ భారతజాతి అనగా దళారీ నిరంకుశ బూర్జువా వర్గం. మోడీ లాంటి ఫాసిస్టులు కేవలం 4 గంటలు మాత్రమే నిద్రపోయి, మిగిలిన సమయమంతా తమ యజమానుల కోసం కుక్క కంటె ఎక్కువ విశ్వాసంతో పని చేస్తున్నారు. జాతుల విలీనం అనేది ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వం మీద ఆధారపడి ఉంటుంది. అది దోపిడీ లేని, ప్రజాస్వామిక పద్ధతిలో ఉంటుంది.

నేడు కొనసాగుతున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలో భారతదేశ పాలకవర్గాలు జాతులను బంధించి అణచివేసి, దోచుకుంటున్నారు. పీడిత జాతులు, పీడిత వర్గాలు ఏకమై సాయుధ పోరాటం ద్వారానే ఈ వ్యవస్థను ధ్వంసం చేయాలి. మరొక తేలిక మార్గం లేదు. జాతులకు విడిపోయే హక్కుతో సహా, స్వయం నిర్ణయాధికారంతో కూడిన జాతుల ఫెడరేషన్‌ను ఏర్పర్చుకోవాలి.

దేశంలోని దేశభక్తులు, విప్లవ శక్తులు, పీడిత శక్తులు, పురోగామి శక్తులు, ప్రజాస్వామిక శక్తులు అందరూ ఆలోచించి కశ్మీర్ సమస్యను సరిగ్గా అర్థం చేసుకోవాలి. అక్కడ కొనసాగుతున్న క్రూరమైన రాజ్యహింసను ఖండించాలి. కశ్మీర్ ప్రజలకు సంపూర్ణ మద్దతును ఇవ్వాలి.

**ముగింపు :–** ఈ వ్యాసం ప్రారంభించే నాటికి దేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అప్పటి పరిణామాలను అంచనా కడుతూ, మోడీ నేతృత్వంలోని బి.జె.పి, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనందున, జరగనున్న ఎన్నికలలో విజయం సాధించేందుకు, కశ్మీర్ సమస్యను దేశ భద్రత సమస్యగా మలిచి ప్రజలను పక్కదారి పట్టిస్తుందని పైన చెప్పాము. ఈ అంచనాకు అనుగుణంగానే, కాషాయమూకలు వేసుకున్న పథకం ప్రకారమే కశ్మీర్ సమస్యను దేశభద్రత సమస్యతో ముడిపెట్టి పాకిస్థాన్ వ్యతిరేక, ముస్లీం వ్యతిరేక హిందూ ఛావనిజాన్ని దేశభక్తి పేరుతో ప్రజలకు రంగరించిపోసి, ప్రజలలో గణనీయమైన సంఖ్యకు దేశభక్తి మైకం కమ్మేలా చేసి, 17వ లోక్‌సభ ఎన్నికలలో విజయాన్ని సాధించారు. మోడీ తిరిగి ప్రధాని కావడంతో పాటు, దేశంలో ఫాసిజం బుసలుకొట్టబోతున్నది. ప్రధానంగా కశ్మీర్ ప్రజల స్వయంప్రతిపత్తికి హామిగా ఉన్న ఆర్టికల్స్ 370, 35(ఎ)లతో పాటు, వారి మొత్తం ప్రజాస్వామిక ఆకాంక్షలు ప్రమాదంలో పడబోతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో దేశంలో సామ్రాజ్యవాదానికి ఊడిగం చేస్తూ, సమస్త శ్రామిక ప్రజలకు బద్ధవిరోధిగా తయారైన బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా, దృక్పథాలలో కొద్దిపాటి తేడాలున్నవారు సైతం ఐక్యమై, తెగింపుతో, సమరశీలంగా పోరాడటం ఒక్కటే కశ్మీర్ సమస్యకు గానీ, భారతదేశంలో పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు గాని సరైన పరిష్కారం.

# బూటకపు పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించండి! నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడంలో భాగంగా విప్లవ ప్రజా కమిటీలను నిర్మించండి!!

*(మార్చి 2019)*

***ప్రియమైన ప్రజలారా!***

త్వరలోనే 17వ లోకసభ (పార్లమెంటరీ) ఎన్నికలతోపాటు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలలో శాసనసభ (అసెంబ్లీ) ఎన్నికలు జరగబోతున్నాయి. పాలకవర్గాలు మరోసారి ఈ ఎన్నికల ద్వారా కార్మికవర్గాన్నీ, ఇతర శ్రామిక ప్రజానీకాన్ని దగా చేసి, దోపిడీ పీడనలు కొనసాగించేందుకు పథకాలు రూపొందిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే దోపిడీ పాలకవర్గాలు అశేష పీడిత ప్రజానీకాన్ని మోసగించడానికి పార్లమెంటరీ ఎన్నికలను ఒక ప్రతీఘాతుక ఎత్తుగడగా ఉపయోగించుకుంటున్నాయి.

ముందుగా మనం భారతదేశంలోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్వభావాన్ని తెలుసుకోవాలి. మన దేశంలోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం యూరప్ దేశాల తరహాలో ఏర్పడినది కాదు. యూరప్‌లో ఫ్యూడలిజాన్ని ధ్వంసం చేస్తూ, బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు విజయవంతమైన క్రమంలోనే పెట్టుబడిదారీ వ్యవస్థలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఏర్పడినాయి. కానీ అక్కడి పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా అభివృద్ధి చెందిన తర్వాత, ఆయా పెట్టుబడిదారీ దేశాలలోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని ప్రగతిశీల అంశాలు పూర్తిగా ధ్వంసమై సారంలో అవి పెట్టుబడిదారీ వర్గాల నియంతృత్వాలుగా మారాయి. ఈ చారిత్రక నేపథ్యం నుండి చూసినప్పుడు మన దేశంలో ఇప్పటికీ ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కాలేదు. కానీ విచిత్రంగా బ్రిటిషు వలసవాదం భారతదేశంలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవమేది జరగకుండానే ఇక్కడి అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అంటుగట్టింది. వాస్తవంగా అది సామ్రాజ్యవాదులకూ, భారతదేశ బడా భూస్వాములకూ, దళారీ పెట్టుబడిదారులకు మధ్య జరిగిన పరమ విద్రోహకర రాజీకి పుట్టిన బిడ్డ. ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దేశ, విదేశీ అభివృద్ధి నిరోధకులు మన ప్రజలపై కొనసాగిస్తున్న అత్యంత దారుణమమైన దోపిడీ, అణచివేతను కప్పిపుచ్చడానికి తెరలాగా ఉపయోగపడేది మాత్రమే. ఈ తెరను, ఈ ముసుగును చించివేసి, కార్మికవర్గం ముందు, ఇతర శ్రామిక జనావళి ముందు మన పార్లమెంటరీ బండారాన్నీ, నిజస్వభావాన్ని – సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా బూర్జువా, బడా భూస్వామ్యవర్గాల నియంతృత్వానికి ఒక సాధనంగా ఉండటమనే దాని స్వభావాన్ని –బహిర్గతపర్చాలి.

దేశానికి స్వతంత్ర్యం వచ్చిందని చెప్పి 72 సంవత్సరాలు కావస్తున్నది. ఈ కాలంలో లోకసభకు 16 విడతలు ఎన్నికలు జరగడంతో పాటు, ఆయా రాష్ట్రాలకు చెందిన శాసనసభలకూ, స్థానిక వ్యవస్థలకు అనేక పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ద్వారా అధికారంలోకి పాలకవర్గ ముఠాలు మారుతూ వచ్చాయే కానీ, ప్రజలకు దేశ రాజకీయ అధికారంలో ఏ మాత్రం భాగస్వామ్యం దక్కలేదు. పర్యావసానంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలు కాపాడేదిగా, వారికి సేవ చేసేదిగా మాత్రమే నిరూపించబడింది. ఈ 72 సంవత్సరాల కాలంలో, ముఖ్యంగా 1990ల తర్వాత దేశంలో ధనికులు మరింత ధనికులుగా మారితే, పేదలు మరింత దారిద్ర్యంలోకి నెట్టబడ్డారు. మరింత నిర్ధిష్టంగా చెప్పుకోవాలంటే ఈ పార్లమెంటరీ ఎన్నికలు దేశంలో సామ్రాజ్యవాదుల పరోక్ష పాలనకూ, దోపిడీకి దోహద పడడంతోపాటు, బడా భూస్వాముల, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల అధికారాన్ని నిలబెట్టి, వారి సంపదను ఇబ్బడి మొబ్బడిగా పెంచేందుకు ఒక సాధనంలా మాత్రమే తోడ్పడ్డాయి. మరో కోణంలో చెప్పుకోవాలంటే భారత పాలకవర్గాలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అప్పుడప్పుడు ప్రజలతో ఓట్లు వేయించుకొనే, మళ్ళీ ఎన్నికలు వచ్చేంతవరకు వారిని నిష్క్రియా ప్రేక్షకులుగా పరిమితం చేసే తంతుగా మార్చాయి. అంతేకాక అవి మళ్ళీ కొన్ని సంవత్సరాలకు, ఎన్నికలు వచ్చేంతవరకు ప్రజలను దోచుకునేందుకు లైసెన్స్ ఇవ్వడం కోసం ఏ రకం దోపిడీ దారులనూ, రక్తపిపాసులనూ, గొంతులు కోసేవారిని ఎన్నుకుంటారనే దానికి ఆ ప్రజల పాత్రను పరిమితం చేశాయి.

పై నిర్ధారణల వాస్తవికతను గత 5 సంవత్సరాల కాలంలో కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాలు అనుసరించిన సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ, భూస్వామ్య వర్గాల అనుకూల, ప్రజావ్యతిరేక, దేశ ద్రోహ విధానాల ద్వారా మరింత లోతుగా, నిర్ధిష్టంగా అవగతం చేసుకోవచ్చు.

2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో పూర్తి మెజారిటీతో గెలిచిన బి.జె.పి నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామిక కూటమి (ఎన్.డి.ఎ) ప్రభుత్వం, గత కాంగ్రెస్ నేతృత్వంలోని సమైఖ్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఎ) ప్రభుత్వం అనుసరించిన ఎల్.పి.జి విధానాలనే మరింత విద్రోహ పూరితంగా, దూకుడుగా అమలు పరిచింది. కాకుంటే దేశభక్తి ముసుగులో హిందూమతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, ప్రజలను చీలదీసి, తన మోసపూరిత దోపిడీ విధానాలకు మద్దతు పొందేందుకు ప్రయత్నించింది. ముఖ్యంగా ప్రధానమంత్రిగా వున్న మోడీ వాక్చాతుర్యంతో, వాగాడంబరంతో పచ్చి అబ్బద్ధాలను ప్రచారం చేస్తూ, ప్రజలను పక్కదారి పట్టించేందుకు, మోసం చేసేందుకు చేసిన ప్రసంగాల బూటకత్వం క్రమంగా వాస్తవాల వెలుగులో బహిర్గతమవుతూ వచ్చింది. ముఖ్యంగా ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలు అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలను వాగ్దానం చేసిన మోడీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని

ఊదరగొట్టినా, విదేశీ పెట్టుబడులను లక్ష్యానికనుగుణంగా రాబట్టలేకపోయింది. ఇందుకు గ్లోబల్ సామ్రాజ్యవాద వ్యవస్థ ఎదుర్కొంటున్న ద్రవ్య, ఆర్థిక సంక్షోభమే కారణం. అమెరికా వంటి పెద్ద సామ్రాజ్యవాద దేశం సైతం ఇతర దేశాలకు పెట్టుబడుల ఎగుమతులను కొంత తగ్గించుకొని క్రమంగా ప్రొటెక్షనిజం, హోంమార్కెట్ (దేశీయ మార్కెట్) దిశగా అడుగులు వేస్తున్నది. ఈ 5 సంవత్సరాల కాలంలో కొన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ) దేశంలోకి వచ్చినా, అవి పెట్టుబడి సాంద్రత కలిగినవి కావడం వలన అంటే అత్యంత ఆధునిక టెక్నాలజీపై ఆధారపడిన పరిశ్రమలు కావడం వలన ఉపాధిని కలిగించలేకపోయాయి. ఒక్కమాటలో చెప్పాలంటే 'మేక్ ఇన్ ఇండియా' పూర్తిగా వైఫల్యం చెందింది. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, స్కిల్ ఇండియా, ముద్రా పథకాల వలన ఆచరణలో దొరికిన అదనపు ఉపాధి ఏది లేదు.

మరో ఎన్నికల వాగ్దానంగా, మోడీ విదేశీ అక్రమ నిల్వలను దేశానికి రప్పించి, ప్రతి పౌరుడి ఖాతాలో 15 లక్షల రూపాయలు జమ చేస్తానన్నాడు. అవినీతిని అంతం చేస్తానన్నాడు. వాస్తవంగా ఈ వాగ్దానాలేవి ఒక్కశాతం కూడా అమలు కాలేదు. పైగా పెద్ద నోట్ల రద్దు ప్రకటిత లక్ష్యమైన అవినీతి సొమ్మును వెనక్కి రప్పించలేదు సరికదా సామాన్య ప్రజా జీవనం నడ్డి విరిచింది. మరోవైపు బి.జె.పి నేతలు ప్రజల సొమ్మును కాజేసి, అవినీతి కుంబకోణాలలో ఇరుక్కున్నారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వమే అనీల్అంబానీకి అనుకూలంగా వ్యవహరించి, రఫేల్ యుద్ధ విమానాల కుంబకోణంలో ఇరుకున్నది. ఇక మోడీ ప్రభుత్వం ప్రజలపై వేసిన మరో దెబ్బ వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి). ఈ దెబ్బను ప్రజలు కాచుకోవలసి వచ్చింది. ఈ దెబ్బ సామాన్య ప్రజానీకంపై ధరల పెరుగుదల రూపంలో పడగా, చిన్న వ్యాపారులను కుదేలు చేసింది. మోడీ రైతుల విషయంలో ఎంతో ప్రేమను వలకబోసినప్పటికీ చేసింది శూన్యం. అప్పుల సుడిగుండంలో మునిగిపోయిన రైతుల ఆత్మహత్యలు ఏ మాత్రం ఆగలేదు. కానీ దేశీయ కార్పొరేట్ సంస్థలు జాతీయ బ్యాంకులకు ఎగ్గొట్టిన లక్షలాది కోట్ల రూపాయల మెండి బకాయిలను మాత్రం మోడీ ప్రభుత్వం రద్దు చేసింది. మరోవైపు విజయ్మాల్య, నీరవ్మోడీ, లలిత్మోడీ వంటి దళారీ ద్రోహులు వేలాది కోట్ల రూపాయల ప్రజల ధనాన్ని దోచుకొని దొడ్డిదారిన దేశం విడిచి పారిపోయేందుకు ఈ ప్రభుత్వం సహకరించింది. మోడీ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వరంగ పరిశ్రమలనుండి పెట్టుబడులను ఉపసంహరించి (డిస్ ఇన్వెస్ట్మెంట్) విదేశీ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు వాటిని చౌకగా అమ్మివేస్తున్నది. సంక్షేమ పథకాల పేరుతో అమలు జరుపుతున్న జన్ధన్, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు ప్రజలకు చేసే మేలు కంటే, కార్పొరేట్ సంస్థలకు చేసే మేలే ఎక్కువ.

మోడీ హయంలో పార్లమెంటు మరింత బాతాఖానీ క్లబ్బుగా మారింది. పార్లమెంట్లో చర్చలు జరిగినట్లు, చట్టాలు రూపొందించినట్లు కనబడినా, వాటి అసలు తయారీ దోపిడీ వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా సంఘపరివార్ స్థావరంలోనే జరుగుతున్నాయి. వాళ్ళనుకున్న నిర్ణయాలు పార్లమెంటులో చట్టంగా రూపొందలేకపోతే వాటిని ఆర్డినెన్స్ రూపంలో అమలు చేశారు. మోడీ తన ప్రభుత్వ హయంలో చేసిన పని ఇదే. నేడు మోడీ, అమిత్షా, మోహన్భాగవత్ త్రయం నేతృత్వంలోనే బ్రాహ్మణవాద హిందూ ఫ్యూడలిజం పునాదులను బలోపేతం చేస్తూ, ఆ పునాదులపై సామ్రాజ్యవాద నయావలస దోపిడీని తీవ్రతరం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాలలో భాగంగానే విద్యను కాషాయీకరించడంతో పాటు, ప్రవేటీకరణకూ, కేంద్రీకరణకు గురి చేస్తున్నారు. న్యాయ వ్యవస్థ, సి.బి.ఐ, రిజర్వుబ్యాంకు వంటి 'రాజ్యాంగబద్ధ స్వతంత్ర్య వ్యవస్థ'లలో జోక్యం చేసుకుంటూ వాటి నిర్ణయాధికారాన్ని గుంజుకుంటున్నారు. అన్ని వ్యవస్థలలో సంఘ్ పరివార్ శక్తులను చొప్పిస్తున్నారు. బ్రాహ్మణవాద హిందూ ఫ్యూడల్ సంస్కృతితో సామ్రాజ్యవాద సంస్కృతిని జోడించి ప్రజలపై రుద్దుతున్నారు. ఈ సాంస్కృతిక దాడిలో భాగంగా ప్రజలు ఏం తినాలి, ఏం కట్టుకోవాలి, ఏం మాట్లాడాలి, ఏం రాయాలి, ఏం ఆలోచించాలి అనేవి ఆదేశిస్తున్నారు. వారి ఆదేశాలకు వ్యతిరేకంగా వున్నవారిని దేశద్రోహులు, జాతి ద్రోహులు అనే ముద్రలు వేస్తున్నారు. ముఖ్యంగా గో రక్షకుల పేరుతో ఈ హిందూ ఫాసిస్టు మూకలు దళితులపైన, ముస్లింలపైన, ఆదివాసీలపైన దాడులు చేస్తున్నారు.

ఈ హిందూ ఫాసిస్టు ముఠా సామ్రాజ్యవాదుల ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలు నెరవేర్చేందుకు సమాజాన్ని మత ప్రాతిపదికన ధృవీకరిస్తూ, దేశంలో హిందువులు మాత్రమే ఉండాలంటూ హూంకరిస్తూ, దేశాన్ని హిందూ దేశంగా మారుస్తామని ప్రతిజ్ఞలు చేస్తున్నారు. వీరి ప్రయత్నాలను అడ్డుకునే ప్రజాస్వామిక వాదులనూ, మేధావులను హత్య చేస్తున్నారు. ముఖ్యంగా దేశంలో పురోగమిస్తున్న విప్లవోద్యమాన్నీ, ప్రజాపోరాటాలను అణచివేసేందుకు అత్యంత ఫాసిస్టు ప్రతీఘాతుక సమాధాన్ దాడిని ఎక్కుపెట్టారు. ఈ దాడి కేవలం విప్లవోద్యమంపైనే కాక మొత్తం ప్రజలపై యుద్ధంగా కొనసాగుతున్నది. ఈ దాడిలో భాగంగా ఈ మధ్య కాలంలో అర్బన్ మావోయిస్టుల పేరుతో అనేక మంది ప్రజాస్వామిక వాదులపైన, ప్రజాసంఘాల కార్యకర్తలపైన అక్రమ కేసులు బనాయించి, జైళ్ళపాలు చేస్తున్నారు. దేశాన్ని ఒక కాన్సన్‌ట్రేషన్ క్యాంపుగా మారుస్తున్నారు.

ఈ ముఠా ఒకవైపునా దేశంలో ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ, మరోవైపు కాశ్మీర్ జాతివిముక్తి పోరాటానికి పాకిస్తాన్ మద్దతు తెలుపుతున్నదనే సాకుతో యుద్ధానికి ఉవ్విళ్ళూరుతున్నది. ఈ యుద్ధం ప్రాతిపదికపై పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా కుహనా దేశభక్తినీ, జాతీయతను రెచ్చగొడుతూ, ప్రజల సమస్యల నుండి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కి, ప్రపంచబ్యాంకు ఆదేశిత విధానాల అమలును ప్రారంభించింది. ఈ విధానాలకు ప్రధాన ఆటంకం మావోయిస్టులుగా భావించిన చంద్రబాబు, ముఖ్యమంత్రిగా తన ప్రమాణస్వీకారం రోజునే నల్లమలలో కోవర్టు కుట్ర జరిపి ముగ్గురు కామ్రేడ్స్‌ను పోలీసులతో హత్య గావించాడు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినది మొదలు విదేశీ బహుళజాతి సంస్థలకూ, దేశీయ కార్పొరేట్ సంస్థలకూ, తన ఆశ్రితులకు రాష్ట్రాన్ని దోచిపెట్టడంలో తలమునకలైపోయాడు. ఇలా

దోచిపెట్టడానికి గత యు.పి.ఎ ప్రభుత్వ హయంలో తయారైన 2013 భూసేకరణ చట్టం అడ్డంకిగా వుందని భావించిన చంద్రబాబు, అందులోని ముఖ్యమైన అంశాలను తొలగించి ఎ.పి భూసేకరణ (సవరణ) చట్టాన్ని తయారు చేసి, దానిని అసెంబ్లీలో ఆమోదింపజేశాడు. ఈ చట్టంలో 'సామాజిక ప్రభావ మదింపు అంచన' వంటి కీలకమైన అంశాలను లేకుండా చేసి, ప్రజల భూములను గుంజుకునే అధికారాన్ని దోపిడీ వర్గాలకు కట్టబెట్టాడు. దీంతో రాజధాని అమరావతి మొదలు పోలవరం ప్రాజెక్టు, కోస్టల్ కారిడార్, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం, భావనపాడు పోర్ట్ ఇంకా అనేక థర్మల్, అణువిద్యుత్ ప్రాజెక్టులు, బాక్సైట్ తవ్వకాలు, చమురు సీమ, కోస్తా తోరణం ఇలా అనేక పేర్లతో విధ్వంసకర అభివృద్ధిని కొనసాగిస్తూ, లక్షలాది ఎకరాల ప్రజల భూములను కారుచౌకగా, బలవంతంగా దోపిడీ వర్గాలకు కట్టబెట్టే పని ప్రారంభమైంది. ఇప్పటికే చంద్రబాబు ప్రభుత్వం రాజధాని అమరావతిని సింగపూర్ చేస్తాననే పేరుతో రెండు పంటలు పండే 35 వేల ఎకరాల భూములను 'భూ సమీకరణ' పేరుతో కబ్జా చేసి, విదేశీ, దేశీయ రియలెస్టేట్ వ్యాపారులకు అప్పచెబుతున్నాడు. ఈ సందర్భంగా రాజధానిని ప్రభుత్వ భూములలో నిర్మించాలనీ, ప్రభుత్వ అధికార వ్యవస్థలను వికేంద్రీకరించాలని సూచనలు చేసిన శ్రీకృష్ణ కమీషన్ నివేదికను చంద్రబాబు బుట్టదాఖలు చేసి, కోస్తా దోపిడీ పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూలంగా రాజధానిని అమరావతిలో నిర్మించడంతో పాటు, ప్రభుత్వ అధికార వ్యవస్థలను కేంద్రీకరించి అక్కడే నిర్మిస్తున్నాడు. రాష్ట్రంలో 15 లక్షల ఎకరాలతో భూబ్యాంక్ ఏర్పాటు చేసి, బహుళజాతి సంస్థలకు దేశీయ కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు మరో పథకాన్ని కూడా రూపొందించాడు.

విదేశీ పెట్టుబడులతోనే అభివృద్ధి సర్వం జరుగుతుందని భావించే చంద్రబాబు స్విట్జర్లాండ్‌లో దావోస్ నగరంలో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూ.ఇ.ఫ్) సదస్సుకు హాజరై, వాల్మర్ట్, పెప్సీ, మైక్రోసాఫ్ట్ వంటి విదేశీ బహుళజాతి సంస్థలు, విప్రో, భారత్ ఫోర్జ్ వంటి దేశీయ కార్పొరేట్ సంస్థల సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ఒక కన్య (వర్జిన్) మీ కోసం ఎదురుచూస్తున్నదని సిగ్గులేకుండా మాట్లాడాడు. అంతేకాకుండా వాణిజ్య సులభతరం పేరుతో 21 రోజుల్లోనే సింగిల్ డెస్క్ విధానం ద్వారా అన్ని అనుమతులు, రాయితీలు ఇవ్వడం ద్వారా బహుళజాతి కంపెనీలకు రాష్ట్రాన్ని అడ్డాగానూ, ప్రజలను అడ్డకులీలుగాను మారుస్తున్నాడు.

ఇన్ని రాయితీలిచ్చినా, పెట్టుబడులు సాధించడంలో చంద్రబాబు ప్రయత్నాలు అనుకున్నంతగా సఫలీకృతం కాలేదు. ప్రపంచ ఆర్థికసంక్షోభం రీత్యా, చంద్రబాబు అనుకున్నట్లుగా రాష్ట్రంలోకి విదేశీ పెట్టుబడుల వెల్లువ ఏర్పడలేదు. అయితే బహుళజాతి సంస్థలు మరింత రక్షణతో కూడిన లాభాలు అందుకునేందుకు గుంటకాడి నక్కలా కాచుక్కుర్చున్నాయి.

చంద్రబాబు తాను అనుసరిస్తున్న ఈ దళారీ, దోపిడీ, అవినీతి విధానాలకు కేంద్రం నుండి పూర్తి సహకారం వుంటుందని భావించి కేంద్రంలోని మోడీ ప్రభుత్వంతో అంటకాగాడు. జాతీయ ప్రజాస్వామిక కూటమిలో భాగస్వామి అయ్యాడు. ఈ అవకాశవాద భాగాస్వామ్యం చంద్రబాబునాయుడు, వెంకయ్యనాయుడుల అపవిత్ర కలయికగా కొంతకాలం తెరపైన కనిపించింది. ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా పార్లమెంటులో ప్రధాని ఇచ్చిన 'ప్రత్యేకహోదా' హామిని కేంద్రం ప్రత్యేక ప్యాకేజ్‌గా మార్చినప్పటికీ, చంద్రబాబు దానికి వంత పాడాడు. చివరికి 2018 కేంద్ర బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రిక్తహస్తం చూపి, ప్రత్యేక ప్యాకేజీకి కూడా నిధులు ఇవ్వకపోవడంతో, రాష్ట్ర ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తికి గాబరా పడిన చంద్రబాబు, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యూటర్న్ తీసుకున్నాడు. చంద్రబాబు ఆడుతున్న ఈ రాజకీయ అవకాశవాద నాటకాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

గడిచిన ఈ 5 సంవత్సరాల కాలంలో, చంద్రబాబు గత ఎన్నికల సందర్భగా చేసిన వాగ్దానాలేటిని అమలు చేయలేదు. 87,612 కోట్ల రూపాయల రైతుల ఋణాలను రద్దు చేస్తానని చెప్పి, కేవలం 24 వేల కోట్ల రూపాయల ఋణాలను విడతల వారిగా మత్రమే రద్దు చేశాడు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న హామి ఉత్త హుళక్కిగా మారింది. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయింది. చివరికి చేనేత, డ్వాక్రా మహిళల ఋణమాఫీకి కూడా ఎగనామం పెట్టాడు. 'జాబు రావాలంటే బాబు రావాలని' ఊదరగొట్టిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి సమస్యను ఏ మాత్రం పరిష్కరించలేకపోయింది. నిరుద్యోగ భృతి కంటి తుడుపుగా మారింది. బెల్ట్‌షాపుల మూసివేత హామి తిరిగి ప్రజల ఆందోళనతోనే నామమాత్రంగా అమలు జరిగింది. ఇప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగానే కొనసాగిస్తున్నది. విద్య వ్యాపారీకరణగా మారింది. సంక్షేమ హాస్టళ్ళల్లో దళిత, వెనకబడిన మైనర్ బాలికలపై అత్యాచారాలు పెరిగాయి. మహిళలపై ముఖ్యంగా మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలలో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానంలో ఉంది. అవినీతి ఆకాశపుటంచులను తాకుతున్నది. తెలంగాణాలో ఎమ్.ఎల్.సి ఎన్నికల సందర్భంగా, ఒక ఎమ్.ఎల్.సిని తమ వైపుకు తిప్పుకునేందుకు చంద్రబాబు 'ఓటుకు నోటు' ఆశ చూపాడు. ఇక చంద్రబాబు ఆశ్రితులుగా వున్న ఇసుక మాఫియా, మద్యం మాఫియా, కల్తీనెయ్యి, కాల్‌మనీ వ్యాపారులు, రియల్‌ఎస్టేట్ మాఫియా ఇలా పరాన్నభుక్కు ముఠాలన్నీ రాష్ట్రంపై పందికొక్కుల్లా పడి ప్రజల సొమ్మును దోచుకుతిన్నారు. 'చెట్టు-నీరు' పథకం పేరుతో అనేక చోట్ల దళితుల భూములను దౌర్జన్యంగా గుంజుకున్నారు. ఈ పనులన్నింటినీ తన అనుయాయులతో నిండిన జన్మభూమి కమిటీల ద్వారా నిర్వహిస్తూ, వాటిని పరిపాలనా రంగంలో సమాంతర అధికార నిర్మాణాలుగా మార్చాడు.

చంద్రబాబు ప్రభుత్వం ఒకవైపున ప్రజలను అనేక ఇక్కట్లకు గురి చేస్తూ, మరోవైపు బూజు పట్టిన బ్రాహ్మణవాద హిందూ సంస్కృతి, సాంప్రదాయాలతో ప్రజలను ముంచెత్తేందుకు కృష్ణా పుష్కరాలను ఆర్భాటంగా నిర్వహించాడు. ఈ సందర్భంగా చంద్రబాబు పర్యటనవల్ల జరిగిన తొక్కిసలాటలో 29 మంది ప్రజలు మరణించారు. ఇవన్నీ చాలవన్నట్లు ఆంధ్రప్రదేశ్‌ను 2029 కల్లా దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా, 2050 సంవత్సరానికంతా ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రమాణాలు గల రాష్ట్రంగా చేస్తానని బీరాలు పలకటమే కాకుండా, అవినీతి రహిత, మలేరియా రహిత, ఇలా రకరకాల రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తానని మతిభ్రమించిన పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నాడు.

పైన చెప్పినట్లుగా ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో దోపిడీ వర్గాల ప్రయోజనాలను ఈడేర్చే పాలన ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు ఆ పాలనను వ్యతిరేకించే శక్తులన్నింటిపై చంద్రబాబు ప్రభుత్వం ఫాసిస్టు ఉక్కుపాదం మోపుతున్నది. ప్రధానంగా పీడిత ప్రజల పక్షాన నిలబడి వారి ప్రయోజనాల కోసం పోరాడుతున్న మావోయిస్టు పార్టీపైన, పి.ఎల్.జి.ఎపైన, ప్రజా నిర్మాణాలపైన తీవ్రమైన నిర్బంధం అమలు జరుగుతున్నది. బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాఉద్యమాన్ని అణచివేసేందుకు మన్యంలో ప్రభుత్వ సాయుధ బలగాల దాడి తీవ్రతరమైంది. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ 24, 2016లో ఎ.పి. గ్రేహౌండ్స్ పోలీసులు రాంగూడ ప్రాంతంపై దాడి చేసి, 31 మంది పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా నిర్మాణాల సభ్యులను హత్య చేశారు. ఇంతటి నిర్బంధంలో సైతం బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా చెలరేగిన ప్రజా ఉద్యమం ముందు చంద్రబాబు తోక ముడవక తప్పలేదు. బాక్సైట్ తవ్వకాలను తాత్కాలికంగా ఆపుకున్నాడు. అయితే జి.ఒ. నెంబర్ 97ను పూర్తిగా ఉపసంహరించలేదు. అవకాశం వస్తే మళ్ళా బాక్సైట్ తవ్వకాలను కొనసాగించే కుట్ర కొనసాగుతున్నది. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వం చట్టబద్ధ, బహిరంగ సంస్థలపైన, కార్యకలాపాలపైన దాడిని తీవ్రతరం చేస్తున్నది. సభలకు అనుమతులివ్వకపోవడం, పత్రికా సమావేశాలను అడ్డుకోవడం, ప్రశ్నించే గళాలపై నిఘాను పెట్టడం, ప్రజాసంఘాల కార్యకర్తలపై వేధింపులకు పాల్పడటం, అక్రమ కేసులు బనాయించి జైళ్ళపాలు చేయడం వగైరా రూపాలలో ఫాసిస్టు పాలన కొనసాగుతున్నది.

మొత్తంగా ఈ 5 సంవత్సరాల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాదుల, దేశీయ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు నెరవేరుస్తూ, ప్రజల ప్రయోజనాలను దెబ్బ తీస్తూ తమ పాలనను కొనసాగించాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్నీ, ప్రత్యేక హోదా హామిని అమలు చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు తీవ్రమైన ద్రోహాన్ని తలపెట్టాయి.

ఒడిశాలో నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం 'అతనికి మించినవాడు ఆచంటమల్లన్న' అన్న చందంగా సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాలకు సేవ చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మించిపోయింది. నియమగిరి మొదలు మాలి, దేవమాలి పర్వతాల వరకు రాష్ట్రంలోని అనేక పర్వతశ్రేణులనూ, ప్రకృతి సంపదను ఖనిజ తవ్వకాలకై బహుళజాతి సంస్థలకు అప్పనంగా అప్పచెపుతున్నది. మరోవైపు స్కూల్ టీచర్ల నుండి, అంగన్‌వాడీ టీచర్ల వరకు చిరు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా వారి ఉసురు తీస్తున్నది. ఈ దుష్ట పాలనను వ్యతిరేకిస్తూ, ఉద్యమిస్తున్న ప్రజలపై తన కిరాయి సాయుధ బలగాలను ఉసిగొల్పి దాడులు చేయిస్తున్నది. కొరాపుట్ జిల్లాకు చెందిన కుందిలి గ్రామంలో బి.ఎస్.ఎఫ్ పోలీసులు ఒక పాఠశాలకు చెందిన మైనర్ బాలికను అత్యాచారం చేస్తే, నవీన్ ప్రభుత్వం తన మౌన అంగీకారాన్ని తెలిపింది. ఈ సంఘటనను నిరసిస్తూ వెల్లువెత్తిన ప్రజా ఆందోళనపై మాత్రం తీవ్రమైన నిర్బంధాన్ని అమలు జరిపింది. ఇలా అనేక విషయాలలో నవీన్ ప్రభుత్వం దోపిడీ పాలకవర్గాలకు అనుకూలంగానూ, ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ వచ్చింది. ముఖ్యంగా మావోయిస్టు పార్టీ నేతృత్వంలో పీడిత ఆదివాసీ రైతాంగం నిర్వహిస్తున్న విప్లవ పోరాటాన్ని దెబ్బ తీసేందుకు ఉద్యమ ప్రాంతమంతటా పోలీసు క్యాంపులను ఏర్పాటు చేస్తున్నది. ఈ బూటకపు పార్లమెంటరీ రాజకీయాలను ధిక్కరిస్తూ, నిజమైన ప్రజాస్వామిక పునాదులపై ప్రజారాజ్యాధికారాన్ని నిర్మించుకొనేందుకు వ్యవసాయక విప్లవ పోరాటాన్ని కొనసాగిస్తున్న కటాఫ్ ఏరియా ఆదివాసీ రైతాంగంపై ఈ దాడి మరింతగా పెరుగుతున్నది. నవీన్ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని నాలుగువైపుల పోలీసు క్యాంపులతో చుట్టుముడుతూ, కార్పెట్ సెక్యూరిటీని బలోపేతం చేస్తూ ఒక సాయుధ దాడికి కుట్ర చేస్తున్నది. మరోవైపు ఆ ప్రాంత ప్రజలను మభ్యపెట్టేందుకు 100 కోట్ల రూపాయల ప్యాకేజీని ప్రకటించింది. కానీ అక్కడి ప్రజలు మాత్రం నవీన్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను బహిర్గతపరుస్తూ, వ్యతిరేకిస్తూ పోరాటబాటలో పురోగమిస్తున్నారు.

ఇక దేశంలోని, రాష్ట్రంలోని ఎన్నికల పార్టీలన్నీ ఒకే తానులోని ముక్కలు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బి.జె.పి, వామపక్షాలు కానీ, ప్రాంతీయ పార్టీలైన వై.ఎస్.ఆర్ కాంగ్రెస్, జనసేన, టి.ఆర్.ఎస్ వంటి రకరకాల పేర్లతో ఉన్న పార్టీలుగాని దేశంలో దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు రాజకీయంగా ప్రాతినిధ్యం వహించేవే. ఇవి సామ్రాజ్యవాదులకు సేవ చేయడంలో భాగంగా ఎల్.పి.జి విధానాలను సంపూర్ణంగా సమర్థిస్తాయి. ఇవి అధికారంలో వున్నప్పుడు ప్రజలను అణచివేస్తాయి. అధికారంలో లేనప్పుడు ప్రజల తరపున వకాల్తా పుచ్చుకొని దొంగనాటకాలాడతాయి. ఈ పార్టీలన్నింటికీ ఈ ద్వంద స్వభావం ఉంటుంది. అయితే ఈ పార్టీల మధ్య ఈ సారుప్యతలతో పాటు, అధికారంలోకి వచ్చేందుకు వీటి మధ్య కుక్కల కొట్లాట ఉంటుంది. కనుక ఈ పార్టీలన్ని ప్రజావ్యతిరేక స్వభావం కలిగినవే. వామపక్షాల విషయానికొస్తే, పైకి మాత్రం అవి ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్ని వల్లె వేస్తూ, సారంలో దిగజారిన కార్మికవర్గ ప్రభువులకు ప్రాతినిధ్యం వహిస్తూ, దేశంలో దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వాన్ని పరిరక్షించడానికీ, ఆ వర్గాలకు సేవ చేయటానికి మాత్రమే అంకితమై ఉన్నాయి.

***ప్రియమైన ప్రజలారా, మిత్రులారా!***

ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అధికారంలో వున్న పార్టీలన్నీ ప్రజల శ్రేయోభిలాషుల్లా వ్యవహరిస్తూ, సంక్షేమ పథకాలు గుప్పిస్తున్నాయి. అధికారంలో లేని పార్టీలు సాధ్యంకాని వరాల జల్లులు కురిపిస్తున్నాయి. కానీ దళారీ స్వభావం కలిగిన ఈ పార్టీలలో ఏ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చినా, అవి ప్రజల సమస్యలు పరిష్కరించవు. అవి చేసేదల్లా దేశీయ ఆదాయాన్ని గుత్తాధిపత్య సంస్థలకు పునఃపంపకం చేయడమూ, గుత్తాధిపతుల దాడికి ద్రవ్యం సమకూర్చడమూ, ప్రభుత్వ అప్పును మరింత, మరింతగా పెంచడం మాత్రమే చేస్తాయి. ఈ క్రమంలో దోపిడీ పాలకవర్గాల వద్ద సంపద కొండలమాదిరి కుప్పబడుతుంది. ప్రజల ఆర్థికస్థితి కనిపించనంత అగాధంలోకి దిగజారిపోతుంది. అంతేకాదు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ప్రభుత్వ అప్పు కూడా ప్రజలపై పడి, ప్రజలు మరింత కునారిల్లిపోతారు. ఇప్పుడు జరుగుతున్నది కూడా ఇదే. ఈ 72 ఏళ్ళ 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం' ప్రజలకు ఇచ్చింది ఇదే. అందుకే ఇది ఒట్టి బూకటమైనది. దీని బూటకత్వం మరింత

లోతుగా తెలుసుకోవాలంటే ఎన్నికల అమలు తీరును కూడా తెలుసుకోవాలి. గడిచిన 72 ఏళ్ళలో 16 విడతలుగా జరిగిన లోకసభ ఎన్నికలలో గానీ, అనేక పర్యాయాలుగా జరిగిన వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గానీ, స్థానిక ఎన్నికలలో గాని పాలకపార్టీలు ఓట్లకోసం ప్రజలను డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు గురి చేస్తున్నాయి. మతం, కులం, బంధుత్వం, ప్రాంతం వంటి భావోద్వేగాలను రెచ్చగొడుతున్నాయి. ఎన్నికల సందర్భంగా పీడితులపై మరీ ముఖ్యంగా దళిత, బలహీన వర్గాలపై భూస్వామ్య శక్తులు జరిపే దౌర్జన్యానికి అంతేలేదు. వాస్తవానికి ఎన్నికలలో అభ్యర్థి ఖర్చు నామినేషన్ వేసిన రోజు నుంచి, ఎన్నికలు ముగిసే వరకు శాసనసభకు 20 లక్షలు, లోకసభకు 70 లక్షలు అని ఎన్నికల సంఘం నిర్దేశించింది. కానీ ఆచరణలో ఒక్కొక్క అభ్యర్థి 10 కోట్ల నుండి 20 కోట్లకు పైనే ఖర్చు చేస్తున్నాడు. ఒక్కొక్క ఓటును 1000 రూపాయల నుండి 5000 రూపాయల వరకు ఇచ్చి కొంటున్నాడు. దీని పైన ఎటువంటి నియంత్రణ లేదు. ఇక ఇ.వి.ఎమ్‌ల మాయాజాలాన్ని పాలకపార్టీలే మాట్లాడుతున్నాయి. ఇలా ఎన్నికల ప్రక్రియ రూపంలో కూడా రాను రాను మరింత బూటకంగా తయారవుతున్నది. ఈ నేపథ్యంలోనే పార్లమెంటరీ ఎన్నికల అసలు స్వభావాన్ని ప్రజలు అర్థం చేసుకోవడం వలన, ఎన్నికల ప్రక్రియలో వారి భాగస్వామ్యం రోజు రోజుకు తగ్గిపోతున్నది. ముఖ్యంగా పట్టణాలలో పోలింగ్ శాతం గణనీయంగా తగ్గింది. ఈ మధ్య తెలంగాణ శాసనసభకు జరిగిన ఎన్నికలలో హైద్రబాద్-సికింద్రాబాద్ జంట నగరాలలో 50% మాత్రమే ఓట్లు పోలైనాయి. పట్టణాలలో దేశవ్యాపితంగా ఈ ధోరణి కొనసాగుతున్నది. దీంతో పాలకవర్గాలు బెంబేలెత్తి ఇంతటి 'ఘనమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని' రక్షించేందుకు 'ప్రముఖుల' ద్వారా ఎన్నికల ప్రాధాన్యతను ఎంతగా ఊదరగొట్టించినా, ఓట్ల పోలింగ్ శాతాన్ని పెంచలేకపోతున్నాయి. ఈ పరిస్థితి ఎన్నికల పార్టీలపైనా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పైన ప్రజలలో భ్రమలు తగ్గుతున్న వైనాన్ని తెలియచేస్తున్నాయి. చారిత్రకంగా ఇప్పటికే కాలం చెల్లిపోయిన ఈ బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థలు ఎక్కడైనా సామాజిక మార్పుకు ఆటంకంగా వుంటాయి. ప్రజాస్వామిక విప్లవం జరగని భారతదేశం వంటి అర్ధవలస, అర్థభూస్వామ్య దేశాలలో సామాజిక విప్లవానికి మరీ కచ్చితంగా అడ్డంకిగా నిలుస్తాయి.

***ప్రియమైన ప్రజలారా, మిత్రులారా!***

నేడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో రోజు రోజుకు పెరుగుతున్న సంక్షోభాన్ని మార్కెట్ తర్కం పరిష్కరించలేకపోతున్నది. దీంతో దోపిడీ పాలకవర్గాలు ఆ సంక్షోభ భారాన్ని పీడిత ప్రజలపై మోపుతూ, వారిని సమస్యల సుడిగుండంలోకి నెడుతున్నారు. ఈ కారణం రీత్యానే దోపిడీ పాలకవర్గాల రాజ్యం, రాజ్యాంగ యంత్రం, వారి రాజకీయ ప్రతినిధులు ప్రజలు ఎదుర్కొంటున్న కీలకమైన సమస్యలను పరిష్కరించలేకపోతున్నాయి. అవి పరిష్కరించబూనుకోవు కూడా. ఇటువంటి పరిస్థితులలో మరోవైపు ప్రజలు తమ దైనందిన సమస్యల పరిష్కారానికి పోరాటాలలోకి సమీకృతులవుతున్నారు. ప్రధానంగా భూమి, విస్థాపిత సమస్యలపై కదులుతున్నారు. ప్రజలు పోరాటాలలోకి కదలడం, నేటి దేశ వ్యాపిత సాదృశ్యంగా ఉంది. ఈ పోరాటాలు దేశంలో తీవ్రతరమవుతున్న మౌలిక వైరుధ్యాల వ్యక్తీకరణలుగా వున్నాయి. ఇవి రోజు రోజుకు పెరుగుతున్న విప్లవ పరిస్థితిని సూచిస్తున్నాయి. ఈ మొత్తం పరిస్థితి మనకు విప్లవ విజయానికి కావల్సిన అనుకూలతను తెలియచేస్తున్నాయి. ఈ అనుకూలతను మనం విప్లవ విజయానికి అవకాశంగా మల్చుకోవాలి. **అందుకు మీరు ఈ బూటకపు పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలి. తద్వారా దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా చైతన్యవంతమవుతూ, విశాల ఐక్యవేదికల ద్వారా పోరాట వెల్లువను సృష్టించాలి. ఈ వెల్లువలో విప్లవ శక్తిని మరింత సంఘటితపర్చాలి. అంటే ప్రజలు వెల్లువలా పార్టీలోకీ, ప్రజాసైన్యంలోకి విప్లవకర ఐక్య సంఘటన(విప్లవ ప్రజా కమిటీలు)లలోకి వచ్చి ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలి. ఈ క్రమంలోనే నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలి. అప్పుడే మన ప్రజలు సకల దోపిడీ పీడనల నుండి విముక్తి అవుతారు.**

**విప్లవాభివందనాలతో,**

**ఎ.ఓ.బి స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

**"ఎన్నికల్లో పాల్గొన్న వారిలో ఎక్కువలో ఎక్కువ మంది రివిజనిస్టులుగా మారడమో లేదా విప్లవ సాయుధ పోరాటాన్ని చట్టబద్ధ శాంతియుత మార్గాలలోకి మరల్చడమో మాత్రమే జరిగిందని ఇప్పటివరకు భారతదేశపు చారిత్రక అనుభవం రుజువు చేసింది. మన దేశంలో పార్లమెంటరీ ఎన్నికలలో పాల్గొనడమనే ఎత్తుగడను అనుసరించే వివిధ మార్క్సిస్టు - లెనినిస్టు గ్రూపులు నానాటికీ మరింత ఎక్కువగా మితవాద, అవకాశవాద రొంపిలో కూరుకుపోతున్నాయి. వాటిలో కొన్ని ఇప్పటికే సాయుధ పోరాటాన్ని వదిలిపెట్టి రివిజనిస్టులుగా మారిపోయాయి.**

**అందువలన ఎన్నికలను బహిష్కరించడమనేది ఎత్తుగడలకు సంబంధించిన సమస్యే అయినా భారతదేశంలోని నిర్దిష్ట పరిస్థితులలో అది వ్యూహం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఎన్నికల్లో పాల్గొనడం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహానికి ఏ మాత్రం పొసగనిది."** - ***భారత విప్లవ వ్యూహం ఎత్తుగడలు,*** (ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ ఆమోదించిన డాక్యుమెంట్) 46వ పేజీ.

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## ఆంధ్రా - ఒడిషా సరిహద్దు ప్రాంత కమిటీ

తేది : 25-మే-2019

## బందు ప్రకటన

**2019, మే 8వ తేదీన కొరాపుట్ జిల్లా, పాడువ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కితుబా గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ హత్యాకాండలో అమరులైన వీరులకు విప్లవ జోహార్లు!**

**ఈ ఎన్‌కౌంటర్ హత్యాకాండను నిరసిస్తూ,**

## మే నెల 25-శనివారం రోజున ఎ.ఒ.బి బంద్‌కు పార్టీ పిలుపునిస్తోంది!

**బందును జయప్రదం చేయవలసిందిగా సమస్త ప్రజానీకాన్ని కోరుతోంది!**

*ప్రియమైన ప్రజలారా!*

మే నెల 8వ తేదీ కోరాపుట్ జిల్లా, నందపూర్ బ్లాక్‌లోని కితుబా గ్రామం వద్ద జరిగిన హత్యాకాండలో కామ్రేడ్ కామేశ్వరి@రింకీ, (డివిజన్ కమిటీ సభ్యురాలు)తో పాటు, ఏరియా కమిటీ సభ్యులైన కామ్రేడ్ సత్తిబాబు @ దాసు, కామ్రేడ్ క్రాంతి, కామ్రేడ్ లాలు @ కృష్ణ మరియు దళ సభ్యురాలైన కామ్రేడ్ ఉయిక తిమ్మో @ గీతలు అమరులయ్యారు. అమరులైన ఈ వీరయోధుల ఆశయాలను తుదకంటా కోనసాగిస్తామని ఎ.ఒ.బి, ఎస్.జడ్.సి ప్రతిన బూనుతోంది.

దోపిడీ పాలక వర్గాలకు కుక్కల్లాగా సేవ చేసే బీజు జనతాదళ్, బి.జె.పి, తెలుగుదేశం పార్టీలు తమ యజమానులైన సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలు ఎటువంటి ఆటంకాలు లేకుండా, దోపిడీ చేసుకొనేందుకు మా పార్టీ మీద, ప్రజల మీద ఇటువంటి క్రూర హత్యాకాండలను కొనసాగిస్తున్నాయి. ఒడిశాలోని నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం ఇక్కడి ఖనిజ సంపదలను అప్పజెప్పేందుకు 100కు పైగా కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నది. వారి దోపిడీని సజావుగా కొనసాగించేందుకు ప్రభుత్వ సాయుధ బలగాలు తేలికగా రవాణా అయ్యేందుకు అవసరమైన రోడ్లు, బ్రిడ్జీలు, సెల్ టవర్లు... మొదలగు పనులు శరవేగంగా చేస్తున్నారు. మరోప్రక్క ప్రజలకు త్రాగునీరు, సాగునీరు, విద్యా, వైద్యం, ఉపాధి లేక అల్లాడుతున్నారు.

కేంద్రంలో ఫాసిస్టు మోడీ నాయకత్వంలోని బి.జె.పి ప్రభుత్వం మరింత దూకుడుగా గ్రీన్‌హంట్ ఆపరేషన్ తీవ్రతను పెంచి, సమాధాన్ ఫాసిస్టు అణచివేత దాడిని కొనసాగిస్తోంది. మోడీ అణచివేత దాడికి ఒడిశాలోని నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం, ఆంధ్రాలోని చంద్రబాబు ప్రభుత్వాలు వంత పాడుతున్నాయి. వీరంతా ఒక గూటి పక్షులే.

ఈ ప్రాంతంలో ప్రజలకు జల్,జంగల్, జమీన్ మీద అధికారం కోసం పోరాటం జరుగుతోంది. పీడిత ప్రజలకు రాజ్యాధికారం సంపాదించేందుకు సాయుధ పోరాటం కొనసాగుతోంది. దీనికి పార్టీ నాయకత్వం వహిస్తోంది. ఈ క్రమంలో ఎంతో మంది వీరులు అమరులయ్యారు. ముఖ్యంగా ఒడిశా రాష్ట్రంలో నవీన్‌పట్నాయక్ ప్రభుత్వ సాయుధ బలగాలు, మోడీ ప్రభుత్వంతో మిలాఖత్‌అయ్యి మా పార్టీ మీద, ప్రజల మీద సాయుధ హత్యాకాండను తీవ్రతరం చేసింది. దీనిలో భాగంగా గత రెండు సంవత్సరాలలో ఒడిశా రాష్ట్రంలో అనేక మంది సాధారణ ప్రజలను కూడా సాయుధ బలగాలు హత్య చేశాయి.

ఒకపక్క అణచివేత, మరోపక్క మోసకారి పథకాల పేరుతో ప్రజలను లొంగదీసుకోవాలని ఈ ప్రభుత్వాలన్ని ప్రయత్నం చేస్తున్నాయి. కానీ ప్రజలు వారి అణచివేత దాడులకు భయపడకుండా, వారి మోసాలకు లొంగిపోకుండా వేలాదిగా పోరాటంలోకి వస్తున్నారు. ఇటువంటి హత్యాకాండలు ఎన్ని జరిగినా అంతిమ విజయం సాధించే వరకు పోరాటం కొనసాగుతుంది.

ఈ హత్యాకాండను నిరసిస్తూ, మే నెల 25 వ తేదీ శనివారం నాడు ఎ.ఒ.బి బంద్‌కు ఎస్.జడ్.సి పిలుపునిస్తోంది. అత్యవసర సర్వీసులుకు బంద్ నుండి మినహాయింపు వుంటుంది.

ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ప్రగతిశీల శక్తులు, దేశభక్తులు ఈ హత్యాకాండను నిరసిస్తూ, బంద్‌ను విజయవంతం చేయవలసిందిగా ఎ.ఒ.బి, ఎస్.జడ్.సి కోరుతోంది.

Ganesh

**సెక్రటరీ,**

**ఎ.ఒ.బి స్పెషల్ జోనల్ కమిటీ,**

**సి.పి.ఐ (మావోయిస్టు).**

# తూర్పు పోరులో వికసించిన ప్రజా ఉద్యమ నాయకురాలు, నవ సమాజ నిర్మాణం కోసం నింగికెగసిన విప్లవ ధృవతార

# కామ్రేడ్ కామేశ్వరి (స్వరూప, రింకి)



నాలుగున్నర దశాబ్దాల క్రితం, తూర్పు గోదావరి జిల్లా, అమలాపురంలో కామ్రేడ్ రింకి మధ్య తరగతి కుటుంబంలో జన్మించింది. నలుగురు అక్కచెల్లెళ్ళలో తానే పెద్దది. తండ్రి ప్రభుత్వ ఆరోగ్య శాఖలో ఉద్యోగి. ఉద్యోగరీత్యా తండ్రికి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో అనేక ప్రాంతాలకు బదిలీలు అవుతుండటంతో, రింకి చదువు కూడా వివిధ ప్రాంతాల్లో మారుతూ, ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నది. తండ్రి అనారోగ్యంతో చనిపోయిన తర్వాత తల్లికి ఆ ఉద్యోగం వచ్చింది. తండ్రి బ్రతికున్నంత వరకూ, ఆ కుటుంబం సాఫీగానే నడిచింది. కానీ తర్వాత నేటి భూస్వామ్య, పితృస్వామ్య సమాజంలో 'మగదిక్కులేని కుటుంబం'గా ఆ కుటుంబం అనేక పితృస్వామ్య వేధింపులను సమస్యలను ఎదుర్కొన్నది. అందులో భాగంగానే తను కూడా చిన్నప్పటి నుంచి సమాజంలో వున్న సమస్యలను, మహిళలపై పితృస్వామ్య ఆధిపత్యాన్ని, అసమానతలను తనూ చూస్తూ, అనుభవిస్తూనే వాటిని ఎదుర్కొంటూనే ఎదిగింది. తను చాలా వ్యక్తిత్వం గల కామ్రేడ్. తను పుట్టినప్పటి నుంచి అమరురాలయ్యేంత వరకూ దేనికీ రాజీపడటం, లొంగివుండటం అనేది తన జీవితంలో ఏ సందర్భంలో కూడా కనిపించదు. తను ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత తన మేనమామతో వివాహం జరిగింది. తనకు ఒక పాప పుట్టింది. కుటుంబంలో ఆర్థిక అవసరాలరీత్యా, తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరం, గోకవురం డిపోలో ఆర్.టి.సి కండక్టర్‌గా ఉద్యోగంలో చేరింది. అలా కండక్టర్‌గా పని చేస్తున్న క్రమంలో, కార్మికసంఘాన్ని నడిపిస్తున్న కామ్రేడ్ దువ్వూరి శ్రీనివాస్‌తో తనకు పరిచయం ఏర్పడింది. తను కూడా కార్మికుల సమస్యలపై యూనియన్‌లో చేరి, ఆ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనేది. ఆ క్రమంలో తనకు శ్రీను ద్వారా పార్టీ రాజకీయాలు, అప్పటికి విశాఖ సిటీ బాధ్యతలు చూస్తున్న కామ్రేడ్ జనార్ధన్, కామ్రేడ్ కౌముదిలతో పరిచయం, ఆ తర్వాత బి.కెలాంటి పై నాయకత్వంతో కూడా పరిచయం ఏర్పడ్డాయి. వీరందించిన విప్లవ రాజకీయాలతో ఆమెలోని వ్యక్తిత్వం, సామాజిక చైతన్యం మరింతగా పదునెక్కాయి. ఆ చైతన్యంతోనే తన చెల్లెలు కామ్రేడ్ సత్యవతి (శ్వేత) వివాహం అయిన కొద్దిరోజులకే శాడిస్టు భర్త పెట్టే చిత్రహింసలు భరించలేక, అక్క దగ్గరకు వచ్చేస్తే, తను చాలా ధైర్యం చెప్పి, సత్యవతిని తన దగ్గరే వుంచుకొని, అన్ని సమస్యలకూ ప్రజా యుద్ధమే పరిష్కారం అని సత్యవతికి కూడా ఉద్యమ మార్గాన్ని చూపించింది. అలా సత్యవతి 2004లో పూర్తికాలం ఉద్యమంలోకి రావడంలో రింకి పాత్ర కూడా ఉంది. అనతి కాలంలోనే 2005లో కా॥ సత్యవతి అమరురాలు కావటం తనకు అశనిపాతమే. తల్లికి తెలిస్తే ఆమె హార్ట్‌పేషెంట్ అని, తట్టుకోలేదని చెప్పి తన ప్రియమైన చెల్లి అమరత్వాన్ని అంతటి వేదనను తను గుండెల్లో దాచుకొని ఎంతో గుండె ధైర్యాన్ని ప్రదర్శించింది. చెల్లి అమరత్వం శతృవు పట్ల మరింత కసిని రగల్చటంతో పాటు, తను ఎంచుకున్న మార్గంలో దృఢంగా ముందుకు పోవాలనే పట్టుదలను పెంచింది. ఆ క్రమంలో తను ఎంచుకున్న రాజకీయాలకు తన వైవాహిక జీవితానికి మధ్య వైరుధ్యం ఘర్షణ ఏర్పడింది. పితృస్వామ్య సమాజంలో సాధారణ పురుషుడిగా తన భర్త ఆమె వ్యక్తిత్వాన్ని, తను ఎంచుకున్న రాజకీయాలను వ్యతిరేకించినప్పుడు ఆమె తను ఎంచుకున్న మార్గానికి, రాజకీయాలకే ప్రాధాన్యతను ఇచ్చి ఇష్టంలేని, రాజీపడి ఉండలేని వైవాహిక జీవితాన్ని విడిచిపెట్టి, గొప్ప వ్యక్తిత్వాన్ని ప్రదర్శించింది. అలా తాను ఎంచుకున్న మార్గంలో పూర్తికాలం పని చేయడానికి స్వేచ్ఛగా ముందుకు వచ్చింది.

తన రాజకీయ గురువు, స్నేహితుడు, బాధ్యుడు కామ్రేడ్ శ్రీను నిర్బంధం రీత్యా, 2002లో ఉద్యమంలోకి (యు.జి) వెళ్ళిపోయిన తర్వాత కార్మికరంగంలో ఆ బాధ్యతను కామేశ్వరి సమర్థవంతంగా నిర్వహించింది. ఆర్.టి.సి రంగంలో పని చేసేటప్పుడు కార్మిక సమస్యలపైన జరిగిన అన్ని పోరాటాలలోనూ తనది చాలా బాధ్యతయుతమైన, క్రియాశీల భాగస్వామ్యం వుంది. యూనియన్ పనులను మాత్రమే కాకుండా, పార్టీ ఇచ్చిన అనేక ముఖ్యమైన పనులను రహస్యంగా, అత్యంత చాకచక్యంతో నిర్వహించింది. కామేశ్వరికి చెబితే ఏ పనైనా ఖచ్చింతగా అయిపోతదనే భరోసా, నిశ్చింత పార్టీ నాయకత్వానికి వుండేది. అంత సమర్థవంతంగా, పట్టుదలగా ఏ పనైనా చేయగలిగేది. అలా కలిసి పని చేస్తున్న క్రమంలో కా॥ శ్రీనుతో ఏర్పడిన అనుబంధం ఇద్దరిని జీవిత సహచరులుగా చేసింది. ఈ దేశ సామాజిక విప్లవాన్ని నిర్వహించాల్సిన చారిత్రక, నాయకత్వ బాధ్యతను గుర్తించి, 2009 నుంచి ఒడిశాలోని గ్రామీణ రైతాంగ సాయుధ పోరాటంలో భాగస్వామి అయ్యింది. కా॥ శ్రీనుతో తన సహచర జీవితం తక్కువ కాలమే అయినప్పటికీ, ఎంతో అన్యోన్యతను, ప్రేమను, స్త్రీ, పురుష సమానత్వాన్ని, రాజకీయ సంబంధాన్ని, అర్థవంతమైన సహచర జీవితాన్ని తాను పొందగలిగానని రింకి సగర్వంగా చెప్పుకునేది. అలాంటి తన ప్రియమైన సహచరుడు కా॥ శ్రీను 2011 జనవరిలో, కాశీపూర్ బ్లాక్, బాసింగిమాలి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైనప్పుడు ఆ ఘటనలో తను కూడా ఉంది. అప్పుడు తను నిరాయుధంగా ఉంది. తనకు మిలటరీ అనుభవం కూడా లేదు. కా॥ శ్రీనుతో పాటు, మరికొంత మంది నాయకత్వ కామ్రేడ్స్ అమరులయ్యారు. అలాంటి సందర్భంలో చాలా నిబ్బరంగా రవి కిట్‌ను తను వేసుకొని, మిగతా కామ్రేడ్స్‌తో రిట్రీట్ అయ్యింది. మిగిలిన సభ్యులందరినీ తను ఓదార్చుతూ, అమరుల కుటుంబాలను కూడా కలిసి ధైర్యం చెబుతూ, తిరిగి పార్టీని కాంటాక్టు చేసింది. తనను విప్లవంలోకి తీసుకొచ్చిన అత్యంత ప్రియమైన సహచరుని అమరత్వం, ఆమెకు జీవితంలో ఒక పెద్ద షాక్. అయినప్పటికీ, ఆయన అందించిన రాజకీయ స్ఫూర్తిని మదిలో నిలుపుకొని, పీడిత ప్రజల విముక్తి కోసం తడబాటు లేకుండా, ఉద్యమంలో కొనసాగాలని నిర్ణయించుకుంది. తనకు అత్యంత ప్రీతిపాత్రమైన తన కూతురు చిన్నారి ఎడబాటు, తల్లిగా తనను ఎంతో బాధిస్తున్నా, ఆమెను కూడా సామాజిక మార్పులో భాగం చేయాలని ఆరాటపడింది. నేటి సమాజంలో భూస్వామ్య-సామ్రాజ్యవాద విష సంస్కృతి, విశృంఖలత్వంలో, నిత్యం మహిళలపై చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులను విన్నప్పుడు, చూసినప్పుడల్లా సహజంగానే ఈ తల్లిపేగు కదలాడేది. చిన్నారిని కూడా సామాజిక విప్లవంలో భాగం చేయటమే పరిష్కారంగా భావించింది. అదే స్ఫూర్తిని తను చిన్నారికి ఉత్తరంలో తెలియజేసేది.

2011 కా॥ శ్రీను అమరత్వం తర్వాత కా॥ స్వరుపగా ఎ.ఒ.బి ఉద్యమంలో భాగమైంది. తన శక్తి సమర్థతలను దృష్టిలో పెట్టుకొని, పార్టీ ఇచ్చిన ఏ బాధ్యతనైనా తాను సమర్థవంతంగా నిర్వహించింది. కంప్యూటర్ నేర్చుకొని కొంతకాలం పత్రిక పనులను చేసింది. తను ఉద్యమంలోకి వచ్చాక, తక్కువ కాలంలోనే ఒడియా భాష నేర్చుకుని, ఆ భాషలో అనువాదం చేయగలిగేంత పట్టును సంపాదించింది. ముఖ్యంగా శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ ఉద్యమంలో కా॥ రింకిగా భాగమయ్యి, విస్తాపనకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలన్నింటినీ ఐక్యం చేసి, యు.ఎఫ్‌ను నిర్మించడంలోనూ, వాటిని క్రియాశీలంగా నడిపించటంలోను తను ప్రత్యక్షంగా నేతృత్వం వహించింది. తను చూస్తున్న రంగంలో ఎప్పుడూ సజీవ సంబంధాలనూ, రాజకీయ సంబంధాలను కలిగి ఉండేది. నిర్బంధంలో ఆ నిర్మాణాలను కలవలేని పరిస్థితుల్లో కూడా తను నిరంతరం ఉత్తరాల ద్వారా రాజకీయంగా గైడెన్స్ అందించేది. ఆ కామ్రేడ్స్‌కు సంబంధించిన వ్యక్తిగత విషయాలనూ, వ్యక్తిగత సమస్యలను రాజకీయాలకూ, సమిష్టి ప్రయోజనాలకు లోబడి ఎలా పరిష్కరించుకోవాలో తను చాలా బాధ్యతగా ఉత్తరంలో రాసేది.

కా॥ రింకి విప్లవ రాజకీయ కార్యకర్తగా, ప్రజా ఉద్యమ నిర్మాతగా, నిర్మాణ దక్షిత కలిగిన ఆర్గనైజర్‌గా, ప్రచార ఆందోళన కార్యక్రమాలను సమర్థవంతంగా రూపొందించి, అమలు పర్చగల ప్రతిభావంతమైన నాయకురాలిగా ఎదిగింది. ఈ అభివృద్ధిని గుర్తించిన పార్టీ తనను 2015 ఆగస్టులో డి.వి.సిలోకి ప్రమోట్ చేసింది. శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ కమిటీలో తను సభ్యురాలిగా బాధ్యతలను నిర్వహించింది. కమిటీలో ఏ విషయానైనా సూటిగా, స్పష్టంగా మాట్లాడటం, భిన్నాభిప్రాయాలను నిర్మొహమాటంగా చర్చించడం, విమర్శించడం అమెలో ఉన్న మంచి లక్షణం. తప్పుల పట్ల ఘర్షణ పడేదాంట్లో తను ఎంత సూటిగా వుండేదో, తనలో కూడా పెటీబూర్జువా మధ్య తరగతి స్వభావం, భావజాలం కారణంగా వ్యక్తమయ్యే బలహీనతలు, లోపాల పట్ల తనపై వచ్చే విమర్శలను కూడా, అంతే వినమ్రతతో నిజాయితీగా, మనస్ఫూర్తిగా స్వీకరించేది. తను ఎంత ఘర్షణ పడినా, భిన్నాభిప్రాయాలు ఉన్న కామ్రేడ్స్‌తో కూడా ఎటువంటి అరమరికలు లేకుండా, ఎల్లప్పుడూ చిరునవ్వుతో స్నేహంతో ఐక్యమయ్యేది.

కా॥ రింకి మంచి వక్త, ఉపన్యాసకురాలు. తను గ్రామాల్లో ప్రజల మీటింగ్స్‌లో ప్రజలకు అర్థమయ్యే విధంగా వాళ్ళయాసలో, భాషలో అనర్గళంగా మాట్లాడుతూ, ప్రజలను ఆకట్టుకుని, ఆలోచింపచేసే విధంగా గొప్ప నైపుణ్యంతో నిర్వహించేది. పార్టీ జరుపుకునే విప్లవ కార్యక్రమాలు, చారిత్రాత్మక దినాలు, అమరుల సంస్మరణ సభలు వగైరా సందర్భంలో తను ఇచ్చిన ఉపన్యాసాలు సృజనాత్మకంగా, తనదైన శైలిలో మనసుకు హత్తుకునే విధంగా కేడర్లకు, ప్రజలకు రాజకీయంగా గొప్ప ప్రేరణను, స్ఫూర్తిని, ఉత్సాహాన్ని కలిగించే విధంగా ఉండేది. తను చాలా కలుపుగోలు మనిషి, స్నేహశీలి, మృధు స్వభావి. తనకు చిన్ననాటి నుండీ తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులు, పని చేసే దగ్గర కొలిగ్స్, పార్టీలో

**తరువాయి భాగం 38వ పేజీలో...**

## మూలవాసిగా పుట్టి, కార్మికవర్గ యోధుడుగా ఎదిగిన అమరుడు

# కామ్రేడ్ దాసు (సత్తిబాబు)



కామ్రేడ్ దాసు విప్లవాల పురిటిగడ్డ మన్యంలో జన్మించాడు. ఆయనది తూర్పు గోదావరి జిల్లా, వైరామవరం మండలం, పాతకోట పంచాయితీకి చెందిన బురదకోట గ్రామం. ఆయన అసలు పేరు పాంగి సత్తిబాబు. ఆ ప్రాంతంలో సాయుధ వర్గపోరాట రాజకీయాలు అందరినీ ప్రభావితుల్ని చేసినట్లుగానే, దాసును కూడా ప్రభావితుడిని చేశాయి. దాసు ప్రారంభంలో, గ్రామానికి చెందిన యువజన సంఘంలో చేరాడు. ఆ ప్రాంతంలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌వారు ప్రజలపై చేస్తున్న దౌర్జన్యాలు మితిమీరిపోవడంతో ప్రజలను ఐక్యం చేసి, ఫారెస్ట్ అధికారులకు వ్యతిరేకంగా పోరాటం చేపట్టడంలో దాసు చురుగ్గా ఉన్నాడు. ఈ క్రమంలో పార్టీ ఆయన చురుకుదనాన్ని గమనించి మిలీషియాలో చేర్చుకున్నది. అప్పటినుంచి దాసు మిలీషియాలో చురుకైన సభ్యుడిగా ఉంటూ, తన కర్తవ్యాలు నిర్వహిస్తూ వచ్చాడు. బురదకోట ప్రాంతం ఎత్తైన కొండలతో, దట్టమైన అడవితో ఉండటం వలన వ్యూహాత్మకంగా దానికున్న ప్రాధాన్యత రీత్యా, పార్టీ అక్కడ అనేక ముఖ్యమైన సమావేశాలు నిర్వహించేది. ఈ సమావేశాలను విజయవంతంగా నిర్వహించడంలో కా॥ దాసు కీలకమైన పాత్ర నిర్వహించాడు. ముఖ్యంగా శత్రువు కన్నుగప్పి సరుకులు చేరవేయడం, రక్షణ బాధ్యతల్లో భాగంగా సెంట్రీలు, పెట్రోలింగ్ నిర్వహించడం వగైరా కార్యక్రమాలలో బాధ్యతగా ఉండేవాడు. ఈ సమయంలోనే తన

---

**36వ పేజీ తరువాయి...**

క్యాడర్ నుండి నాయకత్వం వరకూ తను అందరినీ నిస్వార్థంగా ప్రేమించడం తనకున్న సహజమైన స్వభావం. అంతే ప్రేమ ఆప్యాయతలను తను అందరి నుండీ కోరుకునేది. ఎవరికి ఏ సమస్య వచ్చినా, అది తన సమస్యగానే భావించి, తనకు చేతనైనంత మేరకు పరిష్కారించడానికి ఎంత రిస్క్‌కి అయినా సిద్ధపడి ప్రయత్నించేది.

మిలటరీ విషయాల పట్ల తనకు అనుభవం లేకపోయినా, నేర్చుకోవటానికి చాలా కృషి చేసింది. శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవడానికి ఎక్సర్‌సైజ్‌లు చేయడం, మిలటరీ క్యాంపులో కూడా పాల్గొని ఏ మాత్రం వెనుకబడకుండా పొజిషన్స్, టెక్నిక్స్‌ను నేర్చుకోవటానికి ప్రయత్నించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'కిడారి ఆపరేషన్'లో కూడా తను అస్సాల్ట్ టీంలో మెంబర్‌గా కీలకమైన పాత్ర పోషించింది.

కా॥ రింకి సామాజిక విప్లవంలో భాగమైన నాటి నుండి ఉద్యమం ఎదుర్కొంటున్న అనేక ఆటుపోట్లలోనూ, గెలుపు-ఓటములలోనూ అన్ని మలుపులలో తాను దృఢంగా నిలిచి, సమర్థవంతమైన, ప్రతిభావంతమైన నాయకురాలిగా ఎదిగింది. ఉద్యమ అవసరాలరీత్యా తాను 2019 జనవరిలో ఎమ్.కె.వి.బి డివిజన్‌లో డి.వి.సి మెంబర్‌గా భాగమయ్యింది. అప్పటి వరకూ తాను నిర్వహిస్తున్న యు.ఎఫ్ రంగంలో ముఖ్యంగా కొరాపుట్‌లో విస్థాపన సమస్యకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలపై నిర్బంధం తీవ్రతరం కావటంతో, పెరుగుతున్న ఈ నిర్బంధాన్ని దృష్టిలో వుంచుకొని, పార్టీ తీసుకున్న ఎత్తుగడలనూ, నిర్ణయాలను అమలు చేయడంలో భాగంగా, తన కిచ్చిన కర్తవ్యాన్ని నిర్వహించేందుకు కా॥ రింకి ఎంతో ఆత్మవిశ్వాసంతో, కార్యక్షేత్రంలోకి వెళుతున్న క్రమంలోనే 2019, మే 8న జరిగిన శత్రుదాడిలో తన తుది శ్వాసను విడిచింది. ఏ.ఒ.బి ఉద్యమం ఒక ప్రతిభావంతమైన నాయకురాలిని కోల్పోయింది. నూతన సమాజ నిర్మాణం కోసం మరో తార నింగికెగసింది. ఆమె ఆదర్శాలను ఎత్తిపడదాం! అమరుల కలలను నిజం చేద్దాం!!

గ్రామంతోపాటు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు ప్రభుత్వం ఆధీనంలో ఉన్న టేకు ప్లాంటేషన్‌ను ఆక్రమించేందుకు సిద్ధపడటంతో, అక్కడి సంఘం నేతృత్వంలో ప్రజలు కదిలి టేక్ ప్లాంటేషన్‌ను ఆక్రమించుకున్నారు. ఈ పోరాటంలో దాసు ముందు పీఠిన ఉండి నేతృత్వం వహించాడు. ఈ క్రమంలోనే 2002లో పార్టీ ఆయనను భర్తీ చేసుకొని గుర్తేడు దళానికి పంపింది. అప్పటినుంచి ఆయన పూర్తికాలం కార్యకర్తగా ఈ 17 సంవత్సరాల పాటు, ఎన్నడూ వెనుదిరిగి చూడకుండా ప్రజలతోటి, విప్లవంతోటి మమేకమై పని చేశాడు. గుర్తేడు దళంలో పని చేస్తున్న క్రమంలోనే ఆయనలోని క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతాయితమైన వ్యవహారశైలిలను పార్టీ గమనించి ఆయనను స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడికి గార్డుగా పంపింది. పార్టీ అప్పజెప్పిన ఈ బాధ్యతను కూడా క్రమశిక్షణగా, సమర్థవంతంగా నిర్వహించాడు. ఆ తర్వాత 4 సం॥ల పాటు టెక్నికల్ దళంలో అత్యంత బాధ్యాతాయితంగా పని చేశాడు. 2007లో ఎ.ఒ.బిలో కంపెనీ నిర్మాణాన్ని ఏర్పర్చాలని ఎస్.జడ్.సి నిర్ణయించింది. ఈ నిర్ణయంలో భాగంగా, సి.ఆర్.సి నేతృత్వంలో అక్కడ ఏర్పడిన, 1వ కంపెనీలోకి పార్టీ కా॥ దాసును పంపింది. ఇక్కడ పి.పి.సి సభ్యుడిగానూ, సెక్షన్ కమాండర్‌గాను బాధ్యతలు చేపట్టాడు. తర్వాత ఉద్యమ అవసరాల రీత్యా, దాసును 1+1 నిర్మాణానికి బాధ్యుడిగా నందపూర్ ఏరియాకు పంపడం జరిగింది. ఈ సమయంలో కా॥ దాసు ప్రజలతో సజీవ సంబంధాలను ఏర్పర్చుకొని, ఎమ్.కె.వి.బి డివిజన్‌కూ, కొరాపుట్ డివిజన్‌కు మధ్య సమన్వయంలో ఒక వారధిలా పని చేశాడు. ఆయనకు కువ్వి భాష మాతృభాష కావడంతో పాటు, ఒడియా భాష మీద కూడా పట్టు కలిగి ఉండటంతో, ప్రజలలో సులువుగా మంచి స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఆయన పుట్టి పెరిగినది అటవీ ప్రాంతం కావడంతో భౌగోళిక పరిస్థితులను సులువుగా ఆకళింపు చేసుకునేవాడు. ఇక్కడ కూడా టెర్రయిన్‌పై పట్టు సంపాదించి, నాయకత్వ టీంలకు గైడ్‌గా పని చేశాడు. 2012లో పార్టీ ఆయనను ఉద్యమ అవసరాల రీత్యా ప్రొటెక్షన్ స్క్వాడ్-2కు బదిలీ చేసింది. 2016 వరకు పి.ఎస్-2లోనే ఉంటూ, ఎస్.జడ్.సి నిర్వహించే కీలకమైన పనులలో అత్యంత బాధ్యతగా వ్యవహరించాడు. 2016లో పార్టీ ఆయనను తిరిగి నందపూర్ ఏరియాకు పంపింది. ఇక్కడ జరిగిన భూపోరాటాలకు నేతృత్వం వహిస్తూ, ప్రజలను పార్టీ, వర్గసంఘాలలోకి సమీకరించి ప్రజా పునాదిని బలోపేతం చేశాడు. ఇక్కడ పని చేస్తున్న సమయంలోనే కొరాపుట్ డివిజన్‌కు చెందిన కా॥ క్రాంతిని వివాహం చేసుకున్నాడు. వీరిద్దరు 2019 మేలో జరిగిన కితుబా ఎన్‌కౌంటర్‌లో పోలీసులతో వీరోచితంగా పోరాడుతూ ఒకేసారి అమరులైనారు.

కా॥ దాసు విప్లవోద్యమ క్రమంలో ప్రజలవైపు దృఢంగా నిలబడి, వర్గ శతృవులనూ, ప్రభుత్వ కిరాయి సాయుధ బలగాలను ఎదిరించడంలోనూ, శిక్షించడంలోను కఠినంగానే వ్యవహరించాడు. ఒడిశా రాష్ట్రంలో జరిగిన నయాగఢ్, దామన్‌జోడి పోలీస్‌స్టేషన్స్, క్యాంపులపై జరిగిన రెయిడ్స్‌లో పాల్గొన్నాడు. అలాగే సుంకి, దైగూడ, బలిమెలి, రాళ్ళగడ్డ అంబుష్‌లలో పాల్గొని, శతృవును నిర్మూలించాడు. ఇంకా పనికి, పనసపుట్, ముట్టిశిడగ, టుడువ ఎన్‌కౌంటర్స్‌లో పోలీసులపై ఫైరింగ్ చేసి, నాయకత్వ కామ్రేడ్స్‌కు రక్షణగా నిలిచాడు. సామన ఎన్‌కౌంటర్ సందర్భంగా గాయలైన కామ్రేడ్స్‌ను శతృ బారిన పడకుండా సురక్షితంగా గమ్యం చేర్చాడు.

2009 నుంచి కొరాపుట్ జిల్లాలోని నారాయణపట్నా, బందుగాం, నందపూర్ ఏరియాలలో జరిగిన ఆదివాసీ రైతాంగ పోరాటాలతో కా॥ దాసు జీవితం పెనవేసుకుపోయింది. అక్కడ జరిగిన వ్యవసాయక విప్లవ పోరాటంలో తన వంతు పాత్రను నిర్వహిస్తూ, ఉద్యమ పురోగమనానికి దోహదకారిగా నిలబడ్డాడు. అక్కడి వర్గపోరాటంలో ప్రజాద్రోహులుగా ముందుకొచ్చిన పెత్తందార్లనూ, శాంతి కమిటీ గూండాలనూ, ఇన్‌ఫార్మర్స్‌ను ఖతం చేయడంలో ముందు నిలిచాడు. కత్తులపేట గ్రామంలో భూస్వామి దుర్గాప్రసాద్‌నూ, తెంతిలిపొదర్ గ్రామంలో శాంతి కమిటీ గూండ సిక్కూనూ, మునగలపాలెంలో తవుడు, సిమ్మాలనూ, కొటుబు గ్రామంలో అప్పారావునూ, అత్తిబారీ పంచాయితీ సర్పంచ్ (ప్రజా వ్యతిరేకి), మరో ప్రజావ్యతిరేకిని ఖతం చేసే చర్యలలో చురుకుగా పాల్గొన్నాడు. అలాగే చంద్రబాబు ప్రభుత్వం గుండెలలో గుబులు పుట్టించిన మాజీ ఎమ్.ఎల్.ఎ సీవేరి సోమ, అధికార పార్టీ ఎమ్.ఎల్.ఎ కిడారి సర్వేశ్వరరావులను ఖతం చేసిన చర్యలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు.

2018 నాటికి 'సమాధాన్' దాడి తీవ్రతరం కావడంతో ఎస్.జడ్.సి శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ నుంచి కొన్ని బలగాలను రిట్రీట్ చేసింది. అయితే అక్కడి ఉద్యమాన్ని సమన్వయించేందుకూ, జిల్లా యు.ఎఫ్‌ను గైడ్ చేసేందుకు డివిజన్ కమిటీ నుంచి కా॥ రింకితోపాటు, ఒక దళాన్ని కేటాయించింది. ఈ దళానికి కా॥ దాసు కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ క్రమంలోనే తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా, కొరాపుట్ డివిజన్‌కు వెళ్తున్న ఈ దళంపై కితుబా గ్రామం వద్ద ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసు బలగాలు పెద్దఎత్తున మన కామ్రేడ్స్‌ను చుట్టుముట్టి, గుండ్లవర్షం కురిపిస్తున్నా, కా॥ దాసుతోపాటు మిగిలిన కామ్రేడ్స్ ఏ మాత్రం తగ్గకుండా ప్రజల విముక్తి కోసం పోలీసులను ప్రతిఘటిస్తూ, ఒక కామ్రేడ్ మినహా మిగిలినవారు వీరమరణం పొందారు. ఈ సంఘటన పార్టీకీ, విప్లవ ప్రజానీకానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించేదే అయినప్పటికీ, సాయుధ వ్యవసాయక విప్లవ పోరాటంలో సంఘటితపడిన నారాయణపట్నా, బందుగాం, నందపూర్ విప్లవ ప్రజానీకం త్వరలోనే ఈ నష్టాన్ని పూరించుకొని, విప్లవ ప్రతీఘాతుకత్వాన్ని అంతం చేస్తారు.

# నారాయణపట్నా ఆదివాసీ సాయుధ రైతాంగ పోరాటంలో ఉద్భవించిన వెలుగురవ్వ

# కామ్రేడ్ లాలు (కృష్ణ)



సుమారు 35 సంవత్సరాల క్రితం ఒడిశా రాష్ట్రం, కొరాపూట్ జిల్లా, నారాయణపట్నా బ్లాక్, కుచిడిపేట గ్రామంలో, పేద ఆదివాసీ కువ్వి తెగలో కామ్రేడ్ కృష్ణ (లాలు) జన్మించాడు. చిన్న వయస్సులోనే పెళ్ళయి, భార్య పిల్లలతో సాధారణ జీవితం గడుపుతున్న క్రమంలో అదే ప్రాంతంలో ఛసిములియా సంఘం నాయకత్వంలో జరిగిన పోరాటాల్లో కుచిడిపేటకు ఆనుకుని వున్న కిలువ గ్రామం చాలా మిలిటెంట్‌గా, క్రియాశీలంగా వుండేది. కా॥ కృష్ణ కూడా ఆ పోరాటాల పట్ల ఆకర్షితుడయ్యి, ఆ సంఘం నిర్వహించే క్యాంపెయిన్లకు, అనేక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవాడు. ఆ క్రమంలో 2008 నాటికి బందుగాం నాయకత్వం ఎన్నికల బాట పట్టి, ద్రోహం చేసిన ఫలితంగా ఛసిమూలియా సంఘంలో చీలిక వచ్చింది. ఈ పరిస్థితుల్లో కా॥ కృష్ణ బందుగాం నాయకత్వాన్ని వ్యతిరేకించి, నాచికలింగ నేతృత్వంలోని నారాయణపట్నా సంఘం పక్షాన నిలిచాడు. ఈ క్రమంలోనే పార్టీతో కూడా తనకు సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ ప్రాంతంలో పార్టీ ఆదివాసీ పీడిత ప్రజల పక్షాన నిలబడి, ఆదివాసేతర భూస్వాములకు వ్యతిరేకంగా జరిపిన మిలిటెంట్ కార్యక్రమాలపట్ల, పార్టీ రాజకీయాల పట్ల ఆకర్షితుడైనాడు. ఆ గ్రామానికి పార్టీ వెళ్ళినప్పుడు పార్టీని అంటిపెట్టుకుని వుంటూ, పార్టీ ఇచ్చిన ఏ పనినైనా చేసేవాడు. నారాయణపట్నా ఛసిమూలియా సంఘంలో వుంటూనే, పార్టీ కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొనేవాడు. అలా ఆ ప్రాంతంలో మన పి.ఎల్.జి.ఎ సాయుధ చర్యలు నిర్వహించడం కోసం చేసిన రెక్కీలలో కూడా, తను పాల్గొని చాలా సహాయ సహకారాలు అందించాడు. 2008లో జరిగిన దైగూడ అంబుష్‌లో శత్రు సమాచారాన్ని తెలియచేసే మొయిన్ స్పాట్‌కు సపోర్ట్‌గా వుండి, శత్రు సమాచారాన్ని స్పష్టంగా అందించి, ఆ చర్య విజయవంతం చేయడంలో ఒక మిలీషియా సభ్యుడిగా చాలా ముఖ్య పాత్ర పోషించాడు.

దేశవ్యాప్తంగా పేరుగాంచిన నారాయణపట్నా ఆదివాసీ సాయుధ రైతాంగ పోరాటంలో, భూస్వాములకు వ్యతిరేకంగా ఆదివాసులను ఐక్యం చేయడంలో, ఆనాడు ప్రారంభంలో నారాయణపట్నా ఛసిమూలియా సంఘం చాలా కీలకమైన పాత్ర పోషించింది. నాచికలింగ నాయకత్వంలో నారాయణపట్నా సి.ఎమ్.ఎ.ఎస్ ఏరియా కమిటీలో కృష్ణ కూడా సభ్యుడిగా పని చేశాడు. ఏరియా కమిటీ నాయకత్వానికి మన పార్టీ నిర్వహించిన రాజకీయ తరగతులలో కూడా పాల్గొని, తన రాజకీయ అవగాహనను పెంచుకున్నాడు. మిలిటెంట్‌గా కొనసాగుతున్న భూ పోరాటంపైన, సి.ఎమ్.ఎ.ఎస్‌పైన రాజ్య నిర్బంధం తీవ్రం కావడంతో, నాచికలింగ రాజ్యంతో తలపడటంలో, రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజాయుద్ధంలో భాగం అయ్యేదాంట్లో స్వార్థపూరితంగా ఆలోచించి, నిర్బంధానికి భయపడి, ప్రజామిలిటెన్సీని, ప్రజా పోరాటాన్ని నీరుగార్చాడు. మితవాత, అవకాశవాద రాజకీయాలతో సంఘాన్ని చీల్చి ప్రజలలో గందరగోళం సృష్టించాడు. అటువంటి సంధర్భంలో మన పార్టీలైన్‌ను, రాజకీయ పంథాను సరిగ్గా అర్థం చేసుకొని, తాను దృఢంగా నిలబడటమే కాకుండా, మరికొంత మంది సంఘ సభ్యులను పార్టీ పంథావైపు నిలబెట్టుడంలో కృష్ణ పాత్ర కూడా కీలకమైనదే. ఈ గందరగోళాల మధ్య నుండే ఆ ప్రాంతంలో చాలా మంది స్థానిక యువతీ, యువకులను పార్టీ, పి.ఎల్.జి.ఎల్లోకి రిక్రూట్ చేయడంలో, ప్రజాయుద్ధంలో భాగస్వాములను చేయడంలో కృష్ణ కృషి ముఖ్యమైనది. అలా ప్రజాపోరాటాల్లో రాటు దేలుతూ, సరైన పంథాను అర్థం చేసుకుంటూ, 2010లో కా॥ లాలు పూర్తికాలం విప్లవోద్యమంలో భాగమయ్యాడు.

కా॥ కృష్ణ పూర్తికాలం వచ్చేనాటికి తనకు భార్య, ఇద్దరు కొడుకులున్నారు. మరో కుమారుడు వాళ్ళ అమ్మ కడుపులో వున్నాడు. ఈ మొత్తం కాలంలో వాళ్ళ కుటుంబం అత్యంత పేదరికాన్నీ,

**తరువాయి భాగం 44వ పేజీలో...**

# విజయనగర వీరవనిత, శ్రీకాకుళ పోరుగడ్డ వారసత్వం

# కామ్రేడ్ లక్ష్మీ (క్రాంతి)



**"శ్రీకాకుళంలోనా చిందినా రక్తం**
**కాల్వలై పారింది కొండవాగుల్లోన**
**కొండలెరుపెక్కినాయి**
**పోరాడ బండలే కదిలినాయి"**

కామ్రేడ్ వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసంల నాయకత్వంలో జరిగిన సాయుధ గిరిజన రైతాంగ పోరాట నేపథ్యంలో ఒక విప్లవకవి కలం నుంచి పాట రూపంలో జాలువారిన వాక్యాలివి. అలాంటి ఉ ద్వేత్తున సాగిన పోరాట ప్రాంతంలో, 30 సం॥ల క్రితం విజయనగరం జిల్లా, తిత్తిరి పంచాయితీ, ఇప్పమానుగూడ గ్రామంలో నిరుపేద సవర ఆదివాసీ కుటుంబంలో కా॥ క్రాంతి పురుడుబోసుకుంది. తనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు లక్ష్మీ. ఇంట్లో తానే మొదటి సంతానం కావడంతో అల్లారు ముద్దుగా పెరిగింది.

శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో సవర, జాతాపులు సి.పి.ఐ (ఎమ్.ఎల్) నాయకత్వంలో సంఘటితపడి, భూమి, భుక్తి, విముక్తి కోసం తమ విలువైన రక్తాన్ని ధారపోసి, భారత విప్లవ మార్గాన్ని మరింత ఎరుపెక్కించారు. ఆ పోరాటం తమ పునాదులను కదిలిస్తున్నదని గ్రహించిన పాలకవర్గాలు, ఆదివాసీ పోరాటాలపై ఉక్కుపాదం మోపి, పార్టీ నాయకత్వం, శ్రేణులతోపాటు వందలాది సవర, జాతాపులను పాశవికంగా హత్య చేశారు. పాలకుల హత్యకాండతో ఉద్యమం తాత్కాలికంగా వెనుకడుగు వేసినప్పటికీ, దాని కొనసాగింపుగా 1990 సం॥ చివర నుంచి సి.పి.ఐ (ఎమ్.ఎల్) పీపుల్స్‌వార్ నేతృత్వంలో ఉద్యమం రాజుకోవటం ప్రారంభమైంది. ఈ క్రమంలోనే కా॥ క్రాంతికి దళంతో పరిచయం ఏర్పడి, 'కాకు బంగస్సాపో (అన్నయ్య బాగున్నారా!), కాకి బంగస్సాపో (అక్క బాగున్నారా!)' అంటూ తన చిట్టి చిట్టి చేతులతో దళకామ్రేడ్స్‌కు లాల్‌సలామ్ చెబుతూ పలకరించేది. అలా చిన్నప్పటి నుంచి విప్లవ భావాలతో ప్రభావితమై, బాలల సంఘంలో చేరింది. గ్రామ పరిసర ప్రాంతాల్లోకి దళం వెళ్ళినప్పుడు భోజన ఏర్పాట్లతోపాటు, చిన్న చిన్న అవసరాలను తోటి పిల్లలతో కలిసి తీర్చేది.

కా॥ క్రాంతి 2005 ప్రారంభంలో వృత్తివిప్లవకారిణిగా సిద్ధపడి, విప్లవోద్యమంలో భాగమయ్యింది. 2005 నుంచి 2009 వరకు కొండబారిడి, నాగావళి దళంతో ఉంటూ, ప్రజలను సంఘటితం చేస్తూ, విప్లవోద్యమంలో భాగంగా అనేక ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తీవ్రంగా కృషి చేసింది. శ్రీకాకుళం జిల్లా, భామిని మండలంలో సవరపాడు, మూలగూడ, ఇసుకగూడ, జాకరుగూడ, తాటిమానుగూడ, శ్రీరాంపురం గ్రామాల పరిధిలో వున్న ఆదివాసేతర భూస్వాములకు వ్యతిరేకంగా, పార్టీ ప్రజలను కదిలించి, వారి భూములను ఆక్రమించటంతో పాటు, ప్రజలకు దక్కేలా చేసింది. ఈ పోరాటంలో క్రాంతి చురుగ్గా పాల్గొన్నది. వీటితోపాటు గిట్టుబాటు ధరల సాధన కోసం, సారాకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు క్రాంతి నేతృత్వం వహించింది.

కా॥ క్రాంతి తన మాతృభాష సవర అయినప్పటికీ, ప్రజలను ఆర్గనైజ్ చేయడంకోసం తక్కువ సమయంలోనే తెలుగు, కువ్వి, ఒడియా భాషలను నేర్చుకొని, ఆ భాషలోనే ప్రజలకు తనకు తెలిసిన రాజకీయాలను భోదించేది. కా॥ క్రాంతిలో చదువుకోవాలనే కోరిక ఉన్నప్పటికీ, ఇంటి దగ్గర ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో సాధ్యం కాలేదు. పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చిన కొద్ది కాలంలోనే తను పట్టుదలగా చదువుకోవడం, రాయడం నేర్చుకుంది.

కా॥ క్రాంతి మిలటరీ రంగంలో కూడా కృషి చేస్తూ, అభివృద్ధి అయ్యింది. నిరంతరం మిలటరీ ప్రాక్టీసును కొనసాగిస్తూనే కొత్త కొత్త విషయాలను నేర్చుకోవడనాకి ప్రయత్నం చేసేది. క్రాంతి శతృవు విషయంలో ఏనాడు గందరగోళం పడేది కాదు. 2007 సం॥లో దళానికి అన్నం ఏర్పట్లకై వెళ్ళి, ఒక ఇంటిలో వంట చేస్తున్నప్పుడు ఆ ఇంటిని శతృవు చుట్టుముడితే ఏ మాత్రం గందరగోళ పడకుండా తనకు వంటలో సహకరిస్తున్న ఆ యింటి వాళ్ళకు అర్థం చేయించి, చాకచక్యంగా బయటపడి, సురక్షితంగా దళం దగ్గరకు చేరుకుంది.

2009లో వడద అనే గ్రామంలో దళంపై శత్రువు దాడి చేసినప్పుడు, ఆ దాడిలో దళ కమాండర్‌తో పాటు, ముఖ్యమైన కామ్రేడ్స్ ముగ్గురు అమరులు కావడంతో, మిగిలిన కామ్రేడ్స్‌ను శత్రువు కూంబింగ్స్ మధ్యనే ప్రజల సహకారంతో తప్పించి, ధైర్యంగా రిట్రీట్ చేయించింది.

కా॥ క్రాంతి అనేక మిలటరీ దాడుల్లో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ, ఆ చర్యలను విజయవంతం చేయడానికి కృషి చేసింది. 2005లో విజయనగరం జిల్లా, కునేరు రైల్వేస్టేషన్ దగ్గర ట్రైన్‌లో ఉన్న ఆర్.పి.ఎఫ్ పోలీసులపై దాడి చేసి, 303 రైఫిల్స్-8, 0.32 రివాల్వర్-1, 200పైగా తూటాలతోపాటు, 30లక్షలకు పైగా డబ్బును స్వాధీనం చేసుకున్న సాహసోపేతమైన దాడికి నేతృత్వం వహించిన పి.ఎల్.జి.ఎ స్పెషల్ గెరిల్లా దళంలో క్రాంతి ఒక సభ్యురాలిగా పాల్గొన్నది. ఈ ఘనటలో క్రాంతి చొరవగా పాల్గొని, ఆ చర్య విజయవంతం కావడానికి కృషి చేసింది. ఈ చర్య ఆమెకు సైనికపరమైన చర్యలు చేసేందుకు విశ్వాసాన్ని కల్పించింది. ఆ తర్వాత 2006లో జరిగిన ఉదయగిరి మల్టీ రెయిడ్, 2008లో జరిగిన చారిత్రాత్మక నయాగఢ్ రెయిడ్, 2009లో జరిగిన నాల్కో రెయిడ్, ఆ తర్వాత జరిగిన పాలూరు ఆంబుష్, 2011లో ఒడిశాలో జరిగిన శ్రీరాంపూర్ ఆంబుష్, 2012లో జరిగిన పాటమండు ఆంబుష్, 2016లో జరిగిన సుంకి ఆంబుష్‌లలో పాల్గొని శత్రువును మట్టుబెట్టి, ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంలో చాలా చురుకైన పాత్ర పోషించింది. 2018 సెప్టెంబర్‌లో జరిగిన అరకు ఎమ్.ఎల్.ఎ కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్.ఎల్.ఎ సీవేరి సోమలను ప్రజల సహకారంతో మట్టుబెట్టి, దళారి పాత్ర పోషిస్తున్న రాజకీయ నాయకులకు ఒక హెచ్చరికగా నిల్చింది. ఈ సంఘటనలో కూడా ప్రధాన పాత్ర పోషించింది. అనేక మంది ప్రజా శత్రువులను, ఇన్‌ఫార్మర్‌లను ప్రజల్లో విచారించి, ప్రజాభీష్టానికి అనుగుణంగా చర్యలు తీసుకొని, ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసం ఏర్పడే విధంగా తన వంతు కృషి కొనసాగించింది.

కా॥ క్రాంతి 2010 నుండి 2018 డిసెంబర్ వరకు సి.ఆర్.సి 3వ కంపెనీలో పి.పి.సి.ఎమ్‌గా వుంటూ, సెక్షన్ డిప్యూటీగా, తర్వాత సెక్షన్ కమాండర్‌గానూ బాధ్యతలను కొనసాగిస్తూనే, డాక్టర్ బాధ్యతలను కూడా చాలా బాధ్యతయుతంగా చేపట్టింది. ప్రజలకు, తోటి పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్‌కు నిరంతరం వైద్య సేవలు అందిస్తూనే, ఆ వృత్తిలో నైపుణ్యం సంపాదించేందుకు 6 నెలలు ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకొని, తన జ్ఞానాన్ని మరింత పెంచుకోవడానికి తీవ్రంగా కృషి చేసింది.

నారాయణపట్నా సాయుధ భూపోరాటంలో కా॥ క్రాంతి చాలా చురుకైన పాత్ర పోషిస్తూ, వేలాది ఎకరాల భూములను ప్రజలపరం చేయడంలో చాలా కృషి చేసింది. ఈ భూపోరాటాలను అణచివేయడానికి ప్రభుత్వం ఆ ప్రాంతంలో కార్పెట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసి, ప్రజలను తీవ్రమైన భయాందోళనకు గురి చేసింది. అప్పటి వరకు ఈ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించిన నాచికలింగ తోక ముడిచి ప్రభుత్వానికి సరెండర్ కావడంతో, ఆ విద్రోహాన్ని ప్రజల్లో ఎండగడుతూ పెద్ద ఎత్తున ప్రచారాన్ని కొనసాగిస్తూనే, నిజమైన విప్లవ రాజకీయాలను ప్రజలకు విప్పిచెప్పి సాయుధ పోరాటంలో ప్రజలను నిలబెట్టడానికి తీవ్రంగా కృషి చేసింది.

కా॥ క్రాంతి క్రమశిక్షణ గల విప్లవ కార్యకర్త. పార్టీ క్రమశిక్షణను ఖచ్చితంగా పాటించేది. ఇతరులు ఎవరైనా పార్టీ పద్ధతులకు భిన్నంగా వ్యవహరిస్తే, వాటిని గుర్తింపజేస్తూ సరి చేసేది. పార్టీ పద్ధతులకు అనుగుణంగానే తన వ్యక్తిగత సమస్యలను పరిష్కరించుకునేది. ఇతర కామ్రేడ్స్‌లో లోపాలను ఎప్పటికప్పుడు తనకు అర్థమయ్యే మేరకు ఆయా సమావేశాల్లో మాట్లాడేది. ఈ మొత్తం కాలంలో ఏనాడు తను ఊగిసలాటకు గురికాలేదు. మన పార్టీపై శత్రువు కొనసాగిస్తున్న తీవ్రమైన అణచివేత దాడి మూలంగా కొండబారిడి దళ ప్రాంతాన్ని మనం ఆర్గనైజ్ చేయలేకపోయాం. దాంతో సుమారు 10 సం॥లుగా తన కుటుంబానికి సంబంధించిన సమాచారం తనకు చేరకుండా పోయింది. ఇంటివాళ్ళను చూడాలని మనసులో వున్నప్పటికీ, పరిస్థితులు అనుకూలించకపోవడంతో, ఆ ప్రయత్నాలు విరమించుకుంది. పార్టీ ఆలోచనలకు భిన్నంగా తను ఏనాడు వ్యవహరించేది కాదు. పెళ్ళి సమస్యను కూడా పార్టీ పద్ధతులకు అనుగుణంగా ఆలోచించి, తనకు యిష్టమైన కామ్రేడ్‌ను పెళ్ళి చేసుకుంది. ఆ కామ్రేడ్ (కా॥ దాసు) కూడా తనతోపాటే కితుబా సంఘటనలో అమరుడైనాడు.

ఈ క్రమంలోనే పై కమిటీ, క్రాంతిని నందపూర్ ఏరియా కమిటీ సభ్యురాలిగా నియమించింది. ఈ బాధ్యతలను కూడా తాను శ్రద్ధతో నిర్వహించేందుకు కృషి చేసింది. అయితే నందపూర్ ఏరియాలో ఆంధ్ర-ఒడిశాకు చెందిన ప్రాంతాలు కలిసి వుండటంతో, రెండు రాష్ట్రాల పోలీసులు అక్కడి ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఎమ్.ఎల్.ఎలను ఖతం చేసిన లివిటిపుట్ సంఘటన తర్వాత, ఈ దాడి మరింత తీవ్రతరమైంది. అప్పటికే డొక్రిఘాట్ సంఘటనలో ముగ్గురు ఎ.సి సభ్యులతోపాటు, మొత్తం నలుగురు అమరులై మనం తీవ్రమైన నష్టానికి గురైనాం. ఈ నేపథ్యంలోనే ఎస్.జడ్.సి శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ నుంచి మెజారిటీ బలగాలను రిట్రీట్ చేసింది. అయితే ఆ డివిజన్ ఉద్యమ అవసరాలను తీర్చేందుకు ఒక డి.వి.సి.ఎమ్‌తోపాటు, నలుగురు ఎ.సి.ఎమ్‌లను కేటాయించింది. వీరిలో కా॥ క్రాంతి కూడా ఉన్నది. వీరంతా ఒక దళం రూపంలో, ఉద్యమ కర్తవ్యాలను నిర్వహించేందుకు వెళుతున్నప్పుడు 2019 మే 8న, ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో కితుబా గ్రామం వద్ద, పోలీసులు అకస్మాత్తుగా చుట్టుముట్టి జరిపిన దాడిని తన సహచర కామ్రేడ్స్‌తోపాటు ప్రతిఘటిస్తూ వీరమరణం పొందింది. శ్రీకాకుళం అమరుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న కా॥ క్రాంతి ప్రజల విముక్తి కోసం ఏ మాత్రం శషభిషలు లేకుండా తన ప్రాణాన్ని అర్పించి, మనకు ఆదర్శంగా నిలిచింది. ఆమె ఆశయాలను తుదకంటా కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం!

## మన్యం కొండల్లో ఉదయించిన మధురజ్ఞాపకం

# కామ్రేడ్ గీత (ఉయిక తిమ్మో)



ఓ విప్లవ కవి అన్నట్లుగా "తల్లిపాలకు ఎలా వెల కట్టలేమో, అమరుల త్యాగాలకు కూడా వెల కట్టలేము" అన్నింటికన్న మనిషి జీవితంలో విలువైనది ప్రాణం. అలాంటి ప్రాణాన్ని ప్రజల విముక్తి కోసం తృణప్రాయంగా అర్పించడానికి ఉన్నతమైన చైతన్యం కావాలి. అందులో 14 ఏళ్ళ చిరు ప్రాయంలోనే పీడిత ప్రజల విముక్తే లక్ష్యంగా ఒక మహోన్నత ఆశయం కోసం తనను తాను సమర్పించుకోవడానికి ముందుకు వచ్చిన ఆదివాసీ ముద్దు బిడ్డే కామ్రేడ్ గీత. ఆమె విశాఖ జిల్లాలోని, పెదబయలు మండలంలో, మారుమూలన ఉన్న బంగారుకొండ అనే ఆదివాసి గ్రామంలో, నిరుపేద కుటుంబంలో జన్మించింది. ఆ ప్రాంతంలో నిర్మితమవుతున్న విప్లవోద్యమం తన బాల్యంపై గాఢమైన ముద్ర వేసింది. తల్లిదండ్రులకున్న సంతానంలో తానే పెద్దది కావడంతో, ప్రతి పనిలో బాధ్యతగా వుండటం, విశాల దృక్పథంతో పని చేయడం, క్రమశిక్షణాయుతంగా ఉండటం అనేది కుటుంబ జీవితంలోనే అలవర్చుకుంది. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చే పార్టీని చూడటం, అది నిర్వహించే మీటింగ్‌లలో పాల్గొనడం చేసేది. దళం గ్రామ పరిసర ప్రాంతానికి వెళ్ళినప్పుడు రక్షణ, ఆహారం సమకూర్చడం వంటి పనుల్లో భాగమయ్యేది. పార్టీ చెప్పే రాజకీయాలను తన జీవితానికి అన్వయించుకొని ఆలోచించేది. విప్లవమే వాటికి పరిష్కారం అనే సత్యాన్ని చాలా తక్కువ సమయంలోనే గ్రహించింది. సహజంగానే పార్టీ వైపు తను అడుగులు వేసింది.

2016, అక్టోబర్ 24న ఎ.ఒ.బిలోని మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలో, రాంగూడ గ్రామం వద్ద పక్క సమాచారంతో ఎ.పి గ్రేహౌండ్స్ జరిపిన హంతకదాడిలో 31 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. పార్టీ చరిత్రలోనే ఇది అతి పెద్ద సంఘటన. దీని తర్వాత ఎ.ఒ.బిలో పార్టీ తుడిచిపెట్టుకు పోయినట్లేనని శత్రువు పెద్ద పెత్తున ప్రచారం చేస్తూ, ప్రజల మనోనిబ్బరాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీసి, లొంగదీసుకోవాలని ప్రయత్నించాడు. కాని శత్రువు ఊహించిన దానికి భిన్నంగా ప్రజలు అమరుల ఆశయాలను కొనసాగించడానికీ, వారి వారసత్వాన్ని నిలబెట్టడానికి మరింతగా ముందుకు వచ్చారు. అందులో భాగంగానే కామ్రేడ్ గీత విప్లవోద్యమంలో పూర్తికాలం పని చేయాలని దృఢంగా నిర్ణయించుకొని, పార్టీ ముందు తన ప్రతిపాదనను పెట్టింది. అప్పటికీ తన వయస్సు 14 సంవత్సరాలు. పేదరికం మూలంగా శారీరకంగా బలహీనంగా వున్నప్పటికీ, పార్టీ ఆమెలోని మంచి గుణాలను చూసి, పార్టీ భర్తీ చేసుకున్నది. ప్రారంభంలో లీగల్ జె.ఎన్.ఎమ్ టీంలో సభ్యురాలిగా పని చేయాలని పార్టీ చేసిన నిర్ణయాన్ని సంతోషంగా స్వీకరించి, అదే ప్రాంతంలో కొంతకాలం పని చేసింది. ఈ క్రమంలో తనలో పెరుగుతున్న పట్టుదల, క్రమశిక్షణ, విప్లవం పట్ల తనకున్న అంకితాభావాన్ని పరిగణలోకి తీసుకొని, 2018లో దళ సభ్యురాలిగా పార్టీ రిక్రూట్ చేసుకొని, పెదబయలు దళంలో సభ్యురాలిగా నియమించింది. అనతికాలంలోనే చదువు నేర్చుకుంది. మిలటరీ విషయాలను నేర్చుకోవడంలో పట్టుదలను ప్రదర్శించేది. సమిష్టి పనులు చేయడంలో, తన శక్తికి మించిన బరువులు మోయడంలో అందరికీ ఆదర్శంగా మారింది. ప్రజల పట్ల, తోటి కామ్రేడ్స్ పట్ల కమ్యూనిస్టు ప్రేమను ప్రదర్శించి, అందరి ఆదరాభిమానాలను చూరగొన్నది. తన విశాల దృక్పథంతో ప్రజల, క్యాడర్‌ల బాధలను, కష్టాలను తనవిగా భావించి సహాయపడడంలో వయస్సుకు మించిన రాజకీయ పరిపక్వతను కనబర్చేది. పార్టీ క్రమశిక్షణను తన జీవితంలో అలవాటుగా మార్చుకున్నది. పార్టీ అప్పగించిన ఏ బాధ్యతనైనా మనస్ఫూర్తిగా స్వీకరించి, అమలు పరిచేది. తనలో పై విషయాలను దృష్టిలో పెట్టుకొని నాయకత్వ రక్షణలో భాగంగా కామ్రేడ్ రింకి(అమరురాలు)కి గార్డుగా నియమిస్తూ, నందపూర్‌కు బదిలీ చేసినప్పుడు, ఆ ప్రాంతం తనకు కొత్తదైనప్పటికీ, ఎలాంటి శషబిషలు లేకుండా బదిలీకి అంగీకరించింది. ఈ నిర్ణయం అమలులోకి వచ్చిన 5రోజులలోనే కొరాపుట్ జిల్లా, కితుబా గ్రామం వద్ద మే 8న దళం మకాంపై పక్క సమాచారంతో పోలీసులు అన్నివైపుల నుంచి చుట్టుముట్టి దాడి చేసినప్పుడు కా॥ గీత నిరాయుధంగానే ఉన్నా, తన బాధ్యురాలి (కా॥ రింకి)ని అంటిపెట్టుకొని ఆమెను రక్షించే ప్రయత్నం చేస్తూనే రిట్రీట్ అవుతున్న క్రమంలో కా॥ రింకితోపాటే కా॥ గీత అమరత్వం పొందింది.

కా॥ గీత మరణవార్త విన్న పెబదయలు ప్రజలు కొరాపుట్ నుంచి తన మృతదేహాన్ని గ్రామానికి తెచ్చి, విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు శోకహృదయంతో హాజరైనారు. కా॥ గీత త్యాగానికి పీడిత ప్రజలు, పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం తలవంచి వినమ్రంగా జోహార్లర్పించింది. "పూసే పూలన్నింటిని చిదిమివేయవచ్చు గాక, కానీ రాబోయే వసంతాన్ని శత్రువు ఆపలేదు" అంటూ ప్రజలు ప్రతినబూనారు. కా॥ గీత పోరుదారుల్లో అడుగులు వేస్తున్నారు.

# 2018లో ఒడిశా రాష్ట్ర ఉద్యమంలో అమరులయిన కామ్రేడ్స్ జీవిత చరిత్రలు

**బోల్షివిక్ బులిటెన్‌కు సంబంధించిన గత సంచికలలో, కేవలం ఎ.ఒ.బి జోన్ పరిధిలో, అమరులైన కామ్రేడ్స్ జీవిత విశేషాలను మాత్రమే ప్రచురించాము. ఈ సారి ఒడిశా రాష్ట్ర పరిధి (మల్కనగిరి, కోరాపూట్ జిల్లాలు మినహా మిగిలిన ఒడిశా ప్రాంతం)లో, 2018 జనవరి నుండి సెప్టెంబర్ మాసాల మధ్య అమరులైన కామ్రేడ్స్ జీవిత విశేషాలను కూడా ప్రచురించాము. సాధ్యమైనప్పుడు అక్కడి ఉద్యమ రిపోర్టులను కూడా వేయాలనుకుంటున్నాము. దీని వలన ఒడిశా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక రాజకీయ, ఆర్థిక, అణచివేత విధానాలతోపాటు, ప్రజల ప్రతిఘటనా చైతన్యాన్ని మరింత లోతుగా, నిర్దిష్టంగా అర్థం చేసుకొని ఎ.ఒ.బి జోన్‌లో ముఖ్యంగా ఒడిశా ప్రాంతంలో ఉద్యమ కర్తవ్యాలను మెరుగ్గా నిర్వహించవచ్చని భావిస్తున్నాం.**

---

**40వ పేజీ తరువాయి...**

తీవ్రమైన శత్రు నిర్బంధాన్ని ఎదుర్కొన్నది. తన తమ్ముడిని అనేక సార్లు పోలీసులు తీసుకెళ్ళి, చిత్రహింసలకు గురి చేసారు. తన భార్యపై అనేక ఒత్తిళ్ళు తేవడమే కాకుండా, తన పిల్లలను పోలీసులు చదివిస్తామని తీసుకుపోవటం, లాలును సరెండర్ చేయించమని రకరకాల ప్రయత్నాలు చేశారు. వీటన్నింటిని కృష్ణ చాలా చైతన్యవంతంగా ఎదుర్కొన్నాడు. కుటుంబ బంధనాలు, బాధలు ఏవైనా సంకల్పాన్ని సడలించలేకపోయాయి. ఆయన ఏనాడు కూడా తన కుటుంబ సమస్యలను గానీ, తన భార్య పిల్లలను కలవాలని గానీ తనంతట తానుగా ఎప్పుడూ పార్టీని అడగలేదు. తీవ్ర నిర్బంధంలో కుటుంబాన్ని కలిసే అవకాశాలు చాలా తక్కువగా వున్నప్పటికీ, ఆయన తన బాధ్యతలపైనే ప్రధానంగా కేంద్రీకరించాడు. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయంలో భాగంగానే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయనీ, ప్రజల సమస్యల పరిష్కారంలో భాగంగానే తన కుటుంబ సమస్య కూడా పరిష్కారమవుతుందనే గొప్ప చైతన్యాన్ని ప్రదర్శించాడు.

కాII కృష్ణ దళ సభ్యుడిగా, పార్టీ సభ్యుడిగా పని చేసి, రాజకీయంగా అభివృద్ధి చెందుతూ, 2013 నాటికి నారాయణపట్నా ఎ.సి మెంబర్‌గా ఎదిగాడు. ఆ తర్వాత నందపూర్ ఎ.సిలోకి ఉద్యమ అవసరాల రీత్యా బదిలీ చేయబడ్డాడు. తను ఎ.సి మెంబర్‌గా, ప్రజలలో మంచి ఆర్గనైజర్‌గా చాలా క్రియాశీలకమైన పాత్రను పోషించాడు. తను స్థానిక కామ్రేడ్‌గా ప్రతీ గ్రామాన్నీ, అక్కడి వ్యక్తులనూ, సమస్యలను వాస్తవ పరిస్థితులపై ఆధారపడి అర్థం చేసుకుంటూ, కమిటీకి రిపోర్టులు ఇచ్చేవాడు. ఈ రిపోర్టులు, డి.వి.సి తీసుకునే సరైన నిర్ణయాలకు, చాలా దోహదపడేవి.

కాII కృష్ణ ఆదివాసీ రైతాంగం నుండి వచ్చినప్పటికీ, చదువు నేర్చుకొని, రాజకీయాలను అధ్యయనం చేయటంలో మెరుగుదల సాధించాడు. ఆర్గనైజేషన్ బాధ్యతలు చూసినప్పటికీ, మిలటరీ రంగంలో కూడా అనేక చర్యల్లో పాల్గొంటూ, అనుభవాన్ని సాధించాడు. 2008లో జరిగిన దైగూడ ఆంబుష్, నాల్కో ఆపరేషన్, 2013లో రాళ్ళగడ్డ ఆంబుష్, 2017లో సుంకి ఆంబుష్‌ల్లో పాల్గొని వాటిలో పార్టీ తనకు ఇచ్చిన కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వహించాడు. సామన, పనికి, కుయిరిపుట్, కుత్తుడు, టుడువలలో జరిగిన ఎన్‌కౌంటర్స్‌లో తోటి కామ్రేడ్స్‌తో కలిసి శత్రువును ప్రతిఘటించాడు. శ్రీకాకుళం-కోరాపూట్ డివిజన్‌లో శత్రు నెట్‌వర్క్‌ను, ప్రజా వ్యతిరేకులను శిక్షించడంలో తన పాత్ర క్రియాశీలకమైనది.

ఈ విధంగా శ్రీకాకుళం-కోరాపూట్ ఉద్యమంలో, నారాయణపట్నా-బందుగాం, నందపూర్ ప్రాంతాల ఉద్యమపు ఎగుడు దిగుళ్ళలో, గెలుపు ఓటముల్లో కాII కృష్ణ జీవితం పెనవేసుకుపోయింది. ఆ ప్రాంతంలో జరిగిన సైనిక, నిర్మాణ, సాంస్కృతిక కార్యక్రమాలన్నింటిలోనూ ఆయనను లేకుండా ఊహించలేము. నారాయణపట్నా రైతాంగ సాయుధ పోరాటంలో ఉద్భవించిన ఈ వెలుగరవ్వ 2019, మే 8నాడు శత్రువుతో జరిగిన సాయుధ ఘర్షణలో హోరాహోరీ పోరాడుతూ, నెలకొరిగింది. నారాయణపట్నా ముద్దుబిడ్డ కాII కృష్ణ తన నెత్తురుతో ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించాడు. ఆ జెండాను సమున్నతంగా ఎత్తిపడదాం! అమరవీరుల ఆశయాన్ని కొనసాగిద్దాం!!

## ఒడిశా భూమి పుత్రుడు,

## రెండు ప్రధాన గెరిల్లా జోన్‌ల మధ్య వారధిగా విశేష కృషి చేసిన

# కామ్రేడ్ శంకర్ మాఝీ (బాదల్, డేవిడ్, వినయ్)



కామ్రేడ్ శంకర్ మాఝీ (బాదల్) ఒడిశా రాష్ట్రం దేవగఢ్ జిల్లా టాంపర్‌సాయి గ్రామంలో ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. గ్రామ ముఖ్యుల కుటుంబం కావడంతో పన్నెండో తరగతి వరకు చదువుకోగలిగాడు. మునుపటి ఎంసిసిఐ పార్టీ జార్ఖండ్ నుంచి ఒడిశాకు విస్తరించే క్రమంలో ఎస్‌డిఎస్ (సుందర్‌గఢ్, దేవగఢ్, సంబల్‌పూర్) ప్రాంతాన్ని వ్యూహాత్మక ప్రాంతంగా ఎంచుకుని అక్కడ 2003లో పని ప్రారంభించింది. సంవత్సర కాలంలోనే భర్తీ అయిన 50 మందిలో కామ్రేడ్ శంకర్ ఒకడు.

ఆ ప్రాంతంలో జరిగిన భూపోరాటాలలో భాగంగా టాంపర్‌సాయి గ్రామంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటం జరిగింది. 2006లో టాంపర్‌సాయి, మేఘపాల్ గ్రామాలలో భూపోరాటం జరిపి, 300 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఒక ప్రజా వ్యతిరేక భూస్వామిని నిర్మూలించారు. ఇందులో అక్కడి దళంతో పాటు కా.శంకర్ గణనీయమైన పాత్ర వహించాడు. ఈ పోరాటంలో నుంచి ఉద్భవించినవాడు కామ్రేడ్ శంకర్. 2003 నుంచి 2007 వరకు ఈ పోరాటం అభివృద్ధి చెందుతూ బలపడుతూ వచ్చింది. 2007లో శత్రువు క్రూర నిర్బంధం అమలు చేశాడు. పది పెద్ద బూటకపు ఎదురుకాల్పుల ఘటనలు జరిగాయి. ఇందులో 12 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. కొందరు వెనక్కి తగ్గారు. మొత్తంగా ఎస్‌డిఎస్ ఉద్యమం నష్టపోయింది. మిగిలిన కామ్రేడ్స్‌లో కామ్రేడ్ శంకర్ ఒకడు. అలా ప్రారంభమయిన కా.శంకర్ విప్లవ ప్రస్థానం ఆ తరువాత కాలంలో ఒడిశా రాష్ట్రంలో మన ఉద్యమ ప్రాంతాలలో దాదాపు అన్నింటా సాగింది. పేరేదయినా ఏ ప్రాంతంలో పని చేసినా అక్కడి ప్రజల, కేడర్‌ల అభిమానాన్ని చూరగొన్నాడు.

### వ్యూహాత్మక కర్తవ్య సాధనలో

కా.బాదల్ తన 14 సంవత్సరాల విప్లవ జీవితంలో ప్రతి పనిని శత్రువుతో పోరాడుతూనే నిర్వహించాడు. 2004 నుంచి 2010 నవంబర్ వరకు ఎస్‌డిఎస్ డివిజన్‌లో జరిగిన 12 ఎన్‌కౌంటర్స్‌లో చాలా వరకు కా.బాదల్ చొరవతో శత్రువును ఎదుర్కొని బయటపడ్డారు. 2006లో సంబల్‌పూర్ జిల్లా జమన్‌కిరా ప్రాంతంలో పిఎల్‌జిఎ జరిపిన ఆంబుష్‌లో ఒక ఎస్‌ఓజి పోలీసు చనిపోగా, 4 ఎస్‌ఎల్‌ఆర్‌లు, 500 తూటాలు స్వాధీనం అయ్యాయి. ఇందులో కా.బాదల్ పాల్గొన్నాడు.

ఎస్‌డిఎస్ ఉద్యమం బలహీనపడ్డ తరువాత ఈఆర్‌బి కంపెనీ సహాయంతో రెండు సార్లు 2008, 2009లో ఎస్‌డిఎస్ ప్రజలను సంఘటితపర్చడం కొరకు కృషి చేశాడు. కంపెనీ బలగాలతో, 2009 ఫిబ్రవరిలో సంబల్‌పూర్‌లో ఉన్నప్పుడు రెండు రోజుల తేడాతోనే రెండు ఎన్‌కౌంటర్స్ జరిగాయి. ఏరియాపై పట్టు ఉన్న ఇద్దరు ముగ్గురు కామ్రేడ్స్‌లో కా.బాదల్ ఒకడు. ఈ రెండు సార్లూ ఎస్‌ఓజి పోలీసుల దాడులను తిప్పి కొడుతూ మన బలగాలను సురక్షితంగా రిట్రీట్ చేయడంలో చెప్పుకోదగిన పాత్ర పోషించాడు.

ఎస్‌డిఎస్ ఉద్యమాన్ని నిర్మూలించడం కొరకు శత్రువు నార్త్ కమాండ్‌ను (ఛత్తీస్‌గఢ్–ఒడిశా సిఆర్‌పిఎఫ్ బలగాలు, స్థానిక బలగాలతో కలిపి) ఏర్పాటు చేసి, నిరంతరం దాడులు జరిపాడు. 2004 నుంచి 2010 వరకు శత్రువు జరిపిన దాడిలో రాష్ట్ర, డివిజన్, ఏరియా కమిటీల నాయకత్వ కేడర్ 9 మంది అరెస్టు అయ్యారు. 12 మంది వివిధ స్థాయిల కామ్రేడ్స్ అమరులైనారు. అయినప్పటికీ ఈఆర్‌బి బలగాల అండతో, ఎస్‌డిఎస్ ప్రాంతంలో పనిని కొనసాగించడానికి సైనికంగా, రాజకీయంగా ఎంతో కృషి సల్పాడు. ఈఆర్‌బి కంపెనీతో కలిసి సరండాలో ఉన్నప్పుడు అక్కడి మిలిటరీ కార్యకలాపాల్లో పాల్గొన్నాడు.

కామ్రేడ్ శంకర్ ఎస్‌డిఎస్‌లో ఉన్న ఆరు సంవత్సరాల కాలంలో పథకం ప్రకారం జరిపిన ఆంబుష్‌లో, ఎన్‌కౌంటర్స్‌లో దృఢ సంకల్పాన్ని, సాహసాన్నీ ప్రదర్శించాడు. ఈ ఘటనలలో మన పిఎల్‌జిఎ 15 మంది పోలీసులను మట్టి కరిపించింది. నాలుగు ఎస్‌ఎల్‌ఆర్‌లు, పిస్టల్స్, తూటాలు స్వాధీనం చేసుకుంది. ఈ సైనిక విజయాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయన కృషి ఉన్నది.

కామ్రేడ్ డేవిడ్ ఒక మంచి డ్రైవర్. 2005–2006లో సప్లయి దళంలో కూడా పని చేశాడు. ఈ సమయంలో భారీ ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ఎముకలు, పళ్లు విరిగిపోయాయి. కానీ ధైర్యం సడలలేదు. చికిత్స అనంతరం వెంటనే ఇనుమడించిన విప్లవ స్ఫూర్తితో కార్యరంగంలోకి అడుగు పెట్టాడు.

**నిర్మాణపరంగా, రాజకీయంగా ఉన్నత స్థానంలోకి**

2009 చివరిలో కామ్రేడ్ బాదల్‌ను ఏరియా కమిటీలోకి తీసుకున్నారు. 2010లో దండకారణ్యం వైపుగా విస్తరించాలన్న నాటి సిఐబి నిర్ణయం మేరకు కామ్రేడ్ బాదల్‌ను బిబిఎం డివిజన్‌కు బదిలీ చేశారు. అక్కడ కామ్రేడ్ డేవిడ్‌గా పని ప్రారంభించి 2012లో డివిసిఎంగా ప్రమోట్ అయ్యాడు. అప్పటి నుంచి 2013 వరకు బిబిఎం నుంచి బీహార్-జార్ఖండ్‌కు మధ్య సమన్వయం ఏర్పాటు చేసే పనిలో సిసిఎంతో కలిసి ప్రత్యేక సేవలు అందించాడు. అడవి, కొండలూ సర్వే చేసి దారులు వేశాడు.

2013లో బిజె జోన్‌కు సమన్వయం కోసం మరో దారి సర్వే చేసి వ్యూహాత్మక ప్రాంతాన్ని ఎంపిక చేయడంలో కామ్రేడ్ బాదల్ ముఖ్య పాత్ర పోషించాడు. కొంతకాలం తరువాత కెకెబిఎన్ డివిజన్‌కు బదిలీ అయ్యాడు. చివరి వరకు ఇక్కడే పని చేసాడు.

కెకెబిఎన్ ప్రాంతంలో ఉద్యమాన్ని విస్తరించడంలో భాగంగా అక్కడి ప్రజలలో మన రాజకీయాలను ప్రచారం చేసి వారిని ప్రభావితం చేసాడు. అక్కడి ఉద్యమాన్ని నిలబెట్టడంలో కామ్రేడ్ బాదల్‌కు ముఖ్య పాత్ర ఉన్నది. ముఖ్యంగా మహానది ఏరియా కమిటీ కార్యదర్శిగా, కెకెబిఎన్ డివిసి సభ్యుడిగా అక్కడి ప్రజల, కేడర్‌ల విశ్వాసం చూరగొన్నాడు. ప్రజా నాయకుడిగా పేరు పొందాడు. ఇక్కడ వినయ్‌గా పేరు మార్చుకున్నాడు.

కామ్రేడ్ వినయ్ అనునిత్యం మరొకరి నుంచి నేర్చుకోవడానికి శ్రద్ధ పెట్టేవాడు. తనకు తెలియని దాన్ని వేరే వారిని అడిగి తెలుసుకునేవాడు. కమిటీ సమావేశాలలో తన అభిప్రాయాలను క్షుణ్ణంగా చర్చించేవాడు. కమిటీ కామ్రేడ్స్‌తో కలిసి మెలిసి ఉండేవాడు. ఆదివాసీ కామ్రేడ్స్‌తో కలిసి మెలిసి ఉండడంలో ముందుండేవాడు.

కామ్రేడ్ వినయ్ మంచి వక్త. బహిరంగ సభలలో స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలు ఇచ్చేవాడు. ఆయన ఉపన్యాసాలు విని ప్రజలు ఎంతో ప్రేరణ పొందేవారు. ప్రజల మీదా, కేడర్‌ల మీదా ఒక బలమైన ముద్ర వేసేవాడు. ప్రజలు ఆయనను ప్రేమగా గుర్తు చేసుకుంటారు.

ఆర్గనైజర్‌గా కూడా కామ్రేడ్ వినయ్‌ను గురించి చెప్పుకోవాలి. డికె-బిజె మధ్యలో కొత్త ప్రాంతంలో పార్టీ విస్తరించడంలో ఆయన ఎంతో ఓపికగా ప్రజలలో పని చేసాడు.

నూతన ప్రాంతాలకు ఉద్యమాన్ని విస్తరించడంలో సమన్వయం చేసే పనిలో ఉన్నందుకు నిర్మాణపరమైన, రాజకీయమైన అధ్యయనానికి అవకాశం దొరికేది కాదు. ఆఖరు కాలంలో కామ్రేడ్ డేవిడ్ ఎంతో పరిణతి సాధించాడు. వేర్వేరు సమస్యలపై ప్రజలను సంఘటితం చేయడం, వేర్వేరు నిర్మాణ రూపాలు ఇవ్వడంపై కేంద్రీకరించాడు. మహానది ఏరియాలో సత్‌కోషియా అభయారణ్యం, విస్థాపన సమస్యకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయడంపై శ్రద్ధ పెట్టాడు. ఒడిశా నలు మూలలా ప్రజల్లో తనదైన శైలిలో విప్లవ బీజాలు నాటాడు.

కెకెబిఎన్ డివిజన్‌లో మహానది ఏరియాకు ప్రాముఖ్యత ఉన్నది. ఈ ప్రాంతంలో ప్రజలు అభివృద్ధి చెందినవారు. కటక్, అనుగుల్ వంటి పారిశ్రామిక పట్టణాలకు ఈ ప్రాంతం సరిహద్దు. ఈ ప్రాంతంలో ఉద్యమం నిలబడితే రాజధానితో సహా ముఖ్య పట్టణాలలో మంచి ప్రభావం పడుతుంది. అందుకనే శత్రువు కూడా క్రూరమైన నిర్బంధ క్యాంపెయిన్ నడిపాడు.

కామ్రేడ్ బాదల్ ఎన్నో ఎదురుకాల్పుల ఘటనల నుంచి ధైర్యంగా యుద్ధం చేసి బయటపడ్డాడు. కెకెబిఎన్ డివిజన్‌లో టీసిఓసి కోసం కేడర్‌లను మోటివేట్ చేయడం నుంచి ఘటనలు సఫలం చేసే వరకు ఎంతో శ్రమించాడు. సోడంగియా-కుజులుంగా ఆంబుష్‌లలో పాల్గొన్నాడు. సైనిక విషయాలలో దృఢంగా నిలబడ్డాడు.

**వ్యక్తిగత జీవిత సమస్యల పట్ల రాజకీయ దృక్పథం**

కామ్రేడ్ బాదల్ సహచరి 2015లో శత్రువుకు సరెండర్ అయ్యింది. పార్టీ మీద, ఆయన మీదా దుష్ప్రచారం చేసింది. దీన్ని గట్టిగా ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డాడు. శత్రువు ముందు తల వంచి, ప్రజలకు ద్రోహం చేసి, పోలీసులతో కలిసి కూంబింగ్స్‌కు వస్తున్న విప్లవ ద్రోహులను ప్రజలే శిక్షించాలని ప్రచారం చేశాడు. రెండు సంవత్సరాల తర్వాత, పార్టీలో సీనియర్ కామ్రేడ్ వనీలా (ఎసిఎం)తో పెళ్లి అవగాహనకు వచ్చాడు. పార్టీ ఆమోదం తెలిపింది. కానీ వివాహానికి వారం రోజుల ముందే కా.వనీలా సెప్టెంబర్ 10వ తేదీన మెలిషికియా (కందమాల్)లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరురాలయింది. ఈ విషాదాన్ని రాజకీయ చైతన్యంతో అధిగమించాడు.

**కా.డేవిడ్ బోల్షివిక్ స్ఫూర్తి మనకు ఆదర్శం**

2017 అక్టోబరులో కెకెబిఎన్ డివిజన్ ప్లీనంలో అధ్యక్ష వర్గంలో ఉండి దాన్ని విజయవంతం చేయడంలో తన వంతు బాధ్యత నిర్వర్తించాడు. ప్లీనంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి అవసరమైన అనేక ముఖ్యమైన విషయాలు చర్చించాడు. ఈ ప్లీనంలో తన లోపాలను హాలు ముందుంచాడు. కమిటీ, ఇతర కామ్రేడ్‌ల లోపాలను, బలహీనతలను సూటిగా విమర్శించాడు.

డివిజన్‌లో బోల్షివీకరణ క్యాంపెయిన్‌కు కేడర్‌ను సన్నద్ధం చేయడంలో తన వంతు పాత్ర నిర్వర్తించాడు. కామ్రేడ్ డేవిడ్ లేకపోయినా ఆయన ప్రదర్శించిన ఆ స్ఫూర్తితో ఇప్పుడు జరుగుతున్న బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో కామ్రేడ్స్ తమ బలహీనతలను ప్రజాస్వామికంగా పరస్పరం చర్చించుకోవడమే కాకుండా పరస్పరం నేర్చుకుంటూ ముందుకు సాగే మావోయిస్టు పద్ధతి అభివృద్ధి చెందుతున్నది.

2010 నవంబర్‌లో బిబిఎంకు బదిలీ అయ్యాడు. నూతన ప్రాంతంలో సంబల్‌పురి (కోసల) భాషతో ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాడు. గంధామర్దన్, బోలంగిర్‌లలో 2011-2012లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో, అలాగే కెకెబిఎన్ నూతన, మలి విడత విస్తరణలలో డివిజన్ వ్యాపితంగా 11 ఎన్‌కౌంటర్స్ జరిగితే ఇందులో 6 ఎన్‌కౌంటర్స్‌లో ప్రత్యక్షంగా ఉండి శత్రు దాడిని ఎదిరించి కేంద్ర కమిటీ నాయకత్వాన్ని కాపాడాడు. 2011 నుంచి 2015 చివరి వరకు ఎన్నోసార్లు పై స్థాయి నాయకత్వ కామ్రేడ్స్‌ను శత్రు దాడిని ఎదిరిస్తూ క్షేమంగా గమ్యానికి చేర్చాడు.

పోరాట అనుభవంలో నుంచి ఉద్భవించిన ఒక యువ నాయకుడిని, ఒడిశా భూమి పుత్రుడినీ కోల్పోవడం ఒడిశా ఉద్యమానికి ఒక పెద్ద నష్టం. కామ్రేడ్ డేవిడ్ విప్లవ జీవితం నుంచి స్ఫూర్తి పొందుదాం. ఆ అమరుని స్వప్నాలను నెరవేర్చడానికి చివరి శ్వాస వరకు పోరాడతామని శపథం చేద్దాం.

# విస్తరణలో పుష్పించిన పువ్వు కామ్రేడ్ మదన్



కామ్రేడ్ మదన్ నారాయణపూర్ జిల్లా మాతలా బ్లాక్ పంచాయితీ పానీగావ్ గ్రామంలో పగ్నీ దంపతుల నలుగురు సంతానంలో మూడవవాడు. మదన్ చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో చదువుతున్న ప్రాథమిక స్కూల్ విడిచిపెట్టి తల్లితో కలిసి వ్యవసాయ పనుల్లో పాల్గొనేవాడు. కా.మదన్ పుట్టినది పోరాట ప్రాంతం కాబట్టి చిన్న నాటి నుండి విప్లవ భావాలతో ప్రభావితమయ్యి బాలల సంగంలో పని చేసాడు. వయసు పెరిగిన తరువాత 2004లో భర్తీ అయ్యాడు. ముందు ఆనాటికి మాడ్ డివిజన్‌లో భాగంగా ఉన్న డౌల ఏరియాలో ఎల్‌జిఎస్‌లో పని చేసాడు. ఆ తరువాత ఇంద్రావతి ఏరియాలో 16వ ప్లాటూన్‌లో పని చేసాడు. అక్కడే పిపిసిఎంగా ప్రమోట్ అయ్యాడు. సెక్షన్ కమాండర్ బాధ్యతలు నిర్వహించాడు. తరువాత ప్లాటూన్ 1కు బదిలీ అయ్యాడు. మాడ్ డివిజన్‌లో వివిధ సైనిక నిర్మాణాలలో ఉన్న కాలంలో అనేక సైనిక చర్యలలో పాలు పంచుకున్నాడు.

2010లో ఒడిషా విస్తరణకు వెళ్లాలన్న పార్టీ తీర్మానం విని కామ్రేడ్ మదన్ ఏ మాత్రం వెనుకా ముందూ కాకుండా వెళ్లాడు. అక్కడ బోలంగిర్, బరగఢ్ వరకు మన పార్టీని విస్తరించడంలో కా.మదన్ ఎంతో కష్టపడి పని చేసాడు. పడకోపల్లి లాంటి ఎన్నో ఎదురుకాల్పుల ఘటనలలో, సైనిక చర్యలలోనూ పాల్గొన్నాడు.

**సైనిక ప్రతిఘటనలో కా.మదన్ భాగస్వామ్యం**

ప్లాటూన్‌లో పని చేస్తున్నప్పుడు సెక్షన్ కమాండర్‌గా ఆకబేడ ఆంబుష్, కుర్సేనార్ క్యాంపు పోలీసుల మీద ఫైరింగ్, బేరేవేడ ఆంబుష్ వంటి చర్యలలో పాల్గొన్నాడు. ఒడిశాలో సపముడి ఆంబుష్, గుమరడా, కొదరాబాట–సపముడ ఫైరింగ్ మొదలుగా ఎన్నో సైనిక చర్యలలో ధైర్యంగా నిలబడ్డాడు. శత్రువుకు భయపడేవాడు కాదు. ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బయటపెట్టడంలో కా.మదన్ ముందుండేవాడు. కా.మోహన్ అమరుడయిన తరువాత మహాసముంద్ దళానికి కమాండర్ బాధ్యతలు నిర్వహించాడు. 2010 ఫిబ్రవరిలో మహాసముంద్ ఏరియా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాడు. 2014లో ప్లాటూన్ డిప్యూటీ కమాండర్‌గా 2015 బిబిఎమ్ డివిజన్ మహాసభలో పాల్గొన్నాడు. ఒడిశా రాష్ట్రకమిటీ మహాసభలో కూడా కా.మదన్ ప్రతినిధిగా పాల్గొన్నాడు.

2018 నవంబర్‌లో కా.మదన్‌ను డివిసిలోకి తీసకుకున్నాడు. 2018లో కెకెబిఎన్‌కు బదిలీ అయ్యాడు. అక్కడకు వెళ్లిన కొద్ది రోజులకే కందమాల్ జిల్లాలో సుద్రుకుంప అడవిలో మే 13వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో శత్రువుతో జరిగిన హోరా హోరీ సమరంలో అమరత్వం చెందాడు.

కా.మదన్ నిరుపేద కుటటుంబం నుంచి వచ్చిన కారణంగా ప్రజల సమస్యలను అతి తొందరగా అర్థం చేసుకునేవాడు. ప్రజల భాష త్వరగా నేర్చుకున్నాడు. పార్టీ ప్రోగ్రాంను ప్రజలలో ప్రచారం చేయడంలో ముందు ఉండేవాడు. ఎంత కష్టమైన పని చేయాలన్నా కా.మదన్ ఎప్పుడు వెనుకా ముందు కాకుండా పని చేసేవాడు. సైనిక చర్యలలో అతి త్వరగా అభివృద్ధి కావలసిన కామ్రేడ్‌ను మనం నష్టపోయాం. కా.మదన్ అమరత్వం విస్తరణకు ఎంతో నష్టం.

# పూసుబాక నుంచి డుడుకుమల్ వరకు సాగిన కామ్రేడ్ సంజీవ్

కామ్రేడ్ సంజీవ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాసగూడెం స్టేషన్ పుసుబాక గ్రామ పంచాయితీ శీపురుబట్టి గ్రామంలో ఒక నిరుపేద ఆదివాసీస రైతు కుటుంబంలో జన్మించాడు. తండ్రి బండీ, తల్లి మాసె వేకో. బండీ దంపతులకు ఐదుగురు సంతానంలో కామ్రేడ్ సంజీవ్ మూడో అతను. పేద కుటుంబం కావటంతో చదువుకోవటానికి అవకాశం దొరకలేదు. చిన్న నాటి నుండి తల్లిదండ్రులతో వ్యవసాయ పనుల్లో పాల్గొనేవాడు. భూమి తక్కువగా ఉండడంతో సంజీవ్ కూలి పనులకు వెళ్లేవాడు. కొంతకాలం పాలేరుగా కూడా ఉన్నాడు. తరువాత పార్టీ సంబంధాల్లోకి వచ్చాడు. రెండు సంవత్సరాలు మిలీషియాలో పని చేసాడు. ఈ దోపిడీ సమాజాన్ని మార్చాలంటే విప్లవం ఒక్కటే మార్గం అని కామ్రేడ్ సంజీవ్ ఆలోచించాడు.



2005 డిసెంబరులో పూర్తి కాలం కార్యకర్తగా మారాడు. దక్షిణ బస్తర్ డివిసి దళంలో 5 సంవత్సరాలు పాటు పని చేసాడు. అక్కడే ఎసిఎంగా ప్రమోట్ అయ్యాడు.

2010లో పార్టీ తీర్మానం మేరకు కామ్రేడ్ సంజీవ్ విస్తరణకు బదిలీ అయ్యాడు. ఎటువంటి తపటాయింపులూ లేకుండా తెలియని ప్రాంతానికి బదిలీ అయిన కామ్రేడ్ సంజీవ్ ఒడిశాలో అనేక ప్రాంతాలలో అనేక బాధ్యతలు నిర్వహించాడు. 2012 మార్చి వరకు బిబిఎమ్ డివిజన్‌లోనే బరగఢ్ ప్లాటూన్‌లో డిప్యూటీ కమాండర్‌గా ఉన్నాడు. ఆ తరువాత బోలంగిర్ ప్లాటూన్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. 2014 మే నుంచి ప్లాటూన్ కమాండర్‌గాను, ఏరియా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాడు. 2015 అక్టోబర్‌లో అతని పనిలో అభివృద్ధి చూసి డివిసిలోకి ప్రమోట్ చేసారు. అప్పటి నుండి బిబిఎం డివిసిలో ఉండి బోలంగిర్ ఏరియా కమిటీ ఇన్‌ఛార్జిగా పని చేసాడు.

కామ్రేడ్ సంజీవ్ అనేక సైనిక ప్రతిఘటనా కార్యక్రమాలలో పాల్గొన్నాడు. దండకారణ్యంలో ఉన్నప్పుడు మూడు ఆంబుష్‌లలో పాల్గొన్నాడు. ఒకటి చారిత్రాత్మకమైన ముకరం ఆంబుష్. ఈ ఆంబుష్‌లో 76 మంది సిఆర్‌పిఎఫ్ పోలీసులు చనిపోయారు. మిలీషియాలో ఉన్నప్పుడు బాసగూడెం రోడ్‌కు మైను పెట్టి పేల్చిన చర్యలో పాలు పంచుకున్నాడు. అక్కడ ఒక ఎస్ఐ గాయపడ్డాడు. విస్తరణకు వెళ్లిన తరువాత రెండు ఆంబుష్‌లలో పాలు పంచుకున్నాడు. ఎనిమిది సార్లు ఎదురుకాల్పులలో ధైర్యంగా నిలబడ్డాడు.

కామ్రేడ్ సంజీవ్ విస్తరణ ప్రాంతంలో ఒడియా భాష నేర్చుకున్నాడు. పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్నీ ప్రజల వరకు తీసుకువెళ్లి అర్థం చేయించేవాడు. 2018 మే 12వ తేదీన బోలంగిర్‌లో డుడుకుమల్ గ్రామంలో పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా.సంజీవ్ అమరుడయ్యాడు.

## ప్రజా సేవలో ప్రాణాలు విడిచిన కామ్రేడ్ సేవక్

కామ్రేడ్ సేవక్ (సుక్‌మన్ కొర్రాం) తూర్పు బస్తర్ డివిజన్, నారాయణపూర్ జిల్లా ఇన్నర్ గ్రామంలో ఆదివాసీ మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. అమ్మా నాన్నలకు మొదటి సంతానం. అమ్మ నాన్నలు ముద్దుగా సుక్‌మన్ అనే పేరు పెట్టుకున్నారు. కామ్రేడ్ సుక్‌మన్‌కు ఒక తమ్ముడు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. కామ్రేడ్ సేవక్ కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక ప్రజా నిర్మాణంలో ఉన్నారు. అలా సేవక్ మొదట మిలీషియాలో పని చేసాడు. 2006లో పూర్తి కాలం కార్యకర్తగా పిఎల్‌జిఎలో భర్తీ అయ్యాడు.

వయనార్ ఏరియాలో ఒక సంవత్సరం పని చేసాడు. ఆ తరువాత 2007లో విస్తరణకు బదిలీ అయ్యాడు. కామ్రేడ్ సేవక్ మైన్‌పూర్ డివిజన్‌కు వెళ్లాడు. అక్కడ కొంతకాలం డివిసి కామ్రేడ్‌కు గార్డ్‌గా బాధ్యతలు నిర్వహించాడు. 2010లో ఏరియా కమిటీలోకి ప్రమోట్ అయ్యాడు. డివిజన్ మహాసభలో పాల్గొన్నాడు. కొంతకాలం సీతానది దళం డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. 2011లో రావస్ దళంకు కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. 2012లో డివిజన్ ఎల్‌జిఎస్‌కు బదిలీ చేసారు. 2015 సెప్టెంబర్‌లో కామ్రేడ్ సేవక్ గోబ్రా ఏరియా కమాండర్‌గా బదిలీ అయ్యాడు. 2018 జనవరిలో ఏరియా కమిటీ కార్యదర్శి (ఎసిఎస్)గా బాధ్యతలు చేపట్టాడు.

కామ్రేడ్ సేవక్ మైన్‌పూర్‌కు వచ్చిన తరువాత అక్కడ ప్రజల భాష నేర్చుకున్నాడు. ప్రజలతో కలిసి మెలిసి ఉండేవాడు. ప్రజల సమస్యలు తెలుసుకుని పోరాట మార్గమే శరణ్యం అని నొక్కి చెప్పేవాడు.

కామ్రేడ్ సేవక్ సైనికంగా గట్టిగా ఉండేవాడు. 2008లో మందగిరి ఆంబుష్‌లో పాల్గొన్నాడు. 2013లో కల్లారి గ్రామం వద్ద పార్టీ ఫండ్ వసూలు చేయడానికి వెళ్లినప్పుడు జరిగిన ఎన్‌కౌంటర్‌లో సెంట్రీలో ఉండి డేరా పైకి వస్తున్న శత్రువు పై ఫైరింగ్ చేసాడు. అందులో ఒక పోలీసు చనిపోగా మరొకడు గాయపడ్డాడు. 2017 సెప్టెంబరు 13వ తేదీన రాత్రి 7 గంటలప్పుడు పరశీల గ్రామంలో బయటి వాళ్లను కలువటానికి పోయినప్పుడు వచ్చే వ్యక్తులు ముందే పోలీసులకు సమాచారం ఇచ్చి వచ్చారు. అక్కడ జరిగిన ఫైరింగ్‌లో కామ్రేడ్ సేవక్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయాలతో రిట్రీట్ అయ్యి డేరా వద్దకు వచ్చి మన వాళ్లను కలిసి ట్రీట్‌మెంట్ చేయించుకున్నాడు.

కామ్రేడ్ సేవక్ అందరితో కలిసి మెలిసి ఉండేవాడు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండేవాడు. తన నవ్వు ముఖంతో ప్రజలతో ఇట్టే కలిసిపోయేవాడు. రాజకీయాలు చెప్పి ప్రజలను ఐక్యం చేయటంలో ముందుండేవాడు. 2012లో శత్రువు మైన్‌పూర్ డివిజన్‌లో ఒక

పెద్ద క్యాంపెయిన్ చేపట్టాడు. అప్పుడు సేవక్ ఒక టీమ్‌ను పట్టుకుని ప్రతిఘటన కోసం ఎంగేజ్ అయ్యాడు. చాలా ప్రయత్నాలు చేసాడు. కామ్రేడ్ సేవక్ 2018 మే 11వ తేదీన పని మీద వెళ్లినప్పుడు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు చందన్‌బారా గ్రామంలో కామ్రేడ్ సేవక్‌ను పట్టుకుని క్రూరమైన చిత్రహింసలు పెట్టి చంపివేసారు. చనిపోవడానికి కొద్ది నెలల ముందే కా. సేవక్‌కు వివాహం అయింది.

కామ్రేడ్ సేవక్ త్యాగం, పట్టుదలా మరువరానివి. కామ్రేడ్ సేవక్ అమరత్వం వృథా పోదు. కామ్రేడ్ సేవక్‌కు విప్లవ జోహార్లు అర్పిద్దాం.

## పాటతో మొదలై తుపాకి పట్టి యుద్ధంలో ఒరిగిన కామ్రేడ్ రాకేష్



కామ్రేడ్ రాకేష్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం ఏరియా వీరపురం గ్రామంలో ఆదివాసీ నిరుపేద కుటుంబంలో జన్మించాడు. దూది ఊంగాల్, ముడీ దంపతులకు ఆరుగురు సంతానంలో కామ్రేడ్ రాకేష్ మూడోవాడు. బుధవారం రోజు పుట్టినందుకు అతని తల్లిదండ్రులు అతనికి బుధరాం అని పేరు పెట్టుకున్నారు. పేదరికం కారణంగా చదువుకోవటానికి అవకాశం దొరకలేదు. చిన్ననాటి నుంచి వ్యవసాయం పనుల్లో అమ్మా నాన్నలకు చేదోడు వాదోడుగా ఉండేవాడు.

కామ్రేడ్ రాకేష్ చిన్న వయసులోనే బాలల సిఎన్ఎమ్‌లో చేరాడు. సిఎన్ఎం పాటు అతి త్వరగా నేర్చుకున్నాడు. తక్కువ కాలంలోనే మంచి కళాకారునిగా ఎదిగాడు. రాకేష్ పాటలు పాడితే ప్రజలు చెవి ఒగ్గి వినేవారు.

2007లో కామ్రేడ్ రాకేష్ పూర్తి కాలం కార్యకర్తగా రూపొందాడు. కిష్టారం ఏరియాలో 8వ పిఎల్‌లో సభ్యుడిగా పని చేసాడు. 2010లో కామ్రేడ్ రాకేష్‌ను పార్టీ విస్తరణకు ఒడిశాకు పంపింది.

అక్కడ బోలంగిర్ పిఎల్‌లో పని చేసాడు.. 2013లో బోలంగిర్ ఏరియా కమిటీలోకి తీసుకున్నారు. 2017లో బోలంగిర్ ఎల్ఓఎస్ డిప్యూటీగా బాధ్యతలు నిర్వహించాడు. అక్కడ ప్రజలతో కలిసి మెలిసి ఉండేవాడు. అక్కడ ప్రజల భాష కూడా త్వరగా నేర్చుకున్నాడు. ప్రజలకు పార్టీ గురించి అర్థం చేయించేవాడు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించేవాడు. అన్ని సమస్యలకూ పరిష్కారం పోరాటమే అని చెప్పేవాడు.

కామ్రేడ్ రాకేష్ డికె నుంచి మొదలుకుని ఒడిశా వరకు ఎన్నో ఎన్‌కౌంటర్‌లలో ఉన్నాడు. రెండు ఆంబుష్‌లలో పాల్గొన్నాడు. ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ధ్వంసం చేయడంలో పాల్గొన్నాడు. చివరిగా 2018 మే 12వ తేదీన బోలంగిర్‌లో దుడుకుమల్ గ్రామంలో పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా. సంజీవ్‌తో సహా కా. రాకేష్ అమరుడయ్యాడు. కామ్రేడ్ రాకేష్ ఆశయాన్ని చివరి వరకు కొనసాగిద్దాం.

## జుడుం కొలిమిలో ఉదయించి
## ఒడిశా విస్తరణలో అస్తమించిన కామ్రేడ్ భీమా

కామ్రేడ్ భీమా 2018 మే 13వ తేదీన కందమాల్ జిల్లాలో కొదరిపడా బ్లాక్ గాండరీ గ్రామం అడవిలో జరిగిన ఎదురుకాల్పులలో శత్రువుతో పోరాడుతూ అమరుడయ్యాడు. ఈ ఘటనలో మన కామ్రేడ్స్ ఐదుగురు అమరులయ్యారు.

కామ్రేడ్ భీమా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పాలచెలిమ ఆర్‌పిసి ఈతన్ గ్రామంలో ఒక నిరుపేద ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు. ఇంటి వద్ద ఉన్నప్పుడు పంచాయితీ సిఎన్ఎంలో పని చేసాడు. ఏరియాలో జరిగిన ప్రచార ప్రోగ్రాంలో పాల్గొనేవాడు. 2006లో మిలీషియాతో కలిసి ప్రతిఘటనలో పాల్గొన్నాడు. వింజరంలో సల్వాజుడుం గూండా గాడిని ప్రజల ముందు ఉంచి ఖతం చేసిన ఘటనలో కామ్రేడ్ భీమా ఉన్నాడు.

కామ్రేడ్ భీమా 2007లో పూర్తి కాలం కార్యకర్తగా వచ్చాడు. వచ్చిన తరువాత వెంటనే సింగన్‌మడుగు ఆంబుష్‌లో పాల్గొన్నాడు. 2008లో డివిసి కామ్రేడ్ గార్డ్‌గా బదిలీ అయ్యి మూడు సంవత్సరాల పాటు ఆ బాధ్యతలు నిర్వర్తించాడు. 2010లో ప్లాటూన్‌లో ఉన్నప్పుడు సెక్షన్ డిప్యూటీ కమాండర్ బాధ్యతలు నిర్వహించాడు. 2013లో భట్‌గూడెం ఆంబుష్‌లో పాల్గొన్నాడు. ఈ ఆంబుష్‌లో 9 మంది పోలీసులు మరణించారు. ఇందులో రెండు తుపాకులు మనం



సీజ్ చేసుకున్నాం. కామ్రేడ్ భీమా ఉర్పల్‌మెట్ట ఆంబుష్‌లో కూడా పాల్గొన్నాడు.

2016లో కామ్రేడ్ భీమా ఒడిశా బదిలీ కావాలని తీర్మానం చేసింది పార్టీ. ఈ తీర్మానాన్ని మనస్ఫూర్తిగా అమలు చేసాడు భీమా. అక్కడ 28 ప్లాటూన్‌లో పని చేసాడు. 2016 సెప్టెంబర్‌లో కామ్రేడ్ భీమా పిపిసిఎంగా ప్రమోట్ అయ్యాడు. సెక్షన్ డిప్యూటీగా బాధ్యతలు నిర్వహించాడు. సెంట్రీ బాధ్యతలు కూడా నిర్వహించాడు. చిన్న చిన్న సమస్యలు వచ్చినా కామ్రేడ్ భీమా ఓపికతో పనులు చేసేవాడు. ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఖతం చేయడంలో భీమా విమర్శనాత్మకంగా ఉండేవాడు.

2017 సెప్టెంబర్ 10వ తేదీన శత్రువు చేసిన ఒక దాడిలో ఒక మహిళా కామ్రేడ్ అమరురాలు కాగా, కా.భీమా బయటపడ్డాడు.

కా.భీమా సప్లయి దళం బాధ్యతలలో ఉంటూ 2016 నుంచి అమరుడయ్యే నాటి వరకు ఒడిశాలో పని చేసాడు. ఒడిశాలో క్యాడర్‌లలో ప్రజలతో మమేకమయ్యాడు. ఒడియా భాష నేర్చుకున్నాడు.

అంతిమంగా 2018 మే 13వ తేదీన కందమాల్ జిల్లా సుద్రుకుంపలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా.భీమా అమరుడయ్యాడు.

## పోరాట శైలికి మరో పేరు కామ్రేడ్ శీల



కా.శీల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పశ్చిమ బస్తర్ డివిజన్ భైరంగఢ్ ఏరియాలో తిమ్మేమ్ గ్రామంలో 24 సంవత్సరాల క్రితం జన్మించింది. ఇంట్లో ఆమెను లక్కే అని పిలిచేవారు. చిన్నతనంలో విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితురాలయ్యింది. బాలల సంఘంలో, ఆ తర్వాత సాంస్కృతిక సంఘంలో పని చేస్తూ ఆర్‌పిసి స్థాయి కళాకారిణిగా ఎదిగింది. 2011 డిసెంబర్‌లో పూర్తి కాలం కార్యకర్తగా పిఎల్‌జిఎలో భర్తీ అయ్యింది. తనకు తల్లిదండ్రులు, ఇద్దరు అన్నదమ్ములున్నారు. కా.శీల భర్తీ అయ్యే నాటికే పార్టీ సభ్యురాలిగా ఉన్నది. పార్టీ పిలుపునందుకుని కామ్రేడ్ శీల నూతనంగా విస్తరించిన ఒడిశా రాష్ట్రంలో కెకెబిఎన్ డివిజన్‌కు బదిలీ అయ్యింది. అక్కడ డివిజన్ కమిటీ సభ్యురాలికి గార్డ్‌గా 2017 వరకు పని చేసింది. గార్డ్‌గా రాహుల్ (కందమాల్-కలహండీ) దళం ఏరియాలో ప్రజలతో మమేకం అయింది. కువ్వి-ఒడియా భాషలను నేర్చుకుంది. ఆ ఏరియాలో ప్రజల సమస్య పై కువ్వి-ఒడియా భాషల్లో అనేక పాటలు రాసి పాడింది. అలా కా.శీల ప్రజల్లో చెరగని ముద్ర వేసింది. 2015లో జరిగిన మిలిటరీ క్యాంపులో చొరవగా పాల్గొంది. మిలిటరీ శిక్షణను ఆచరణలో అమలు చేసి, అనేక ఎన్‌కౌంటర్స్‌లో గార్డ్‌గా నాయకత్వ కామ్రేడ్స్‌కు రక్షణగా ఉన్నది.

ఉద్యమ అవసరాల రీత్యా 2017 అక్టోబర్‌లో తనను గార్డ్ నుంచి రిలీవ్ చేసి కెకెబిఎన్ డివిజన్‌లో మహానది ఏరియాకు బదిలీ చేసింది. పార్టీ ఇచ్చిన బాధ్యతలను క్రమశిక్షణతో స్వీకరించేది. కా.శీల ఇష్టపడిన కామ్రేడ్‌తో ఆమె వివాహం జరిగింది. వ్యక్తిగత జీవితంలోనూ అదే క్రమశిక్షణను పాటించింది. పార్టీ బాధ్యతల రీత్యా పెళ్లి అయిన కొద్ది కాలానికి ఇద్దరూ విడిపోయారు. మళ్లీ ఆ కామ్రేడ్ తిరిగి వచ్చి కా.శీలను కలువక ముందే, సుద్రుకుంప (మహానది) అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా.శీల అమరురాలయింది.

చాలా చిన్న వయసులోనే గార్డ్‌గా, కళాకారిణిగా, రచయితగా, క్రియాశీల పార్టీ సభ్యురాలిగా ప్రజల కొరకు పని చేసి అమరురాలైన కా.శీల మనందరికీ ఆదర్శప్రాయమైనది.

# బస్తర్‌లో పుట్టి ఒడిశాలో ఒరిగిన వీర యోధ కొమ్రేడ్ రాధ



కా.రాధ 20 సంవత్సరాల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కుంట బ్లాక్ మోర్‌పల్లి గ్రామంలో ఒక మధ్య తరగతి ఆదివాసీ కుటుంబంలో జన్మించింది. చిన్నతనంలో బాలల సంఘంలో పని చేసిన కా.రాధ విప్లవ గీతాలు, నాటకాలూ చూసి ఆకర్షితురాలయ్యి గ్రామ సిఎన్‌ఎమ్‌లో భర్తీ అయ్యింది. ఆ సమయంలో దళం వచ్చి కబురు పెట్టినప్పుడు వెంటనే తన పని విడిచిపెట్టి వెళ్లేది. అన్న కా.రామాల్ దళంలో భర్తీ అయిన తరువాత తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులలో పాల్గొనేది.

తన అన్న కా.రామాల్ చారిత్రాత్మక ముకరం దాడిలో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరుడయ్యాడు. అన్న అమరత్వం కా.రాధను తీవ్ర దుఖంలో ముంచివేసింది. కానీ 2005లో సల్వాజుడుం సమయంలోను, ఆ తరువాత కాలంలోనూ పోలీసులు గ్రామానికి వచ్చి ఇళ్లు కాలబెట్టారు, ప్రజల ధాన్యం ధ్వంసం చేసారు. అప్పుడు కా.రాధ కుటుంబం తీసిన పంట కూడా నాశనమయింది. ఇదంతా చూసిన రాధకు రాజ్య క్రూర స్వభావం అర్థమయ్యింది. అందుకనే అన్న అమరుడయితే నేను పార్టీలో భర్తీ అయి పని చేస్తానని పార్టీకి ప్రతిపాదించింది. మహిళల మీద పోలీసుల హత్యాకాండను చూసి చలించిన కా.రాధ దీనికి పరిష్కారం సాయుధ పోరాటంలోనే ఉన్నదని స్పష్టంగా గ్రహించింది. అయితే కొడుకును పోగొట్టుకున్న కా.రాధ తల్లిదండ్రులు కూతురు కూడా చనిపోతుందనేమోనని ఆమెను దళంలోకి వెళ్లడాన్ని నిరుత్సాహపరిచారు. కానీ రాధ వారి మాట వినలేదు. 2013 సెప్టెంబరులో పార్టీలో భర్తీ అయింది.

బాపనమ్మ పేరుతో పుట్టి పెరిగిన కా.రాధ ముందు జేగురుగొండ ఏరియాలో నాలుగు నెలలు పని చేసింది. 2014లో సప్లయి దళంలోను, ఆ తరువాత పిఎల్‌లోనూ పని చేసింది. పిఎల్‌లో పని చేస్తున్న సమయంలోనే కా.రాధను పార్టీ ఒడిశాకు బదిలీ చేసింది. నూతన ప్రాంతంలో పని చేయడానికి ఉత్సుకత చూపించిన కా.రాధ పార్టీ ఇచ్చిన బాధ్యతను నెరవేర్చడానికి ఉత్సాహంగా ఒడిశాలో అడుగు పెట్టింది. అక్కడి ఆదివాసీ ప్రజలలో పని చేస్తూ కువ్వి భాష నేర్చుకుంది. చక్కగా మాట్లాడేది. సప్లయి దళంలో డాక్టర్‌గా బాధ్యతలు నిర్వహించింది. ప్రజలకు కూడా ఎన్నో సేవలు చేసింది. గాయపడ్డ కామ్రేడ్స్‌కు చికిత్సతో పాటుగా ధైర్యాన్ని కూడా ఇచ్చేది. ఒడిశాకు వెళ్లిన నాటి నుంచి ఇల్లు చూసేందుకు పోలేదు కా.రాధ.

కా.రాధ సప్లయి దళంలో ఉంటూ డాక్టర్ బాధ్యతను నిర్వహించింది. ఎంతో ఓపికగా వైద్య సేవలు అందించింది. ఎంత కష్టమైన పనిని కూడా చిరునవ్వుతో, అలసట లేకుండా పూర్తి చేసేది.

తను రిక్రూట్ అయిన కొద్ది కాలానికే వివాహ సమస్యలోకి వెళ్లింది. తన తొందరపాటును కమిటీ గుర్తింపజేస్తే, తన తప్పును అంగీకరించింది. తను రాజకీయంగా అభివృద్ధి అయి వివాహం చేసుకుంటానన్నది. ఆర్గనైజేషన్‌లో ఉన్న ఆ కామ్రేడ్, తన సప్లయ్ దళంకి మారితేనే పెళ్లి చేసుకుంటానని నిర్మొహమాటంగా చెప్పింది. ఎంతో చైతన్యాన్ని ప్రదర్శించింది.

కా.రాధ క్యాడర్‌లు, ప్రజలు, నాయకత్వ కామ్రేడ్స్ అందరితోనూ కలుపుగోలుగా మాట్లాడేది. వ్యక్తిగత సమస్యలు వచ్చినప్పుడు కూడా కా.రాధ కుంగిపోకుండా పార్టీ పద్ధతిలో పరిష్కరించుకునేది. పార్టీ రహస్య పని విధానాన్ని సరిగా అర్థం చేసుకున్న కా.రాధ దీర్ఘ ప్రయాణాలకు వెనుకా ముందూ ఆడేది కాదు. 2018 మే 13వ తేదీన కందమాల్ జిల్లా సుద్రుకుంప అటవీ ప్రాంతంలో ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు కా.రాధ ఉన్న దళం మీద దాడి చేసారు. ఈ దాడిలో కా.వినయ్, కా.గగన్, కా.భీమా, కా.శీలలతో కా.రాధ కూడా అమరురాలయింది. ఈ కాల్పులలో కా.రాధకే మొదటగా తూటా తగిలి పడిపోయింది. తాను లేచి రాలేనని ఇతరులయినా అక్కడి నుంచి తప్పించుకుని సురక్షితంగా ఉండమనీ చెప్పిన వీర యోధ మన కా.రాధ.

# ఉద్యమ మైదానాలు దాటుకుంటూ ప్రాణాలిచ్చిన కామ్రేడ్ జైసింగ్

కామ్రేడ్ జైసింగ్ ఇడ్కో దండకారణ్యంలో మాన్‌పూర్ డివిజన్, మదన్‌వేడ బ్లాక్‌లో రేతె గ్రామంలో జన్మించాడు. కా.జైసింగ్‌ది మధ్య తరగతి కుటుంబం. నలుగురు అన్నదమ్ముల్లో రెండోవాడు. గ్రామంలో ఉన్నప్పుడు గ్రామ ప్రజా సంఘం, మిలీషియాలలో చురుకుగా పాల్గొనేవాడు. అప్పటికే మాన్‌పూర్ డివిజన్‌లో కొనసాగుతున్న విప్లవ కార్యకలాపాలకు ఆకర్షితుడయి, 2009లో పూర్తి కాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. ఏడాది కాలం మదన్‌వేడ ఎల్‌ఓఎస్‌లో పని చేసాడు. ఆ సమయంలో ప్రజలతో మమేకం అవుతూ ప్రజా యుద్ధాన్ని అర్థం చేసుకున్నాడు. పార్టీ అవసరాల రీత్యా 2010లో నూతనంగా ఏర్పడిన మైన్‌పూర్ డివిజన్‌కు బదిలీ అయ్యాడు. 2014 వరకు ఉదంతి ఏరియా దళంలో సభ్యుడిగా, 2014 నుంచి 2015 వరకు రాష్ట్ర కమిటీ సభ్యుని గార్డ్‌గా, 2016-17లో గోబ్రా ఎల్‌ఓఎస్ సభ్యుడిగా పని చేసాడు. 2018 జులైలో జిల్లాలో ఎల్‌జిఎస్‌ను పటిష్టం చేయడంలో భాగంగా కా.జైసింగ్‌ను ఎల్‌జిఎస్‌కు బదిలీ చేసారు.

మైన్‌పూర్ డివిజన్‌లో ఉదంతి, గోబ్రా ఏరియాల్లో ఉద్యమాన్ని నిర్మూలించడం కోసం శత్రువు తీవ్ర నిర్బంధాన్ని అమలు పరిచాడు. ఎన్నో సార్లు దళాలపై ఎన్‌కౌంటర్లు జరిగినా, శత్రు దాడిని తిప్పి కొడుతూ ఉద్యమంలో నిలబడ్డాడు. ఒక సీనియర్ పార్టీ సభ్యుడిగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. పార్టీ చెప్పిన పనిని మనస్ఫూర్తిగా చేసేవాడు. పార్టీ అవసరాలకి, ప్రాధాన్యతనిస్తూ ఏ ప్రాంతానికైనా బదిలీ అయ్యాడు. పోలీసు కూంబింగ్స్ మధ్య సివిల్‌లో వెళ్లి కూడా ధైర్యంగా పని చేసేవాడు.

ఇలా పార్టీ పని మీద వెళ్లినప్పుడు ధంతరీ జిల్లాలో మందగిరి ప్రాంతంలో ఒక గ్రామంలో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో కా.జైసింగ్‌ను పోలీసులు 2018 సెప్టెంబరు 4వ తేదీన అరెస్టు చేసారు. అదే రోజు తీవ్ర చిత్రహింసలకు గురి చేసి కాల్చి చంపారు. ఈ హత్యా నేరాన్ని కప్పి పుచ్చుకోవడానికి ఎన్‌కౌంటర్‌లో మరణించాడని ధంతరి ఎస్‌పి ప్రకటించాడు.

పోలీసులు తీవ్ర చిత్రహింసలకు గురి చేసినా రహస్యాన్ని కాపాడి పార్టీని రక్షించిన కా.జైసింగ్ క్యాడర్‌లకు ఆదర్శం. ప్రజల కొరకు తన ప్రాణాన్ని అర్పిస్తూ కా.జైసింగ్ అమరుడైనాడు. కా.జైసింగ్‌కు విప్లవ జోహార్లు.

**ఒడిశా రాష్ట్ర కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ**

**(మావోయిస్టు)**

**2019 జనవరి**

**"తన స్వంతం కోసం ఏమి చేసుకోకుండా ప్రతి పని ఇతరుల ప్రయోజనం కొరకు చేసే కామ్రేడ్ బెతూన్ దీక్ష, తన పనిలో బాధ్యతపట్ల చాలా గొప్ప గుర్తింపు, తన కామ్రేడ్స్, ప్రజలపట్ల చాలా గొప్ప ఆప్యాయతల ద్వారా వ్యక్తమైంది. ప్రతి కమ్యూనిస్టు ఆయన నుండి నేర్చుకోవాలి. చెప్పకొనతగినంత మంది తమ పనిలో బాధ్యతారహితంగా ఉంటున్నారు. "తేలికైనదాన్ని ఎంచుకొని బరువైనదాన్ని నెట్టివేయడం" అంటే అధికమైన బరువులను ఇతరులపైకి నెట్టి తమకోసం తేలికైన వాటిని ఎంచుకోవడం. ఏదైనా ముంచుకొచ్చినప్పుడు వారు తమను గురించి మాత్రమే ఆలోచించుకొని ఇతరుల గురించి ఆ తర్వాత మాత్రమే ఆలోచిస్తారు. వారు శ్రమ చేసినప్పుడు గర్వంతో పొంగిపోతారు. దాన్ని గురించి ఇతరులకు తెలియదేమోనని అతి గొప్పలు చెప్పకుంటారు. తన తోటి కామ్రేడ్స్‌పట్ల, ప్రజలపట్ల వారు నిండైన ఉత్సాహంతో మెలగకుండా అయిష్టంగాను, సాన్నిహిత్యం లేకుండాను నిర్లక్ష్యంగానూ, అనాసక్తితోను వ్యవహరిస్తారు. అలాంటివారు నిజంగా కమ్యూనిస్టులు కారు. లేదా కనీసంగా చెప్పాలంటే మంచి కమ్యూనిస్టులుగా లెక్కించబడజాలరు. యుద్ధరంగం నుండి తిరిగి వచ్చినవారిలో ఏ ఒక్కడు బెతూన్ పేరు చెప్పినప్పడు తమ ప్రశంసాభావాన్ని వ్యక్తపరచకుండా ఉండలేకపోయారు. ఏ ఒక్కరూ ఆయన దీక్షకు చలించకుండా ఉండలేకపోయారు. డాక్టర్ బెతూన్ చేత వైద్యం చేయించుకొన్నటువంటి లేదా తన పనిని ఆయన ఏ విధంగా చేసేవాడో తమ స్వంత కళ్ళతో చూసినటువంటి షాన్సీ - చాహాట్-హూపే సరిహద్దు ప్రాంతాలలోని సైనికులూ, పౌరులలోని ఏ ఒక్కరూ చలించకుండా ఉండలేకపోయారు. ప్రతి కమ్యూనిస్టు ఈ నిజమైన కమ్యూనిస్టు దీక్షను కామ్రేడ్ బెతూన్ నుండి నేర్చుకోవాలి."**

*-మావో రచనలు రెండవ సంపుటి, కామ్రేడ్ నార్మన్ బెతూన జ్ఞాపకార్థం, 420వ పేజి.*

# ఎ.ఒ.బిలో పాశవికంగా కొనసాగుతున్న 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని, పార్టీ నేతృత్వంలో అత్యంత ధైర్యసాహసాలతో ప్రతిఘటిస్తూ, విప్లవోద్యమాన్ని పురోగమింపజేస్తున్న ప్రజలు

దేశవ్యాప్తంగా సి.పి.ఐ (మావోయిస్టు) నాయకత్వంలో నిర్మాణం అవుతున్న విప్లవోద్యమాన్ని సంపూర్ణంగా నిర్మూలించే దుష్ట తలంపుతో, సరికొత్త వ్యూహాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా, ఆపరేషన్ గ్రీన్‌హంట్ కొనసాగింపుగా 2017 నుంచి 'సమాధాన్' పేరుతో క్రూరమైన సైనిక దాడిని అత్యంత దూకుడుగా కొనసాగిస్తున్నారు. ఈ దాడి ప్రధానంగా విప్లవోద్యమంపై ఎక్కుపెట్టబడి, దేశంలోని మత మైనారిటీలు, జాతులు, దళితులు, నిజమైన దేశ భక్తులు, లౌకిక శక్తులు, ప్రగతి కాముకులపై కూడా సంపూర్ణ యుద్ధంగా రూపుదిద్దుకున్నది.

ఈ దాడి లక్ష్యం, పోరాడే ప్రజలకు నాయకత్వం లేకుండా నిర్మూలించడం, ప్రజాస్వామిక వాదులపైనా, మేధావులపైన ఫాసిస్టు చట్టాలు మోపి, వాళ్ళను జైళ్ళలో బంధించడం, ప్రశ్నించే వారినీ, ప్రజల పక్షం వహించేవారినీ, భయభ్రాంతులకు గురి చేసి, లొంగదీసుకోవడం, మొత్తంగా ప్రజలపై తమ బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు దాడిని ఎక్కుపెట్టి కొనసాగించడంగా ఉంది. గత సంవత్సరం సెప్టెంబర్ మాసంలో అధికార టి.డి.పి ఎమ్.ఎల్.ఎ, మాజీ ఎమ్.ఎల్.ఎలైన కిడారి సర్వేశ్వరరావు, సీవేరి సోమాలు గనుల మాఫియాగా అవతారం ఎత్తి, ప్రజా పీడకులుగా మారడంతో, పి.ఎల్.జి.ఎ వారిని ఖతం చేసింది. దీంతో ఎ.ఒ.బి వ్యాప్తంగా ప్రభుత్వాల దాడి మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ నిర్బంధంలో భాగంగా ఉద్యమ ప్రాంతాలలోనూ, మనం దెబ్బతిని వదిలివేసిన ప్రాంతాలలోనూ, నూతనంగా మనం ప్రవేశించే ప్రాంతాలలోనూ, ఒక్క మాటలో చెప్పాలంటే విశాల ప్రాంతంలో, దీర్ఘకాలిక దృష్టితో ఇంటలిజెన్సీ వ్యవస్థను బలోపేతం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా (ఆంధ్ర-ఒడిశా)ల ఆదేశాలకనుగుణంగా, యూనిఫైడ్ కామండ్ నేతృత్వంలో కేంద్ర పారా మిలటరీ బలగాలు, స్పెషల్ కమాండో బలగాలు సంయుక్తంగా తమ దాడిని తీవ్రతరం చేశాయి. 3 నుండి 10 రోజుల వరకు భారీ ఏరియా డామినేషన్స్‌ను కొనసాగిస్తూ, మన కార్యకలాపాలకు ఆటంకాలు కల్పించడం, మన సమాచారం దొరికితే కొన్ని గంటలలోనే దళాలను చుట్టుముట్టి దాడులు చేయడం పెరిగింది. ముఖ్యంగా ఎ.పిలో ఈ ఏరియా డామినేషన్స్ ఫ్రీక్వెన్సి చాలా పెరిగింది. కొన్ని ఏరియాలలో వారం రోజుల వరకు కూడా వెసులుబాటు యివ్వడంలేదు. ప్రది 10, 15 రోజులకు ఒకసారి మొత్తం ఏరియాలను దిగ్బంధనం చేసి గాలిస్తున్నారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మరుసటి రోజునుంచి ఎన్నికలు ముగిసేవరకు సుమారు నెల రోజులు ఏరియాలను ఒక్కరోజు కూడా ఖాళీ చేయకుండా మొత్తం ప్రాంతాలను తమ అదుపులో పెట్టుకోవడానికి, ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేయడానికి ప్రయత్నిస్తూ, మనం చేపట్టిన ఎన్నికల బహిష్కరణ కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు.

మార్చి, 2019లో పని నిమిత్తం పెదబయలు ఏరియాకు వచ్చి, వాపస్ అవుతున్న నందపూర్ దళం సమాచారాన్ని ఎ.పి ఎస్.ఐ.బి పసిగట్టింది. ఈ సమాచారాన్ని ఒడిశా పోలీసులకు అందజేయడంతో పాటు, గ్రేహౌండ్స్ పోలీసులు కూడా నందపూర్ దళం కోసం ఎంగేజ్ అయ్యారు. ఈ క్రమంలో మార్చి 13న గ్రేహౌండ్స్ బలగాలు బురదమామిడి గ్రామం వద్ద మన దళాన్ని చుట్టుముడుతున్న క్రమంలో, అదే సమయానికి వేటకు వెళ్ళి అటుగా వస్తున్న సాధారణ రైతులను పోలీసులు చూసి, దళంగా భావించి, విచ్చలవిడిగా కాల్పులు జరపడంతో ఇద్దరు రైతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. దళం అప్రమత్తమై తప్పుకుంది. ఈ సంఘటన తర్వాత కూడా దళాన్ని సమారు వారం రోజులపాటు వెంబడించారు. ప్రజల సహకారంతో దళం సురక్షితంగా తప్పుకుంది. ఇదే దళం కొరాపుట్ జిల్లా, కితుబా గ్రామం వద్ద మే 8న ఉదయం 5గం॥లకు మకాం వేయగా, పక్కా సమాచారం అందుకున్న స్పెషల్ కమాండో బలగాలు, మధ్యానం 2గం॥లకు చుట్టుముట్టి, దాడి చేయగా దళ కామ్రేడ్స్అందరూ అత్యంత ధైర్య సాహసాలతో ఆ చుట్టివేతను ఛేధించడానికి తీవ్రంగా పోరాడుతూ, డి.వి.సి.ఎమ్ కా॥ రింకితోపాటు, ఐదుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. నిత్యం ప్రజల సహకారం, అప్రమత్తత, చలనశీలతలను పాటిస్తున్నప్పటికీ, చిన్న పొరపాటు కూడా పెద్ద నష్టానికి దారి తీస్తుందని ఈ సంఘటన మనకు తెలియచేసింది.

ఇక గ్రామాలపై పోలీసు దాడులు గతంలో కన్న తీవ్రతరమయ్యాయి. ఆకస్మికంగా రాత్రులకు రాత్రే వందలాది బలగాలు గ్రామాలను చుట్టుముట్టి, ప్రజా సంఘ నాయకులను అరెస్టు చేసి ఎత్తుకుపోవడం, చిత్రహింసలకు గురి చేయడం, అక్రమ కేసులు బనాయించి జైళ్ళలో నిర్బంధించడం పెరిగింది. అయితే పార్టీ ఇచ్చిన చైతన్యంతో ప్రజలు గ్రామలపై దాడులకు వచ్చే పోలీసు బలగాలను సాంప్రదాయాక ఆయుధాలతో సాముహికంగా ప్రతిఘటించడం, అరెస్టులను అడ్డుకోవడం, అరెస్టు చేసిన వారిని విడిపించుకోవడం వంటి ప్రతిఘటనా చర్యలను చేయడంతో, పోలీసు దాడులు గ్రామాలపై కొంత మేరకు తగ్గాయి. దీంతో పోలీసులు మరో ఎత్తుగడకు పూనుకున్నారు. స్థానిక పోలీసు ఏజెంట్ల సమాచారంతో సంఘకార్యకర్తలు ఒంటరిగా ప్రయాణం

చేస్తున్నప్పుడు, వారపు సంతలకు, బంధువుల ఇళ్ళకు, వైద్యం కోసం, పట్టణాలకు వెళ్తునప్పుడు మఫ్టీలో ఉన్న పోలీసులు వారిని అరెస్టు చేసి తీసుకెలుతున్నారు.

ఎ.పి, తెలంగాణ బహిరంగ ప్రజా సంఘాలలో పని చేస్తున్న నాయకులనూ, కార్యకర్తలనూ, ప్రజాస్వామిక వాదులను అర్బన్ మావోయిస్టులగా ముద్రవేసి, నల్లచట్టాలను మోపి, అనేక మందిపై అక్రమ కేసులు బనాయించారు. అందులో కొందరిని అరెస్టులు చేసారు. మరికొందరిపై నిరంతరం నిఘా పెట్టి వేధిస్తున్నారు. అదును చూసి అరెస్టులు చేయడానికి రంగం సిద్ధం చేసి, భయాందోళనలకు గురి చేస్తున్నారు. పార్టీ సానుభూతిపరులపైన, మద్ధతుదారులపైన దాడులు చేసి, అరెస్టు చేస్తున్నారు.

ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా, విప్లవోద్యమంపైన తీవ్ర దుష్ప్రచార దాడిని ఒక క్యాంపెయిన్‌గా కొనసాగిస్తున్నారు. మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులని నిరంతరం ప్రచారం చేస్తూ, మనం ఇన్‌ఫార్మర్లను శిక్షించినప్పుడు ఆదివాసీలను హత్య చేస్తున్నామని ఆదివాసీ సంఘాల పేర్లతో పోస్టర్లు, కరపత్రాలు వేయిస్తున్నారు. స్కూల్ పిల్లలను బలవంతంగా తీసుకెళ్ళి పార్టీకి వ్యతిరేకంగా రాసిన ప్లేకార్డులను వారి చేతుల్లో పెట్టి ఊరేగింపులు, కొవ్వొత్తుల ప్రదర్శనలు చేయిస్తున్నారు. స్థానిక ఎస్.ఐ మొదలు ఎస్.పిల వరకు విప్లవోద్యమంపై విషం కక్కుతూ, రెగ్యులర్‌గా పత్రికా ప్రకటనలు, ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. పార్టీ చేతిలో ఖతం చేయబడిన పోలీసు ఏజెంట్ల పేరుతో జులై 28 సందర్భంగా తెల్ల (గుడ్డ)స్థూపాలు నిర్మించి నివాళులు అర్పిస్తున్నారు. అలాగే మానసిక యుద్ధంలో భాగంగా, అరెస్టు చేసిన వారిని లొంగిపోతున్నట్లుగా ప్రకటనలు ఇవ్వమని బెదిరించడం, విప్లవకారుల కుటుంబ సభ్యులపై 'మీ పిల్లలను ఇంటికి రమ్మని ప్రకటనలు ఇవ్వమని' ఒత్తిడి చేయడం, పోలీసు అధికారులు వ్యక్తిగతంగా పూర్తికాల కార్యకర్తలకు ఆశలు, భ్రమలు, బెదిరింపులు కలగలిపిన ఉత్తరాలు రాస్తూ, లొంగిపొమ్మని సందేశాలు పంపుతున్నారు.

## శత్రు దాడిని ఎదిరిస్తూ ప్రజల ప్రతిఘటన

ఎమ్.కె.వి.బి డివిజన్‌లోని, పెదబయలు ఏరియాలో జనవరి నెలలో గ్రామ సంఘ నాయకుడు కా॥ రాంమూర్తిని స్థానిక పోలీసు ఏజెంట్లు ఇచ్చిన పక్క సమాచారంతో రాత్రి యింట్లో నిద్రిస్తున్నప్పుడు స్పెషల్ బలగాలు ఇంటిని చుట్టుముట్టి అరెస్టు చేశారు. ఈ సమాచారం కొద్ది నిమిషాల్లోనే గ్రామంలోని ప్రజలకు చేరింది. ప్రధానంగా మహిళలు, పురుషులు సాంప్రదాయక ఆయుధాలతో పోలీసులపై తిరగబడి అరెస్టు చేసిన సంఘ నాయకుడిని విడిచిపెట్టాలని పట్టు పట్టారు. ఆయనను ఒక బ్యాచీ తరలిస్తుండగా మిగిలిన బలగాలు ప్రజలను అడ్డుకున్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సుమారు అరగంటకుపైగా ఘర్షణ జరిగింది. నలుగురు గ్రేహౌండ్స్ కమాండోలకు తీవ్రంగా గాయాలవ్వగా, కొందరు గ్రామ మహిళలు కూడా గాయపడ్డారు. తెల్లవారి వందలాది మంది ప్రజలు తరలివెళ్ళి ఐ.టి.డి.ఎ ఆఫీసు ముందుకు ఊరేగింపుగా వెళ్ళి రాంమూర్తిని బేషరతుగా విడుదల చేయాలనీ, ప్రజలపై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు ఆఘమేఘాల మీద సంఘ నాయకుడిని అదేరోజు కోర్టులో హాజరుపర్చారు. "ప్రజలే మా గ్రేహౌండ్స్ కమాండోలపై దాడి చేసి, నలుగురుని తీవ్రంగా గాయపర్చారు" అంటూ పోలీసు అధికారులు హాస్పిటల్‌లో జాయిన్ అయిన తమ పోలీసులను విలేఖరులకు చూపించారు.

పెదబయలు (ఎ.పి) ఒడిశా సరిహద్దులోని జోడిగూడ గ్రామంపై ఫిబ్రవరిలో ఒడిశాలోని జంతబాయిలోని బి.ఎస్.ఎఫ్ క్యాంపు బలగాలు రాత్రికి రాత్రే గ్రామస్తులందరూ నిద్రలో వున్న సమయంలో గ్రామాన్ని చుట్టుముట్టి సంఘం కామ్రేడ్స్‌ను అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. ఉదయం 4గం॥ల సమయంలో చివరిగా ఒక ఇంటిని సోదా చేయడానికి సిద్ధపడగా గ్రామసెంట్రీ ప్రజలందరిని అప్రమత్తం చేశాడు. కొద్ది నిమిషాలలోనే గ్రామ ప్రజలందరు ఎవరికి దొరికిన ఆయుధాన్ని (గొడ్డళ్ళు, కర్రలు, రాళ్ళు) పట్టుకొని ఒక దగ్గరకు చేరుకొని పోలీసులను ప్రవేశించకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ప్రజలకు, పోలీసులకు మధ్య 2గం॥ల పాటు తీవ్రంగా ఘర్షణ జరిగింది. పోలీసులను నెట్టి క్రింద పడవేశారు. పోలీసులు ఆయుధాలు లోడ్ చేస్తుండగా మీదపడి ఆయుధాలు లాక్కొవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఒక వాకీని, కొన్ని తూటాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు గ్రామం బయటే ఆగి మరిన్ని ఆదనపు బలగాలను పిలిపించుకొని తిరిగి గ్రామానికి వెళ్ళి క్షమాపణ చెప్పి, మరోసారి గ్రామానికి రామని తమ వాకీ వాపస్ ఇవ్వమని ప్రాధేయపడ్డారు. ఈ ఒప్పందంలో భాగంగా వాకీని వాపస్ ఇచ్చారు. ఈ ప్రతిఘటనలో ఒక బి.ఎస్.ఎఫ్ జవాన్ తీవ్రంగా గాయపడగా మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు.

కటాఫ్ ఏరియాలోని దకడపొదర్ గ్రామంపై, గతంలో పార్టీలో పనిచేసి, విప్లవ ద్రోహిగా మారిన సుధీర్, బి.ఎస్.ఎఫ్ పోలీసులను వెంటబెట్టుకొని గ్రామం చివరలో ఉన్న సంఘ నాయకుడు చందన్ ఇంటిపై దాడి చేసి పట్టుకున్నారు. ఈ విషయం కొద్దిసేపటిలోనే గ్రామస్తులకు చేరింది. రాత్రి 12గం॥ల నుంచి 1గం॥ మధ్య ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో పోలీసుల వెంటపడి గంట దూరంలో ఉన్న దాబగూడ వరకు పరుగెత్తి పోలీసులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ప్రజలకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ప్రజలపైకి పోలీసులు కాల్పులు ప్రారంభించి 'సంఘ నాయకులు పారిపోతున్నారు పట్టుకొండి' అంటూ పెద్ద పెద్దగా అరిచారు. అరుస్తూనే ఆ చీకట్లో పోలీసులు మాయమయ్యారు. ప్రజలు ఎటు తేల్చుకోలేక తిరిగి గ్రామానికి చేరుకున్నారు. పోలీసులకు, ప్రజలకు ఘర్షణ జరుగుతున్న సమయంలో పోలీసులు సంఘ నాయకుడు పారిపోతున్నాడని పెద్దగా అరుస్తూ, ప్రజలను పక్కదారి పట్టించి, మరో పోలీస్ బ్యాచీ గుట్టు చప్పుడు కాకుండా సంఘనాయకుడిని తరలించారని ప్రజలు తర్వాత తెలుసుకున్నారు.

## ఆపరేషన్ 'సమాధాన్' ను వ్యతిరేకిస్తూ ప్రజల ప్రచార ఆందోళన కార్యక్రమం





దేశవ్యాప్తంగా విప్లవోద్యమంపైనా, మత మైనారిటీలు, జాతులు, లౌకిక శక్తులు, నిజమైన దేశ భక్తులపైన బ్రహ్మణీయ హిందూ ఫాసిస్టులు 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని అత్యంత అమానుషంగా, పాశవికంగా కొనసాగించడాన్ని నిరసిస్తూ జనవరి 25 నుంచి 30 వరకు ప్రచారం, ఆందోళనలు చేపట్టి, 31న బంద్‌ను విజయవంతం చేయాలని సి.ఆర్.బి పిలుపునిచ్చింది.

ఈ పిలుపును ఎ.ఒ.బి నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడంలో భాగంగా, ఎస్.జడ్.సి పేరుతో పత్రికా ప్రకటన ఇచ్చాము. పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా ఎమ్.కె.వి.బి డివిజన్ వ్యాప్తంగా ప్రచారం చేశాము. జనవరి 23 నుంచి అంతటా పోలీసు బలగాలను మోహరించినప్పటికీ, జనవరి 25 నుంచి కటాఫ్ ఏరియాలో ప్యాకెట్‌ల వారిగా ప్రజలు ర్యాలీలు నిర్వహించి సభలు జరిపారు. జొంత్రి, పాకెట్‌లోని 7 గ్రామాలలోని 500 మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాబేరు పాకెట్‌లో 300 మంది, ఒంద్రుపల్లి పాకెట్‌లో 450, ముకుడుపల్లిలో 500, సిమ్లిపొదర్‌లో 600, కొజ్జరిగూడలో 400, ఎ.పిలోని కొసంపూట్‌లో 400 మందితో కార్యక్రమాలను నిర్వహించారు. తమ నిరసనను తెలియజేస్తూ, డివిజన్ బంద్‌ను ప్రజలు సంపూర్ణంగా విజయవంతం చేశారు. పోలీసులు వారం రోజులు ఏరియాలో కూంబింగ్ కొనసాగించినా ప్రజలు లెక్కచేయకుండా తమ నిరసనను తెలియజేశారు.

## ప్రజల భాగస్వామ్యంతో స్థానిక శత్రువు నెట్‌వర్క్‌ను గుర్తించి, ప్రజామోదంతో శిక్షలు విధించిన మిలీషియా

పెదబయలు ఏరియాలో, గిన్నెలకోట పంచాయితీలోని, బొంగిజంగి, లండూలు, సుర్తన్‌పూట్ గ్రామాల సంఘాల నుంచి, కొందరు దిగజారి, శత్రువు ముందు సరెండర్ అయిన సందర్భంలో వారిలో కొందరికి పోలీసులు డబ్బులు ఆశ చూపి, మరికొందరిని బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి లోబర్చుకున్నారు. వారి ద్వారా పకడ్బందిగా ఇంటలీజెన్సీ నెట్‌వర్క్‌ను ఏర్పర్చి, వారికి మొబైల్స్, మోటార్ సైకిల్ ఇచ్చి దళ సమాచారం, ముఖ్య సంఘ నాయకుల సమాచారం సేకరించే బాధ్యతను అప్పగించారు. ఈ టీంలు సంతలకు వెళ్ళే సంఘ నాయకుల సమాచారాన్నీ, రాత్రుళ్ళు ఇళ్ళలో పడుకునే కార్యకర్తల సమాచారాన్ని ఇచ్చి, సుమారు 10 మందిని అరెస్టు చేయించారు. ఈ సందర్భాలలో పోలీసుల నుంచి డబ్బులు తీసుకున్నారు. వీరి కార్యకలాపాలను గ్రహించిన ప్రజలు, ఈ విషయాన్ని సంఘ నాయకత్వం దృష్టికి తెచ్చారు. తర్వాత ఈ సమాచారాన్ని అందుకున్న పార్టీ, గిన్నెలకోట పంచాయితీలోని 7, 8 గ్రామాల మిలీషియాను జమ చేసి, వారి ద్వారా లండూలు గ్రామంలోని పోలీసు ఏజెంట్లను పట్టుకొని ప్రజల్లో పెట్టి విచారించగా, వారు వాస్తవాలను అంగీకరించారు. వీరిని ఆర్గనైజ్ చేసిన వాడిలో ముఖ్యుడు బొంగిజంగి గ్రామానికి చెందిన సత్తిబాబు. వీడి ద్వారా మొత్తం కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు బహిర్గతమైంది. దీంతో 8 గ్రామాల ప్రజల ఆమోదంతో, మిలీషియా సత్తిబాబును ఖతం చేసింది. మిగిలినవారికి దేహశుద్ధి చేసి, కండిషన్స్ పెట్టి వదిలి పెట్టారు.

పార్టీ, సత్తిబాబు ఇచ్చిన సమాచారంపై ఆధారపడి, ఇంజరి పంచాయితీలోని నానబరి గ్రామంలో మరికొందరు ఇన్ఫర్మర్లను పట్టుకున్నది. వారిని ప్రజలలో విచారించగా వాస్తవాలు అంగీకరించారు. వీరిని కూడా సత్తిబాబు గ్యాంగే తయారు చేసింది. ఈ విషయాలన్ని బహిర్గతం కావడంతో వారికి దేహశుద్ధి చేసి, ప్రజలు పెట్టిన షరదులకు లోబడి గ్రామంలో బ్రతకాలని నిర్ణయించారు. ఇదే గ్రామం నుంచి కొన్ని సం॥ల క్రితం మోటర్ సైకిల్ రిపేరింగ్ వర్క్ నేర్చుకోవడానికి మద్దిగరువులో సెటిల్ అయిన ఎన్.టి.ఆర్ అనే లంపెయిన్, అంగవైకల్యం గల యువకుడిని పోలీసులు డబ్బులు ఇచ్చి లొంగదీసుకున్నారు. వీడు గ్రామంలో ఉన్న మరో యువకుడిని ఆర్గనైజ్ చేశాడు. ఇతడికి రాత్రికి రాత్రి గ్రామానికి వచ్చి సంఘ నాయకుల గురించి రెక్కి నిర్వహించే పనిని అప్పగించారు. ఒక రోజు రాత్రి 11గం॥ సమయంలో ఎస్.ఐ గ్రామానికి అందుబాటులో ఉండి రెక్కి కోసం ఇతడిని పంపగా, మోటర్‌సైకిల్‌పై వస్తున్న ఆ యువకుడిని గ్రామ సెంట్రీ అరెస్టు చేసి, విచారించగా మొత్తం విషయాలను అంగీకరించాడు. మోటర్ సైకిల్, మొబైల్ స్వాధీనం చేసుకొని అతడికి ప్రజాకోర్టులో దేహశుద్ధి చేశారు.

మిలీషియా ఒక క్యాంపెయిన్‌గా ఏరియాలోని శత్రువు ఏజెంట్లను గుర్తించడం, ప్రజల్లో పెట్టి విచారించడం, ప్రజల ఆమోదంతో శిక్షలు విధించడం చేసింది. "పోలీసులు ఇచ్చే డబ్బుల ఆశకు, వారి భయాలకు ఎవరు కూడా ప్రజలకు, పార్టీకి వ్యతిరేకులుగా, విప్లవ ద్రోహులుగా మారవద్దు" అంటూ ప్రచారం చేసింది. అప్పటి నుండి వరుస అరెస్టులు తాత్కాలికంగా ఆగిపోయాయి.

## పి.ఎల్.జి.ఎ చేపట్టిన ప్రతిఘటన

ప్రధాన, సెకండరీ బలగాలతోపాటు, మిలీషియా ఎన్నికల సందర్భంగా లోపలికి వచ్చిన శత్రుబలగాలకు నష్టం కల్గించడానికి తీవ్ర ప్రయత్నాలు చేసింది. శతృవు అదనపు జాగ్రత్తలు తీసుకొని ప్రయాణించడం, హెలిక్యాప్టర్‌ల ద్వారా బలగాలు తరలించడం వంటి పద్ధతులు అనుసరించి నష్టాలను నివారించుకున్నాడు.

మే 12న మాచిఖండ్ ఏరియాలో గోవిందపల్లి-బైఫరిగూడ రోడ్డు ఓపెనింగ్ పార్టీని లక్ష్యంగా చేసుకొని, సప్తదార బ్రిడ్జివద్ద మైన్స్ అమర్చి, రిమోట్ ద్వారా పేల్చివేయగా, ఒక బి.ఎస్.ఎఫ్ జవాన్ తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరు తృటిలో తప్పించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు, మిలీషియా ప్రతిఘటన ద్వారా శతృవు దూకుడును ఒక మేరకు అడ్డుకోవడం జరిగింది. అలాగే స్థానిక ఇన్‌ఫార్మర్స్‌ను గుర్తించి శిక్షించడం ద్వారా ప్రజలలో పని చేయడానికి కొంత వెసులుబాటు సంపాదించుకోగలిగాం.

## లోక్‌సభ, శాసనసభ (ఒడిశా-ఆంధ్రప్రదేశ్) ఎన్నికలను క్రియాశీలకంగా బహిష్కరిస్తూ, విప్లవ ప్రజా రాజ్యాధికార నిర్మాణాలే ప్రత్యామ్నాయమంటూ నినదించిన విప్లవ ప్రజానీకం





**నవీన్ ప్రభుత్వం 100కోట్ల ప్యాకేజీని ప్రకటించడంలో దాగివున్న కుట్రను బహిర్గతం చేస్తూ, 8వేల మందితో సభ నిర్వహించుకున్న ప్రజానీకం**

2019 ఏప్రిల్‌లో కేంద్రంలో లోక్‌సభకు, రాష్ట్రాలలో (ఎ.పి-ఒ.ఎస్) శాసనసభకు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించారు. ఆ మరుసటి రోజు నుండే ఎ.ఒ.బిలోని ఉద్యమ ప్రాంతామంతటా కమాండో బలగాలను, కేంద్ర అర్ధసైనిక బలగాలను మోహరించి, ఎన్నికలు ముగిసేవరకు మన రాజకీయ ప్రచారాన్ని, ఎన్నికల బహిష్కరణను అడ్డుకున్నారు. బూర్జువా పార్టీల ఎన్నికల ప్రచారం కోసం నాయకుల రక్షణే లక్ష్యంగా కూంబింగ్‌లు, తనిఖీలు విస్తృతంగా చేపట్టారు.

'ఎన్నికలను బహిష్కరించి, విప్లవ రాజ్యాధికార కమిటీలను నిర్మించుకుందా'మంటూ కేంద్రకమిటీ విడుదల చేసిన సర్క్యులర్, ఎ.ఒ.బి ఎస్.జడ్.సి విడుదల చేసిన లేఖ, వ్యూహం-ఎత్తుగడలలోని ఎన్నికల బహిష్కరణపై అవగాహనను ఎమ్.కె.వి.బిలోని ప్రజా నిర్మాణాలకు మొదట ఎడ్యుకేషన్‌గా తీసుకుపోవాలని నిర్ణయించాం. అందులో భాగంగా, పెదబయలు ఏరియాలో, ఏరియా విప్లవ రైతుకూలీ సంఘం కాన్ఫరెన్స్ జరిపి, ఎన్నికల బహిష్కరణ కార్యక్రమాన్ని ప్రజలలోకి తీసుకుపోయే నిర్ణయం చేశారు. ఆ తర్వాత కొన్ని పాకెట్స్‌లలో క్లాసులు నిర్వహించి, కార్యక్రమం రూపొందించారు. ఈ సమయంలో పోలీసులు ఏరియా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సాయుధ బలగాలను మోహరించి అన్ని గ్రామాలను తమ ఆధీనంలో పెట్టుకునేందుకు ప్రయత్నించారు. ఎన్నికలు ముగిసేవరకు ఏరియాను ఖాళీ చేయకుండా (నెల రోజులు) కూంబింగ్‌లు నిర్వహించారు. అయినప్పటికీ, ఏ గ్రామానికి ఆ గ్రామంలోనే సంఘాలు ప్రజలతో మీటింగ్‌లు నిర్వహించి, ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిస్తూ ప్రచారం చేశాయి.

కటాఫ్ ఏరియాలో పార్టీ, ప్రజా నిర్మాణాలలో పని చేస్తున్న ముఖ్యమైన నాయకత్వా కోర్‌కు అనేక బ్యాచీలుగా వందలాది మందికి రాజకీయ క్లాసులు నిర్వహించి ఎన్నికల బహిష్కరణ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ క్లాసులలో పాల్గొన్నవారితో 14 క్యాంపెయిన్ టీంలను నిర్మించి, ఏరియాలోని గ్రామాలలో ఎన్నికలు ముగిసే వరకు 2, 3 దఫాలుగా రాజకీయ ప్రచారాన్ని నిర్వహించారు. ఎక్కడికక్కడ గ్రామాలలో కూడా సంఘాలు మీటింగ్‌లు నిర్వహించాయి. పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా విస్తృతంగా ప్రచారం కొనసాగించారు. పత్రిక ప్రకటనలు యిచ్చారు.

ఏరియాలోని 6 పంచాయితీలలోని సుమారు 80 నుండి 90 గ్రామాల ప్రజలను సమీకరించి 8వేల మంది ప్రజలతో ఊరేగింపు, భారీ బహిరంగ సభ జరిపారు. ఈ సందర్భంగా ప్రజలు ఎన్నికలను

బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. కటాఫ్ ఏరియా అభివృద్ధి కోసం ప్రభుత్వం 100కోట్ల ప్యాకేజీని ప్రకటించడంలో దాగివున్న కుట్రను బహిర్గతం చేశారు. ఈ సందర్భంగా ప్రజల మౌలిక సమస్యలను ముందుకు తెచ్చారు. అలాగే ఈ ప్రాంతంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పడిన ఐక్యసంఘటన వేదిక కూడా ఎన్నికలను బహిష్కరిస్తామని ప్రకటించింది. అనేక మంది పత్రిక విలేఖరులు ప్రజలను కలిసి వారి అభిప్రాయాలను సేకరించారు. విలేఖర్లందరికి ఒకే సమాధానంగా ఎన్నికలను బహిష్కరిస్తామని బహిరంగంగా ప్రకటించారు. ఈ సమయంలో పోలీసులు ఏరియాలోకి ప్రవేశించే సాహసం చేయలేదు. ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా ఎన్నికల ప్రచారానికి కాలు మోపలేదు. ఎన్నికల రోజు మొత్తం ఏరియా ఓటర్ల కోసం కుంతులుపాదర్ పోలీస్ క్యాంపు వద్ద 9 పోలింగ్ బూతులు పెట్టి, హెలిక్యాప్టర్ల ద్వారా పోలింగ్ సిబ్బందిని దించారు. 6 పంచాయితీలలోని ఏ ఒక్కరు కూడా ఓటు వేయకుండా సంపూర్ణంగా ఎన్నికలను బహిష్కరించారు.

పెదబయలు, కోరుకొండ ఏరియాలలో వందలాది బలగాలను మోహరించి, ఎన్నికల తంతును విజయవంతం చేయాలని ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రత్యేకంగా కేంద్రీకరించాయి. అయినా రోడ్లమీద కొన్ని చోట్ల మినహా, గ్రామాల వరకు ఏ రాజకీయ పార్టీ నాయకుడు వచ్చి ప్రచారం నిర్వహించలేకపోయాడు. చివరికి పోలింగ్ బూతులను కూడా, రోడ్డు మీద తమకు సురక్షితం అనుకునే గ్రామాలకు తరలించారు. మన ఉద్యమ ప్రాంతంలోని అనేక చోట్ల పోలింగ్ బూతులను ఎత్తివేశారు. ఓటు వేయాలని నెల రోజులుగా పోలీసులు ప్రజలను నయానా, భయానా ఒప్పించేందుకు ప్రయత్నించినప్పటికీ, ప్రజలు వారి మాటను ఏ మాత్రం లెక్కలోకి తీసుకోలేదు. మెజారిటీ గ్రామాలు ఎన్నికలను పూర్తిగా బహిష్కరించాయి. కొన్ని గ్రామాలలో మాత్రమే అతి తక్కువ మంది ఓటు వేశారు. ఉద్యమ ప్రాంతానికి ఆనుకొని వున్న మైదాన, పట్టణ ప్రాంతమైన పాడేరు నియోజకవర్గంలోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకన్న 'నోటా'కు ఎక్కువ ఓట్లు పడ్డాయని బూర్జువా మీడియానే విశ్లేషిస్తూ కథనాలు ప్రచురించింది.

మనపార్టీ, ప్రజా నిర్మాణాలు ప్రజల్లో చేసిన రాజకీయ ప్రచారం ద్వారా పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, ఫాసిస్టు విధానాలు మరింతగా బహిర్గతమైనాయి. ఈ ప్రాంతంలో ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తూ చూపిన రాజకీయ పరిపక్వత, బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ బోలుతనాన్ని బహిర్గతపర్చింది. ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యాధికార వ్యవస్థ నిర్మాణానికి ప్రజలు సంసిద్ధులవుతున్నారు. కొన్ని చోట్ల ఇదే సమయంలో ఆర్.పి.సిలను నిర్మించుకున్నారు. ప్రజాయుద్ధ రాజకీయాలతో సాయుధమవుతూ, ప్రభుత్వ సాయుధ బలగాల దాడులనూ, బెదిరింపులను తిప్పికొట్టారు. పోలీసులు మాత్రం ఈ ఎన్నికల బహిష్కరణ గురించి ప్రస్తావించకుండా ఎన్నికల సందర్భంగా ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరుగలేదనీ, శాంతి భద్రతలకు విఘాతం కలగలేదనీ, ఈ 'గొప్పతన'మంతా మాదేనని సిగ్గులేకుండా ప్రకటించుకున్నారు.

## వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తూ, ప్రత్యామ్నాయ రాజ్యాధికార దిశగా అడుగులు వేస్తున్న ఎమ్.కె.వి.బి విప్లవ ప్రజానీకం

ఎ.ఒ.బి జోన్‌లోని ఎమ్.కె.వి.బి డివిజన్‌లో ప్రజలు పార్టీ నాయకత్వంలో వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తూ, ప్రత్యామ్నాయ రాజ్యాధికారాన్ని నిర్మించి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే వున్నారు. దానికి కొనసాగింపుగానే గుమ్మ ఎ.సి పరిధిలోనూ, పెదబయలు, కోరుకొండ ఏరియాలలోను అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

ఎమ్.కె.వి.బి డివిజన్ పరిధిలో సీజనల్‌గా వచ్చే వ్యాధులు మలేరియా, టైఫాయిడ్, చర్మవ్యాధులు, విరోచనాల వల్ల అనేక మంది మరణిస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల చిన్న చిన్న సమస్యల (అనారోగ్యం)వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా లోతట్టు గ్రామాలలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని విప్లవ సంస్కరణలలో భాగంగా, ఆర్.పి.సిలు ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్నాయి. ఆర్.పి.సిలు లేనిచోట పార్టీ నుండి ప్రత్యేకంగా వ్యక్తులను కేటాయించడం జరుగుతున్నది.

✦ గుమ్మ ఎ.సి పరిధిలో పార్టీ 80వేల రూపాయల మెడిసిన్ తెప్పించగా, దానికి సానుభూతిపరుల ద్వారా, వివిధ రూపాలలో వచ్చిన దాదాపు 50వేల రూపాయల మెడిసిన్‌ను కలిపి పంపిణీ చేయడమైంది.

✦ పి.బి.ఎల్ ఎ.సి పరిధిలో ఆర్.పి.సి పాకెట్‌లలోనూ, మరికొన్ని పాకెట్‌లలోను వైద్య క్యాంపులు నిర్వహించడమైంది. ఆర్.పి.సి పాకెట్‌లలో మన అభివృద్ధి కమిటీలు గ్రామాల్లో తిరుగుతూ వైద్యం అందించమైంది.

✦ వ్యవసాయంలో మెరుగుదల తీసుకురావడానికి సమిష్టి శ్రమ, సహకార గ్రూపుల ద్వారా భూమిని ఎక్కువ మొత్తంలో సాగులోకి తీసుకువస్తున్నారు. అవకాశం ఉన్నదగ్గర నీటి పారుదల సౌకర్యాన్ని మెరుగుపర్చుకుంటున్నారు.

✦ పి.బి.ఎల్ ఎ.సి పరిధిలోని, కోరుకొండ ఏరియాలో, కొసంపుట్‌లో మెజారిటీగా కొండపోడు ఉన్న భూమే ఉంది. గ్రామానికి సరిపడ పొలం లేదు. నీటి పారుదల సౌకర్యం కల్పిస్తే కొంత సాగులోకి వస్తుందని చర్చించుకొని, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 20 రోజులు 50 మంది శ్రమించి పంట నీటికాలువను నిర్మించారు.

✦ కోరుకొండ ఏరియాలోని రెండు చేపల చేరువులను 4 గ్రామాల ప్రజలు కలిసి నిర్మించుకున్నారు. ఈతలపాడు, చీకటిపల్లి, జాజిపాళెం గ్రామాలు కలిసి ఒక చెరువునూ, రాళ్ళగెడ్డ గ్రామంలో ఒక చెరువును నిర్మించారు. వర్షకాలంలో పంటలకు నీటి వసతిని కల్పించే రకంగా నిర్మించారు.

✦ పి.బి.ఎల్ ఏరియాలో నానాబరి, దోసలబంద, బోడ్డంగాపాడు, బంగారుకొండ మొదలైన 4 గ్రామాలలో మంచినీటి కుండీలు నిర్మించుకున్నారు.

ఈ కార్యక్రమాలన్నీ తీవ్రమైన నిర్బంధం మధ్యనే అమలు పరుచుకుంటున్నారు. గత సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న ఆపరేషన్ 'సమాధాన్' దాడి తీవ్రమైంది. డివిజన్‌లో ఎ.పి-ఒ.ఎస్ ప్రాంతాలలో గ్రామాలపై పోలీసులు దాడులు చేస్తూ, ప్రజలపై కాల్పులకు పాల్పడుతున్నారు. సంతలకు కూడా వెళ్ళలేని పరిస్థితి కల్పిస్తున్నారు. వీటన్నింటిని ధైర్యంగా ఎదుర్కొంటూ, ప్రతిఘటిస్తూనే పై కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

ఈ దోపిడీ ప్రభుత్వం చెబుతున్నట్లు అభివృద్ధి అంటే భారీ రహదారులు, మొబైల్ టవర్స్ కావనీ, భూమి కేంద్రంగా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే కార్యక్రమమని తెలియజేశారు.

## కాఫీ తోటల పోరాటానికి ఆటంకంగా నిలిచిన శక్తులను ప్రజాకోర్టులో నిలదీసిన ప్రజానీకం

విశాఖ మన్యంలోని చింతపల్లి, గూడెంకొత్తవీధి, పాడేరు, పెదబయలు, అరకు, అనంతగిరి మండలాల్లో 10 వేల ఎకరాల భూమిని ప్రభుత్వం ఎ.పి.ఎఫ్.డి.సికి అప్పగించింది. ఎ.పి.ఎఫ్.డి.సి అందులో కాఫీ ప్లాంటేషన్లను వేసింది. స్థానిక ఆదివాసులు, బయటి నుంచి వచ్చిన ఆదివాసులు, శ్రీలంక నుంచి వలస వచ్చిన కాందశీకులు(సిలోన్) ఈతోటల్లో కూలీలుగా శ్రమ చేస్తూ, ఎ.పి.ఎఫ్.డి.సి దోపిడీకి గురవుతుండేవారు. 'అడవిపై హక్కు ఆదివాసీలదే, పీడిత ప్రజలదే' అనే నినాదంతో మన పార్టీ 90లలో ఈ కాఫీ తోటల పోరాటానికి స్థానిక ఆదివాసీ ప్రజలనూ, క్యాంపు లేబర్‌నూ, సిలోన్ కార్మికులను సమైక్యం చేసి, కాఫీ పోరాటానికి నాంది పలికింది. కూలిరేట్ల పెంపుదల మొదలుకొని, క్యాంపు లేబర్‌ను పర్మినెంట్ కార్మికులుగా గుర్తించాలనీ, 24 రోజులు పని దినాలు కల్పించాలనీ, ఇళ్ళు, త్రాగునీరు, విద్యా, వైద్యం కల్పించాలనీ, పని స్థలాల్లో ప్రమాదాలకు, మరణాలకు నష్టపరిహారం కల్పించాలనీ తదితర డిమాండ్లతో సమ్మెలు చేశారు. యాజమాన్యం లొంగిరానప్పుడు ఎ.పి.ఎఫ్.డి.సి ఆస్తుల ధ్వంసం చేయడం, అధికారులను దేహశుద్ధులు చేయడం వంటి మిలిటెంట్ పోరాటాలు కూడా పార్టీ నాయకత్వంలో ప్రజలు నిర్వహించారు. 98-99 నాటికి ఊపుగా వున్న ఈ పోరాటాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి, అరెస్టులు తప్పుడు కేసులు బనాయించడంతోపాటు, సంఘ నాయకులైన వనగల ఎర్రబ్బాయి, కొర్ర లక్ష్మణరావులను బూటకపు ఎన్‌కౌంటర్లో హత్య చేసింది. పార్టీపై కూడా తీవ్ర నిర్బంధాన్ని అమలు చేసింది. అలా ఆ పోరాటం తాత్కాలికంగా బలహీనపడింది.

తిరిగి 2007లో గాలికొండ ఏరియా పరిధిలోని మర్రిపాకల ఎస్టేట్‌ను స్వాధీనపర్చుకునేందుకు ప్రజలను సన్నద్ధపరిచే కార్యక్రమాన్ని పార్టీ తీసుకుంది. 2008లో మర్రిపాకల ఎస్టేట్‌ను అత్యంత మిలిటెంట్‌గా పోరాడి, 67 హెక్టార్లను ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. 2010లో కోరుకొండ ఎ.సి పరిధి బలపం ఎస్టేట్‌లో, 110 హెక్టార్లను ఆ పంచాయితీకి చెందిన 33 గ్రామాల ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. జి.కె-ఎ.సి పరిధిలోని తీములబంద-కుంకుంపూడి ఎస్టేట్‌లో 165 హెక్టార్లనూ, లంకపాకల-సప్పర్ల ఎస్టేట్‌లను కూడా ప్రజలు పోరాడి సాధించుకున్నారు. ఈ క్రమంలో ప్రజా పోరాటానికి ఆటంకంగా నిలిచిన రేంజర్ మజ్జ మాధవరావుని మన పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది. దీంతో కాఫీ పోరాటం మరింత ఊపందుకుని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించింది. అయితే ఈ పోరాటాన్ని దెబ్బతీయటానికి ప్రభుత్వం, పోలీసులు నిర్బంధాన్ని తీవ్రతరం చేశారు. మర్రిపాలక, తీములబంద, కుంకుంపూడి, లంకపాకల, సప్పర్ల ఎస్టేట్‌ల పరిధిలోని గ్రామాల ప్రజలను సరెండర్ కమ్మని నోటీసులు పంపటం, అరెస్టులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం, జైళ్ళలో పంపడం, చిత్రహింసలకు గురి చేయడం, సంతలను బంద్ పెట్టడం, బస్సు సౌకర్యాన్ని రద్దు చేయడం, గ్రామాలపై దాడులు చేయడం వంటి వాటన్నింటినీ ప్రజలు చాలా సమరశీలంగా, పోలీసులతో సైతం తలపడి మిలిటెంట్‌గా ఎదుర్కొన్నారు. కాఫీ పోరాటంపై పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా 2014లో ఆర్.వి నగర్, చాపగడ్డ పల్సర్లను పి.ఎల్.జి.ఎ, ప్రజలు ధ్వంసం చేశారు. తర్వాత 2015లో గూడెం మండలం, ఆర్.వి నగర్ పరిధిలోని 8 గ్రామాలకు చెందిన 280 మంది ప్రజలు కొత్తురు ఎస్టేట్ రేంజర్‌నూ, ఫీల్డ్‌మెన్‌లను ప్రజాకోర్టులో పెట్టి నిలదీసి, ఇక నుంచి తోటల్లోకి అడుగుపెట్టవద్దని హెచ్చరించి దానిని స్వాధీనం చేసుకున్నారు.

అయితే ఈ పోరాటం 2016 నుంచి మరింత తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నది. ఈ నిర్బంధంలో అనేక మంది పార్టీ, పి.ఎల్.జి.ఎకు చెందిన నాయకత్వ క్యాడర్లను కోల్పోయాము. శత్రువు ప్రజలపై కూడా నిర్బంధాన్ని తీవ్రం చేశాడు. ప్రజలు తమ అవసరాలరీత్యా సంతలకు, మండల కేంద్రాలకు వెళ్ళినప్పుడు అరెస్టులు చేయడం, వత్తిడి చేయడం, భయపెట్టడంతోపాటు,

బలవంతంగా ప్రజలనూ, సంఘనాయకులనూ, సభ్యులను సరెండర్లు చేయించుకున్నాడు. ప్రజలు పోరాడి సాధించుకున్న కాఫీ తోటలను తిరిగి ఎ.పి.ఎఫ్.డి.సి స్వాధీనం చేసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. అయినప్పటికీ, ప్రజలు కాఫీ తోటలను వదులుకోవడానికి సిద్ధంగా లేరు. కాఫీ తోటల పోరాట కమిటీల నాయకత్వం, ప్రజలు దృఢంగా వున్న దగ్గర ఇప్పటికీ, ప్రజలే కాఫీ తోటలను అనుభవిస్తున్నారు. కానీ రాజ్య నిర్బంధానికి సంఘ నాయకత్వం బలహీనపడిన దగ్గర ఎ.పి.ఎఫ్.డి.సి తిరిగి తోటలను స్వాధీనపర్చుకుంది. అయితే ప్రజలు మాత్రం ఆక్రమించుకున్న కాఫీ తోటలను రక్షించుకునేందుకూ, నూతన ప్లాంటేషన్లను ఆక్రమించుకునేందుకు పార్టీ నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ళేందుకు సిద్ధపడుతున్నారు.

ఈ నేపథ్యంలో కాఫీ పోరాటంపై కేంద్రీకరించేందుకూ, క్రియాశీల నాయకత్వం అందించేందుకు ప్రత్యేక ఏరియా కమిటీ(ఎ.సి)ని డి.వి.సి ఏర్పాటు చేసింది. ఈ ఎ.సి తీర్మాణాల్లో భాగంగా, ఆర్.వి నగర్ ఎస్టేట్ పరిధిలో వున్న కొన్ని గ్రామాల ప్రజలను కలిసి చర్చించింది. ప్రజల అభిప్రాయాల మేరకు ఆర్.వి నగర్ డి.ఎమ్ (డివిజన్ మేనేజర్) కృష్ణబాబుని పిలిచి 2019, ఏప్రిల్ 26వ తేదీన ప్రజాకోర్టు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ప్రజలు డి.ఎమ్‌ను నిలదీసి, ఎ.పి.ఎఫ్.డి.సి‌ని మన్యంలోనే లేకుండా చేయాలన్నారు. "మేము కూలీలుగా వుండము. ఈ తోటల్లోకి ఎ.పి.ఎఫ్.డి.సి అడుగుపెట్టవద్దు, ప్రజాపోరాటానికి ఆటంకంగా వుంటే మజ్జ మాధవరావుకి పట్టినగతే పడుతుంది'' అని హెచ్చరించారు. "ఆదివాసీగా ఉండి ప్రజల పక్షాన ఉంటావో, దోపిడీ వర్గాల పక్షాన ఉంటావో'' తేల్చుకొమ్మన్నారు. డి.ఎమ్ ప్రజల ముందు తలవంచి క్షమాపణలు కోరాడు. ప్రజలకు ఆటంకంగా వుండననీ, ఈ ఆర్.వి. నగర్ డివిజన్ నుంచి సెలవు తీసుకుంటానని ఒప్పుకున్నాడు. ఆ సభలో పాల్గొన్న గ్రామ ప్రజలు "ఈ రోజు నుంచి ఈ తోటలు మావి. సరిహద్దులు పెట్టుకోవాలి. ఎవరూ కూలికి వెళ్ళకూడదు. ప్రభుత్వం, పోలీసులు, ఎ.పి.ఎఫ్.డి.సి నుంచి ఎలాంటి నిర్బంధం వచ్చినా ధైర్యంగా, ఐక్యంగా ఎదుర్కోవాలి" అని సభలోనే తీర్మాణం చేశారు. ఈ సమావేశానికి నిర్బంధం కారణంగా అన్ని గ్రామాల ప్రజలను హాజరు పరచలేదు. కనుక ఈ ఎస్టేట్‌కు సంబంధించిన మిగతా గ్రామాల ప్రజలకు పార్టీ లేఖ ద్వారా ఇక్కడ చేసుకున్న నిర్ణయాలను తెలియజేయాలని అనుకోవడం జరిగింది.

## సప్పర్ల ఎస్టేట్‌లో కాఫీ పోరాటాన్ని నీరుగార్చిన పోరాట కమిటీ నాయకత్వాన్ని నిలదీసిన ప్రజలు

సప్పర్ల ఎస్టేట్ పరిధిలోని, కొత్తూరు గ్రామంలో బలరాం కాఫీ పోరాటంలో ఎస్టేట్ పోరాట కమిటీలో నాయకుడిగా ఉంటూ, శత్రు నిర్బంధంలో బలహీనపడి శత్రువుకు లొంగిపోయాడు. లొంగిపోవటమే కాకుండా, కాఫీ తోటలను వదలకపోతే పోలీసుల నిర్బంధం, అరెస్టులు ఉంటాయని ప్రజలను అధైర్య పరచడం చేస్తూనే, తాను ఫారెస్టు డిపార్ట్‌మెంట్ ఇచ్చిన పనిలో (ఎండకాలంలో అడవిలో అగ్గి ఆర్పటం)జీతానికి జాయిన్ కావడం జరిగింది. ఇది సప్పర్ల ఎస్టేట్ ప్రజలలో తీవ్ర నెగటివ్ ప్రభావం వేసింది. ఈ సమస్యను పరిష్కరించడంలో భాగంగా 2019, ఫిబ్రవరి 5వ తేదీన బలరాంను ప్రజల ముందు పెట్టి చర్చించడంతో, ప్రజలు అతడిని నిలదీశారు. ప్రస్తుతం చేస్తున్న ఈ దళారీ పనిని (ఉద్యోగాన్ని) తక్షణమే మానివేయాలని చెప్పారు. అలాగే ఆ ఎస్టేట్‌లో నిర్బంధానికి భయపడి వదిలివేసిన కాఫీ తోటలను తిరిగి ప్రజలు స్వాధీనం చేసుకునే విషయాన్ని చర్చించి కొత్త కమిటీని ఏర్పర్చుకున్నారు. ఆ ఎస్టేట్‌కు సంబంధించిన మిగతా గ్రామాలన్నీ సమావేశమయ్యి, సమస్యలను చర్చించుకొని కాఫీ తోటలను స్వాధీనం చేసుకోవడానికి సిద్ధం కావాలని చెప్పటం జరిగింది. అదే విధంగా ఇదే ఎస్టేట్‌లో సప్పర్ల గ్రామానికి చెందిన శ్రీనుకూ, సువ్వపల్లి గ్రామానికి చెందిన సతీష్‌లకు ఎ.పి.ఎఫ్.డి.సి ప్రజల పోరాటాన్ని నీరుగార్చే కుట్రతో ఉద్యోగాలను ఇచ్చింది. వీరు ఈ ఉద్యోగాలను చేస్తూ, ప్రజలను తోటలలోకి కూలీలుగా రావాలని ఒత్తిడి చేయడం, ప్రజలు సిద్ధపడకపోతే బయటనుంచి కూలీలను రప్పించి ప్రజలు స్వాధీనం చేసుకున్న తోటలలో కాఫీ పండ్లను ఏరించడం చేస్తున్నారు. వీరిద్దరు గ్రామాల్లో ఉండకుండా చింతపల్లిలో మకాం వేసి వుంటున్నారు. వీరి విషయంలో కూడా ఈ ఎస్టేట్ పరిధిలో వున్న గ్రామాల ప్రజలంతా కలిసి ప్రజాకోర్టు నిర్వహించి, వీరిని నిలదీయాలని కార్యక్రమం ఇవ్వడం జరిగింది. ఇందుకనుగుణంగా సువ్వపల్లి గ్రామంలో సతీష్ విషయాన్ని చర్చించి, గ్రామస్తులంతా అతడిని నిలదీశారు. ఆ ఉద్యోగం మానుకొని ప్రజల పక్షాన నిలబడాలనీ, ప్రజా వ్యతిరేకులుగా పని చేస్తే ప్రజాకోర్టులో ప్రజల చేతిలో శిక్షకు గురికాక తప్పదని హెచ్చరించారు.

## చెరుకుంపాకల సన్నంనాయుడికి ప్రజాకోర్టులో హెచ్చరిక

గూడెం మండలం, గూడెం పంచాయితీకి చెందిన చెరుకుంపాకల గ్రామంలో సన్నమనాయుడు, చంటి, రాంబాబులు సుదీర్ఘకాలంగా ఎ.వి.ఆర్.సి.ఎస్ సంఘ నాయకత్వంగా పని చేస్తూ, శత్రువు ఒత్తిళ్ళకు తలొగ్గి 2015, మే 12వ తేదీన లొంగిపోయారు. వీరిని పి.కె గూడెం పాకెట్లో 300 మంది ప్రజల ఆధ్వర్యంలో, మన్యం పితూరిసేన నాయకత్వంలో లొంగుబాట్లకు వ్యతిరేకంగా జరిపిన ప్రజాకోర్టులో

ఆనాడే ప్రజలు నిలదీశారు. శత్రువు ముందు మోకరిల్లటాన్ని తీవ్రంగా తప్పుపట్టి, దాన్ని ప్రజా ఉద్యమానికి ద్రోహంగా పరిగణిస్తూ, వారికి ప్రజలు పోరాడి సాధించుకున్న భూమి, కాఫీ తోటలపై హక్కు సడలించాలని తీర్పునిచ్చింది. అయితే సన్నమనాయుడు తర్వాత కాలంలో శత్రువు ఇచ్చిన డబ్బులను తీసుకున్నాడనీ, హోంగార్డ్ గిరితోనూ, బాలరేవుల రమేష్ (మాజీ)లతోను సంబంధాలను కొనసాగిస్తున్నాడనే విషయాలు మన పార్టీ దృష్టికి వచ్చాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2019, ఏప్రిల్ 20వ తేదీన మన పి.ఎల్.జి.ఎ చెరుకుంపాకల గ్రామంలో సన్నమనాయుడిని, వారి కుటుంబ సభ్యులను ఆదుపులోకి తీసుకుని, ముందుగా విడి విడిగా విచారించడం జరిగింది. ఈ విచారణలో పోలీసులు చెక్ ఇచ్చినమాట వాస్తవమేననీ, అయితే అవి తనకు అందలేదనీ, బాలరేవుల రమేష్ తీసుకున్నాడని చెప్పాడు. శత్రువు ఒత్తిడి చేస్తున్నప్పటికీ, తను ఇప్పటివరకూ ఎప్పుడూ దళం, పార్టీ సమాచారాన్ని చెప్పలేదనీ, చెక్ తీసుకోవడం తన తప్పేననీ, ఇకనుంచి పార్టీ, ప్రజలు చెప్పిన ప్రకారం నడుచుకుంటాననీ, క్షమించమని కోరాడు. ఈ విషయాలన్నీ ప్రజాకోర్టులో ప్రజల ముందు చెప్పడంతో, ప్రజలు, అతని కుటుంబీకులు అతడిని సీరియస్‌గా నిలదీశారు, హెచ్చరించారు. మరోసారి ఇలాంటి తప్పు జరిగితే క్షమించబోమనీ, గ్రామంలో కంట్రోల్‌లో ఉండాలనీ, లేనట్లయితే తర్వాత పరిణామాలకు తాము బాధ్యత వహించబోమనీ చెప్పారు.

## కొండజర్త ధర్మ, ఈశ్వర్‌రావులకు ప్రజాకోర్టులో హెచ్చరిక

వీరిద్దరు కొండజర్త గ్రామంలోని మునసబు కొడుకులు. ఈ గ్రామం బాగా లోతట్టు ప్రాంతంలో కొండల మీద ఉంది. ఆర్థికంగా, సామాజికంగా బాగా వెనుకబడిన గ్రామం. టెర్రయిన్ అనుకూలత రీత్యా మన పార్టీ చాలా అవసరాలకు ఈ గ్రామంపై ఆధారపడటం జరుగుతుంది. అలాగే ఈ గ్రామ అభివృద్ధి కోసం కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ప్రజలను రాజకీయంగా మలుచుకునేందుకు కృషి చేసింది. అయితే శత్రువు మనం బాగా ఆధారపడుతున్న, మనకు బలమైన గ్రామాలనూ, తమకు అనుకూలంగా మలచుకుని, నెట్‌వర్క్‌ను ఏర్పచ్చుకోవడానికి ఎంతకాలమైనా ఓపికగా అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. అందులో భాగంగానే ఈ గ్రామానికి సోలార్‌లైట్లు, ఫ్యాన్లు, రగ్గులు వగైరా ఇవ్వడం చేస్తూ వచ్చాడు. దీంట్లో ముఖ్యంగా ధర్మ, ఈశ్వర్‌రావులు చురుగ్గా ఉంటూ, గ్రామ ప్రజలను వాటి కోసం తీసుకెళ్ళడం చేసేవారు. ఈ విషయాన్ని గతంలోనే ఒకసారి ప్రజల్లో చర్చించి, శత్రువు కుట్రలను అర్థం చేయించి, అటువంటి వాటిని వ్యతిరేకించాలని చెప్పడం జరిగింది. ధర్మ, ఈశ్వర్‌రావులను బయట ఎక్కువ తిరగడం మానుకోవాలని ఆంక్షలు పెట్టడం జరిగింది.

2019 మార్చిలో పోలీసులు ఈ గ్రామానికి నోటీసులు పంపడంతో కొద్ది మంది సీలేరుకి వెళ్ళి రగ్గులు, లైట్లు తెచ్చుకున్నారు. ఆ సందర్భంగా వెళ్ళిన ధర్మ, ఈశ్వర్‌రావులను పోలీసులు తమవద్దే ఉంచుకున్నారు. ఆ సమయంలో దళం ఆ గ్రామానికి వెళ్ళినప్పుడు, మునసబు ఈ విషయాన్ని దళానికి తెలియకూడదనే ఉద్దేశంతో, కొన్ని పుకార్లు (పోలీసులు దగ్గర్లో ఉన్నారని) పుట్టించి, దళాన్ని వెళ్ళిపోయేలా చేయాలని ప్రయత్నించాడు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని, దీన్ని క్లియర్ చేయడం కోసం 2019, మే 25వ తేదీన కొండజర్త గ్రామంలో వీరిని ముందు విడివిడిగా విచారించడం జరిగింది. ఈ విచారణలో పోలీసులు వీరిని వారం రోజులపాటు, విశాఖలో ఒక రూంలో ఉంచి, పార్టీకి సంబంధించిన అనేక విషయాలను అడిగి తెలుసుకున్నారనీ, దళం మకాం వేసే డేరాలనూ, గ్రామంలో పార్టీకి సహకరించే వ్యక్తుల పేర్లనూ, దళానికి సరుకులు వగైరా తెచ్చే వ్యక్తుల పేర్లను అడిగారనీ, పోలీసుల ఒత్తిడికి తట్టుకోలేక ఈ విషయాలన్నీ చెప్పేశామనీ, ఇన్‌ఫార్మర్లుగా, హోంగార్డులుగా పని చేయామన్నారనీ, అందుకు ఒప్పుకోలేదనీ, ప్రయాణ చార్జీలకు డబ్బులిచ్చి పంపించి వేశారని ఒప్పుకున్నారు. వీరిని పంపివేసిన తర్వాత పోలీసులు వీరిచ్చిన సమాచారంతో మరో ఇద్దరికి నోటీసులు పంపించి, వారిని కూడా మరో వారం రోజులపాటు ఉంచుకున్నారు. ఈ విషయాలన్నింటినీ ఆ గ్రామ ప్రజలందరి ముందు పెట్టి చర్చించడం జరిగింది. శత్రువు ప్రలోభాలకు లొంగిపోవడం, పార్టీ, సంఘాల విషయాలను శత్రువుకు చెప్పడం, ప్రజలకు, ఉద్యమానికి తీవ్ర ద్రోహం చేయటమేనని వివరించడంతో, ప్రజలు వీరిని నిలదీశారు. ఇక నుంచి వీరిరువురూ గ్రామం విడిచి ఎక్కడికీ వెళ్లరాదనీ, పోలీసుల నుంచి ఎటువంటి నోటీసులు వచ్చినా ఎవరూ తీసుకురాకూడదనీ, ఒకవేళ పోలీసులే గ్రామానికి వచ్చి అరెస్టు చేసినా, ప్రజలంతా ఐక్యంగా, ధైర్యంగా ప్రతిఘటించాలనీ ప్రజలు తీర్పునిచ్చారు. దీన్ని ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కొవలసి వస్తుందని వీరిరువురిని హెచ్చరించారు.

## పాతకోట దేవీప్రసాద్‌కు ప్రజాకోర్టులో హెచ్చరిక

తూర్పు గోదావరి జిల్లా, పాతకోట పంచాయితీ. అదే గ్రామానికి చెందిన దేవీప్రసాద్ తండ్రి, అన్నలను గతంలో పార్టీ (గుర్తేడు ఎ.సి) ఇన్‌ఫార్మర్లుగా పని చేస్తున్నందున మరణశిక్ష విధించింది. వీరు వాల్మీకి (డొంబ) తెగకు చెందిన వాళ్ళు. ఆ తర్వాత ఇతను కూడా పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నాడనీ, ప్రజల ద్వారా మనకు సమాచారం తెలిసింది. ఈ విషయంలో నిజానిజాలను తెలుసుకుని,

ఇతడిని ప్రజల్లో బహిర్గతపరిచి, అటువంటి ఉద్యోగాన్ని, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను మానుకోవాలని మొదటిసారిగా హెచ్చరించాలని అనుకోవడం జరిగింది.

2019, జూన్ 6వ తేదీన దళం పాతకోట గ్రామానికి వెళ్ళి ముందుగా అతడిని అదుపులోకి తీసుకుని విచారించడం జరిగింది. ఆ విచారణలో అతడు తమ తండ్రిని మావోయిస్టులు చంపినందుకు పోలీసులు డబ్బులు ఇచ్చినది వాస్తవమేననీ, అవి తీసుకోవడానికి తాను వెళ్ళాననీ, తనను హోంగార్డుగా పని చేయమనీ పోలీసులు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారనీ, తాను ఒప్పుకోవడం లేదనీ, ఆ ప్రయత్నంలో భాగంగానే పోలీసులు తనను కలవటం చేస్తున్నారనీ, తాను పార్టీకి వ్యతిరేకంగా పని చేయడం లేదని అన్నాడు. ఈ విషయాన్ని ప్రజల ముందు పెట్టి, ఆచరణలో తన నిజాయితీని నిరూపించుకోవాలనీ, పార్టీనీ, ప్రజలను మోసం చేసి, ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శిక్ష తప్పదని ప్రజాకోర్టులో అతడిని హెచ్చరించి విడిచిపెట్టడం జరిగింది. ఆదివాసీ యువతీ యువకులు పోలీసు ఉద్యోగాలలో చేరవద్దనీ, ఇన్‌ఫార్మర్లుగా మారవద్దనీ, ప్రజాయుద్ధంలో భాగమవ్వాలని పిలుపునిస్తూ, పంచాయితీ సెంటర్‌లో పోస్టర్లు వేయడం జరిగింది.

## అభివృద్ధి పేరుతో పోలీసులు ఏర్పర్చిన గ్రామ యూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి ఆనందరావు, కమిటీ సభ్యులను నిలదీసిన ప్రజలు

విప్లవోద్యమాన్ని అణచివేయడం కోసం ఎల్.ఐ.సిలో భాగంగా అమలు జరుపుతున్న, ప్రభుత్వ, పోలీసు సంస్కరణల ద్వారా ఆదివాసీ ప్రాంతాల్లో, ముఖ్యంగా మన ఉద్యమం బలంగా వున్న ప్రాంతాల్లో పోలీసులు యువతీ, యువకులను అనేక ప్రలోభాలకు గురిచేసి పార్టీకి, ప్రజా ఉద్యమానికి వ్యతిరేకంగా వీరిని నిలబెట్టి ఇన్ఫర్మర్లుగా మార్చుకోవడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే సీలేరు ఎస్.ఐ విభూషణరావు (ప్రస్తుతం ట్రాన్స్‌ఫర్ అయ్యాడు) వున్న కాలంలో తన పరిధిలో ఉన్న అన్ని పంచాయితీలలో, గ్రామాలలో యువతీ, యువకులపై ప్రత్యేకమైన కేంద్రీకరణ పెట్టాడు. వివిధ పనులరీత్యా సంతలకు, మండల సెంటర్స్‌కు, పంచాయితీ ఆఫీసులకు వెళ్ళే సమయాల్లో యవతీ, యువకులతో స్నేహాన్ని ఏర్పర్చుకోవడం, అనేక రకాలుగా వారికి సహాయ సహకారాలను అందిస్తూ, ప్రలోభాలకు గురిచేస్తూ, మన పార్టీ, దళం సమాచారం రాబట్టడం కోసం ప్రయత్నాలు చేశాడు. అందులో భాగంగానే ప్రతీ గ్రామంలోనూ అభివృద్ధి పేరుతో యూత్‌తో కమిటీలను ఏర్పర్చారు. అలాంటి కమిటీలలో తోకరాయి గ్రామానికి చెందిన కమిటీ చురుగ్గా పని చేస్తున్నది. ఈ కమిటీకి అధ్యక్షుడిగా ఉన్న రెడ్డి ఆనందరావు వాల్మీకి తెగకు చెందినవాడు. గతంలో సెక్యూరిటీ గార్డుగా కూడా పని చేశాడు. ఇతని తమ్ముడు రెడ్డి రాజేష్ కూడా ఈ కమిటీలో ఉన్నాడు. ఇతను గతంలో హోంగార్డుగా పని చేసినప్పుడు మన పార్టీ 'అటువంటి ఉద్యోగం సరైంది కాదు, వదులుకోవాలి' అని నచ్చచెప్పడంతో మానివేశాడు. కానీ వీరిరువురూ సీలేరు ఎస్.ఐతో సన్నిహిత సంబంధాల్లో ఉంటూ, గ్రామంలో కమిటీని ఏర్పర్చడం, ఈ కమిటీ సభ్యులను, గ్రామ యువకులను పోలీసులు నిర్వహించే వాలీబాల్ పోటీలకు తీసుకువెళ్ళడం, 'మావోయిస్టుల ద్వారా అభివృద్ధి వుండదనీ, పోలీసుల ద్వారానే అభివృద్ధి జరుగుతుంద'ని ప్రచారం చేయడం వంటి పనులను చురుకుగా చేస్తున్నారు. ఆ ప్రాంతంలో దళం కదలికలు అర్థమైతే వెంటనే శత్రువుకు సమాచారం చేరవేస్తున్నారనీ, ఈ విషయాలన్నీ ప్రజల ద్వారా మనకు తెలిశాయి. ఈ గ్రామం గతంలో (దశాబ్దం క్రితం గుర్తేడు దళం వున్నప్పుడు) పార్టీకి అనేక సహాయ సహకారాలు అందించిన బలమైన గ్రామంగా, ప్రజా నిర్మాణాలు కూడా ఏర్పడి, భూమి సమస్యలను కూడా పరిష్కరించుకున్న గ్రామం. అయితే క్రమంగా గ్రామంలో యువకులు ప్రభుత్వ, పోలీసుల సంస్కరణలకు, ప్రలోభాలకు గురయ్యి, గ్రామంలో ఆధిపత్యం చెలాయించడం జరుగుతున్నది. మన పార్టీ దృష్టిలోకి వచ్చిన ఈ విషయాలన్నీ గ్రామ ప్రజలందరి ముందు పెట్టి చర్చించి, పోలీసులు ఏర్పాటు చేసిన ఈ కమిటీనీ, అది చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను బహిష్కరించాలని అనుకోవడం జరిగింది. అందుకోసం 2019, జూన్ 9వ తేదీ రాత్రికి దళం ఆ గ్రామానికి వెళ్ళి ప్రజలందరితో సమావేశ పరిచింది. చాలాకాలం తర్వాత వెళ్ళిన దళానికి గ్రామస్తులందరూ సాదరంగా ఆహ్వానించారు. పార్టీ దృష్టిలోకి వచ్చిన విషయాలన్నీ ప్రజల ముందు పెట్టడంతో 'ఈ కమిటీల విషయం తమకు తెలియదనీ, గ్రామంలో యూత్ ఏ విషయాన్ని గ్రామ పెద్దల, ప్రజల దృష్టికి తీసుకురాకుండా తామే నిర్ణయాలు తీసుకుంటున్నారనీ, ఇది సరైనది కాదనీ, పార్టీకి, ప్రజలకు వ్యతిరేకంగా ఉండే ఇలాంటి కార్యక్రమాలను, కమిటీలను మానుకోవాల'ని కమిటీ అధ్యక్షుడు ఆనందరావుతోపాటు, కమిటీలో ఉన్న మరో ఐదుగురు యువకులను కూడా ప్రజల ముందు నిలబెట్టి ప్రశ్నించారు. "గ్రామ అభివృద్ధి కోసం యూత్ అంతా ఐక్యంగా ఉండాలని ఎస్.ఐ చెబితే అలా పెట్టుకున్నాం, గ్రామంలో సారా మాన్పించడం వంటి కార్యక్రమాలు చేశాం తప్ప, పార్టీ సమాచారం ఎప్పుడూ చెప్పలేదు. ఇక నుంచి ఈ కమిటీని రద్దు చేస్తున్నాం. ఇకనుంచి ఎస్.ఐని కలవము, గ్రామంలోని ఎలాంటి పనులనైనా గ్రామస్తులందరి దృష్టికి తీసుకుపోతాం. అందరిని సంప్రదించే చేస్తాం. ఇప్పటి వరకు జరిగి దానికి మమ్మల్ని క్షమించాలి" అంటూ కోరారు. మన పార్టీ రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకూ అనేక విషయాలను ప్రజలకు వివరించి, పోలీసుల కుట్రలకు మన ఆదివాసులు బలికవద్దని నచ్చ చెప్పింది. ప్రజలు కూడా తమ గ్రామంలో వున్న అనేక సమస్యలను పార్టీ దృష్టికి తెచ్చి, పార్టీ రావాలనీ, పార్టీని కాపాడుకుంటామనీ, తమ సమస్యలను పరిష్కరించాలనీ కోరారు.

## 6. లంపెన్స్‌గా తిరుగుతున్న గోపాల్, రమేష్‌లను హెచ్చరించిన ప్రజలు

తూర్పుగోదావరి జిల్లా పాతకోట పంచాయితీ బురదకోటకి చెందిన గోపాల్ కువ్వి ఆదివాసీ తెగకు చెందినవాడు. ఇతడు గ్రామంలో, కుటుంబంలో బాధ్యతారాహిత్యంగా శ్రమ చేయకుండా ఆవారాగా తిరగడం, పాత నాణేల పేరుతో ఎప్పుడూ బయటే తిరగడం వంటి దందాలతోపాటుగా, స్త్రీ, పురుష సంబంధాల విషయంలో కూడా అరాచకంగా ఉంటున్నాడు. గతంలో వెరొకరి భార్య (సొంత తమ్ముడి భార్య)ను తీసుకుపోవడంతో, గ్రామస్థులు, పార్టీ కలిసి వీడికి దేహశుద్ధి చేసింది. బయట తిరగడం మానుకోవాలని హెచ్చరించింది. అప్పుడు కొంత కాలం వరకు బాగానే ఉన్నాడు. మళ్ళీ పార్టీ ఆ ప్రాంతానికి వెళ్ళడం ఆలస్యం కావడంతో, కొంత గ్యాప్ రావడంతో వీడు పాత కార్యక్రమాలను ప్రారంభించాడు. ఇతను ఒక్కడే కాకుండా ఫేములగొంది గ్రామానికి చెందిన రమేష్‌తో పాటు కలిసి తిరగడం మొదలుపెట్టారు. రమేష్ తమ గ్రామంలో వుండకుండా బురదకోటకే వచ్చి ఉండటం, సెల్‌ఫోన్స్‌లో అసభ్యకర చిత్రాలను చూస్తూ, సామ్రాజ్యవాద విషసంస్కృతి ప్రభావంతో వీరు మహిళల పట్ల తప్పుడు పద్ధతులు వ్యవహరించడం, ఈ మధ్య కాలంలో రెండు చోట్ల ఫంక్షన్స్‌కు వచ్చిన అమ్మాయిలపై అత్యాచారాలు చేసిన దాంట్లో వీరిద్దరు కూడా వున్నారనే విషయం వగైరా సమాచారమంతా పార్టీ దృష్టికి వచ్చింది. ఈ విషయాలన్నింటిని దళం బురదకోట గ్రామంలో ప్రజల ముందు పెట్టడంతో ప్రజలు వీరిని తీవ్రంగ విమర్శించారు. వీరిద్దరు ప్రజలముందు తమ తప్పులను ఒప్పుకున్నారు. అత్యాచారాల విషయంలో తాములేమన్నారు. చెడుతిరుగుళ్ళు మానేస్తామనీ, ఇకనుండి బయట తిరగమనీ, అవసరమైనప్పుడు గ్రామస్తులకు చెప్పి వెళతామని అన్నారు. రమేష్ వెంటనే తన ఊరు ఫేములగొందికి వెళ్ళి, తన కుటుంబంతో ఉండాలని కండిషన్స్ పెట్టి హెచ్చరించారు.

## మార్చి8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం

ఈస్ట్-మల్కనగిరి డివిజన్ పరిధిలో మార్చి8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా ఎ.ఒ.బి ఎస్.జడ్.సి పేరుతో వేసిన కరపత్రాలను 500 ప్రింటింగ్ చేసి, జి.కె-ఎ.సి పరిధిలో 300, కలిమెల ఎ.సి పరిధిలో 200 కరపత్రాలను గ్రామంలోని ప్రచారం చేయడం జరిగింది. బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు ప్రభుత్వాలు మహిళలపై అమలు జరుపుతున్న అమానుష హింస, అణచివేతలకు వ్యతిరేకంగా మార్చి 8 నుంచి 14 వరకు పోరాట వారంగా పాటించాల్సిందిగా పిలుపునిస్తూ, గాలికొండ ఏరియా కమిటీ పేరుతో కొయ్యూరు, బుదరాళ్ళ, పెదవలస సెంటర్స్‌లో మిలీషియా పోస్టర్స్ వేయడం జరిగింది.

## యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ సాంస్కృతిక నృత్యాలు





**సామ్రాజ్యవాద సంస్కృతిని వ్యతిరేకిస్తూ, ఆదివాసీ సాంస్కృతిక నృత్యం ధింసా ఆడుతున్న ప్రజలు**

గుమ్మ ఏరియా (కటాఫ్ ప్రాంతం)లో ప్రజలను విప్లవ రాజకీయాలతో సంఘటిత పరిచే ప్రక్రియలో భాగంగా, యువజన సంఘాలు పెట్టడం ప్రారంభమైంది. ఇవి విద్యా, వైద్యం, అభివృద్ధి వంటి కర్తవ్యాలతోపాటు, ప్రధానంగా ప్రజల వారసత్వ సంస్కృతిని కాపాడుతూ, దానిని విప్లవీకరించే కర్తవ్యాన్ని కూడా చేపట్టాయి. ముఖ్యంగా సామ్రాజ్యవాద విషసంస్కృతి ఆదివాసీ ప్రాంతాలలోకి కూడా చొరబడి, లైగింక విశృంఖలత్వం, మతితప్పిన హింస, వస్తువినిమయ సంస్కృతి వంటి అరాచక ధోరణులను ప్రేరేపిస్తున్న నేపథ్యంలో, ముందుగా మూలపడ్తున్న ఆదివాసీ కళలను ప్రోత్సాహించేందుకు నడుం కట్టారు. ఇందులో భాగంగానే అనేక గ్రామాల నుండి వచ్చిన ధింసా గ్రూపులకు పోటీలు పెట్టి, చివరగా సామ్రాజ్యవాద సంస్కృతిని ఎండగడుతూ విప్లవ రాజకీయాలను అందించారు.

ఇక ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, నవీన్‌పట్నాయక్‌లు మోడీ కంటే తామేమీ తక్కువ కాదన్నట్లు సామ్రాజ్యావాదులకు సేవ చేయటమే ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ, హిందూ మత అనుకూల పక్షపాత వైఖరిని అవలంభిస్తున్నారు. ఇందుకనుగుణంగానే మహిళలపై పితృస్వామిక దాడిని కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఈ దాడి రాజ్యం ద్వారా కొనసాగుతున్నది. వీరు యువతను సామాజిక బాధ్యత నుండి పక్కదారి పట్టించేందుకు భూస్వామ్య సంస్కృతికి తోడుగా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద విషసంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. టి.విలు, సినిమాలు, పత్రికలు, ఇంటర్నెట్ వంటి సామాజిక మాధ్యమాలన్నీ మహిళలను సరుకుగా, సెక్స్ సింబల్‌గా చూపిస్తూ, విచ్చలవిడి శృంగారాన్ని ప్రేరేపిస్తున్నాయి. దీని ప్రభావంతో మహిళల ఉనికే ప్రమాదకరంగా మారింది. చిన్నారుల నుండి వృద్ధ మహిళల వరకూ గడపదాటి బయటకు వెళితే ఏ క్షణం ఏమవుతుందోననే అభద్రతా జీవితం గడపవలసి వస్తోంది. మహిళలపై లైంగిక అత్యాచారాలు, హత్యలు, ప్రేమ పేరుతో ఆసిడ్ దాడులు సర్వసాధారణమైపోయాయి. మరోవైపు టూరిజం పేరుతో సెక్స్ ఇండస్ట్రీని అభివృద్ధి చేస్తున్నారు. విశాఖ జిల్లాలో ఇప్పటికే అరకు, లంబసింగి తదితర ప్రాంతాలు వుండగా ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలలో ఇంకా అనేక ప్రాంతాలలో దీన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు పథకాలు వేస్తున్నాయి.

కేంద్రంలో అధికారంలో వున్న మోడీ బేటిబచావో–బేటిపడావో వంటి మహిళా అనుకూల నినాదాలు ఇస్తున్నప్పటికీ, ఆచరణలో మహిళలపై రాజ్యం దాడి రోజురోజుకు మరింత తీవ్రతరమవుతున్నది. మోడీ ఉపన్యాసాలలో చెబుతున్నదంతా ఉత్త వాగాడంబరమేనని ఆచరణ తేటతెల్లం చేస్తున్నది. ముఖ్యంగా విప్లవోద్యమాన్ని, ప్రజాఉద్యమాలను అణచివేయడం కోసం, రాజ్యం చేసే అన్ని రకాల దాడులకు పురుషులే కాక, మహిళలూ గురవుతున్నప్పటికీ, స్త్రీలు అదనంగా పితృస్వామిక భావజాలం వలన లైంగిక అత్యాచారాలకు, వేధింపులకు గురవుతున్నారు. ముఖ్యంగా విప్లవోద్యమ ప్రాంతాలలో నరహంతక కిరాయి పోలీసు బలగాలు మహిళలపై జరిపిన అత్యాచారాలను వెలుగులోకి రాకుండా చేస్తున్నారు. కొన్ని సంఘటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ, రాజ్యం తమ సాయుధ బలగాలను రక్షించుకొనేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ విషయంలో ఒక్క కేసులో కూడా పోలీసులకు శిక్ష పడలేదు. ప్రభుత్వం ఒకవైపు అత్యాచార దోషులను ఉరిశిక్ష విధిస్తామని నిర్భయ చట్టాన్ని తీసుకువచ్చి, మరోవైపు మహిళలపై లైంగిక అత్యాచారాన్ని అణచివేతకు ఆయుధంగా ఉపయోగిస్తున్నది. వీరు 'తలాక్' పద్ధతిని వ్యతిరేకిస్తూ, ముస్లిం మహిళల రక్షకులుగా ఫోజు కొట్టి, మరోవైపు కేరళలోని అయ్యప్పగుడికి మధ్య వయస్కులైన మహిళలు వెళ్ళవచ్చునని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినప్పటికీ, ఆ తీర్పును వ్యతిరేకిస్తూ, హిందూ మతఛాందసవాదుల పక్కన నిలిచి మహిళల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అల్లర్లు సృష్టించారు. దేశంలో మోడీ పాలనలో అధికారిక లెక్కల ప్రకారం మహిళలపై అత్యాచారాలు **61%** పెరిగాయి. మైనారిటీ బాలికలపై ఇటువంటి కేసులు **133%** పెరిగాయి. ప్రతిరోజు **46** మంది మైనర్ బాలికలు అత్యాచారాలకు గురవుతున్నారు. ఇలా గురవుతున్న వారిలో అత్యధిక మెజారిటీ దళిత, మైనారిటీ, ఆదివాసీ మహిళలే. మోడీ ప్రభుత్వ ఫాసైజేషన్‌లో భాగంగా మహిళా సంఘాలపై దాడులు కూడా తీవ్రతరం అవుతున్నాయి. ఈ మధ్య కాలంలో ప్రజా సంఘాలలో పని చేస్తున్న భవాని, సునీత, అనూష అనే ముగ్గురు అక్కచెల్లెళ్ళను గత డిసెంబర్‌లో అక్రమంగా అరెస్టు చేసి జైళ్ళో నిర్బంధించారు. అలాగే గతంలో మావోయిస్టు ఉద్యమంలో పని చేసి, అరెస్టయి, విడులయ్యాక సాధారణ జీవితం గడుపుతున్న సుగుణ (భూతం అన్నపూర్ణ) మావోయిస్టులతో సంబంధాలు వున్నాయని ఆరోపణ చేసి, మళ్ళీ అరెస్టు చేసి, జైళ్ళో నిర్బంధించారు. కటాఫ్ ఏరియాలోనూ, కలిమెల ఏరియాలోను జరిగిన ఎన్‌కౌంటర్లలలో పోలీసులు విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో కామ్రేడ్ మీనా, కామ్రేడ్ సుశీల, కామ్రేడ్ సున్నిలు గాయపడగా, పోలీసులు వారిని పట్టుకొని కౄరంగా కల్చిచంపారు.

## ప్రియమైన ప్రజలారా! పీడిత మహిళల్లారా!

ఈ రోజు దేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు మూకలు మహిళలపై అమలు జరుపుతున్న అమానవీయ హింస, అణచివేత ఎంత బీభత్సంగా, భయంకరంగా వుందో, దానికి వ్యతిరేకంగా మహిళల్లో పెరుగుతున్న పోరాట చైతన్యం అంత ఆశావహంగానూ ఉంది. మహిళలపై హింస, అణచివేత, అత్యాచారాలకు వ్యతిరేకంగానూ, యూనివర్సిటీలు, కాలేజీలు, హాస్టళ్ళలోనూ స్వేచ్ఛ, సమానత్వం కోసం, దేవాలయాల్లో మహిళలకు ప్రవేశం మొదలుకుని 'మీటూ' క్యాంపెయిన్ వరకూ మహిళలు గొంతెత్తటం, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి, ఆగ్రహానికి ప్రతిబింబం. ఆదివాసీ ప్రాంతాల్లో మహిళలు తెగ పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, రాజ్యహింసలో భాగంగా మహిళలపై జరుగుతున్న లైంగిక అత్యాచారాలకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతున్నారు. ప్రజాయుద్ధంలో భాగస్వాములవుతున్నారు. పీడిత ప్రజల, మహిళల ఉజ్వల భవిష్యత్ కోసం తమ సర్వస్వాన్ని త్యజించి, వేగుచుక్కలై మార్గాన్ని చూపుతున్నారు. రండి! మనమూ ఆ మార్గాన్ని అనుసరిద్దాం! వారి త్యాగాలను ఎత్తిపడదాం! మార్చి8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా మనం సాధించుకున్న హక్కులను నిలబెట్టుకోవటం కోసం 'ఆకాశంలో సగభాగాన్ని' గెలుచుకోవటం కోసం సామ్రాజ్యవాదానికి, హిందూ బ్రాహ్మణీయ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం! ప్రజాయుద్ధంలో భాగస్వాములవుదాం!

- ★ మార్చి8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటదినం వర్ధిల్లాలి!
- ★ అంతర్జాతీయ శ్రామిక మహిళల ఐక్యత వర్ధిల్లాలి!
- ★ మహిళ లేని విప్లవం గెలువబోదు! విప్లవం లేనిదే మహిళా విముక్తి లేదు!
- ★ తెగించి పోరాడుదాం! బానిస సంకెళ్ళను, పితృస్వామ్య బంధనాలను తెంచుకుందాం!
- ★ నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!
- ★ ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!

విప్లవాభివందనాలతో...

ఎ.ఒ.బి.ఎస్.జెడ్.సి

సి.పి.ఐ(మావోయిస్టు)

మార్చి8-2019

# మార్చి 8

## అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం వర్ధిల్లాలి!

### బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు ప్రభుత్వాలు మహిళలపై అమలు జరుపుతున్న అమానుష హింస, అణచివేతలకు వ్యతిరేకంగా మార్చి 8నుండి 14వరకు పోరాట వారంగా పాటించండి!!

*ప్రియమైన ప్రజలారా!*

మార్చి8, ప్రపంచ చరిత్రలో ఒక మహత్తరమైన రోజు. ప్రపంచ శ్రామిక మహిళల ఐక్యతకు, గొప్ప పోరాట శక్తికీ నిదర్శనగా నిలిచిన రోజు. **1857** మార్చి 8న అమెరికాలో బట్టల జౌళి మిల్లులలో పని చేసే శ్రామిక మహిళలు పది గంటల పనిదినాన్ని, పని పరిస్థితుల మెరుగుదలను కోరుతూ, పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన జరిపారు. ఆ సందర్భంగా నిరసనకారులపై అమెరికా రాజ్యం, పోలీసులు జరిపిన హింసను, దాడులను వీరోచితంగా ప్రతిఘటిస్తూ, తమ హక్కుల సాధన కోసం ఎలుగెత్తి నినదించారు. ఆ పోరాట స్ఫూర్తితో తర్వాత కాలంలో అమెరికా, యూరప్ దేశాలలోని శ్రామిక మహిళలు ఓటు హక్కుకోసం, చౌకవేతనాలకు వ్యతిరేకంగా అనేక గొప్ప పోరాటాలు చేశారు. మహిళల్లో గొప్ప పోరాట చైతన్యం పెల్లుబుకిన ఆ మార్చి8ని అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా జరుపుకోవాల్సిందిగా అంతర్జాతీయ కమ్యూనిస్టు మహిళా ఉద్యమ నాయకురాలు, జర్మనీ దేశానికి చెందిన కామ్రేడ్ క్లారాజట్కిన్ **1910** కోపెన్‌హెగెన్‌లో జరిపిన శ్రామిక మహిళల రెండవ అంతర్జాతీయ మహసభలో ప్రకటించారు. ఆనాటి నుండీ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలోను శ్రామిక మహిళలు మార్చి8ని గొప్ప పోరాట చైతన్యంతో జరుపుకుంటున్నారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, అర్ధవలస–అర్ధభూస్వామ్య దేశాలలో పాలకవర్గాలు కూడా మార్చి8ని మహిళా దినంగా ప్రకటిస్తున్నప్పటికీ, అవి మోసపూరితంగా మహిళల పోరాటస్ఫూర్తిని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో పితృస్వామ్య సంకెళ్ళతో బంధించబడి వున్న మహిళలు తమ విముక్తితో పాటు, సకల పీడిత ప్రజల విముక్తికోసం నేడు మన దేశంలో నిజమైన కార్మికవర్గ పార్టీ సి.పి.ఐ(మావోయిస్టు) నేతృత్వంలో జరుగుతున్న వర్గపోరాటంలో భాగమవుతున్నారు. మరోవైపు పితృస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని వర్గ పోరాటంతో అనుసంధానిస్తున్నారు.

భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో, మావోయిస్టు పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధం మహిళలను 'ఆకాశంలో సగభాగాన్ని' గెలుచుకోవడం కోసం వందలు, వేలుగా పోరాటంలోకి కదిలిస్తున్నది. నాటి తె.బా.గ, తెలంగాణ, శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటాలలో వందలాది రైతాంగ మహిళలు పురుషులతో భుజం, భుజం కలిపి భూమి, భుక్తి, స్త్రీ విముక్తి కొరకు వీరోచితంగా పోరాడారు. నేడు భారతదేశంలో విప్లవోద్యమానికి ప్రధాన కేంద్రంగా వున్న దండకారణ్యంతోపాటు బీహార్, జార్ఖండ్, ఎ.ఒ.బి తదితర పోరాట ప్రాంతాల్లో జరుగుతున్న వర్గపోరాటంలోనూ వేలాది మహిళలు భాగస్వాములవుతూ, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడంలో అసమాన ప్రతిభను చూపారు, చూపుతున్నారు. అలాగే 'ఆజాదీ' కోరుకుంటున్న కాశ్మీర్‌లోనూ, అస్సాం, మణిపూర్, త్రిపుర వంటి ఈశాన్య రాష్ట్రాలలోనూ జరుగుతున్న జాతి విముక్తి పోరాటాలలోనూ మహిళలు అత్యంత మిలిటెంట్‌గా, సాహసోపేతంగా సాయుధ బలగాలతో తెగించి పోరాడుతున్నారు. ఈ పోరాటాల్లో తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తూ, సామాజిక మార్పుకోసం ముందు పీఠిన నిలబడుతున్నారు. మార్చి8 సందర్భంగా ఈ అమర వీరనారులకు, మహిళా గెరిల్లా వీరయోధలకు ఎ.ఒ.బి.ఎస్.జడ్.సి తలవంచి వినమ్రంగా జోహార్లు అర్పిస్తున్నది. ప్రస్తుత వ్యవస్థలో మహిళలు, పోగొట్టుకోవడానికి ఏమీ లేదు, సంకెళ్ళు తప్ప. గెలుచుకోవటానికి 'సగం ఆకాశం' వుంది. అందుకు ప్రజాయుద్ధంలో, మహిళా విముక్తి పోరాటాలలో క్రియాశీల భాగస్వాములు కావాల్సిందిగా, మార్చి8 పోరాట స్ఫూర్తిని కొనసాగించాల్సిందిగా ఎ.ఒ.బి.ఎస్.జడ్.సి పీడిత మహిళలకు పిలుపునిస్తున్నది.

దేశంలో నరేంద్రమోడీ రథసారథిగా బి.జె.పి నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి దేశాన్ని హిందూ మత రాజ్యంగా మార్చటం కోసం, అత్యంత ఫాసిస్టు పాలనను కొనసాగిస్తోంది. గుజరాత్‌లో ముస్లిం మారణకాండను సృష్టించిన మోడీ ప్రధాని అయ్యాక భారత రాజ్యాంగపు నామమాత్రపు బూర్జువా ప్రజాస్వామిక చట్రాన్ని సైతం హైందవీకరించేందుకు ఆర్.ఎస్.ఎస్, వి.హెచ్.పి, సంఘపరివార్, భజరంగదళ్, ఎ.బి.వి.పి, శ్రీరామసేన, శివసేన వంటి సంఘాలన్నీ 'అంకితభావం'తో పని చేస్తున్నాయి. వీరు ప్రజల జీవితాలలోని సకల రంగాల(రాత, మాట, ప్రేమ, పెళ్ళి, డ్రస్సు చివరకు తినే తిండి)ను బలవంతంగా కాషాయీకరణ చెందించేందుకు ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలోనే తమ ప్రయత్నాలను అడ్డుకుంటున్నవారిని ఉన్మాదుల్లా ప్రవర్తిస్తూ చంపేస్తున్నారు. కర్నాటకలో తన కలానికి పదునుపెడుతూ, హిందూ మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తున్నందుకు ప్రముఖ జర్నలిస్టు గౌరిలంకేష్‌ను కిరాతకంగా కాల్చిచంపారు. అలాగే దేశంలో జరుగుతున్న విప్లవోద్యమానికీ, జాతి పోరాటాల(కాశ్మీర్)కు మద్దతు తెలుపుతున్న ప్రముఖ ప్రజాస్వామికవాది అరుంధతీరాయ్‌పై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారు. ఈ హిందూ ఫాసిస్టు మూఠా ఒక వైపున సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తుతూ, ఈ దేశంలోని దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలను ఈడేర్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటున్న విప్లవోద్యమాన్ని, ప్రజా ఉద్యమాలను దెబ్బతీసేందుకు తమ ఫాసిస్టు దాడిని ప్రజలపై తీవ్రతరం చేశారు. గ్రీన్‌హంట్ పేరుతో కొనసాగిన ఈ దాడి ప్రస్తుతం సమాధాన్ పేరుతో మరింత తీవ్రతరమైంది. ఈ దాడిలో భాగంగానే అర్బన్ మావోయిస్టుల పేరుతో అనేక మంది ప్రజాస్వామిక వాదులను అక్రమంగా అరెస్టు చేస్తూ వేధిస్తున్నారు. ఈ మధ్య జరగిన భీమకోరెగాం సంఘటన సందర్భంగా జరిగిన అల్లర్లకు ఉద్దేశపూర్వకంగా **10**మంది ప్రముఖ ప్రజాస్వామిక వాదులను బాధ్యులుగా చేసి, అక్రమ కేసులు బనాయించి నిర్బంధించారు. ఈ సందర్భంగా నాగపూర్ విశ్వవిద్యాలయం ఇంగ్లీషు ప్రొఫెసర్ షోమాసేన్‌ను, హరియాణాలోని ఫరిదాబాద్‌కు చెందిన లాయర్ సుధాభరద్వాజ్ అనే మహిళా ప్రజాస్వామిక వాదులను అక్రమంగా అరెస్టు చేసి వేధిస్తున్నారు. ఈ సంఘటనలు మహిళల ఎడల బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టుల నిరంకుశ, పితృస్వామిక వైఖరిని తెలియజేస్తున్నాయి.